

ఈనాడు



కరీంనగర్ 24-1-2019 గురువారం సిటీ సంపుటి 45 సంచిక 164

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



ప్రియాంకం

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియామకం

ఈనాడు – దిల్లీ

కాంగ్రెస్‌లో ప్రియాంకానికి తెరలేచింది. మోదీ బృందం ఎన్నికల వ్యూహాలు, ఆకర్షణలను ఎదుర్కొనేందుకు తన అమ్ములపొదిలోని సమ్మోహనాస్త్రాన్ని పార్టీ సంధించింది. గాంధీ–నెహ్రూ కుటుంబ వారసురాలు ప్రియాంకా గాంధీని ప్రత్యక్ష రాజకీయాల్లోకి దించింది. సార్వత్రిక ఎన్నికల కోసం యావద్దేశం సమాయత్తమవుతున్న వేళ ఉరుములేని పిడుగులా ఈ ఆకస్మిక నిర్ణయాన్ని ప్రకటించింది. ఆమెను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నియమించారు. ఈ తురుపు ముక్కకు ఉత్తర్‌ప్రదేశ్ తూర్పు ప్రాంతంలో కాంగ్రెస్ బాధ్యతల్ని అప్పగించారు. ఇప్పుడు 49 ఏళ్ల రాహుల్ గాంధీతో పాటు, 47 ఏళ్ల ప్రియాంక.. శతాధిక కాంగ్రెస్‌కు రెండు కళ్లు కాబోతున్నారు.

- తూర్పు ఉత్తర్‌ప్రదేశ్ వ్యవహారాలు అప్పగింత
- ఎన్నికల వేళ అన్నకు చెల్లి తోడు
- 1న బాధ్యతల స్వీకారం.. ఎన్నికల్లోనూ పోటీ!
- పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం

దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వారసురాలుగా ప్రియాంకను ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకురావాలని చాలా కాలం నుంచి పార్టీ వర్గాల్లోనూ డిమాండ్లు వస్తున్నాయి. దీనికి తగ్గట్టుగా తొలిసారి ఉత్తర్‌ప్రదేశ్‌ను పార్టీ పరంగా రెండుగా (తూర్పు, పశ్చిమ) విభజించి, ఇద్దరు ప్రధాన కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకూ నలుగురు పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులతో యూపీలో ప్రయోగాలు చేస్తూ వస్తున్నారు. ఇప్పుడు విభజించిన రెండు భాగాల్లో ఒక దానిని ప్రియాంకకు, రెండో దానిని గ్వాలియర్ (మధ్యప్రదేశ్) రాజ కుటుంబీకుడైన జ్యోతిరాదిత్య సింధియాకు అప్పగించి సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. లఖ్‌నవూ పైభాగం అంతా తూర్పు ప్రాంతం, దిగువ భాగమంతా పశ్చిమ భాగం కిందికి రానుంది. ప్రియాంక, జ్యోతిరాదిత్య సింధియాలు చెరి 40 లోక్‌సభ స్థానాల బాధ్యతలను చూసే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం. దేశానికే కీలకమైన యూపీలో కోల్పోయిన పట్టును తిరిగి సాధించడం లక్ష్యంగా ఈ విధంగా పావులు కదిపినట్లు తెలుస్తోంది.

ఈసారి రాయ్‌బరేలీ నుంచి పోటీ!

జవహర్‌లాల్ నెహ్రూ సొంత ఊరు అలహాబాద్‌తో పాటు, ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసి, యూపీ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్‌కు పట్టున్న గోరఖ్‌పూర్ వంటివి ఇప్పుడు ప్రియాంక పరిధిలోకి రానున్నాయి. ఆమె తల్లి సోనియాగాంధీ క్రమంగా అన్ని బాధ్యతల నుంచి వైదొలగుతూ వస్తున్నందున

...మిగతా 2లో



అమెరికా వెళ్లి చెల్లిని ఒప్పించిన రాహుల్

వారికి కుటుంబమే పార్టీ భాజపాకు పార్టీయే కుటుంబం

ప్రియాంక రాకపై ప్రధాని మోదీ స్పందన



కాంగ్రెస్ ప్రియబాంధవి

ప్రియాంక కార్యసాధకురాలు | పునరుత్తేజమే లక్ష్యం

ప్రత్యేక కథనాలు 11లో

మండలి సందడి మొదలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర శాసనమండలిలోని ఖాళీ స్థానాలకు త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. లోక్‌సభ ఎన్నికల కన్నా ముందే వీటిని నిర్వహించాలని ఈసీ భావిస్తోంది. ఖాళీలపై నివేదిక పంపాలని రాష్ట్ర అధికారులను కోరింది. ప్రస్తుతం 7 స్థానాలు ఖాళీ కాగా మార్చి నెలాఖరుకు మరో 9 ఖాళీ కానున్నాయి. వాటిలో 15 స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా.. గవర్నర్ కోటాలో మరో స్థానాన్ని భర్తీ చేయాల్సి ఉంది. ఉపాధ్యాయుల, పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఇప్పటికే ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియ ప్రారంభమైంది. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్, వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గాల నుంచి పాతూరి సుధాకర్‌రెడ్డి, పి. రవీందర్, మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-ఖమ్మం జిల్లా పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కె.స్వామిగౌడ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరి పదవీకాలం మార్చి నెలతో ముగియనుంది. ఇవి కాకుండా మిగిలిన 12 స్థానాలకు కలిపి ఒకేదఫా

...మిగతా 2లో



సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో జరుగుతున్న సహస్ర చండీయాగం మూడోరోజైన బుధవారం పూజల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు

రెండో విడతకు అంతా సిద్ధం

3,342	10,668	ముగిసిన ప్రచార ఘట్టం
రేపు ఎన్నికలు జరగనున్న పంచాయతీలు	పోటీ పడుతున్న అభ్యర్థులు	

ఈనాడు, హైదరాబాద్: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రెండో విడత పోలింగ్‌కు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం 3,342 సర్పంచి స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. 10,668 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పంచాయతీ ఎన్నికల్లో తొలి విడత పోలింగ్ ఈనెల 21న ముగియగా, రెండో విడతకు 25న, మూడో విడతకు 30న ఎన్నికలు జరగనున్నాయి. రెండో విడతలో మొత్తం 4,137 పంచాయతీలలో ఎన్నికల కోసం నోటిఫికేషన్లు వెలువడగా, వాటిలో 788 సర్పంచి స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మరో 7 సర్పంచి పదవులకు నామినేషన్లు దాఖలు

...మిగతా 2లో

ఇదీ సంగతి!



గాల్లో చక్కర్లు కొట్టి కొట్టి పెట్రోలు అయిపోయిందట మేడం, త్వరగా అనుమతించండి దిగటానికి!

కాళేశ్వరానికి భారీ రుణం

- రూ. 7,784.75 కోట్లిచ్చిన పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్
- ఇప్పటి వరకు తీసుకున్నది రూ. 38,652 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం పనుల పురోగతికి నిధుల సమస్య లేకుండా చూసేందుకు మరో భారీ రుణం తీసుకొంది. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని మళ్లించే పనులకు, నిజామాబాద్ జిల్లాలో ఆయకట్టుకు నీళ్లిచ్చే పనులకు రూ.7784.75 కోట్ల రుణం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి స్వీకరించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కలిపి ఇప్పటివరకు కాళేశ్వరానికి రూ.38,652 కోట్ల రుణం తీసుకొన్నట్లయింది. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు వచ్చే జూన్ నాటికి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొంది. ఇప్పటికే పనులన్నీ ఓ కొలిక్కి వచ్చాయి. మిగిలిన పనులను పూర్తి చేయడం, ఇందుకు అవసరమైన నిధులకు సమస్య లేకుండా చూసేందుకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ.5405.39 కోట్ల రుణం తీసుకొనేందుకు అంగీకారం జరిగింది. ఈ మొత్తాన్ని పదేళ్లలో చెల్లించాలి. 2021-22 నుంచి 2033-34 వరకు తిరిగి చెల్లించాల్సి ఉండగా, ఇందులో మొదటి, చివరి సంవత్సరాలు రెండేసి కంతులు, మిగిలిన సంవత్సరాలు నాలుగేసి కంతులు చెల్లించాలి. మూడు నెలలకోసారి రూ.112.61 కోట్లు ప్రభుత్వం తిరిగి చెల్లించాలి.

మరో రుణం రూ.2379.56 కోట్లు

శ్రీరామసాగర్ వెనుకభాగం నుంచి నీటిని మళ్లించి నిజామాబాద్ జిల్లాలో ఆయకట్టుకు నీరందించే పనులు కాళేశ్వరం ఎత్తిపోతల్లో భాగంగా ఉన్నాయి. ఇందులో 21-ఎ ప్యాకేజీలో పైపులతో నీటిని సరఫరా చేయడం, ఇతర ఎలక్ట్రో మెకానికల్ పనుల కోసం రూ.2379.56 కోట్లు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రుణం తీసుకొనేందుకు అంగీకారం కుదిరింది. దీనికి సంబంధించి ఉత్తర్వులు జారీ

...మిగతా 2లో



ప్రియాంకం

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే ఎన్నికల్లో రాయబరేలీ లోక్‌సభ స్థానం నుంచి ప్రియాంక గాంధీయే పోటీకి దిగే అవకాశాలు కూడా మెండుగా కనిపిస్తున్నాయి. ఇప్పటివరకూ యూపీలో మోదీ స్థాయి నాయకత్వం కాంగ్రెస్‌కు ఉండేది కాదు. ప్రియాంక రాకతో ఆ లోటు తీరిపోనుంది. మాటలే కాకుండా, వాటిని చెప్పే నాయకుల స్థాయిని కూడా ప్రజలు చూస్తారు కాబట్టి ఇప్పుడు తూర్పు ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ మాటకు విలువ పెరిగే అవకాశం ఉంటుందన్నది పార్టీ వర్గాల అంచనా. భాజపాలో మోదీ, అమిత్‌షాలు బలమైన నాయకద్వయంగా మారిన తరుణంలో ఇప్పుడు రాహుల్, ప్రియాంకలు అదే స్థాయి పోటీ ఇవ్వడానికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.



సామాజిక మాధ్యమాల్లోనూ పైచేయి

ఇప్పటివరకూ మోదీపైనే కేంద్రీకృతమైన మీడియా దృష్టిని ప్రియాంక తన వైపునకు తిప్పుకొనే అవకాశం ఉన్నందున ఆ ప్రభావం కాంగ్రెస్‌కు చాలా ఉపయోగపడుతుందన్న విశ్లేషణ ఉంది. యువత ఎక్కువగా ఉపయోగించే సామాజిక మాధ్యమానికి ఇకమీదట ప్రియాంక కేంద్ర బిందువుగా మారే అవకాశం ఉన్నందున మోదీ ప్రభ మసకబారడం ఖాయమని కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు. దక్షిణాదిలోనూ ప్రియాంక ప్రభావం బాగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు.

రాజీవ్‌గాంధీ హంతకులకు క్షమాభిక్ష ప్రసాదించడంతోపాటు, వారిని జైల్లో కలిసి సానుభూతి వ్యక్తం చేసిన వ్యక్తిగా ఆమె ఇప్పటికే తమిళ ప్రజల్లో గుర్తింపు పొందారు. ఆ ప్రభావం వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, డీఎంకేలకు మంచి ఫలితాలనిస్తుందని పేర్కొంటున్నారు. అలాగే కేరళ, కర్ణాటకల్లోనూ కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు కొత్త ఊపుతో పని చేయడానికి ప్రియాంక రాజకీయ ప్రవేశం దోహదం చేస్తుందని చెబుతున్నారు. ఇటీవల కాంగ్రెస్ గెలిచిన రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో ఓటర్లు లోక్‌సభ ఎన్నికల నాటికి మోదీ నాయకత్వం వైపు మళ్లకుండా చేయడానికీ ఈ ఊపు పనికొస్తుందని పేర్కొంటున్నారు.

యువతను ఆకట్టుకునేందుకే జ్యోతిరాదిత్య

యూపీలో మరో అర్ధభాగం బాధ్యతలను జ్యోతిరాదిత్య సింధియాకు అప్పగించడం వెనుక ప్రధానోద్దేశం యువతను ఆకట్టుకోవడమేనని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. యువ నాయకుడు, మంచి వాక్పటిక ఉన్న వ్యక్తి, ధైర్యంగా నిర్ణయాలు తీసుకొనే శక్తి సామర్థ్యాలు ఉండటం కాంగ్రెస్‌కు కలిసి వస్తుందని పేర్కొంటున్నారు. మధ్యప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెస్ వైపు యువ ఓటర్లను మరల్చడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్న వాదన ఉంది. 2014 ఎన్నికల్లో మోదీ యువతను బాగా ఆకట్టుకోగలిగారు. గత అయిదేళ్ల ఆయనపై ఆ వర్గంలో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మలచుకోవడానికి జ్యోతిరాదిత్య నాయకత్వం కాంగ్రెస్‌కు ఉపయోగపడుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఇలాంటి యువనేత భాజపాలో లేకపోవడం కూడా కాంగ్రెస్‌కు మరో అనుకూలాంశమంటున్నారు.

కనిపించని వ్యతిరేకత...

రాహుల్‌గాంధీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేక భావన ప్రియాంకపై లేదని చెప్పవచ్చు. 2014 ఎన్నికల సమయంలో రాహుల్‌ను సామాజిక మాధ్యమాల్లో కొందరు పప్పూ అని గేలిచేసేందుకు ప్రయత్నించారు. ప్రియాంకగాంధీకి అలాంటి సమస్య రాలేదు. ఆమె 2004, 2009, 2014 ఎన్నికల్లో అమేథీ, రాయ్‌బరేలి నియోజకవర్గాల్లో సోదరుడు, తల్లి తరపున ప్రచారంలో పాల్గొన్నా ఎలాంటి వ్యతిరేకత మూటగట్టుకోకుండా బయటపడ్డారు. చాలామంది కాంగ్రెస్ కార్యకర్తలు ఆమెను నానమ్మ ఇందిరాగాంధీ ప్రతిరూపంగా, సహజ నాయకత్వ లక్షణాలున్న నేతగా చూస్తూ వస్తున్నారు. భర్త రాబర్ట్ వాద్రా అవినీతి వ్యవహారం మినహాయిస్తే ఆమెకు ప్రతికూల అంశాలేమీ లేవు. దీనివల్ల పాత తరం కాంగ్రెస్ ఓటర్లంతా తిరిగి శక్తిని పుంజుకొని బలంగా పనిచేయడానికి వీలుంటుందన్న అంచనా ఉంది. ముఖ్యంగా యువత, విద్యావంతులు, మహిళలు, తొలిసారి ఓటేయబోయేవారిని ప్రియాంక తనవైపు తిప్పుకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పార్టీ వర్గాల అంచనా. ఇప్పటి వరకు నిద్రాణంగా ఉన్న కాంగ్రెస్ శ్రేణుల్ని ఉత్తేజపరిచే వాతావరణం ఆమె రాకతో సాధ్యమవుతుందని కూడా అంచనా వేస్తున్నారు. ఆమె కాంగ్రెస్‌కు కొత్త చోదకశక్తి అవుతుందంటున్నారు.

యూపీలో ఓటు చీలిపోతే..!

ఎస్పీ-బీఎస్పీలు తమను పక్కనపెట్టి కూటమిగా ఏర్పడటాన్ని కాంగ్రెస్ నాయకత్వం జీర్ణించుకోలేకపోతోంది. తద్వారా వచ్చిన అవకాశాన్ని తమకు అనుకూలంగా మలచుకోవాలన్న ఉద్దేశంతో అమ్ముల పొదిలోంచి ప్రియాంక అస్త్రాన్ని బయటికి తీసింది. దీనివల్ల వచ్చే ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో భాజపా, కాంగ్రెస్, ఎస్పీ-బీఎస్పీ కూటమి మధ్య త్రిముఖ పోటీ ఏర్పడటం ఖాయం అంటున్నారు. గత లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాకు మద్దతు పలికిన అగ్రవర్ణాలు ఇప్పుడు ఆ పార్టీపై అంత సంతృప్తిగా లేరన్న వాదన ఉంది. అలాంటి వారంతా కాంగ్రెస్ వైపు మళ్లే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. సంప్రదాయ కాంగ్రెస్ ఓటుకు తోడు, యువత, ముస్లిం ఓట్లను రాబట్టుకుంటే కాంగ్రెస్ మర్యాదకర స్థాయిలో స్థానాలు దక్కించుకొనే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో కాంగ్రెస్‌కి 10, 15 స్థానాలు వచ్చినా అద్భుతమైన పనితీరు కనబరిచినట్లేనని, అప్పుడు దేశవ్యాప్తంగా పార్టీ స్థానాల సంఖ్య 150కి పెరిగి కేంద్రంలో కీలకపాత్ర పోషించడానికి స్థానం ఉంటుందని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ప్రియాంక ప్రవేశం తర్వాత బలమైన త్రిముఖ పోటీ ఏర్పడి ప్రభుత్వ వ్యతిరేక ఓటు కాంగ్రెస్, ఎస్పీ-బీఎస్పీల మధ్య చీలిపోయి భాజపా లబ్ధిపొందే అవకాశం ఉంటుందన్న వాదనా లేకపోలేదు.

ప్రధాని అభ్యర్థిగానూ తెరపైకి?

లోక్‌సభ ఎన్నికల అనంతరం మిత్రపక్షాలేమైనా రాహుల్‌గాంధీ నాయకత్వానికి మద్దతివ్వడానికి సంకోచించిన పక్షంలో కాంగ్రెస్ ఒరలోంచి ప్రియాంకను ప్రధాని అభ్యర్థిగా ముందుకు తీసుకురావచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాంగ్రెస్‌కు 100కి పైగా సీట్లు వస్తే అదే జరిగే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ఆమెను ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లో ఒక భాగానికే పరిమితం చేసినప్పటికీ ఆ ప్రభావం మాత్రం యావద్దేశంపైనా ఉంటుందన్నది కాంగ్రెస్ నాయకుల విశ్వాసం. తూర్పు ఉత్తరప్రదేశ్‌ను ఆనుకొనే బిహార్ ఉంటుంది. కాబట్టి సార్వత్రిక ఎన్నికల్లో ఆమె ప్రభావం రెండు రాష్ట్రాలపై పడుతుందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా హిందీ రాష్ట్రాల్లో ఈమె ప్రభావం కాంగ్రెస్‌కు సరికొత్త శక్తిని ఇస్తుందని నమ్ముతున్నారు.

హరియాణా బాధ్యతలు ఆజాద్‌కు



మార్పుల్లో భాగంగా సీనియర్ నేత గులాంనబీ ఆజాద్‌కు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా హరియాణా బాధ్యతల్ని అప్పగించారు. మరో సీనియర్ నేత కె.సి.వేణుగోపాల్‌ను పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూసిన గహ్లోత్ ఇటీవల రాజస్థాన్‌కు ముఖ్యమంత్రిగా వెళ్లిన విషయం తెలిసిందే. వేణుగోపాల్ కర్ణాటక వ్యవహారాలనూ చూస్తారు.

ఎత్తిపోతలకు భారీగానే విద్యుత్తు ఖర్చు

- మొత్తం ప్రాజెక్టులకు ఏడాదికి రూ.10,500 కోట్ల వ్యయం
- వీటి నిర్వహణకు భారీగా నిధులు అవసరం
- సిఫార్సు చేయాలని 15వ ఆర్థిక సంఘాన్ని కోరనున్న ప్రభుత్వం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతల పథకాలన్నీ పూర్తయితే ఏడాదికి విద్యుత్తు ఖర్చు రూ.10,500 కోట్లు అవుతుందని నీటిపారుదల శాఖ అంచనా వేసింది. పనులు పూర్తి చేసుకుని నీటి వినియోగం జరిగాక ఎక్కువ విద్యుత్తు ఖర్చయ్యే ప్రాజెక్టుల్లో కాళేశ్వరం మొదటిది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల రెండోది. ఈరెండూ పూర్తి స్థాయిలో నీటిని ఎత్తిపోయడం మొదలైతే ఏడాదికయ్యే విద్యుత్తు ఖర్చు రూ.6328 కోట్లు. ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయిన తరువాత నిర్వహణ కీలకం. కాబట్టి ఇందుకు అవసరమయ్యే నిధులను కేంద్ర ప్రభుత్వం ఇచ్చేలా సిఫార్సు చేయాలని 15వ ఆర్థిక సంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరనుంది. సాగునీటి ప్రాజెక్టులకు విద్యుత్తు ఖర్చు, నిర్వహణ వ్యయంపై నివేదికను తయారు చేసిన నీటిపారుదల శాఖ 2020-21 నుంచి 2024-25 వరకు విద్యుత్తు ఛార్జీలు, నిర్వహణ వ్యయం రూ.40 వేల కోట్లు అవుతుందని లెక్కగట్టింది. ఇందులో విద్యుత్తు ఛార్జీలకే రూ.37 వేల కోట్లు. తెలంగాణలోని 18 ఎత్తిపోతల పథకాలకు కలిపి 11,722 మెగావాట్ల విద్యుత్తు అవసరమవుతుందని నివేదించారు. 2020-21 నాటికి అన్ని ఎత్తిపోతల పథకాలు పూర్తికావు. పూర్తయినా ఆయకట్టంతా సాగు కాదు. దీని ప్రకారం విద్యుత్తు ఖర్చు రూ.2500 కోట్లే. అయితే ఇది ఏటా పెరుగుతూ 2024-25 నాటికి రూ.10,500 కోట్లకు చేరుతుందని నీటిపారుదల శాఖ అంచనా వేసింది. ఎక్కువ విద్యుత్తు ఖర్చు అయ్యే ఎత్తిపోతలలో కాళేశ్వరం ఎత్తిపోతల, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, దేవాదుల, ఎల్లంపల్లి, ఎ.ఎం.ఆర్.పి ఉన్నాయి. అయిదేళ్లకు అయ్యే విద్యుత్తు, నిర్వహణ వ్యయాన్ని ఇచ్చేలా సిఫార్సు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంఘాన్ని కోరనుంది.

కొన్ని ప్రధాన ప్రాజెక్టుల కింద 2024-25వ సంవత్సరంలో కానున్న విద్యుత్తు ఖర్చులు

ఎత్తిపోతల ప్రాజెక్టు	విద్యుత్తు ఖర్చు(రూ.కోట్లలో)
కాళేశ్వరం	3300
పాలమూరు-రంగారెడ్డి	3028
సీతారామ	1060
కల్వకుర్తి	1050
దేవాదుల	840

మండలి సందడి మొదలు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉపాధ్యాయుల, పట్టభద్రుల నియోజకవర్గాలకు చెందిన తుది ఓటర్ల జాబితా ఫిబ్రవరి 20న ప్రకటించనుంది. తరువాత ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎన్నికలు జరిగే స్థానాలు

ప్రత్యక్షంగా ఎన్నికలు జరగాల్సిన మూడు నియోజకవర్గాలతో పాటు మరికొన్ని స్థానాలు ఖాళీ కానున్నాయి. స్థానిక సంస్థల కోటా నుంచి ఎన్నికైన ఇద్దరు, ఎమ్మెల్యే కోటాకు ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు ఎమ్మెల్సీలు శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్యేలుగా గెలుపొందారు.

- పట్నం నరేందర్‌రెడ్డి(రంగారెడ్డి), కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి(నల్గొండ), ఎమ్మెల్యే కోటా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మైనంపల్లి హనుమంతరావు ఎమ్మెల్యేలుగా పోటీ చేసి గెలుపొందారు. వారు ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు.
- ఎన్నికల ముందు తెరాస నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన నేపథ్యంలో స్థానిక సంస్థల కోటాలో గెలుపొందిన కొండా మురళీధర్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. దీంతో నాలుగు స్థానాలు ఖాళీ అయ్యాయి.
- స్థానిక సంస్థల కోటా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎం.ఎస్.ప్రభాకర్(హైదరాబాద్), భూపతిరెడ్డి(నిజామాబాద్)ల పదవీ కాలం మార్చితో ముగియనుంది.
- భూపతిరెడ్డి తెరాస నుంచి కాంగ్రెస్‌లో చేరి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు.
- ఎమ్మెల్యేల కోటా నుంచి ఎన్నికైన షబ్బీర్ అలీ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, టి.సంతోష్‌కుమార్, మహ్మద్ సలీం, మహమూద్ అలీ, కె.యాదవరెడ్డి పదవీ కాలం మార్చి నెలతో ముగినుంది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన భూపతిరెడ్డి, తెరాసకు దూరంగా ఉన్న యాదవరెడ్డి, గవర్నర్ కోటాలో నియమితులైన సభావత్ రాములు నాయక్‌లపై ఇటీవల అనర్హత వేటు పడింది. దీంతో ఆ మూడు స్థానాలు ఖాళీ అయ్యాయి.

రెండో విడతకు అంతా సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

కాలేదు. మిగతా 3,342 సర్పంచి స్థానాలకు శుక్రవారం పోలింగ్ జరగనుంది. రెండో విడత ఎన్నికల ప్రచార ఘట్టం బుధవారం సాయంత్రంతో ముగిసిన నేపథ్యంలో ప్రలోభాల పర్వం ఊపందుకుంది. గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది.

అవే బ్యాలెట్ పెట్టెలు

మొదటి విడతలో వినియోగించిన బ్యాలెట్ పెట్టెల్లోని బ్యాలెట్ పత్రాల లెక్కింపు పూర్తయిన నేపథ్యంలో వాటినే ఈ విడతలోనూ వినియోగించాలని అధికారులు నిర్ణయించారు. మొదటి విడతలో పాల్గొన్న పోలింగ్ సిబ్బందే రెండో విడతలోనూ విధులు నిర్వహిస్తారు. మొదటి విడతలో తలెత్తిన లోపాలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల సంఘం అవి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టింది. నిబంధనల్లో మార్పులు చేసింది. ఈ కారణంగా రెండో విడతలో చెల్లని ఓట్ల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తోంది.

ఉద్ధృతంగా ప్రచారం..మద్యం ప్రవాహం

రెండో విడత ఎన్నికల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం హోరెత్తింది. గత కొద్ది రోజులుగా మద్యం ఏరులై పారుతోంది. ఎన్నికల అధికారులు జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, రాజన్నసిరిసిల్ల, మెదక్, వికారాబాద్, సూర్యాపేట, కరీంనగర్, మంచిర్యాల, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మాత్రం రూ.3.48 లక్షల విలువైన 1,446 లీటర్ల మద్యం బుధవారం స్వాధీనం చేసుకున్నారు. దీంతో కలిపితే రాష్ట్ర వ్యాప్తంగా ఇంతవరకు రూ.36.27 లక్షల విలువైన మద్యం పట్టుబడినట్లయింది. వనపర్తిలో సరైన లెక్కలు లేకుండా తరలిస్తున్న రూ.19 లక్షల నగదును బుధవారం స్వాధీనం చేసుకున్నారు. దీంతో కలిపి ఇంతవరకు రాష్ట్ర వ్యాప్తంగా పట్టుబడిన నగదు రూ.1.78 కోట్లకు చేరింది. 288 సంఘటనలపై పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఇంతవరకు 289 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

రెండో విడత ముఖచిత్రం ఇదీ

ఎన్నికలను జరిగే పంచాయతీలు	4,137
నామినేషన్లు దాఖలు కానివి	7
ఏకగ్రీవం అయిన సర్పంచి స్థానాలు	788
శుక్రవారం పోలింగ్ జరిగేవి	3,342
బరిలో నిలిచిన అభ్యర్థులు	10,317

వార్డుల వారీగా

ఎన్నికలు జరిగే వార్డులు	36,620
నామినేషన్లు దాఖలు కాని స్థానాలు	94
ఏకగ్రీవమైనవి	10,317
శుక్రవారం పోలింగ్ జరిగేది	26,209
పోటీపడుతున్న అభ్యర్థులు	63,380

పథకాలు చూడండి.. పైసలీయండి

- 15వ ఆర్థిక సంఘాన్ని కోరనున్న రాష్ట్ర ప్రభుత్వం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ కొత్త రాష్ట్రమైనా సవాళ్లను అధిగమించి ప్రగతిపథంలో ముందుకు వెళ్తున్న నేపథ్యంలో 15వ ఆర్థిక సంఘం తోడ్పాటు అత్యంత కీలకమని రాష్ట్ర ప్రభుత్వం నివేదించనుంది. ప్రణాళికా సంఘం స్థానంలో ఏర్పాటైన నీతిఆయోగ్ ద్వారా రాష్ట్రాలకు ఎలాంటి నిధులు అందలేని పరిస్థితిలో బాసటగా నిలవాల్సింది ఆర్థికసంఘమే అని పేర్కొంటూ బలమైన వాదన వినిపించనుంది. 15వ ఆర్థికసంఘం నుంచి ప్రత్యేక నిధులను సాధించడమే లక్ష్యంగా రాష్ట్ర ఆర్థికశాఖ కసరత్తు చేస్తోంది. ఆర్థికసంఘం మార్గదర్శకాల మేరకే వ్యవహరించనున్నప్పటికీ ప్రత్యేక అధికారాలను ఉపయోగించుకుని తెలంగాణ రాష్ట్రానికి సహకరించాలని కోరనున్నారు. 14వ ఆర్థిక సంఘానికి పలు అంశాలను నివేదించినా ఒక్క అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోకపోవడం, కొత్త రాష్ట్రమైనా ప్రత్యేక పరిస్థితులను గుర్తించి సాయం చేసేందుకు ముందుకు రాని నేపథ్యంలో 15వ ఆర్థిక సంఘమైనా ప్రత్యేక దృష్టి సారించాలని కోరనున్నారు. కేంద్ర ఆర్థిక సంఘం నివేదికలో ఇచ్చే సిఫారసుల్లోనే తెలంగాణకు సంబంధించి ప్రత్యేక కేటాయింపులు ఉండేలా చూసేందుకు వివిధ అంశాలపై దృష్టిసారించినట్లు ప్రభుత్వ ఉన్నత వర్గాలు స్పష్టం చేశాయి.

'తెలంగాణలో అనేక భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి... రాష్ట్రంలో ప్రధానంగా గ్రామీణ జనాభా అంతా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయరంగం కుదుటపడేందుకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవానికి రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లుగా అనేక కార్యక్రమాలు చేపట్టింది. ప్రత్యేక పథకాలు అమలు చేసింది. వీటిని మరింత సమర్థంగా ముందుకు తీసుకెళ్లడానికి, మౌలిక వసతుల కల్పనకు ఆర్థిక సంఘం తోడ్పడాలి' అని నివేదించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, వాటి ద్వారా ప్రజలకు కలిగిన ప్రయోజనాలను ప్రత్యేకంగా వివరించనున్నారు. కాళేశ్వరం సహా సాగునీటి ప్రాజెక్టులు, రైతు రుణ మాఫీ, రైతుబంధు, రైతుబీమా, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఆసరా పింఛన్లు, రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణం, వ్యవసాయానికి ఉచితంగా 24 గంటల విద్యుత్, బలహీనవర్గాలకు గొర్రెలు, మేకల పంపిణీ వంటి వాటిని వివరిస్తున్నారు. ఈ పథకాల లక్ష్యం, ఇవి ప్రజల జీవితాల్లో తీసుకువస్తున్న మార్పులు, వీటికి అవుతున్న వ్యయం, నిధుల సమీకరణ వంటి వాటిపై ప్రత్యేకంగా విశ్లేషణలు సిద్ధం చేశారు.

పరిపాలనపరంగా సౌలభ్యంతోపాటు రాష్ట్రంలోని భిన్నమైన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో కొత్తగా 21 జిల్లాలను ఏర్పాటు చేశామని, కేంద్రం నుంచి వీటికి ఇంతవరకూ ఎలాంటి సహకారం అందలేదని వివరిస్తున్నారు. జిల్లాల వారీగా మానవాభివృద్ధి సూచికలు, మౌలిక సదుపాయాలు విశ్లేషించనున్నారు. నివేదికపై తుది కసరత్తు జరుగుతోందని ఆర్థిక సంఘం నుంచి రాష్ట్రం అడుగుతున్న మొత్తం ప్రత్యేక నిధులను వివిధ అంశాల వారీగా విశ్లేషిస్తున్నట్లు ఆర్థికశాఖ అధికారులు తెలిపారు. నివేదికకు తుదిరూపం ఇచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్షిస్తారని వివరించారు. ఆయన సూచనలమేరకు మార్పులు చేసి నివేదికను పూర్తి స్థాయిలో సిద్ధం చేస్తామన్నారు.

తెలంగాణకు వర్ష సూచన

ఈనాడు, హైదరాబాద్: బంగాళాఖాతం నైరుతి ప్రాంతంలో తమిళనాడు తీరానికి దగ్గర 900 మీటర్ల ఎత్తున ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఈ ఆవర్తనం నుంచి రాయలసీమ మీదుగా తెలంగాణ వరకు ఉపరితల ద్రోణి ప్రభావంతో.. శుక్రవారం రాష్ట్రంలో అక్కడక్కడా ఒక మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయన్నారు.

కాళేశ్వరానికి భారీ రుణం

(మొదటి పేజీ తరువాయి)

అయ్యాయి. ఈ రుణాన్ని కూడా 2021-22 నుంచి 2033-34 వరకు ఏడాదికి 4 కంతుల చొప్పున చెల్లించాలి. ఒక్కో కంతు రూ.49.57 కోట్లు. ఈ రెండు రుణాలకు నీటిపారుదలశాఖ ఏర్పాటు చేసిన కార్పొరేషన్ 10.4 శాతం వడ్డీ చెల్లిస్తుంది. గతంలో మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు బ్యారేజిలు, లిఫ్టుల కోసం ఆంధ్రా బ్యాంకు నేతృత్వంలో ఏర్పాటైన కన్సార్టియం రూ.7400 కోట్లు రుణంగా ఇచ్చింది. తర్వాత ఎల్లంపల్లి నుంచి మల్లన్నసాగర్ వరకు పనులకు పంజాబ్ నేషనల్ బ్యాంకు ఆధ్వర్యంలోని కన్సార్టియం రూ.11,400 కోట్లు రుణంగా ఇచ్చింది. పంపులు, మోటార్లు, ఇతర ఎలక్ట్రో మెకానికల్ పనుల కోసం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ.12,067.36 కోట్లు తీసుకొంది. ఇప్పుడు మళ్లీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచే రెండు రుణాలు పొందింది. కాళేశ్వరం ఎత్తిపోతలకు రూ.80,500 కోట్లతో పాలనా అనుమతి ఇచ్చింది. ఇప్పటివరకు సుమారు రూ.40 వేల కోట్లు ఖర్చు చేసింది.

అమెరికా-రష్యాల క్షిపణి పంచాయితీ

మాస్కో: ఒక మధ్యంతర శ్రేణి క్షిపణిపై అమెరికా, రష్యాల మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయి. రష్యా రూపొందించిన ఈ వ్యవస్థ ఒక కీలక ఆయుధ నియంత్రణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని అమెరికా ఆరోపిస్తోంది. ఈ వివాదాన్ని పరిష్కరించుకునేందుకు రష్యా బుధవారం ఒక క్షిపణి వ్యవస్థను బహిరంగపరచింది. రెండు దేశాల మధ్య కుదిరిన 'మధ్యంతర శ్రేణి అణ్వస్త్ర బలగాల ఒప్పందా' (ఐఎన్ఎఫ్)న్ని 9ఎం729 అనే క్షిపణి ఉల్లంఘిస్తోందని అమెరికా వాదిస్తోంది. దాన్ని రష్యా పదే పదే ఖండించింది. తన వాదనకు సమర్థనగా ఈ అస్త్రాన్ని బుధవారం మాస్కోకు శివార్లలోని కుబింకా పట్టణంలో ప్రదర్శించింది.

కరెంట్ సమాచారం మీ సెల్‌ఫోన్‌కే

- ఫోన్ నంబర్ నమోదు చేస్తే చాలు
- సరఫరా, కోతలు, వివరాలతో సందేశాలు
- తెలంగాణలో కోటి నంబర్ల అనుసంధానం

ఈనాడు - హైదరాబాద్

మీ కరెంటు కనెక్షన్ నంబర్‌కు మీ సెల్ నంబర్‌ను అనుసంధానం చేశారా.. లేకపోతే వెంటనే నమోదు చేసుకోండి.. ఇక మీ విద్యుత్ కనెక్షన్‌కు సంబంధించిన సమస్త సమాచారం మీ సెల్‌ఫోన్‌కే వస్తుంది. ప్రతి కనెక్షన్ వినియోగదారుడి ఫోన్ నంబర్‌ను తప్పనిసరిగా అనుసంధానం చేయాలని కేంద్ర విద్యుత్ శాఖ అన్ని రాష్ట్రాల విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లను ఆదేశించింది. తెలంగాణలోని రెండు డిస్కంల పరిధిలో మొత్తం కోటీ 17 లక్షల కనెక్షన్లున్నాయి. వీటిలో కోటి సెల్ ఫోన్ నంబర్లను అనుసంధానం చేశారు. మిగతా 17 లక్షల మంది వినియోగదారుల నంబర్లను సైతం అనుసంధానించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి రెండు డిస్కంలు ఆదేశాలిచ్చాయి. వినియోగదారులు విద్యుత్ సంస్థ వెబ్‌సైట్‌కెళ్లి వారి ఫోన్ నంబరును అనుసంధానం చేసుకోవచ్చు. ఫోన్ నంబరు మార్చాలంటే తాజా కరెంటు బిల్లుపై కొత్త ఫోన్ నంబరు రాసి ఫొటో తీసి ఈమెయిల్ చేయాలి. ఇల్లు లేదా దుకాణంలో అద్దెకు ఉండేవారు వారి ఫోన్ నంబర్‌నే సబ్‌మీటర్‌కు అనుసంధానం చేయమంటున్నారు. లేకపోతే కరెంటు ఎప్పుడు పోతుంది? ఎప్పుడొస్తుందనే తమకు ఎలా తెలుస్తుందంటున్నారు. అయితే అద్దెకు ఉండేవారు ఎప్పుడు ఖాళీ చేసి వెళతారో తెలియదని, వారి నంబర్లను ఎలా అనుసంధానిస్తారని యజమానులు గొడవ చేస్తున్నారు. ఇలాంటి క్షేత్రస్థాయి సమస్యల వల్లే కొన్ని నంబర్లు అనుసంధానం కావడం లేదని విద్యుత్ సిబ్బంది చెబుతున్నారు.



ఏయే వివరాలు తెలుసుకోవచ్చు?

వినియోగదారులకు అందించే సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే కనిపించడానికి కేంద్రం 'ఊర్జ మిత్ర డాట్ కామ్' పేరుతో ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చింది.

- ఒక ప్రాంతంలో కరెంటు ఉందా? లేదా? లేకపోతే ఎంత సమయం కోత ఉంటుంది, తిరిగి ఎప్పుడొస్తుందనే వివరాలన్నీ ఈ యాప్‌లో తెలుసుకోవచ్చు.
- ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోతే వెంటనే ఆ ప్రాంత విద్యుత్ సిబ్బందికి సందేశం వస్తుంది.
- సాంకేతిక పనులు, మరమ్మతుల కోసం సరఫరా నిలిపివేస్తే ఎంతసేపు కరెంటు ఉండదు? తిరిగి ఎప్పుడొస్తుందనే వివరాలతో యాప్ నుంచి వినియోగదారుడి సెల్‌ఫోన్‌కు సంక్షిప్త సందేశం వెళుతుంది.

ఉన్నది ఒక్కటే

మనలో ఎవరమూ కూడా జీవితంలో ఒకవైపు తప్పుడు పనులు చేస్తూ.. మరోవైపు మంచి పనులు చేయడమన్నది సాధ్యం కానేకాదు. జీవితమన్నది ఒక్కటే. అది ముక్కలు ముక్కలుగా ఉండదు. దాన్ని వేర్వేరుగా చూడలేం!

– మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

24-1-2019 గురువారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
హేమంత రుతువు; పుష్య మాసం; బహుళ పక్షం
చవితి : రా. 2.32 తదుపరి పంచమి
పుబ్బ నక్షత్రం: రా. 11.49 తదుపరి ఉత్తర
అమృత ఘడియలు: సా.5.50 నుంచి 7.20 వరకు
వర్జ్యం: ఉ. 8.51 నుంచి 10.21 తిరిగి తె. 6.36 నుంచి
దుర్ముహూర్తం: ఉ. 10.21 నుంచి 11.05 తిరిగి మ. 2.48 నుంచి 3.32 వరకు
రాహుకాలం: మ. 1.30 నుంచి 3.00 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-46

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
మెదక్	15.1	34.6
విశాఖపట్నం	15.4	29.4
గుంటూరు	16.6	32.1
ఆదిలాబాద్	16.8	31.0
కరీంనగర్	17.0	30.0
మహబూబ్‌నగర్	17.0	31.9
హైదరాబాద్	17.9	29.9
తిరుపతి	17.9	31.2
నిజామాబాద్	17.9	32.5
నల్గొండ	18.0	29.4
హన్మకొండ	18.0	30.0
రామగుండం	18.4	30.0
విజయవాడ	19.1	31.1
సూర్యాపేట	20.0	21.0
ఖమ్మం	21.0	31.0

పాఠశాల నాయకత్వంపై ఆన్‌లైన్ కోర్సు

- ప్రభుత్వ ఉపాధ్యాయులకు మాత్రమే
- అందుబాటులోకి తెచ్చిన విద్యా ప్రణాళిక, పరిపాలన జాతీయ సంస్థ
- ప్రధానోపాధ్యాయ పదోన్నతులకు ముడిపెట్టే అవకాశం

ఈనాడు - హైదరాబాద్


'పాఠశాల నాయకత్వం'పై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. సర్కారు బడులను సమర్థంగా నిర్వహించే, ఉత్తమ ఫలితాలను సాధించే దిశగా ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు అందుబాటులోకి వచ్చింది. కేంద్ర మానవ వనరుల శాఖ పరిధిలోని విద్యాప్రణాళిక, పరిపాలన జాతీయ సంస్థ(న్యూపా)లో విభాగమైన పాఠశాల నాయకత్వ జాతీయ కేంద్రం (ఎన్‌సీఎస్ఎల్) దీన్ని రూపొందించింది. ఆన్‌లైన్ విధానంలో ఉచితంగా అందించే ఈ కోర్సులో ప్రవేశానికి ప్రభుత్వ ఉపాధ్యాయులు మాత్రమే అర్హులు.

నాణ్యతాప్రమాణాల పెంపునకే..

దేశవ్యాప్తంగా పాఠశాలల విస్తరణ భారీగా పెరిగినా నాణ్యతాప్రమాణాల విషయంలో ఆశించిన లక్ష్యాన్ని చేరుకోలేదన్నది నిపుణుల అభిప్రాయం. ఇందుకోసం ఉపాధ్యాయుల్లో పాఠశాల నాయకత్వం అత్యవసరం. అందుకే న్యూపా ఈ అంశంపై 2014లోనే దృష్టి పెట్టింది. తెలుగు రాష్ట్రాల్లోనూ 2015లో ప్రధానోపాధ్యాయులకు రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) కొన్ని జిల్లాల్లో ప్రధానోపాధ్యాయులకు శిక్షణ అందించింది. గత మూడేళ్లుగా క్రియాశీలకంగా శిక్షణ అందడం లేదు. తాజాగా అందుబాటులోకి వచ్చిన ఆన్‌లైన్ కోర్సులను పూర్తి చేసిన వారికి సమీప భవిష్యత్తులో బదిలీలు, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల్లో ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారి ఒకరు చెప్పారు. ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందాలంటే ఈ కోర్సును తప్పనిసరి చేసే అవకాశం కూడా ఉందన్నారు.

నిరంతర శిక్షణ

పాఠశాల నాయకత్వంపై మొత్తం 30 గంటల శిక్షణ ఇస్తారు. వారాంతాల్లో ఇచ్చే ఈ శిక్షణ పూర్తి కావడానికి రెండున్నర నెలల సమయం పడుతుంది. గత ఏడాది సెప్టెంబరు 26న ప్రారంభించారు. ఇప్పటివరకు మూడు బ్యాచ్‌లకు శిక్షణ పూర్తికాగా, మరో అయిదు బ్యాచ్‌లకు జరుగుతోంది. తాజాగా 9వ విడత శిక్షణకు జనవరి 13 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. 28 వరకు తీసుకుంటారు. 29 నుంచి ఏప్రిల్ 10 వరకు నిపుణులు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తారు. 13వ విడత శిక్షణ వరకు కాలపట్టికను పాఠశాల నాయకత్వ జాతీయ కేంద్రం ఖరారు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 28 వేల సర్కారు బడుల్లో దాదాపు 1.15లక్షల మంది ఉపాధ్యాయులున్నారు.



'న్యూపా' విడుదల చేసిన హ్యాండ్‌బుక్

ఏం బోధిస్తారు?

- పాఠశాల నాయకత్వం - సూక్ష్మదృష్టి
- బోధనాభ్యాస ప్రక్రియలో మార్పు తేవడం
- బృందాలను ఏర్పరచి నాయకత్వం వహించడం
- నవీనత్వానికి ఆధ్వర్యం
- స్వీయ అభివృద్ధి
- భాగస్వామ్యాన్ని పెంచడంలో నాయకత్వం

అకాడమీని ఏర్పాటు చేశాం

జాతీయ స్థాయిలో పాఠశాల నాయకత్వ కేంద్రం ఏర్పాటుకాగా, దానికి అనుబంధంగా రాష్ట్రంలో పాఠశాల నాయకత్వ అకాడమీని నెలకొల్పాం. దీనికి సమన్వయకర్తను నియమించాం. ఈ అకాడమీ ప్రధాన లక్ష్యం ఉపాధ్యాయులకు పాఠశాలలను సమర్థంగా నడపటంపై శిక్షణనివ్వడం. కేంద్రం అందించే ఆన్‌లైన్ కోర్సులను పూర్తి చేసేలా ఉపాధ్యాయులకు సూచిస్తున్నాం. ఇక్కడి అకాడమీ ద్వారా ప్రత్యక్ష శిక్షణ కూడా ఇస్తాం. ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్ కోర్సుకు www.pslm.nuepa.org ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

– శేషుకుమారి,
సంచాలకురాలు, తెలంగాణ ఎస్‌సీఈఆర్‌టీ



నల్గొండకు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు ఆవుల అంజయ్యకు రూ.5 లక్షల చెక్కును అందజేస్తున్న తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్. పక్కన టీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ తదితరులు

తెలంగాణ ఉద్యమకారునికి రూ.5 లక్షల సాయం అందజేత

ఈనాడు, హైదరాబాద్: నల్గొండ పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు ఆవుల అంజయ్యకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని మంజూరు చేసింది. తెలంగాణ ఉద్యమ సమయంలో పోలీసు దెబ్బలకు తీవ్రంగా గాయపడి అనారోగ్యంతో బాధపడుతున్న ఆవుల అంజయ్య గురించి తెలుసుకున్న తెరాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆయనను పిలిపించి మాట్లాడారు. సాయం కోసం ప్రభుత్వానికి సిఫార్సు చేయగా రూ.5 లక్షలు మంజూరయింది. కేటీఆర్ బుధవారం హైదరాబాద్‌లో అంజయ్యకు ఈ చెక్కును అందజేశారు. అంజయ్య కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

అటవీ భూములన్నింటికీ ఒకే పేరు

వివాదాస్పద భూముల్లో డీజీపీఎస్ సర్వే

దస్త్రాలను పరిశీలించిన అటవీ, రెవెన్యూ శాఖలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో వేర్వేరు పేర్లతో ఉన్న అటవీ భూములను రికార్డుల్లో ఒకే పేరుతో తీసుకురావాలని అటవీశాఖ నిర్ణయించింది. ఈ మేరకు రెవెన్యూశాఖకు ప్రతిపాదనలు పంపింది. జిల్లాల్లో జంగల్, అడవి పోరంబోకు, మైసుర అని ఇలా నాలుగైదు పేర్లతో పిలుస్తున్నారు. వీటన్నింటిని తొలగించి 'అడవి' భూమిగా పేర్కొనాలని అటవీ శాఖ కోరింది. అటవీ భూముల లెక్కలు తేల్చాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో రెవెన్యూ, అటవీ శాఖలు రికార్డులు పరిశీలిస్తున్నాయి. తెలంగాణవ్యాప్తంగా 66 లక్షల అటవీ భూములున్నాయని అటవీశాఖ వర్గాలు చెబుతున్నాయి. "ఇందులో 53 లక్షల ఎకరాలకు సంబంధించి రెవెన్యూ, అటవీ శాఖ దస్త్రాలను పోల్చి చూశాం. ఇందులో 47 లక్షల ఎకరాలు అటవీ భూమిగా తేలింది. ఆరు లక్షల ఎకరాలకు సంబంధించి రెవెన్యూ రికార్డులతో సరిపోలేదు" అని అటవీ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. మిగిలిన 13లక్షల ఎకరాల రికార్డుల పరిశీలన పూర్తయ్యాక వివాదాస్పదంగా ఉన్న భూములను క్షేత్రస్థాయి పరిశీలన, డీజీపీఎస్ సర్వే ద్వారా తేల్చాలని అటవీశాఖ ప్రతిపాదించింది. దీనికి సంబంధించిన ముసాయిదా మార్గదర్శకాలను ఇప్పటికే అందించామని, సీసీఎల్ఏ సర్క్యులర్ జారీ చేయాల్సి ఉందని అటవీశాఖ వర్గాలు చెబుతున్నాయి. సుమారు 15 లక్షల అటవీ భూములకు సర్వేనంబర్లు లేవని, వీటికి కొత్తవి ఇవ్వాలని అటవీశాఖ రెవెన్యూ శాఖను కోరింది. గందరగోళం లేని భూముల్ని రికార్డుల్లో పక్కాగా నమోదు చేయించాలని, భవిష్యత్తులో వివాదాలు కాకుండా, ఇతరుల పేరిట రిజిస్టర్ కాకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. "అటవీ భూములన్నింటిని రెవెన్యూ పహాణీల్లో తొలుత అడవి భూమిగా నమోదు చేయిస్తాం. తర్వాత ప్రొహిబిషన్ రిజిస్టర్‌లోనూ నమోదు చేయిస్తాం. తద్వారా అటవీ భూముల్ని ఇతరులపేరిట మార్చేందుకు ఆస్కారం ఉండదు" అని అటవీశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

యాసంగి సాగు 61 శాతమే

వరి నాట్లు 59 శాతానికే పరిమితం

వ్యవసాయశాఖ తాజా నివేదిక

ఈనాడు, హైదరాబాద్: వర్షాభావ పరిస్థితులు యాసంగి(రబీ) సీజన్ పంటల సాగుపై ప్రభావం చూపుతున్నాయి. ఈ సీజన్‌లో సాగు సాధారణ విస్తీర్ణంలో 61 శాతానికే పరిమితమైందని వ్యవసాయశాఖ బుధవారం విడుదల చేసిన తాజా నివేదికలో వెల్లడించింది.

యాసంగిలో పంటల సాగు తీరు(వేల హెక్టార్లు)

పంట	సాధారణ విస్తీర్ణం	సాగైనది
వరి	705	413
సెనగ	95	104
వేరుసెనగ	143	106
మొక్కజొన్న	166	100
జొన్న	33	17
పెసర	12	6
నువ్వులు	17	1

మొత్తం 13.38 లక్షల హెక్టార్లలో పంటలు వేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 8.20 లక్షల హెక్టార్లలోనే సాగుచేశారు. గతేడాది ఇదే కాలవ్యవధిలో ఇంతకన్నా 65 వేల హెక్టార్లలో అధికంగా పంటలు సాగయినట్లు తెలిపింది. ప్రస్తుత సీజన్‌లో వరి నాట్లు 59 శాతం విస్తీర్ణంలోనే పడ్డాయి. ఈ నెలాఖరునాటికి యాసంగి పంటల సాగు దాదాపు పూర్తవుతుంది. వ్యవధి మరో వారం రోజులే ఉన్నందున మిగిలిన 41 శాతం విస్తీర్ణంలో వరి నాట్లు పడతాయా అన్నది తేలాల్సి ఉంది. సాగునీటి లభ్యత లేని ప్రాంతాల రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగుచేయడం మేలని వ్యవసాయశాఖ సూచించింది. ప్రస్తుత రబీ సీజన్‌లో 18జిల్లాల్లో వర్షపాతం లోటు 20నుంచి 46శాతం వరకూ ఉంది. అత్యధికంగా సంగారెడ్డి జిల్లాలో 46శాతం లోటు ఏర్పడింది. గత అక్టోబరు నుంచి మొదలైన యాసంగిలో ఈశాన్య రుతుపవనాల వల్ల వర్షాలు పడలేదు. అంతకుముందు జులై, సెప్టెంబరులోనూ వర్షపాతం లోటు అధికంగా ఉంది.

పంటల కాలనీలపై సర్వే చేయండి

డీఏఓలతో పార్థసారథి దూరదృశ్య సమీక్ష

అధ్యయనానికి నేడు హరియాణా పయనం

ఈనాడు, హైదరాబాద్: పంటల కాలనీల ఏర్పాటుకు రైతు, కమతం వారీగా సర్వే చేయడానికి నమూనా పత్రాలను జిల్లాలకు పంపామని రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి తెలిపారు. బుధవారం సచివాలయం నుంచి అన్ని జిల్లాల వ్యవసాయాధికారుల (డీఏఓ)తో ఆయన దూరదృశ్య సమీక్ష నిర్వహించారు. ఆహార శుద్ధి, ఉద్యాన, మార్కెటింగ్ సంచాలకులు అఖిల్, వెంకట్రాంరెడ్డి, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో పంటల కాలనీల ఏర్పాటు ద్వారా రైతులకు అధిక ధర వచ్చేలా చూడాలన్నారు. వ్యవసాయ, ఉద్యానశాఖల సిబ్బంది రైతుల ఇళ్లకు వెళ్లి వారి కమతాలు, పంటల సాగు వివరాలను కచ్చితమైన అంకెలతో సేకరించాలన్నారు. వాటిని పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. పంటల కాలనీల్లో పండే పంటల నుంచి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ఆహార శుద్ధి కేంద్రాలను వచ్చే వానాకాలంలో నెలకొల్పాలని చెప్పారు. వీటి ఏర్పాటుకు వారంలోగా ప్రణాళికలు తయారుచేసి సెర్ప్, స్త్రీనిధి శాఖలకు పంపాలని సూచించారు. పంటల కాలనీల్లో ఆహార పంటల సాగు, శుద్ధి పరిశ్రమల ఏర్పాటుపై సాంకేతిక అధ్యయనానికి గురువారం హరియాణా రాష్ట్రంలోని సోనేపట్ వద్ద గల జాతీయ ఆహార సాంకేతిక సంస్థకు పార్థసారథి ఆధ్వర్యంలో 8 మంది అధికారులు వెళుతున్నారు.

విత్తన సదస్సుకు వెయ్యిమంది రైతులు

ఈనాడు, హైదరాబాద్: జూన్ 26 నుంచి జులై 3 వరకు హైదరాబాద్‌లో జరిగే అంతర్జాతీయ విత్తన సదస్సుకు రాష్ట్రం నలుమూలల నుంచి వెయ్యిమంది రైతులను తీసుకురావాలని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి ఆదేశించారు. అంతర్జాతీయ విత్తన పరీక్షల ఏజెన్సీ, రాష్ట్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సుకు చేయాల్సిన ఏర్పాట్లపై బుధవారం ఆయన సమీక్షించారు. సదస్సు నిర్వహణకు అధికారులతో కమిటీలు ఏర్పాటు చేశారు. సదస్సుకు హాజరయ్యేందుకు ఆన్‌లైన్‌లో నమోదు గడువు మే ఒకటో తేదీ వరకు ఉందని తెలిపారు.



మాతృ భాష కోసం సైకిల్ యాత్ర

15 రాష్ట్రాల్లో 11,400 కి.మీ. పూర్తి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ తమ మాతృ భాషను పరిరక్షించుకునేలా చైతన్యం కల్పించాలనే లక్ష్యంతో ఓ యువకుడు దేశవ్యాప్త సైకిల్ యాత్ర చేస్తున్నాడు. మహారాష్ట్రలోని డోంబివలికి చెందిన గంధార్ తన యాత్రలో భాగంగా బుధవారం కర్నూలుకు చేరుకున్నాడు. ఈ సందర్భంగా 'న్యూస్‌టుడే'తో మాట్లాడాడు. "పుణె విశ్వవిద్యాలయంలో ఎంఏ సంస్కృతం చదివాను. 2018 జులై 1న ముంబయిలో యాత్ర ప్రారంభించా. ఇప్పటివరకూ 15 రాష్ట్రాల్లో 11,400 కి.మీ. యాత్ర పూర్తయింది. నిత్యం 120 కి.మీ. సాగుతోంది. ఆయా ప్రాంతాల్లోని ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు మాతృ భాషపై అవగాహన కల్పిస్తున్నా. ప్రస్తుత సాంకేతిక ప్రపంచంలో మన అవసరాలకు అనుగుణంగా ఇతర భాషలు మాట్లాడటం అవసరమైనప్పటికీ ఎవరూ తమ మాతృ భాషను నిర్లక్ష్యం చేయకూడదని వివరిస్తున్నా. ఆశ్రమాలు, మందిరాల్లో రాత్రి బస చేస్తున్నా. ఆగస్టు 15న యాత్ర ముగుస్తుంది" అని గంధార్ వివరించాడు.

గిరిజన విద్యార్థులకు ఇస్రో ఉపగ్రహాలపై అవగాహన

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని 314 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 'ఈ-స్కూల్' స్టూడియో ద్వారా.. బుధవారం ఇస్రో పీఎస్ఎల్వీ-సీ44 ఉపగ్రహంపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానం పెంచేందుకు ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించామని గిరిజన సంక్షేమశాఖ జేడీ నవీన్ నికోలస్ తెలిపారు. ప్రముఖ ఖగోళ పరిశోధకుడు- పీఎస్ఐ డైరెక్టర్ ఎన్.రఘునందన్ పలు ఉపగ్రహ విశేషాలు వివరించడంతో పాటు, విద్యార్థుల సందేహాలు తీర్చారన్నారు.



పొడవైన మిరపకాయలతో రైతుబజార్ ఎస్టేట్ అధికారి లింగమూర్తి

ఈ మిర్చి.. చాలా పొడవు గురూ!

సాధారణంగా పచ్చి మిరపకాయ ఒక్కొక్కటి 5 లేదా 6 సెం.మీ. పొడవు ఉంటుంది. బుధవారం విశాఖ జిల్లా ఆనందపురానికి చెందిన రైతు నగరంలోని ఎంవీపీ రైతుబజారుకు తెచ్చిన కొన్ని మిరపకాయలు మాత్రం దాదాపుగా 12 నుంచి 13 సెం.మీ. పొడవు ఉన్నాయి. సాధారణంగా ఇంత పొడవుకాయలు ఉండవని, సేంద్రియ విధానంలో పండించిన మిరపకాయలు కావడంతో ఇలా భారీగా పెరిగినట్టు రైతుబజార్ ఎస్టేట్ అధికారి లింగమూర్తి తెలిపారు.

– న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ(విశాఖపట్నం)

నేటినుంచి జాన్‌పహాడ్ దర్గా ఉర్సు

పాలకవీడు గ్రామీణం, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా ఉర్సు ఉత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. శుక్రవారం జరిగే గంధం ఊరేగింపులో తెలుగు రాష్ట్రాల నుంచి అసంఖ్యాకంగా భక్తులు హాజరు కానుండటంతో, తగినన్ని రక్షణ చర్యలు చేపట్టామని కోదాడ డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మూడురోజుల ఈ వేడుకలు శనివారం సాయంత్రం దీపారాధనతో ముగుస్తాయని దర్గా నిర్వాహకులు ప్రకటించారు.

ఉ(ల్లి)పాయం!


- నిల్వకు కొత్త విధానం
- పుణె పరిశోధన కేంద్రం రూపకల్పన
- తగ్గనున్న నష్టాలు
- మంచి ధర ఉన్నప్పుడే అమ్ముకోవడానికి భరోసా

ఉల్లి రైతులకు మేలుచేసే సరికొత్త నిల్వ పరిజ్ఞానాన్ని పుణెలోని ఉల్లి, వెల్లుల్లి పరిశోధన కేంద్రం రూపొందించింది. ఈ వివరాలను భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్) వెల్లడించింది. ధర లభించని సమయంలో ఉల్లిపాయలను నిల్వ చేసుకుని, ధరలు వచ్చిన తర్వాత వాటిని అమ్ముకోవడానికి ఈ కొత్త విధానం వీలు కల్పిస్తుందని పేర్కొంది. తద్వారా ఉల్లి నిల్వ నష్టాలు 7 శాతానికి తగ్గుతాయని తెలిపింది.

తేమ-ఉష్ణోగ్రతలను అనుకూల మోతాదులో నిర్వహించడం; నిర్దిష్ట ఉష్ణోగ్రత, వెలుతురులో ఉల్లిపాయలను నిల్వ చేయడం వల్ల వాటి జీవన ప్రమాణం పెరగడమే కాకుండా... మొలకలు రావడం, కుళ్లిపోవడం, బరువు తగ్గడం వంటి సమస్యలు ఉండవని ఐకార్ వివరించింది. ఈ కొత్త డిజైన్‌ను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో అభివృద్ధి చేసినట్లు ఆ సంస్థ పేర్కొంది. దీనిపై పేటెంట్ హక్కుల కోసం పుణెలోని పరిశోధన కేంద్రం దరఖాస్తు చేసింది.

ఎలా పనిచేస్తుంది?

ఉల్లిని నిల్వచేసే చోట ఉష్ణోగ్రతలను రెండు డిగ్రీలు అటూఇటుగా నిరంతరం 27 డిగ్రీల సెల్సియస్ వద్ద పరిమితం చేస్తారు. గాలి ఆడే వాతావరణంలో తేమ (రిలేటివ్ హ్యుమిడిటీ)ను 60-65% వద్ద ఉంచుతారు. వెంటిలేటెడ్ స్టోరేజ్ విధానంతో పోల్చితే, కొత్త విధానంలో నిల్వ నష్టాలు గణనీయంగా తగ్గుతాయి. శీతల గిడ్డంగుల్లో నిల్వచేసే ఉల్లిని బయటికి తీసిన 15 రోజుల్లో 27% మొలకలు కనిపిస్తుండగా... కొత్త విధానంలో నిల్వచేసిన వాటిలో నెల రోజుల తర్వాత కూడా మొలకలు రాకపోవడం విశేషం.



ఖర్చు తక్కువే...

రైతులు సొంతంగా పొలాల్లోనే ఈ నిల్వ కేంద్రాలను నిర్మించుకోవచ్చని ఐకార్ తెలిపింది. ఇందుకయ్యే ఖర్చు కూడా తక్కువేనట. 2 టన్నుల కనీస నిల్వ సామర్థ్యంతో నిర్మించుకుని...క్రమంగా 2 వేల టన్నుల సామర్థ్యం వరకూ వీటిని పెంచుకోవచ్చు. అంతేకాదు. ఈ కేంద్రాలకు చిన్నచిన్న మార్పులు చేసి అరటి పండ్లు మాగబెట్టడానికి కూడా వాడుకోవచ్చని ఐకార్ వివరించింది.

– ఈనాడు, దిల్లీ

సాయం పెరగదు.. ప్రోత్సాహకం అందదు!

- కులాంతర వివాహాల లబ్ధిదారులకు అందిస్తున్నది రూ.50 వేలే
- రూ.2.5 లక్షలకు పెంచే పని అపరిష్కృతం
- అమలుకు నోచుకోని కేంద్ర ప్రతిపాదనలు

ఈనాడు, హైదరాబాద్: సాంఘిక దురాచారాలను అధిగమించి కులాంతర వివాహాలు చేసుకుంటున్న వారిని ఆర్థికంగా ఆదుకునే ఉద్దేశంతో ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద కులాంతర వివాహ ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. తొలుత ఈ మొత్తం రూ.10 వేలుగా ఉండగా, 2011లో అప్పటి ప్రభుత్వం దాన్ని రూ.50 వేలకు పెంచింది. ఈ ప్రోత్సాహకాన్ని 2017-18లో కేంద్రం రూ.2.50 లక్షలకు పెంచింది. రాష్ట్రాలూ ఈ మేరకు ఇవ్వాలని సూచించినా ఇప్పటివరకు అది అమలుకు నోచుకోలేదు.

పెంచితే ఎంతో ప్రయోజనం

కొన్నేళ్లుగా తెలంగాణలో కులాంతర వివాహాలు, లబ్ధిదారుల సంఖ్య పెరుగుతోంది. హైదరాబాద్, పూర్వ ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో ఎక్కువగా నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోనూ ఈ ప్రోత్సాహకాన్ని రూ.50 వేల నుంచి రూ.2.5 లక్షలకు పెంచాలంటూ ఎస్సీ సంక్షేమ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. నేటికీ ఆ దిశగా ఉత్తర్వులు వెలువడలేదు. నమోదైన వారిలోనూ చాలా మందికి ఆర్థిక సాయం అందలేదు.

తెలంగాణలో గత నాలుగేళ్లలో నమోదైన కులాంతర వివాహాలు, ఆర్థిక సాయం అందినవారు

ఏడాది	రిజిస్ట్రేషన్లు	సహాయం అందినవారు
2015–16	1959	980
2016–17	1973	1040
2017–18	1090	821
2018–19	450	180

సర్పంచి ఎన్నిక ఏకగ్రీవం గ్రామీణులకు విమానయోగం

హన్వాడ, న్యూస్‌టుడే: పంచాయతీ ఎన్నికల పుణ్యమా అని 12మంది గ్రామీణులకు విమానం ఎక్కే యోగం దక్కింది. అదెలాగంటే.. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం కిష్టంపల్లి సర్పంచిగా సరస్వతి, మరో మహిళ నామినేషన్లు వేశారు. తన భార్యను ఏకగ్రీవం చేయాలని సరస్వతి భర్త వెంకటయ్య గ్రామంలోని నాయకులతో మంతనాలు జరిపారు. ఏకగ్రీవానికి సహకరిస్తే తిరుపతికి విమానంలో తీసుకెళ్తానని వారికి మాట ఇచ్చారు. 12 మంది నాయకులు ఆయనకు దన్నుగా నిలబడి ప్రత్యర్థిగా రంగంలో నిలిచిన మహిళ కుటుంబసభ్యులతో మాట్లాడారు. నచ్చజెప్పి ఆమెను ఉపసంహరింపజేశారు. దీంతో సరస్వతి ఎన్నిక ఏకగ్రీవమయ్యింది. వారికిచ్చిన మాటమేరకు వెంకటయ్య బుధవారం మహబూబ్‌నగర్ నుంచి 12 మందిని తీసుకుని శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లి, అక్కడి నుంచి విమానంలో తిరుపతికి తీసుకెళ్లారు. స్థానిక నేతలకు విమానయోగం దక్కడం గ్రామంలో చర్చనీయాంశమైంది.

28 నుంచి పాకశాస్త్ర విద్యార్థులకు అంతర్జాతీయ పోటీ

ఈనాడు, దిల్లీ: విద్యార్థి చెఫ్‌ల పాకశాస్త్ర ప్రావీణ్యాన్ని పరిశీలించేందుకు 28నుంచి ఫిబ్రవరి2వ తేదీవరకు అయిదో యంగ్‌చెఫ్ ఒలింపియాడ్‌ను నిర్వహించనున్నట్లు ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐఐహెచ్‌ఎం), ఇంటర్నేషనల్ హాస్పిటాలిటీ కౌన్సిల్ (ఐహెచ్‌సీ) ఓ ప్రకటనలో తెలిపాయి. దిల్లీలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. దిల్లీ, పుణె, బెంగళూరు, కోల్‌కతాల్లో దశలవారీగా పోటీలు నిర్వహిస్తారు.

అదృశ్యమైన బ్యాలెట్ పత్రాలు లభ్యం

స్టేజీ-2 అధికారిపై కేసు నమోదు

చివ్వెంల, న్యూస్‌టుడే: ఎన్నికల అనంతరం అదృశ్యమైన, సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని గుంజలూరు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వినియోగించిన బ్యాలెట్ పత్రాలు బుధవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో లభ్యమయ్యాయి. సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్సై సీహెచ్.నరేష్ వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్టేజీ-2 అధికారిపై కేసు నమోదు చేశారు. ఈ నెల 21న గుంజలూరు పంచాయతీకి అదే గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో ఎన్నికలు జరిగాయి. పోలింగ్ ముగిసిన తర్వాత స్టేజీ-2 అధికారి, గరిడేపల్లికి చెందిన వై.బుచ్చిరెడ్డి బ్యాలెట్ పత్రాలున్న సంచిని ఈవోఆర్డీ గోపీకి అప్పగించేందుకని చివ్వెంలకు తీసుకెళ్లాడు. సంచిని ఆరుబయట ఉంచి కార్యాలయంలోకి వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా సంచి కన్పించలేదు. 'తాజాగా అవి దొరికాయని, స్టేజీ-2 అధికారి నిర్లక్ష్యం కారణంగానే బ్యాలెట్ పత్రాలు అదృశ్యమైనట్టు విచారణలో తేలిందని' ఈవోఆర్డీ తెలిపారు.

ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు

తొలిదశలో ఘటనలతో పోలీసులు అప్రమత్తం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ముగిసిన మొదటిదశ పంచాయతీ ఎన్నికల్లో దాడులు, ప్రతిదాడుల నేరాలకు సంబంధించి 39 కేసులు నమోదు కావడం పోలీసులకు ఆందోళన కలిగిస్తోంది. అనేక ప్రాంతాల్లో ఇరువర్గాలు బాహాబాహీకి దిగిన సంఘటనల నేపథ్యంలో మిగిలిన రెండు దశల ఎన్నికలకు మరింత కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల ముగిసిన శాసనసభ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోలేదు. పంచాయతీ ఎన్నికల్లో తొలిదశ ముగిసేటప్పటికి మొత్తం 248 కేసులు నమోదయ్యాయి. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండల పరిధిలోని చెల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో బాహాబాహీకి దిగిన ఇరువర్గాలు కౌంటింగ్ గది తాళాలు పగలగొట్టేందుకు ప్రయత్నించాయి. దాంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. ఒకదశలో ఆందోళనకారులు పోలీసులపైనే దాడికి ప్రయత్నించారు. రీకౌంటింగ్ జరపాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా నందిగామలో ఒక వ్యక్తి మంచినీటి ట్యాంక్‌పైకి ఎక్కి దూకుతానని బెదిరించడం కలకలం రేపింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.

పులిపిర్లకు తేలిక చికిత్స

- విటమిన్ డి3 సూదిమందుతో సత్ఫలితం

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: మృదుత్వంతో మెరిసిపోవాల్సిన చర్మంపై పులిపిర్లు(వార్ట్స్) వస్తే.. పడే కంగారు అంతా ఇంతా కాదు. అవి తగ్గే వరకు రకరకాల చికిత్సల కోసం ప్రయత్నిస్తారు. చాలామందిని వేధించే ఈ పులిపిర్ల చికిత్సా విధానాలపై గుంటూరు సర్వజనాసుపత్రి చర్మ వ్యాధుల చికిత్స విభాగం ఆచార్య నాగేశ్వరమ్మ నేతృత్వంలో విద్యార్థి వైద్యురాలు రజిత పరిశోధన చేశారు. గత ఆరు నెలల కాలంలో 15 నుంచి 60 సంవత్సరాల వయసు ఉన్న 50 మంది రోగులను ఎంపిక చేసుకుని పరీక్షించారు. వీరికి విటమిన్ డి3 సూదిమందు పులిపిర్లలోకి ఇస్తే కొద్ది నెలల్లోనే 45మందికి మంచి ఫలితం కనిపించింది. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి వైద్య విద్య కార్యక్రమంలో సంబంధిత పరిశోధనాపత్రం సమర్పించి అందరి మన్ననలు పొందారు.



డాక్టర్ రజిత

గతంలో రకరకాల చికిత్సలు

పులిపిర్లు ఊడిపోవడానికి ఇప్పటివరకూ రకరకాల చికిత్సలు ఉన్నాయి. థర్మల్, క్రయో, లేజర్ థెరపీలతోనూ వీటిని నయం చేస్తున్నారు. ఈ చికిత్స అనంతరం పులిపిర్లు నయం అయిన తర్వాత కూడా కొందరికి గుంతలు, మచ్చలు కనిపించేవి. వీటిని నివారించడానికి మరోసారి వైద్యసేవలు అవసరమయ్యేవి. అయితే విటమిన్ డి3 సూది మందుతో చికిత్స పొందిన వారిలో ఆ సమస్య కనిపించలేదు. అంతేగాకుండా శరీర భాగాలపై పలు చోట్ల ఉన్నప్పటికీ ఒకటి, రెండు పులిపిర్లలోకి ఈ సూది మందు ఇస్తే మొత్తం ఊడిపోయాయి. కొంతమందికి కేవలం 15 రోజుల్లోనే మంచి ఫలితం కనిపించిందని డాక్టర్ రజిత తెలిపారు.



చికిత్సకు ముందు



చికిత్స అనంతరం

అందుబాటులో సూదిమందు

గుంటూరు సర్వజనాసుపత్రికి పులిపిర్ల సమస్యతో వచ్చిన రోగులకు విటమిన్ డి3 సూదిమందు ద్వారా చికిత్స చేశాం. రూ.50కే అందుబాటులో ఉన్న ఈ సూదిమందుతో కొందరికి కేవలం రెండింటితోనే చికిత్స పూర్తి చేయగలిగాం. సమస్య తీవ్రతను బట్టి ఎన్ని ఇంజెక్షన్లను వినియోగించాలో వైద్యులు సూచిస్తారు. అతి తక్కువ ఖర్చుతోనే చికిత్స అందరికీ అందుబాటులో ఉన్నందున దీన్ని రోగులు వినియోగించుకోవాలి.

– ఆచార్య నాగేశ్వరమ్మ

ఈనాడు

ముంచుతున్న ప్లాస్టిక్ సంచులు

ఇది ప్లాస్టిక్ యుగం. చౌకగా ఉత్పత్తి చేసే వీలు, ఎన్నో విధాలుగా వినియోగించే అవకాశం ఉన్నందువల్ల చేతి సంచులు, కాఫీ కప్పుల నుంచి కంప్యూటర్ల వరకు అన్నింటా తానై విస్తరించిన ప్లాస్టిక్- తేలిగ్గా ఛిద్రంకాని లక్షణంతో పర్యావరణానికి, మానవాళికి పెనుముప్పుగా దాపురించిందన్నది నిష్ఠుర సత్యం. నేడు విశ్వవ్యాప్తంగా తయారవుతున్న ప్లాస్టిక్ ఉత్పత్తుల్లో సగానికిపైగా ఇలా వాడి అలా పారేసేవే. దేశ దేశాల్లో ప్లాస్టిక్ సీసాలే నిమిషానికి పది లక్షలకుపైగా అమ్ముడుపోతున్నాయంటే ఏమనుకోవాలి? ఇంత భారీ వినియోగం కారణంగా భూమండలం మీద ఏటా 3.5 కోట్ల టన్నుల ప్లాస్టిక్ కాలుష్యం పేరుకుపోతూ, అందులో నాలుగో వంతు దాకా జలాల్లోకి చేరుతోంది. అది లక్షల సంఖ్యలో సముద్ర పక్షులు, పెద్దయెత్తున చేపలు, క్షీరదాలను బలిగొంటోంది. దేశీయంగా ఏటా 26 వేల టన్నులదాకా పోగుపడుతున్న ప్లాస్టిక్ వ్యర్థాల్లో దాదాపు 40 శాతం సేకరణకే నోచుకోవడం లేదని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఎక్కడికక్కడ పేరుకుపోతున్న వ్యర్థాల మూలాన మురుగునీటి పారుదల వ్యవస్థ ఉక్కిరి బిక్కిరవుతోంది. వాన నీరు భూమిలో ఇంకకపోవడానికి, దేశంలో పలుచోట్ల వరదల బీభత్సానికి, జలచరాల సంఖ్య తగ్గిపోతుండటానికి టన్నులకొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలే పుణ్యం కట్టుకుంటున్నాయి. ప్లాస్టిక్ ధూళి గాలిలో కలిసి క్యాన్సర్లు సహా రకరకాల ఆరోగ్య సమస్యలు ప్రజ్వరిల్లుతున్నాయి. మనిషి మనుగడనే దుర్భరం చేస్తున్న ప్లాస్టిక్ భూతంపై కదనకాహళి మోగించిన కేంద్రప్రభుత్వం- ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని 2022 నాటికి రూపుమాపే లక్ష్యంతో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల క్రియాశీల తోడ్పాటును అభిలషిస్తోంది. సుమారు పాతిక రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ప్లాస్టిక్ ఉత్పత్తుల కట్టడికి నిబద్ధత చాటినా వాస్తవిక కార్యాచరణ నీరోడుతోంది. ప్రాణాంతక ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ కోసం జాతీయ స్థాయిలో ఏకోన్ముఖ వ్యూహం అమలులో జాగు చేసేకొద్దీ జాతికి తీవ్ర అనర్థం తప్పదు!

'సముద్ర జలాల్ని విషపూరితం చేసి జలచరాల్ని కబళిస్తూ, మనుషుల హార్మోన్లలోకి చొరబడి రోగగ్రస్తం చేస్తున్న ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొందించా'లన్నది నిరుటి ధరిత్రీ దినోత్సవ ఇతివృత్తం. ఆ స్ఫూర్తికి గొడుగుపడుతూ ప్లాస్టిక్‌పై దేశవ్యాప్త యుద్ధాన్ని ఫ్రాన్స్ ఉద్ధృతం చేసింది. జర్మనీ, ఇంగ్లాండ్, నార్వే ప్రభృత దేశాల్లోనూ ఉత్పత్తి వాడకాలపై ఆంక్షలు పకడ్బందీగా అమలవుతున్నాయి. 2005-2015 సంవత్సరాల మధ్య మొత్తం అంతర్జాతీయ ప్లాస్టిక్ వ్యర్థాల్లో రమారమి సగందాకా రి-సైక్లింగ్ నిమిత్తం దిగుమతి చేసుకున్న చైనా, విధాన సమీక్షానంతరం నిషేధానికి మళ్ళింది. దేశీయంగానూ ప్లాస్టిక్ వ్యర్థాల దిగుమతిని నిషేధిస్తూ 2015లో ఉత్తర్వులు వెలువడినా, ఆ మరుసటి ఏడాది చేసిన సవరణ- ఆ కసరత్తు మౌలికోద్దేశానికే గండికొట్టింది. ప్రత్యేక ఆర్థిక మండళ్ల('సెజ్'ల)లో నెలకొల్పిన ఏజెన్సీలకు 'మినహాయింపు' ప్రసాదించిన దరిమిలా 'పెట్' సీసాల దిగుమతులు జోరెత్తాయి. 2017లో 12 వేల టన్నులుగా నమోదైన అటువంటి దిగుమతులు, నిరుడు 48 వేల టన్నులకు ఎగబాకాయి. మరోవైపు- రాష్ట్రాలవారీగా ప్లాస్టిక్ సంచుల తయారీ, వాడకం, రవాణా, పంపిణీ, విక్రయం, నిల్వ, దిగుమతుల్ని నిషేధిస్తూ జారీ అయిన ఉత్తర్వులూ చాలాచోట్ల దస్త్రాలకే పరిమితమవుతున్నాయి. ప్లాస్టిక్ ఉత్పాదనలకు సరైన ప్రత్యామ్నాయాలు చూపడంలో ప్రభుత్వాల అలసత్వం, సిబ్బంది అవినీతి మూలాన- అమలులో నిషేధాంక్షలు కొరగానివవుతున్నాయి. జాగృత జన మహోద్యమంగా కొనసాగాల్సిన 'ఉమ్మడి యుద్ధం' ఇలా చతికిలపడినన్నాళ్లు, పునశ్శుద్ధి నామమాత్రమే అయినంత కాలం- దేశంలో చనిపోతున్న ప్రతి ఆవు, గేదె పొట్టలో కనీసం 30 కిలోల ప్లాస్టిక్ బయటపడే ఉదంతాలు పునరావృతమవుతూనే ఉంటాయి!

దేశంలో ఏటా కోటీ ముప్ఫై లక్షల టన్నుల మేర ప్లాస్టిక్ వస్తూత్పాదనలు వినియోగిస్తుండగా, అందులో పునశ్శుద్ధికి నోచుకుంటున్నవి 40 లక్షల టన్నులేనని (సుమారు 30 శాతం) అంచనా. తక్కినవాటితో పాటు వెలుపలి నుంచి వచ్చిపడుతున్న వ్యర్థాలూ దేశం నలుమూలలా గాలిని, నీటిని, నేలను విషకలుషితం చేయడంలో పోటీపడుతున్నాయి. వ్యర్థాల కారణంగా అనర్థాలు దాపురించకుండా జాగ్రత్తపడటమే కాదు, చెత్త నుంచి పునర్వినియోగార్హమైన వస్తువుల సృష్టిలో స్వీడన్ సృజన పాటవం- ఏ దేశానికైనా విలువైన గుణపాఠం. జపాన్‌లో 75 శాతానికి పైగా ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాల్ని తిరిగి ఉపయోగంలోకి తెస్తున్నారు. పోలాండ్, ఐర్లాండ్ లాంటిచోట్లా వ్యర్థాల రి-సైక్లింగ్ పరిశ్రమగా వర్ధిల్లుతోంది. 'మాక్ రిబర్' అనే అంకుర సంస్థ యూకేలో ప్లాస్టిక్ రహదారులు నిర్మిస్తోంది. చెన్నై విమానాశ్రయ ప్రాంతంలో న్యూజిలాండ్ తరహా ప్లాస్టిక్-బిటుమెన్ రహదారి నిర్మాణ ప్రతిపాదన ఇటీవలే వెలుగుచూసింది. దేశీయంగా ఆచార్య రాజగోపాలన్ వాసుదేవన్ వంటివారు ప్లాస్టిక్ రోడ్ల ప్రాధాన్యాన్ని చాటుతున్నా- ప్రభుత్వపరంగా సమధిక సహకారం ఒనగూడితేనే- వ్యర్థానికి కొత్త అర్థం దఖలుపడుతుంది. వ్యర్థాల పునశ్శుద్ధిని విస్తృతీకరిస్తూ, ప్లాస్టిక్ ఉత్పత్తులకు దీటైన ప్రత్యామ్నాయాల అన్వేషణనూ శీఘ్రతరం చేయాల్సిన తరుణమిది. వెయ్యేళ్లదాకా నశించకపోవడం ప్లాస్టిక్ దుర్లక్షణం. గాలిలో తేమ సోకినా, నేరుగా సూర్యరశ్మి తగిలినా వందరోజుల్లో దానంతటదే విచ్ఛిన్నమయ్యే పదార్థంతో చేతి సంచుల తయారీలో వియత్నాం సఫలమైంది. ప్రయత్నిస్తే ప్రత్యామ్నాయాలు అసాధ్యం కాదని నిరూపితమవుతున్న దశలో- ప్రభుత్వాల నిర్ణాయక చొరవ, ప్రజానీకం క్రియాశీల భాగస్వామ్యాలతోనే ఇక్కడా కొత్తపొద్దు పొడిచేది!



నిర్దేశిత లక్ష్యానికి ఆమడదూరం

భారత్ వ్యవసాయ ప్రధాన దేశం. సుమారు 50 శాతం పైగా ప్రజలకు (12 కోట్ల కుటుంబాలకు) ఈ రంగమే జీవనాధారం. స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు గడచినా వ్యవసాయ రంగం పలు సమస్యలతో సతమతమవుతోంది. ఒక్క ప్రకృతి విపత్తు చాలు అన్నదాతల ఆశలను ఆవిరి కావడానికి. దేశంలో 50 శాతం పైగా రైతులు అప్పుల్లో మునిగిఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇది 93 శాతమని 'సెస్' అధ్యయనం చాటుతోంది. తెలంగాణలో అది సుమారుగా 83 శాతం. అన్నదాతల అప్పులు పెరిగిపోతున్నాయి. పంట నష్టాల వల్ల రుణాలను తీర్చలేని అన్నదాత చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నాడు. 1995-2015 మధ్యకాలంలో సుమారు 3.10 లక్షల రైతులు ఆత్మహత్యకు పాల్పడినట్లు అంచనా. చివరకు వ్యవసాయ సంక్షోభం రైతులను రోడ్డెక్కించే పరిస్థితిని తీసుకొచ్చింది. కేంద్రం రైతులను ఆదుకోవడానికి అనేక చర్యలు చేపడుతున్నా క్షేత్రస్థాయిలో అన్నదాతల బతుకులు మాత్రం బాగుపడటం లేదన్నది నిష్ఠుర సత్యం.

చెల్లింపు విధానాలే సమస్యాత్మకం

మూడేళ్ల క్రితం ప్రధాని మోదీ ప్రారంభించిన 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన' ఆచరణలో ఆశించిన లక్ష్యాలను సాధించలేక చతికిలపడింది. 2019 నాటికి దేశంలో 50 శాతం రైతుల్ని దీని పరిధిలోకి తేవాలన్నది ప్రధాని లక్ష్యం. గతంలో ప్రవేశపెట్టిన పలు బీమా పథకాలు రైతులకు మేలు చేయడంలో విఫలమయ్యాయి. 2015లో 20 శాతం పంట భూమి మాత్రమే బీమా పరిధిలో ఉండేది. పాత బీమా పథకాల్లో ప్రీమియం అధికంగా, నష్టపరిహారం పరిమితంగా ఉండేది. ప్రీమియంలో ప్రభుత్వ వాటా స్వల్పమే. కొత్త పథకం ఈ లోపాలను సరిదిద్దింది. బ్యాంకు రుణాలు తీసుకోనివారూ దీనిలో చేరవచ్చు. సత్వరం నష్టపరిహారం అందజేసేందుకు, నష్టాన్ని అంచనా వేసేందుకు రిమోట్ సెన్సింగ్, స్మార్ట్‌ఫోన్, డ్రోన్ వంటి పరికరాల వినియోగాన్ని ఈ పథకం ప్రతిపాదిస్తోంది. రైతుల ఆదాయాలు ఒడుదొడుకులకు లోనుకాకుండా, సేద్యాన్ని విడిచిపెట్టి ఇతర ఉపాధిమార్గాల వైపు వెళ్ళకుండా నివారించడానికి ఇది ఉపయోగపడుతుంది. మొదటి ఏడాది 2016-17లో 5.6 కోట్ల రైతు కుటుంబాలు ఇందులో చేరాయి. వీరిలో 3.7 కోట్ల కుటుంబాలు వివిధ బ్యాంకుల రుణగ్రహీతలు. 5.55 కోట్ల హెక్టార్ల భూమి ఈ పథకం పరిధి కింద నమోదైంది. మొదటి ఏడాది భూమి విస్తీర్ణం, రైతుల సంఖ్య విషయాల్లో అనుకున్న లక్ష్యాన్ని ప్రభుత్వం సాధించింది. కానీ అర్హులైన రైతులకు నష్టపరిహారం చెల్లించడంలో బీమా సంస్థలు అనుసరిస్తున్న విధానాలు పలు విమర్శలు ఎదుర్కొన్నాయి. మొదటి ఏడాది బీమా కంపెనీలు రూ.22,337 కోట్ల ప్రీమియాన్ని వసూలు చేసింది. ఇందులో రైతుల వాటా రూ.4,411 కోట్లు. మిగిలినది రాయితీ కింద కేంద్ర, రాష్ట్రాలు చెల్లించాయి. అదే ఏడాది బీమా సంస్థలు రైతులకు చెల్లించిన నష్టపరిహారం రూ.13,500 కోట్లు మాత్రమే. ఇది చెల్లించిన ప్రీమియంలో 60 శాతంకన్నా తక్కువ. ఈ రెండింటికి తేడా సుమారు రూ.8,837 కోట్లు. ఇది బీమా సంస్థలకు స్థూల లాభమే అవుతుంది. దీంతో అర్హులైన చాలామంది రైతులకు నష్టపరిహారం సరిగ్గా చెల్లించలేదనే విమర్శలు వచ్చాయి. 2017-18, 2018-19 ఖరీఫ్ సీజన్ వరకు బీమా సంస్థలు చెల్లించిన నష్టపరిహారం 60 శాతంకన్నా తక్కువగానే ఉంది. బీమా కంపెనీల్లో పోటీతత్వం లోపించడం, చిత్తశుద్ధి, సామర్థ్యం లోపించడం ఈ పరిణామాలకు ముఖ్య కారణాలు. అయిదు ప్రభుత్వ, 13 ప్రైవేట్ బీమా సంస్థలు ఈ పథకాన్ని అమలుచేస్తున్నాయి.

ఖరీఫ్ పంటకు బీమా చేసిన మొత్తంలో రెండు శాతాన్ని, రబీ పంటకు 1.5 శాతాన్ని, వ్యాపార పంటలకు అయిదు శాతాన్ని ప్రీమియంగా నిర్ణయిస్తున్నారు. పంట నష్టాన్నిబట్టి పరిహారం చెల్లిస్తారు. వాస్తవ పంట దిగుబడికి, గత ఏడు సంవత్సరాల పంట సగటు దిగుబడికి మధ్యగల తేడాను పంట నష్టంగా పరిగణిస్తారు. నష్టపరిహారాన్ని నిర్ణయించేటపుడు ఈ ఏడేళ్ళలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన రెండు సంవత్సరాలను మినహాయించి పండిన సగటు పంటను, రైతు ఎంచుకున్న నష్టం స్థాయి పూర్తి శాతంతో గుణిస్తారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగిన నష్టాలకు ఈ పథకం కింద నిబంధనల ప్రకారం రైతుకు పరిహారం చెల్లిస్తారు. అంతేతప్ప రాష్ట్రాలు, కేంద్ర బృందాల నివేదికలు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల, కరవు/తుపాను ప్రకటనల ఆధారంగా నష్టపరిహారం చెల్లించరు. ఈ పథకం కింద పరిహారం పొందిన రైతులకు 'స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్' కింద పంట నష్టంలో 33 శాతానికి సమానంగా సత్వర ఉపశమనం కోసం ఆర్థికసాయం లభిస్తుంది.


రైతాంగాన్ని ఆదుకోని ఫసల్ బీమా యోజన

ఈ పథకం కొన్ని రైతు సంఘాలను అంతగా ఆకర్షించలేకపోవడానికి పలు కారణాలున్నాయి. బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకున్న రైతులు సహజంగానే ఈ పథకంలో సభ్యులవుతారు. రుణాలు తీసుకోని రైతులను తప్పనిసరిగా సభ్యులుగా చేర్పించడానికి తగిన ప్రయత్నాలు జరగడం లేదు. వారందరూ సాధారణంగా కౌలు రైతులే. వ్యవసాయ భూములు వీరి పేరున లేకపోవడం వల్ల రుణాలకు వీరు అర్హులు కారు. బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా ఈ పథకం అమలుకావడం వల్ల కొన్ని రాష్ట్రాల్లో కౌలురైతులు సభ్యులు కాలేకపోతున్నారు. రైతుల బ్యాంకు ఖాతాల నుంచి వాయిదా ప్రీమియం మొత్తాన్ని వారికి తెలియకుండా తీసుకోవడాన్ని రైతు సంఘాలు తప్పుపడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో బ్యాంకు సిబ్బంది బీమా చేసిన పంటకు బదులు వేరొక పంటకు బీమా చెల్లించడం వల్ల రైతుకు ఎటువంటి ప్రయోజనమూ లేకుండా పోతుంది. ఇదంతా బ్యాంకులను అడ్డం పెట్టుకొని బీమా సంస్థలు ఆడుతున్న నాటకమని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. నష్ట పరిహారం లెక్కించే తీరూ సంతృప్తికరంగా లేదని ఆరోపిస్తున్నాయి. పంట దిగుబడి నిర్ణయించడానికి రైతు బీమా చేసిన వ్యక్తిగత భూమి కాకుండా, గ్రామాన్ని యూనిట్‌గా తీసుకోవడం రైతు సంఘాలకు ఆమోదయోగ్యంగా లేదు. ఈ విషయంలో గ్రామాన్ని కాకుండా, రైతు బీమా చేసిన పంట భూమిని యూనిట్‌గా పరిగణించడం శ్రేయస్కరం. ప్రతి గ్రామంలోను నాలుగు పంట కోత ప్రయోగాలు జరపాలని ఈ పథకంలో నిర్దేశించారు. ఇంత భారీ కార్యక్రమాన్ని అమలు చేయడానికి రాష్ట్రాల్లో తగినంత సిబ్బంది లేదు. నష్ట పరిహారం అందజేసేటప్పుడు ప్రైవేటు బీమా సంస్థలు, పలు కారణాలు చూపించి తక్కువ ఇవ్వడం ఆనవాయితీగా మారింది. గతంలో వరదలు సంభవించిన యూపీ, బిహారు, అసోమ్‌లో రైతులు ఈ పరిస్థితిని ఎదుర్కొన్నారు. డ్రోను పరికరాలను ఉపయోగించకపోవడం, క్షేత్రస్థాయిలో అధికారులకు స్మార్టుఫోన్లు ఇవ్వక పోవడం, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటా ప్రీమియం సకాలంలో చెల్లించకపోవడం వల్ల రైతులకు పరిహారం చెల్లింపులో జాప్యం జరుగుతోంది. నకిలీ విత్తనాల వల్ల వాటిల్లుతున్న నష్టాన్ని, ఏనుగులు, అడవి పందులు, ఎలుగుబంట్లు పంటలకు చేస్తున్న నష్టాన్ని ఈ పథకం పట్టించుకోవడం లేదు.

నానాటికీ తీసికట్టు

పథకం అమలు తీరులోనూ పారదర్శకత లోపించింది. దీనిపై రైతులకు అవగాహన కొరవడటంతో పథకంలో చేరుతున్న రైతుల సంఖ్య తగ్గింది. 2016-17లో 5.53 కోట్లమంది చేరగా, 2017-18లో 4.79 కోట్లమంది మాత్రమే చేరారు. 2016-17లో 5.55 కోట్ల హెక్టార్ల వ్యవసాయ భూమి ఈ పథకం కిందకు రాగా, 2017-18లో 4.75 కోట్ల హెక్టార్లు మాత్రమే చేరింది. అంటే 20 శాతం తగ్గింది. 2018-19లో దేశంలోని మొత్తం సాగుభూమిలో 50 శాతం ఈ పథకం కిందకు తేవాలన్నది లక్ష్యం. ప్రభుత్వం చెబుతున్న లక్ష్యానికి అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు లేవు. రైతులకు పరిహారం అందించడంలో తీవ్రజాప్యం చోటుచేసుకుంటోంది. వారి అభ్యర్థనల్లో చాలావరకు తిరస్కరణకు గురవుతున్నాయి. దీంతో పథకంలో చేరేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. వ్యవసాయం మన నాగరికతకు చిహ్నం. దాన్ని కాపాడుకోవలసిన బాధ్యత అందరిదీ. రైతులేనిదే జన జీవనం లేదు. అటువంటి అన్నదాత కంటతడి పెట్టడం దేశానికి శ్రేయస్కరం కాదు. నేడు వ్యవసాయరంగం పలు ఆటుపోట్లకు గురవుతోంది. స్వాతంత్ర్యం వచ్చిన తొలి కాలంలో జాతీయాదాయంలో 55 శాతంగా ఉన్న వ్యవసాయరంగం నేడు కేవలం 14 శాతం వద్ద కొట్టుమిట్టాడుతోంది. ప్రకృతి వైపరీత్యాలు హరిత విప్లవం ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయి. రైతుల ఆదాయం రెట్టింపు కావాలంటే వారికి అన్ని విధాలా అండదండలు అవసరం. ఈ దిశగా ప్రభుత్వాలు ముందుకు కదలాలి!

– ఆచార్య పి.వెంకటేశ్వర్లు

(రచయిత- ఆంధ్ర విశ్వవిద్యాలయ వాణిజ్య విభాగం ఆచార్యులు)

బంగారు తల్లికేదీ భరోసా?

'బాలికలకు సమాన అవకాశాలు లభించడమే దేశ ప్రగతికి నిదర్శనం' అని రాష్ట్రపతి కోవింద్ ఇటీవల స్పష్టీకరించారు. శాస్త్ర, సాంకేతిక విద్యా సంస్థల్లో యువతుల సంఖ్య నేటికీ తక్కువగా ఉండటంపట్ల తీవ్ర ఆందోళన వ్యక్తపరచారు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం దేశంలోని మొత్తం విద్యార్థినుల సంఖ్య 48 శాతం. దేశంలో బాలికలకు కొత్త అవకాశాలు కల్పించి, మరింతగా ప్రోత్సహించడానికి ఏటా జనవరి 24న 'జాతీయ బాలికా దినోత్సవం' నిర్వహిస్తున్నారు. 21వ తేదీ నుంచే వారోత్సవాలను కూడా దేశవ్యాప్తంగా ప్రారంభించారు. ఆడపిల్లలకు ఎదురయ్యే అనేక సమస్యలపై సామాజిక చైతన్యాన్ని, అవగాహనను మరింత ఇనుమడింపజేయడానికి పలు కార్యక్రమాలు నిర్వస్తున్నారు. దేశంలో ఏటా అయిదు లక్షల ఆడశిశువుల భ్రూణహత్యలు జరుగుతున్నట్లు ఒక అంచనా. గర్భస్థ శిశువుల లింగనిర్ధారణను నిషేధిస్తూ 1994లోనే చట్టం తెచ్చినా అది సక్రమంగా అమలు కావడం లేదు. అంతర్జాలం సహా ఎక్కడా లింగనిర్ధారణ పరీక్షకు సంబంధించిన ప్రకటన చేయరాదంటూ 2008లో ఆదేశాలు జారీచేసిన సర్వోన్నత న్యాయస్థానం, ఆడపిల్ల కలిగిన ప్రతి కుటుంబానికి ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా పరిస్థితిలో సానుకూల మార్పు సాధించవచ్చని సూచించింది. ఆడపిల్లలను కాపాడి, చదువుల తల్లులుగా తీర్చిదిద్ది, వారికి సాధికారత కల్పించేందుకు 'బేటీ బచావో-బేటీ పఢావో' కార్యక్రమాన్ని 2015లోనే కేంద్రం తీసుకొచ్చింది.

'బేటీ బచావో- బేటీ పఢావో' కార్యక్రమానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టిన హరియాణాలోనే లైంగిక నేరాలు మితిమీరుతుండటంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. సీబీఎస్ఈ పరీక్షల్లో టాపర్‌గా నిలిచిన విద్యార్థిని, మహిళా హెడ్ కానిస్టేబుల్ ఒకరు సామూహిక అత్యాచారానికి గురికావడం ఇందుకు నిదర్శనం. దేశంలో ప్రతి 15 నిమిషాలకు ఒక చిన్నారి లైంగిక దాడికి గురవుతోందని 'చైల్డ్ రైట్స్ అండ్ యూ' (క్రై) నివేదిక సంస్థ వెల్లడించింది. గత పదేళ్లలో అత్యాచారాలు ఏకంగా 500 శాతం పెరిగాయని కుండ బద్దలు కొట్టింది. బాలలపై జరిగిన నేరాల్లో 50 శాతానికి పైగా కేవలం అయిదు రాష్ట్రాల్లోనే నమోదయ్యాయి. ఉత్తర్‌ప్రదేశ్ 15 శాతం నేరాలతో అగ్రస్థానంలో ఉండగా, తరవాతి స్థానాల్లో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, దిల్లీ, పశ్చిమ్ బంగ వరసగా ఉన్నాయి. దిల్లీలో నిర్భయ ఘటన జరిగినప్పుడు దేశమంతా అట్టుడికిపోయింది. 2012లో అప్పటి యూపీఏ ప్రభుత్వం చిన్నారులపై లైంగిక నేరాల నిరోధక చట్టం (పోక్సో) తెచ్చింది.

18 ఏళ్లలోపు వారిని బాలలుగా 'పోక్సో' చట్టం గుర్తించింది. అత్యాచారాలకు పాల్పడేవారికి శిక్షలను కఠినతరం చేస్తూ కేంద్రం 'నిర్భయ' చట్టం తెచ్చింది. అసీఫా ఉదంతం వెలుగుచూడగానే 12 ఏళ్లలోపు బాలికలపై అత్యాచారానికి మరణ శిక్ష విధించాలని మోదీ ప్రభుత్వం అత్యవసరాదేశం జారీ చేసింది. నిర్భయ ఉదంతం తరవాత ఆరు రోజుల్లోనే అప్పటి ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ వర్మ నేతృత్వంలో కమిటీని నియమించి, నెల రోజుల్లోనే నివేదిక ఇవ్వాలని కోరింది. మరో మాజీ న్యాయమూర్తి లీలా సేఠ్, ప్రముఖ న్యాయవాది గోపాల్ సుబ్రహ్మణ్యం సభ్యులుగా గల కమిటీ 29 రోజుల్లో నివేదిక అందజేసింది. చట్టాన్ని అమలుచేసే వ్యవస్థల లోపమే అత్యాచారాలకు కారణమని కమిటీ తేల్చింది. పోక్సో చట్టమే ప్రత్యేక కోర్టుల ఏర్పాటుకు వీలు కల్పించింది. పిల్లలపై లైంగిక వేధింపులు, దాడులు, అశ్లీల చిత్రాల కేసుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటు బిల్లును కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రి వీరేంద్రకుమార్ తాజాగా లోక్‌సభలో ప్రవేశపెట్టారు. చిన్నారులపై ఘోరమైన రీతిలో లైంగిక దాడికి పాల్పడినవారికి ఉరిశిక్ష సహా కఠిన శిక్షలు ఉండాలని 'పోక్సో' చట్టానికి సవరణలు ప్రతిపాదించారు.


నేడు జాతీయ బాలికా దినోత్సవం

ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల సమయంలో చిన్నారులపై లైంగిక నేరాల్లో దోషులకు శిక్షలు వేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. బాలికలకు హార్మోన్లు, ఇతర ఇంజెక్షన్లు ఇవ్వడం, వారిపై లైంగిక దాడులను శిక్షార్హ నేరాలుగా పేర్కొంది. చిన్న పిల్లలతో కూడిన అశ్లీల చిత్రాలను తొలగించకపోయినా కనీసంగా వెయ్యి రూపాయల జరిమానా విధిస్తారు. ఇదే తప్పు పునరావృతమైతే అయిదు వేల రూపాయల అపరాధ రుసుం చెల్లించాలి. ఇలాంటి చిత్రాలను ప్రసారం, ప్రచారం చేసినా మూడేళ్ల జైలు లేదా జరిమానా లేదా రెండూ విధించవచ్చు.

చిన్నారులపై లైంగిక నేరాల్లో నిందితులకు శిక్షలు అమలయ్యేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుంటూరు జిల్లాలో ఉన్న పోక్సో న్యాయస్థానాలను తాజాగా నవీకరించింది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ కోర్టులను చిన్నారుల స్నేహపూర్వక న్యాయస్థానాలు (చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు)గా మార్చింది. ఇప్పటికే దిల్లీ, బెంగళూరు, హైదరాబాద్‌లలో ఇలాంటి న్యాయస్థానాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు, బాలికల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం 'అభయ' పథకాన్ని, తెలంగాణ ప్రభుత్వం 'షీ టీమ్స్' కార్యక్రమాన్ని తీసుకొచ్చాయి. సమాజంలో ఎన్ని మార్పులు వచ్చినా కొన్ని దురాగతాలు ఆగడం లేదు. దేశంలో ఏటా మూడు కోట్ల బాల్యవివాహాలు నమోదవుతున్నాయి. వీటి నిరోధానికి 1872లోనే చట్టం రూపొందించింది. ఆ తరవాత 1891, 1929, 2006 సంవత్సరాల్లో అవసరమైన మార్పులు తెచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో 'బంగారు తల్లి', చంద్రన్న పెళ్లికానుక, తెలంగాణ రాష్ట్రంలో 'కల్యాణలక్ష్మి' పథకాలు బాల్యవివాహాల నిరోధానికి దోహదపడుతున్నాయి. జాతీయ నేరగణాంక సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక ప్రకారం 2016లో మొత్తం 15,379 మంది అక్రమ రవాణా బారినపడ్డారు. వారిలో 4,980 మందిని వ్యభిచార కూపం నుంచి కాపాడినట్లు నివేదిక వెల్లడించింది. మానవ అక్రమ రవాణా (నివారణ, పరిరక్షణ, పునరావాసం) బిల్లు-2018ని లోక్‌సభ ఆమోదం పొందినా, రాజ్యసభలో ఇంకా గట్టెక్కలేదు.

దేశంలో రోజు రోజుకు పెరిగిపోతున్న భ్రూణహత్యలు, పౌష్టికాహార లోపాలు, అనారోగ్యం, అవిద్య, బాల్యవివాహాలు, మానవ అక్రమ రవాణా వంటి బాలికల సమస్యలపై మరింత చిత్తశుద్ధితో పాటుపడాలి. లింగదుర్విచక్షణను రూపుమాపాలి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో బాలికలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలి. విద్యతోపాటు క్రీడలు, కళలు, సాంకేతిక రంగాల్లో రాణించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. ఇందుకోసం ప్రభుత్వాలతోపాటు సామాజిక కార్యకర్తలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చొరవ తీసుకుంటేనే బంగారుతల్లికి భరోసా దక్కుతుంది.

– నల్లాని రాజేశ్వరి

(రచయిత్రి- సామాజిక ఉద్యమకారిణి)

ఈనాడు లేఖలు

తృణధాన్యాల సాగుకు ప్రోత్సాహం

తెలంగాణ ప్రభుత్వం రైతులకు రైతుబంధు పథకం కింద ఎకరానికి ఎనిమిది వేల రూపాయలు అందజేస్తోంది. మరోవైపు పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కినప్పుడే రైతన్నకు న్యాయం జరుగుతుందన్న వాదనలూ వినిపిస్తున్నాయి. ఇక నాణ్యమైన విత్తనాల నుంచి సాగునీటి వరకు ప్రతి అంచెలో కర్షకులకు కష్టాలే ఎదురొస్తున్నాయి. ఈ నేపథ్యంలో సేద్యంలో సరికొత్త పోకడలకు తెరతీయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఇటీవలి కాలంలో తృణ ధాన్యాలకు గిరాకీ ఎంతగానో పెరిగింది. సేంద్రియ సేద్యం ప్రచారంలోకి వచ్చింది. తక్కువ వ్యయప్రయాసలతో వీటిని సాగుచేయవచ్చు. నీటి అవసరమూ పెద్దగా ఉండదు. ప్రకృతి విపత్తులను ఈ పంటలు తట్టుకుని నిలబడతాయి. ఈ అవకాశాలను అందిపుచ్చుకొనేలా తెలంగాణ రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలి. రేషన్ షాపుల ద్వారా తృణ ధాన్యాల పంపిణీ చేపట్టాలి.

- ఆనబత్తుల రవీందర్, మాధారం, నల్గొండజిల్లా

ఓటుపై అనుమానాలు

ఎన్నికలు జరిగిన ప్రతిసారీ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరు చర్చనీయాంశమవుతోంది. అధికారులు ఎన్ని వివరణలు ఇస్తున్నా సందేహాలు మాత్రం కొనసాగుతున్నాయి. టీవీలు, కంప్యూటర్ల వంటివాటినే రిమోట్ ద్వారా నియంత్రించగలుగుతున్నాం. ఓటింగ్ యంత్రాలను ప్రభావితం చేయలేరా అన్న అనుమానాలు ఎప్పుడూ సామాన్యులకు కలుగుతుంటాయి. ఓటు వేసినప్పుడు శబ్దం రానప్పుడు, లైట్ వెలగకపోయినా ఫిర్యాదు చేయకుండా సర్దుకుపోయేవారే ఎక్కువగా ఉంటారు. దీనివల్ల ఓటు వేసినా అది సరిగ్గా నమోదైందో లేదో అనుమానం తొలుస్తూనే ఉంటుంది. అగ్రరాజ్యం అమెరికా సాంకేతికంగా ఎంతగా అభివృద్ధి చెందినా ఇప్పటికీ బ్యాలట్ విధానాన్నే అనుసరిస్తోంది. బ్యాలట్ విధానంలో ఓటు సందేహాలకు అతీతంగా ఉంటుంది. కనుక అనుమానాస్పదమవుతున్న ఈవీఎం ఓటు విధానానికి తెరదించడం ప్రజాస్వామ్యానికి మేలు!

- ఎస్.మల్లేశ్వరరావు, కేపీహెచ్‌బీ, హైదరాబాద్

ప్రార్థన

దైవ ప్రార్థనలో వినయం, అభ్యర్థన, ఆర్తి, ఆవేదన, యాచన అంతర్లీనమై ఉంటాయి. జీవాత్మ పరమాత్మల మధ్య అనన్య ప్రేమసంబంధాలను దృఢతరం చేసే వారధి ప్రార్థన.

వేదాలు, ఉపనిషత్తులు, పురాణాల్లో అభ్యర్థనకు ఎంతో ప్రాధాన్యం ఉంది. 'ఈశ్వరా! మా అజ్ఞానం తొలగించి, ప్రపంచానికి సేవచేసే సహృదయతను ప్రసాదించ'మంటుంది రుగ్వేదం. నా ఆత్మ, మనసు సత్సంకల్పం చేసేలా ప్రేరేపించు అంటుంది యజుర్వేదం. సమస్తకార్యాలను జయప్రదంగా నిర్వహించగలిగే ఉన్నతమైన జీవనశక్తి కోసం ప్రార్థించాలని సూర్య సూక్తం చెబుతుంది. మనకర్మలే మనకు కష్టాలు కలిగిస్తాయని, వాటినెలా అధిగమించాలో ప్రార్థన అందుకు ఎంతగా ఉపకరిస్తుందో కపిల మహర్షి వ్యాఖ్యానించారు. భగవన్నామస్మరణం విధిని, ఏకాగ్రతను ఉద్దీప్తం చేస్తాయని, ఫలితంగా జ్ఞాన నిష్ఠ పెరుగుతుందని, శంకరాచార్యులు హితవు పలికారు.

కులశేఖర మహారాజు రచించిన ముకుంద మాలలో ప్రార్థన విధానాన్ని వివరించిన వైనం మహత్తరమైనది. 'ఓ పుండరీకాక్షా! నీకు మనః పూర్వకంగా వందనం చేస్తుంటే శరీరం పులకాంకితమవుతోంది. కనుదోయి ఆనంద బాష్పాలతో నిండిపోతోంది. ఈ అనుభూతిని నాకు సర్వదా ప్రసాదించు స్వామీ' అంటాడు కులశేఖరుడు. త్రికరణశుద్ధిగా సర్వేంద్రియాలను పరమశివుడి ముందుంచడమే ప్రార్థన అని చెబుతుంది శివానందలహరి. 'అమృతమయీ! బ్రహ్మాండాలకు అతీతంగా తేజరిల్లే తల్లీ! అభిన్నమైన, అఖండ స్వరూపిణియైన శ్రీమత్సింహాసనేశ్వరీ!' అన్న ప్రార్థన గోచరమవుతుంది లలితా సహస్రనామంలో. సర్వకాల సర్వావస్థల్లోను సత్-అసత్ వస్తువుల ఉత్పత్తి లయ ఎరిగిన సర్వుడు, శర్వుడు, ఆ పరమేశ్వరుడి తత్వాన్ని ప్రార్థించమంటుంది విష్ణు సహస్రనామం. అందరూ సంతోషంగా, భద్రంగా, శోకరహితులై ఉండాలన్న ప్రార్థనను వ్యక్తంచేస్తాయి ఉపనిషత్తులు.

రాగద్వేషాలకు అతీతంగా లోక కల్యాణం కోసం, పరహితం కోసం చేసే ప్రార్థన మహత్తరమైంది. తల్లి, తండ్రి, గురువు, అతిథి అందరినీ జ్ఞానం ప్రసాదించమని ప్రార్థించాలని భారతీయ సనాతన ధర్మం బోధిస్తోంది. దుఃఖం దూరమై అంతటా శాంతి విస్తరిల్లాలని శాంతి మంత్రం కోరుకుంటుంది. ప్రార్థనకు ప్రధానంగా ప్రాతఃకాలం, రాత్రి నిద్రించేముందు ఉత్తమమైన సమయంగా పెద్దలు చెబుతారు. రాజ్యాన్ని పాలించే ప్రభువులు ధర్మబద్ధంగా నడుస్తూ ప్రజల్నీ ధర్మమార్గాన నడిపించటం తమ విధ్యుక్తధర్మంగా భావించాలన్నది మనుస్మృతి.



అంతర్యామి

ప్రార్థన చేసే భక్తులు మూడు విధాలుగా ఉంటారని పౌరాణికులు ప్రవచిస్తున్నారు. తమ దురదృష్టానికి దామోదరుణ్ని నిందిస్తూ, వచ్చిన ఆపదల్ని తొలగించమని ప్రార్థించేవారు సాధారణ భక్తులు. వచ్చిన విపత్తులను ఎదుర్కొనే ధైర్యం, శక్తిని ప్రసాదించమని ప్రార్థించేవారు మధ్యరకం భక్తులు. 'కష్టమైనా, దుఃఖమైనా, పరాజయమైనా... ఏం జరిగినా మా మంచికే' అన్న నమ్మకాన్ని కలిగించమని కోరేవారు నిజమైన భక్తులు. మానవ జన్మను సార్థకం చేసే బాధ్యత నీదే స్వామీ అని కోరుకుంటారు కొందరు భక్తులు. దుష్టబుద్ధులకు, దుష్టకర్మలకు, హింసాప్రవృత్తికి దూరంగా ఉండాలని కోరుకోవడం వాంఛనీయం. ప్రార్థన చేసే భక్తులు ఆర్తులు, జిజ్ఞాసులు, అర్థార్థులు, జ్ఞానులు అని నాలుగు విధాలుగా ఉంటారని భగవద్గీత చెబుతోంది.

కేవలం పరమాత్మలో లీనమై, మోక్షప్రాప్తి కోరుకునేవారు జ్ఞానులు అని అర్జునుడికి గీతలో వాసుదేవుడు బోధిస్తాడు. పంచభూతాలు దివారాత్రాలు, సకల ప్రాణికోటి దైవ స్వరూపమేనని, వాటి అనుగ్రహాన్ని కోరుకోవడమే నిజమైన ప్రార్థన అని విజ్ఞులు చెబుతున్నారు. దేవుణ్ని అంతటా చూడగలిగితే మనం చేసే ప్రతి మంచి పనీ ప్రార్థనే అవుతుంది.

– చిమ్మపూడి శ్రీరామమూర్తి

చంద్రబాబువి ఆపద మొక్కులే

- తెలంగాణ పథకాలనే కాపీ కొడుతున్నారు
- ఆంధ్ర ప్రజలు చాలా తెలివైనవారు
- ఎన్నికలకు ముందు చేసే హడావిడిని నమ్మబోరు
- తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

ఈనాడు – హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలంగాణ పథకాలనే కాపీ కొట్టి ఆ రాష్ట్రంలో అమలు చేస్తున్నారని తెరాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. మరోసారి ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఆయన చేస్తున్న విన్యాసాలను చైతన్యవంతులైన ఆంధ్ర ప్రజలు నమ్మబోరని, వారు చాలా తెలివి గలవారని పేర్కొన్నారు. ఆందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డిని బుధవారం నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.

'ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబువి ఆపద మొక్కులు. ఆయన దిగిపోయే సమయం దగ్గర పడింది. సంక్షేమ పథకాలతోనే తెలంగాణలో కేసీఆర్ ఘన విజయం సాధించారనే ఉద్దేశంతో చంద్రబాబు కూడా ఆంధ్రలో అవే కార్యక్రమాలను కాపీ కొట్టి ప్రకటిస్తున్నారు. ఇక్కడ రూ.2 వేల పింఛన్ ఉంటే.. అక్కడా ఇస్తున్నారు. 43 శాతం ఫిట్‌మెంట్ ఇస్తే.. అక్కడా ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణలో నాలుగేళ్ల కిందటే ఆటోలు, వ్యవసాయ ట్రాక్టర్లకు రవాణా పన్ను మాఫీ చేశాం. తాజాగా అక్కడా చేశారు. ఎన్నికలకు రెండుమూడు నెలల ముందు హడావిడి చేస్తే ఆంధ్ర ప్రజలు నమ్మే స్థితిలో లేరు. వాళ్లు చాలా తెలివైన వాళ్లు. రాజకీయంగా చైతన్యవంతులు. వచ్చే ఎన్నికల్లో సరైన నిర్ణయం తీసుకుంటారనే నమ్మకం నాకుంది' అని కేటీఆర్ పేర్కొన్నారు.



హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్‌లోని ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో శాసనసభ్యులు క్రాంతికుమార్, రామలింగారెడ్డిలను సత్కరిస్తున్న తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్. పక్కన ప్రెస్ అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ

పాత్రికేయుల సమస్యలు పరిష్కరించే బాధ్యత నాదే

'జర్నలిస్టులకు చంద్రబాబు ఏదో చేశారని.. మేం కూడా ఇక్కడ హడావిడిగా అలా చేయం. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు లేకుండా.. ఎవరూ వేలెత్తి చూపకుండా పక్కాగా న్యాయం చేస్తాం. ఇంకా అయిదేళ్ల సమయముంది. ఆ లోపు పాత్రికేయులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తాం. నేను ప్రభుత్వంలో ఉన్నా లేకపోయినా సరే.. తెరాస పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చెబుతున్నా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించే బాధ్యతను నేను తీసుకుంటా. ఎన్నికలకు ముందు ఇదే మాట చెప్పాను. ఇప్పుడూ అదే చెబుతున్నా. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్‌కు ప్రత్యేక భవనం కట్టించేందుకు కృషి చేస్తా' అంటూ కేటీఆర్ హామీ ఇచ్చారు. ఉద్యమంలో పాల్గొన్న ప్రతి వర్గానికీ న్యాయం చేసిన ఘనత కేసీఆర్ నాయకత్వంలో తెరాసకే దక్కుతుందన్నారు. స్థానిక సంస్థల నుంచి దిల్లీ వరకు అవకాశమున్న ప్రతి చోట తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులకు పెద్దపీట వేశామని తెలిపారు.

మీడియా సంస్థలపై ఆగ్రహం

తెలంగాణ రాష్ట్రం సిద్ధించి అయిదేళ్లవుతోందని, అయినా సరే.. కొన్ని మీడియా సంస్థలు, పత్రికల ధోరణి మాత్రం ఇంకా మారలేదంటూ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రోజు తెల్లారి లేవగానే అమరావతి వార్తలు కొన్ని పత్రికల్లో ప్రముఖంగా కనిపిస్తున్నాయి. అక్కడి వార్తలు ఇక్కడ వేయండి మాకెలాంటి అభ్యంతరం లేదు. కానీ.. ఇక్కడి వార్తలు కూడా అక్కడ వేయాలి కదా. ఆ సంస్కారం ఉండాలి కదా' అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ భావజాలాన్ని అణువణువునా నింపుకుని నడుస్తున్న పత్రికలు, ఛానెళ్లను భుజం తట్టి ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ ఆఫ్ తెలంగాణ ఛైర్మన్ అల్లం నారాయణ, టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ ఘంటా చక్రపాణి, పలువురు సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు.



నేతాజీ... నిన్ను కొలిచేదెలా?

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా నివాళులు అర్పించేందుకు కొంతమంది యువకులు బుధవారం సికింద్రాబాద్‌లోని రైల్వే స్టేషన్ ఎదుట ఉన్న ఆయన విగ్రహం వద్దకు వచ్చారు. అయితే అక్కడ నిచ్చెన లేకపోవడంతో గద్దెపైకి ఎక్కిన ఇద్దరు యువకుల సాయంతో మరో యువకుడు నేతాజీ విగ్రహానికి పూలమాల వేసేందుకు ఇలా ఇబ్బంది పడ్డారు. – ఈనాడు, హైదరాబాద్

ముందు ఏపీ, తర్వాత తెలంగాణలో

గణతంత్ర వేడుకలకు హాజరుకానున్న గవర్నర్

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ నరసింహన్ ఈ నెల 26న జరిగే గణతంత్ర వేడుకల్లో ముందుగా ఆంధ్రప్రదేశ్‌లో, ఆ తర్వాత తెలంగాణలో పాల్గొంటారు. 25న మధ్యాహ్నమే ఆయన అమరావతికి చేరుకుంటారు. జాతీయ ఓటరు దినోత్సవంలో పాల్గొంటారు. 26న ఉదయం 8.45 గంటలకు అమరావతిలో గణతంత్ర వేడుకల్లో జెండా వందనం చేస్తారు. 9.25కి అక్కడి నుంచి బయల్దేరి 10.15 గంటలకు హైదరాబాద్ చేరుకుంటారు. 10.45 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగే గణతంత్ర దినోత్సవంలో పాల్గొంటారు.

మజ్లిస్ సభ్యుని ప్రమాణస్వీకారం

మజ్లిస్‌పార్టీ నాంపల్లి నియోజకవర్గ శాసనసభ్యుడు జాఫర్ హుస్సేన్ మెరాజ్ బుధవారం శాసనసభలోని సభాపతి కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆయనతో ప్రమాణం చేయించారు. శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దిగజారుతున్న విద్యాప్రమాణాలు

- ప్రైవేటు పాఠశాలలను ప్రోత్సహించేలా ప్రభుత్వ తీరు
- ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేయండి
- సర్కారు పాఠశాలలపై హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో నానాటికీ ప్రమాణాలు దిగజారుతున్నాయని హైకోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం కూడా పడిపోతోందని పేర్కొంది. ప్రభుత్వ విధానాలు ప్రైవేటు పాఠశాలను ప్రోత్సహించేలా ఉన్నాయని వ్యాఖ్యానించింది. నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద సర్కారు ప్రైవేటు బడులకు రుసుములు చెల్లించడం సరికాదని వ్యాఖ్యానించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని తీవ్రమైనదిగా పరిగణనలోకి తీసుకుని విద్యాశాఖలోని ఉన్నతాధికారులతో ఓ కమిటీ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచడానికి ఈ కమిటీ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించింది. ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యాప్రమాణాలను మెరుగుపరిచేలా ఆదేశాలివ్వాలంటూ ఎంవీ ఫౌండేషన్ కన్వీనర్ ఆర్.వెంకటరెడ్డి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై మరోసారి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎన్.ఎస్.అర్జున్‌కుమార్ వాదనలు వినిపిస్తూ, గత వారం విడుదలైన ఎఎస్ఇఆర్ 2018 వార్షిక నివేదికలో కూడా తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు మరింత దిగజారినట్లు చెప్పారు. రాష్ట్రంలో అత్యవసరంగా భర్తీ చేయాల్సిన ఉపాధ్యాయ పోస్టులు 1,600 ఉన్నాయన్నారు. ఈ వ్యవహారంపై అధ్యయనం చేయడానికి ఉన్నతస్థాయిలో ఓ కమిటీ ఏర్పాటు అవసరముందన్నారు. వాదనలను విన్న ధర్మాసనం ఓ కమిటీని ఏర్పాటు చేసి పటిష్ఠమైన ప్రతిపాదనలను సిద్ధం చేసే విషయమై వివరణ ఇవ్వాలంటూ విచారణను 25వ తేదీకి వాయిదా వేసింది.

జయలలిత మృతి వెనుక మర్మాలు!

మాథ్యూస్ శామ్యూల్ సంచలన ఆరోపణలు

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత మృతిపై విచారణ జరుపుతున్న ఆర్ముగస్వామి కమిషన్‌పై తనకు నమ్మకం లేదని, ఆ కమిషన్ నివేదిక ఇలాగే ఉండాలంటూ ముందే నిర్ణయం జరిగిపోయిందని తెహల్కా మాజీ మేనేజింగ్ ఎడిటర్ మాథ్యూస్ శామ్యూల్ ఆరోపించారు. కొడనాడులో జయలలితకు చెందిన ఎస్టేట్ బంగ్లాలో దోపిడీ, అనుమానాస్పద మరణాలపై డాక్యుమెంటరీ విడుదల చేసిన ఆయన తాజాగా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. బుధవారం చెన్నైలో మాథ్యూస్ విలేకరులతో మాట్లాడుతూ జయలలిత మరణం వెనుక ఉన్న మర్మాలు బయటకు రావాల్సి ఉందన్నారు. కొడనాడు ఎస్టేట్ బంగ్లాలో దోపిడీ, అనంతర ఘటనల్లో శశికళ, ఆమె అక్క కుమారుడు టీటీవీ దినకరన్, సీఎం పళనిస్వామిలలో ఎవరికి సంబంధముందనే విషయాలపై దర్యాప్తు చేసి వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న రంగరాజన్, వేదికపై అయ్యప్ప సంఘాల ప్రతినిధులు

శబరిమల పవిత్రతను కాపాడాలి

చిలుకూరు బాలాజీ దేవాలయ అర్చకుడు రంగరాజన్

కవాడిగూడ, న్యూస్‌టుడే: శబరిమల అయ్యప్ప దేవాలయం పవిత్రతను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్ సహా పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. హిందువుల విశ్వాసాలపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్ ధర్నాచౌక్‌లో శబరిమల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర కమిటీ, శబరిమల అయ్యప్ప సేవా సమాజం సంయుక్త ఆధ్వర్యంలో మహా ఉపవాస దీక్ష జరిగింది. ఈ సందర్భంగా రంగరాజన్, నిర్మలానంద యోగ భారతి, తెలంగాణ శాసన మండలి సభ్యుడు రామచందర్‌రావు, విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు, అయ్యప్ప సేవా సంఘం ప్రతినిధి నాయిని బుచ్చిరెడ్డి తదితరులు మాట్లాడారు. శబరిమల అస్తిత్వాన్ని దెబ్బతీసేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆక్షేపించారు. కేరళలోని కమ్యూనిస్టు ప్రభుత్వం కోర్టు తీర్పును బూచిగా చూపుతూ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తోందని మండిపడ్డారు ఇదిలా ఉండగా.. దీక్షా స్థలి వద్దకు వచ్చిన ఓ టీవీ ఛానల్(ఈటీవీ కాదు) విలేకరి, కెమెరామెన్‌లకు వ్యతిరేకంగా అయ్యప్ప భక్తులు నినాదాలు చేశారు. ఆ టీవీ ఛానల్‌లో శబరిమల పవిత్రతకు భంగం కలిగించేలా కార్యక్రమాలను ప్రసారం చేస్తున్నారంటూ వారిని ఘెరావ్ చేసే ప్రయత్నం చేశారు. ఇదే సందర్భంలో గుర్తుతెలియని వ్యక్తి ఛానల్ సిబ్బందిపై దాడి చేసేందుకు యత్నించడం గందరగోళానికి దారితీసింది. పోలీసులు అప్రమత్తమై వారిని అక్కణ్నుంచి పంపించి వేయడంతో పరిస్థితి సద్దుమణిగింది.

12న తిరుమలలో ఆర్జిత సేవలు రద్దు

తిరుమల, న్యూస్‌టుడే: రథసప్తమి పర్వదినమైన ఫిబ్రవరి 12వ తేదీన శ్రీవేంకటేశ్వర స్వామివారికి అన్ని ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్లు తిరుమల జేఈవో శ్రీనివాసరాజు వెల్లడించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రథసప్తమి రోజున వయోవృద్ధులు, దివ్యాంగులతో పాటు చంటిపిల్ల తల్లిదండ్రులకూ ప్రత్యేక దర్శనాలను రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

ఇక మూడేళ్ల కోర్సుగా యానిమేషన్!

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుతం నాలుగేళ్ల కాలపరిమితితో కొనసాగుతున్న గేమింగ్ అండ్ యానిమేషన్ కోర్సును వచ్చే విద్యాసంవత్సరం నుంచి మూడేళ్ల కోర్సుగా మార్చాలని ప్రభుత్వం యోచిస్తోంది. రాష్ట్రంలో జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా దాదాపు 14 కళాశాలల్లో ఈ కోర్సును నిర్వహిస్తున్నారు. నాలుగేళ్ల కాలపరిమితి ఉన్న కోర్సులన్నింటికీ ఏఐసీటీఈ అనుమతి తప్పనిసరి. మూడేళ్ల కోర్సు నిర్వహించడానికి విశ్వవిద్యాలయం, ఉన్నత విద్యామండలి అనుమతి ఉంటే సరిపోతుంది. గేమింగ్ అండ్ యానిమేషన్ కోర్సును మూడేళ్లకు కుదించాలని ఉన్నత విద్యామండలి వినతిపై ప్రభుత్వం త్వరలో ఉత్తర్వులు వెలువరించే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

లింగాల యువకుడికి ఐరాస గుర్తింపు

లింగాల, న్యూస్‌టుడే: నాగర్‌కర్నూలు జిల్లాలోని లింగాలకు చెందిన ఓ యువకుడికి ఐక్యరాజ్యసమితి సభలో పాల్గొనే అరుదైన అవకాశం దక్కింది. ఈ మేరకు స్కైలార్క్ మెడికల్ ఇండియా (హైదరాబాద్) సంస్థ నిర్వాహకుడు మోట వీర్‌కుమార్ ఈనెల 25న జెనీవా చేరుకుంటారు. అక్కడి ఐరాస ప్రధాన కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. సంస్థ ఆధ్వర్యంలో ఆయన వివిధ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సామాన్యశాస్త్రంపై అవగాహన కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వైద్యులతో పిల్లలకు వైద్యపరీక్షలు జరిపించారు. ఎర్రపెంట గ్రామంలో చెంచులకు వైద్య పరీక్షలు చేశారు. నల్లమల ప్రాంతంలో తన సామాజిక సేవలను గుర్తించిన ఐరాస.. ఆహ్వానం పంపిందని తెలిపారు.

ఎన్నికల్లో దివ్యాంగుల హక్కుల అమలు వివరాలివ్వండి

కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు హైకోర్టు నోటీసులు

ఈనాడు, హైదరాబాద్: ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఉన్న హక్కుల అమలుకు సంబంధించి ఏం చర్యలు తీసుకుంటున్నారని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. దివ్యాంగులకు ప్రత్యేక బూత్‌లు, సౌకర్యాల కల్పనలో సీఈసీ ఇచ్చిన ఆదేశాల అమలుకు సంబంధించి తీసుకున్న చర్యలపై కౌంటర్లు దాఖలు చేయాలంది. దివ్యాంగుల చట్టం 2016తోపాటు కేంద్ర ఎన్నికల సంఘం 2016, 2017, 2018ల్లో పేర్కొన్న హక్కులను అమలు చేసేలా చూడాలంటూ మలక్‌పేటలోని దివ్యాంగుల సంస్థ తరఫున ఎం.శ్రీనివాసులు మరికొంత మంది హైకోర్టుకు లేఖ రాశారు. ఈ లేఖను సుమోటో ప్రజాప్రయోజన వ్యాజ్యంగా పరిగణనలోకి తీసుకున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.

వీవీప్యాట్‌ల లెక్కింపు వ్యవహారంపై కౌంటరు దాఖలు చేయండి

మల్‌రెడ్డి రంగారెడ్డి పిటిషన్‌పై ఈసీకి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో వీవీప్యాట్ చీటీల లెక్కింపునకు సంబంధించి పూర్తి వివరాలతో ఈనెల 30లోగా కౌంటరు దాఖలు చేయాలని ఎన్నికల సంఘానికి హైకోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఓట్ల లెక్కింపులో లోపాలున్నాయని, అందువల్ల వీవీప్యాట్‌లను లెక్కించేలా కేంద్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేయాలంటూ ఆ నియోజకవర్గంలో బీఎస్పీ తరఫున పోటీ చేసిన మల్‌రెడ్డి రంగారెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిల ధర్మాసనం విచారణ చేపట్టింది. లెక్కింపులో లోపాలున్నాయని ఫిర్యాదు చేసినప్పటికీ వీవీప్యాట్ చీటీలు లెక్కించడానికి ఎన్నికల సంఘం అంగీకరించలేదని మల్‌రెడ్డి పిటిషన్‌లో పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం కింద పూర్తి వివరాలు అడిగినా తొక్కిపెట్టారన్నారు. వివరాలతో కౌంటరు దాఖలు చేస్తామని ఈసీ తరఫు న్యాయవాది అవినాశ్ దేశాయ్ తెలిపారు.

స్టాంపుల విక్రయాల్లో అక్రమాలు.. ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రార్‌పై వేటు

సబ్‌రిజిస్ట్రార్, నలుగురు ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్ల సస్పెన్షన్

ఈనాడు, ఆదిలాబాద్: స్టాంపుల విక్రయాల్లో అక్రమాలు నిరూపితం కావడంతో జిల్లా రిజిస్ట్రార్‌ను ఉద్యోగం నుంచి తొలగించారు. ఒక సబ్ రిజిస్ట్రార్‌తో పాటు ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్లుగా పనిచేసిన నలుగురిపై సస్పెన్షన్ వేటు వేశారు. స్టాంపుల విక్రయాల్లో చోటుచేసుకున్న అవినీతిపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితం కావడంతో స్పందించిన అధికారులు విచారణ నిర్వహించి ఈ చర్యలు తీసుకున్నారు. ఆదిలాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపుల విక్రయాల్లో రూ.80లక్షల మేర అక్రమాలు జరిగాయి. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులను వదిలిపెట్టి దినసరి వేతనంతో పనిచేస్తున్న, జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన వారిపై చర్యలు తీసుకున్నారు. దీనిపై ఈ నెల 17న 'లెక్కలేని అవినీతి' అన్న శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీంతో అదనపు ఐజీ వెంకట రాజేశ్ బుధవారం ఆదిలాబాద్ కార్యాలయంలో విచారణ జరిపి జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న జయవంత్‌రావును విధుల నుంచి తొలగించారు. ఆదిలాబాద్‌లో సబ్ రిజిస్ట్రార్ మనోహర్‌తో పాటు ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్లు సాయినాథ్, ఇమ్రాన్‌ఖాన్, చంద్రశేఖర్, అరుణ్‌కుమార్‌లను విధుల నుంచి సస్పెండ్ చేశారు.

వంద కోట్ల మొక్కల లక్ష్యం చేరాలి: సీఎస్

ఈనాడు, హైదరాబాద్: నగరాలు, పట్టణాల్లో పెరిగిన కాలుష్యాన్ని తట్టుకునేందుకు పచ్చదనాన్ని పెద్దఎత్తున పెంచాలని డివిజన్‌కు, వార్డుకు ఓ నర్సరీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్.కె.జోషి ఆదేశించారు. వర్షకాలం నుంచి ప్రారంభమయ్యే ఐదో విడత హరితహారానికి సీఎం కేసీఆర్ నిర్దేశించిన 100 కోట్ల మొక్కలను నాటాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఆయా శాఖలు పనిచేయాలని స్పష్టం చేశారు. సీఎస్ అధ్యక్షతన హరితహారం రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశం సచివాలయంలో బుధవారం జరిగింది. 12,751 గ్రామ పంచాయతీల్లో 2,206 గ్రామాల్లో ఇప్పటికే అటవీశాఖ నర్సరీలు ఉన్నాయని.. మిగిలిన 10,545 పంచాయతీల్లో 9,868 నర్సరీల ఏర్పాటు వేగవంతమైందని పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ వెల్లడించారు. 59 అర్బన్ ఫారెస్ట్ పార్కులను జులైకల్లా సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. సమావేశంలో విద్యుత్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, ఆర్ అండ్ బీ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, పట్టణాభివృద్ధిశాఖ కమిషనర్ శ్రీదేవి, పర్యాటక శాఖ కార్యదర్శి దినకర్‌బాబు, జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ ఆమ్రపాలి, ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ కల్యాణ్ చక్రవర్తి, సీఎం ఓఎస్డీ (హరితహారం) ప్రియాంక వర్గీస్, పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝా, మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉపగ్రహం.. ప్రయోగానికి సిద్ధం

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: ఉన్నత పాఠశాల విద్యార్థుల బృందం రూపొందించిన ఓ ఉపగ్రహాన్ని ప్రయోగానికి సిద్ధం చేశారు. శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి గురువారం రాత్రి నిర్ణీత కక్ష్యలో ప్రవేశ పెట్టనున్నారు. ఇప్పటి వరకు విశ్వవిద్యాలయ విద్యార్థులు మాత్రమే ఉపగ్రహాలకు రూపకల్పన చేసి, ప్రయోగించారు. మొట్టమొదటిసారిగా పాఠశాల విద్యార్థులు స్పేస్ కిడ్స్ ఇండియా ప్రోత్సాహంతో 1.2 కిలోల ఉపగ్రహాన్ని తయారుచేశారు. ఇది అత్యంత తక్కువ బరువు గల ఉపగ్రహం. ఈ ఉపగ్రహం పది సెంటీమీటర్ల పరిమాణంలో ఉంది. దీనికి దివంగత రాష్ట్రపతి కలాం పేరును పెట్టారు. దీని రూపకల్పనకు రూ.12 లక్షలు వ్యయం చేశారు. ఈ ఉపగ్రహం జీవిత కాలం రెండు నెలలు. ఇందులో 3డీ ప్రింటింగ్ సాంకేతికతను ఉపయోగించారు. ఈ ఉపగ్రహం.. పీఎస్‌ఎల్‌వీ-సి44 వాహక నౌకలోని నాల్గో దశను ఆర్బిటల్ ప్లాట్‌ఫామ్‌గా ఉపయోగించనుంది. విద్యార్థుల బృందానికి తమిళనాడు పల్లపట్టికి చెందిన విద్యార్థి రిఫత్ (18) సారథ్యం వహించారు.





కలాం శాట్‌కు రూపకల్పన చేసిన విద్యార్థులు ★ కలాం శాట్

ఆర్టీసీ డ్రైవర్‌కు గుండెపోటు

- చాకచక్యంగా బస్సును రోడ్డు పక్కన నిలిపిన వైనం

పెద్దపల్లి పట్టణం, న్యూస్‌టుడే: విధుల్లో ఉన్న ఓ ఆర్టీసీ డ్రైవర్‌కు గుండెపోటు వచ్చి స్టీరింగ్‌పై కుప్పకూలాడు. అంతబాధలోనూ విధి నిర్వహణను వీడలేదు. తాను నడుపుతున్న బస్సును చాకచక్యంగా పక్కన నిలిపి 52 మంది ప్రయాణికులను ప్రమాదం నుంచి కాపాడాడు. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ వద్ద బుధవారం జరిగింది. డ్రైవర్ మహేందర్ చొరవను ప్రయాణికులు అభినందించారు. గోదావరిఖని డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం ఉదయం 8 ఇన్‌క్లైన్‌కాలనీ మీదుగా హైదరాబాద్‌కు వెళ్తోంది. కమాన్‌పూర్ దాటగానే డ్రైవర్ అస్వస్థతకు గురై తనను పిలిచినట్లు కండక్టర్ రాణి తెలిపారు. అయినా బస్సు నడుపుతూ క్షణాల్లోనే గుండెపోటుకు గురయ్యాడు. అంత బాధలోనూ బస్సును జాగ్రత్తగా పక్కకు ఆపాడు. ఇదే బస్సులో ప్రయాణిస్తున్న సింగరేణి వైద్యుడు చంద్రశేఖర్‌రావు డ్రైవర్‌కు ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమిస్తుందనే భావనతో అప్రమత్తమైన బస్సులోని మరో సింగరేణి ఉద్యోగి తిరుపతి 11 కిలోమీటర్లు బస్సు నడిపి పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించాలని నిర్ణయించారు. ఆ సమయంలో కండక్టర్ వద్ద డబ్బులు లేకపోవడంతో ప్రయాణికులే రూ.2 వేలు సేకరించి, ప్రత్యేక అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలించారు. కాసేపటికి డిపో అధికారులు మరో డ్రైవర్‌ను పంపి బస్సును హైదరాబాద్‌కు బయలుదేరేలా చర్యలు తీసుకున్నారు.



బాధితుడిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న ప్రయాణికులు

ఆదర్శ పట్టణంగా యాదగిరిగుట్ట

- వైటీడీఏ సమీక్షలో సీఎస్ ఎస్కే జోషి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: యాదగిరిగుట్టను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో యాదాద్రి పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ (వైటీడీఏ) సమీక్ష సమావేశం జరిగింది. సీఎస్ మాట్లాడుతూ యాదాద్రిలో మోడల్ బస్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఉద్యానవనాలు, మార్కెట్‌లు, రహదారులు, ప్రధాన కూడళ్లు, మురుగు కాల్వలు, డంపింగ్ యార్డులు, వీధి దీపాలు, నడక దారులను అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తామన్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్ ద్వారా రహదారులకు ఇరువైపులా మొక్కలు పెంపకాన్ని చేపడతామని చెప్పారు. పెద్దగుట్టలో 132/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని ఏప్రిల్ 15 నాటికి పూర్తి చేయాలని పేర్కొన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్, అగ్నిమాపక కేంద్రం, వేదపాఠశాల, శ్రీ లక్ష్మీనరసింహ శిల్ప, వాస్తుకళా సంస్థల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారుల విస్తరణ, మంచినీటి సరఫరా, గండిచెరువు అభివృద్ధి చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఇంధనశాఖ, రెవెన్యూ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అజయ్‌మిశ్రా, రాజేశ్వర్ తివారి, రహదారులు, భవనాలశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, వైటీడీఏ వైస్ ఛైర్మన్ కిషన్‌రావు, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, పురపాలకశాఖ సంచాలకురాలు టీకే శ్రీదేవి, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, యాదాద్రి జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్, ఆలయ ఈవో గీత పాల్గొన్నారు.



సచివాలయంలో బుధవారం జరిగిన వైటీడీఏ సమీక్ష సమావేశంలో అధికారులతో సమీక్షిస్తున్న సీఎస్ ఎస్కే జోషి

GOVERNMENT OF ANDHRA PRADESH
REQUEST FOR EXPRESSION OF INTEREST

వ్యవసాయ క్షేత్రం.. వేదమంత్ర శోభితం

- ఎర్రవల్లిలో మూడో రోజు ఘనంగా మహారుద్ర సహిత సహస్ర చండీ యాగం



సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో జరుగుతున్న సహస్ర చండీయాగం ప్రధాన వేదిక వద్ద బుధవారం హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

ఎర్రవల్లి నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: వేద మంత్రాలు.. చండీ పారాయణాలు.. సంప్రదాయ యాగశాలలు.. మేళతాళాలు.. భక్తి పరిమళాల మధ్య బుధవారం మూడో రోజు మహారుద్ర సహిత సహస్ర చండీ యాగం అంగరంగ వైభవంగా కొనసాగింది. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహిస్తున్న ఈ యాగానికి మొదటి రెండు రోజుల కంటే బుధవారం ప్రముఖులు ఎక్కువగా తరలి రావడంతో సందడి నెలకొంది. ఉదయం ఎనిమిది గంటల నుంచే సీఎం కేసీఆర్ దంపతులు.. కోడలు శైలిమ, కుమార్తె- అల్లుడు ఎంపీ కవిత, అనిల్, ఎంపీ సంతోష్‌కుమార్, ఇతర కుటుంబసభ్యులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. మొదట రాజశ్యామల మండపానికి చేరుకొని అమ్మవారికి అర్చన చేశారు. మహాకాళి, మహాసరస్వతి, మహాలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవగ్రహ పూజలతోపాటు చతుర్వేద పారాయణ మండపంలో పూజలు చేశారు. సహస్ర చండీ పారాయణ మండపంలో చండీ మాతకు సీఎం అభిషేకం నిర్వహించారు. మహారుద్ర మండపంలో హవనంలో పాల్గొని రుద్రాన్ని ఆలకించారు. మూడో రోజు కూడా సీఎం కేసీఆర్ కుటుంబసభ్యులు దంపతీ, కుమారి పూజలను నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు..

మొత్తం పూజలు పూర్తయ్యే వరకు ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు భక్తిశ్రద్ధలతో మండపాల్లో కూర్చొనే ఉన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు వారు వివిధ యాగశాలల్లో పూజలు చేశారు. సీఎంను కలిసేందుకు పెద్దఎత్తున ప్రముఖులు రాగా.. వారికి అభివాదం చేస్తూ సైగలతోనే యాగశాలలోకి ఆహ్వానించారు. పూజలు ముగిసిన తర్వాత ప్రతి ఒక్కరినీ ఆయన పేరుపేరునా పలకరించారు. భోజన శాల వద్దకు వచ్చి అక్కడున్న వారందరితో మాట్లాడారు.

తెలుపు రంగు దీక్షావస్త్రాలు..

ప్రధాన యాగశాలతోపాటు మిగతా నాలుగు చోట్ల పూజల సందర్భంగా వేదమంత్రోచ్చారణలతో ఎర్రవల్లి మార్మోగింది. మధ్యమధ్యలో మైకుల్లో భక్తి గీతాలను వినిపించారు. భక్తులకు పసుపు,కుంకుమలతోపాటు మహాప్రసాదాలను అందజేశారు. మూడో రోజు రుత్వికులు తెలుపు రంగు దీక్షా వస్త్రాలు ధరించారు.

హాజరైన ప్రముఖులు..

మూడో రోజు యాగంలో పార్టీ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీఎం రాజకీయ కార్యదర్శి శేరి సుభాష్‌రెడ్డి, మాజీ మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, ఈటల రాజేందర్, అజ్మీరా చందూలాల్, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు గొడిశాల రాజేశంగౌడ్, నాగుర్ల వెంకటేశ్వర్లు, బీఎస్ రాములు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దేవీప్రసాద్, భూపతిరెడ్డి, సీఎంవో ప్రత్యేకాధికారి దేశపతి శ్రీనివాస్, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, తెరాస రాష్ట్ర కార్యదర్శి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిలతోపాటు పలువురు నాయకులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

■ సహస్ర చండీ యాగంలో బుధవారం తెలంగాణ అర్చక సమాఖ్య నేతలు గంగు ఉపేంద్రశర్మ, రామచంద్రమూర్తి, రామశర్మ, రాజేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు. యాగం నిర్వహించడంపై ముఖ్యమంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

మూడో రోజు యాగాలు ఇలా..

■ **సహస్ర చండీ యాగం:** 300 చండీ పారాయణాలు పూర్తి

■ **మహారుద్ర యాగం:** శాంతి పాఠంతో ప్రారంభమై ఆవాహిత దేవతా పూజలు, 41 ఏకాదశ రుద్ర అభిషేకాలు, హోమం, క్రమార్చన, భజన, మంగళహారతులు

■ **రాజశ్యామల యాగం:** రాజశ్యామల మూలమంత్ర జపం, మూలమంత్ర హవనం, మాతంగి మహావిద్య హవనం, కుంకుమార్చన, సహస్ర నామార్చన, హారతి, చతుర్వేద స్వస్తి

■ **బగళాముఖి:** ఆవాహిత దేవతా పూజ, హరిద్రాన్నంతో 2 వేల మూలమంత్ర హవనం, అరుణ పారాయణాలు, మహామృత్యుంజయ జపం



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని సాత్వికకు బహుమతి ప్రదానం చేస్తున్న చుక్కా రామయ్య, ఎం.నాగేశ్వరరావు. వేదికపై జూలూరు గౌరీశంకర్, వై.శ్రీనివాస్

సరైన పునాదుల్లేకే పోటీలో వెనుకబాటు

- విద్యార్థి నైపుణ్యాలను బాల్యం నుంచే గుర్తించాలి: చుక్కారామయ్య
- సైన్స్ పోటీ పరీక్షల విజేతలకు బహుమతి ప్రదానం

ఉస్మానియా యూనివర్సిటీ, న్యూస్‌టుడే: ప్రాథమిక విద్యలో సరైన పునాదులు లేకపోవడంవల్లే మన విద్యార్థులు ప్రపంచస్థాయి పోటీల్లో రాణించలేకపోతున్నారని విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అయిదో తరగతి నుంచే పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించి, వారిని ప్రోత్సహించాలని ఆయన సూచించారు. చుక్కా రామయ్య సతీమణి చుక్కా లక్ష్మీబాయి స్మారకార్థం నిర్వహించిన సైన్స్ పోటీ పరీక్షల బహుమతులను బుధవారం హైదరాబాద్‌లో ప్రదానం చేశారు. 'అమ్మ కానుక' పేరుతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల్లోని వివిధ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు దాదాపు 14,700 మంది విద్యార్థులకు సైన్స్ రంగంలో ప్రతిభా పరీక్ష నిర్వహించారు. వారిలోనుంచి దాదాపు వందమందికి బహుమతులు అందజేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి 'ఈనాడు' సీనియర్ అసోసియేట్ ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ అవార్డులు చిరు కానుకగా కనిపించినా, వీటి ఫలితాలు ఎంతో ఘనంగా ఉంటాయని తెలిపారు. ప్రోత్సాహకాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. నాణ్యమైన విద్య లభించిన విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించగలుగుతారని అన్నారు. పిల్లల భవిష్యత్తు నిర్మాణంలో గురువులు, తల్లిదండ్రుల పాత్ర ముఖ్యమని సూచించారు. విదేశాల్లో మాదిరిగా ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఉచిత విద్యను అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యారంగంపై శ్రద్ధ పెట్టిన దేశాలే ప్రగతి సాధిస్తాయని చెప్పారు. బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజం గురించి చదవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాల నిపుణులు డాక్టర్ హరితలేఖరాజు, జీసీసీ విద్యాసంస్థల ఎండీ డాక్టర్ వైఎస్.శర్మ, నానో విద్యాసంస్థల సంచాలకుడు వై.శ్రీనివాస్, పాపిరెడ్డి, జానకీ ప్రభాకర్, సీఎల్‌బీ అవార్డుల అధ్యక్షుడు డాక్టర్ సీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహుళ అంతస్తుల భవనంలో అగ్నిప్రమాదం

- ఖాన్ లతీఫ్‌ఖాన్ బిల్డింగ్‌లో మంటలు
- ఐదుగంటలు శ్రమించి ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది
- భవనంలో ఇరుక్కున్న ఆరుగురిని రక్షించిన వైనం



హైదరాబాద్‌లోని ఖాన్ లతీఫ్‌ఖాన్ భవన్ పై మూడు అంతస్తుల్లో అలుముకున్న దట్టమైన పొగ, మంటలు

ఈనాడు– హైదరాబాద్, గన్‌ఫౌండ్రి– న్యూస్‌టుడే: ఎల్బీ స్టేడియం వద్ద గల ఖాన్ లతీఫ్‌ఖాన్ (కేఎల్‌కే) బిల్డింగ్‌లో బుధవారం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అయిదో అంతస్తులో తొలుత మంటలు రేగాయి. తర్వాత ఆరు, ఏడు అంతస్తుల్లోకి కూడా పొగలు దట్టంగా విస్తరించాయి. ప్రమాదం జరిగిన సమయంలో భవనంలో వందల సంఖ్యలో ఉద్యోగులున్నారు. అగ్నిప్రమాదం చోటు చేసుకోవడంతో భవనంలో ఉన్నవారంతా భయంతో బయటకు పరుగులు పెట్టారు. దీంతో ప్రాణనష్టం తప్పింది. భారీ అగ్నిమాపక యంత్రాలతోపాటు 50 మంది సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఏసీలో మంటలు రావడం వల్ల ప్రమాదం జరిగిందా? మరేవైనా కారణాలున్నాయా అనే విషయం తెలియాల్సి ఉంది. ప్రమాదంలో ఫర్నిచర్, ఇతర సామగ్రి బుగ్గయింది. కేఎల్‌కే బిల్డింగ్‌లోని అయిదో అంతస్తులో ఉన్న వన్ అడ్వాంటేజ్ సాఫ్ట్‌వేర్ కార్యాలయంలో మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో మంటలు రేగి ఆరు, ఏడు అంతస్తులకూ వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది 12 ఫైరింజన్లు, 2 స్కైలిఫ్ట్ వాహనాలతో అయిదు గంటలు శ్రమించి మంటలను అదుపు చేశారు. సరైన అగ్నిమాపక నివారణ చర్యలు లేకపోవడం వల్లే మంటలు ఆర్పడానికి ఇంత శ్రమించాల్సి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. భవనంలో చిక్కుకున్న ఆరుగురు ఉద్యోగులను డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బంది సురక్షితంగా బయటికి తీసుకువచ్చారు. దట్టమైన పొగతో అస్వస్థతకు గురైన డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఉద్యోగి ఖాజా మొయినుద్దీన్‌ను ఆసుపత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బందితోపాటు పోలీసు, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖల అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ గోపీకృష్ణ, అగ్నిమాపక సేవల అధికారి డి.పాపయ్య, జిల్లా అగ్నిమాపక సేవల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, నగర పోలీస్ అదనపుకమిషనర్ డీఎస్ చౌహాన్, సెంట్రల్ జోన్ డీసీపీ విశ్వప్రసాద్, జీహెచ్ఎంసీ సెంట్రల్ జోన్ కమిషనర్ ముష్రాఫ్ అలీ సహాయచర్యలను పర్యవేక్షించారు. ఈ భవనంలో భారీస్థాయిలో వ్యాపార సంస్థలు నిర్వహిస్తున్నా.. కనీసం ఆక్యుపెన్సీ, ట్రేడ్ లైసెన్సు లేకపోవడం గమనార్హం. దీనిపై ఖాన్ లతీఫ్‌ఖాన్ ఎస్టేట్ యాజమాన్యానికి నోటీసులు ఇస్తున్నట్లు జీహెచ్ఎంసీ తెలిపింది. 5, 6, 7 అంతస్తులను సీజ్ చేసినట్లు పేర్కొంది.

మహాకూటమికి ఇది ముందస్తు ఓటమి

కేంద్ర మాజీ మంత్రి దత్తాత్రేయ వ్యాఖ్య

ఈనాడు, హైదరాబాద్: కాంగ్రెస్, ఇతర పార్టీలతో కూడిన మహాకూటమి ప్రస్తుతం ఈవీఎంలపై మరిన్ని తప్పుడు ఆరోపణలు చేస్తోందని.. ఇది రానున్న ఎన్నికల్లో ఓటమిని ముందస్తుగా అంగీకరించడమేనని కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడారు. ప్రధాని మోదీ అంత సమర్థనేత జాతీయస్థాయిలో మరెవరూ లేరని, సుస్థిర ప్రభుత్వాన్ని అందించే పార్టీ భాజపా తప్ప మరేదీ ఉండదని అన్నారు. ఇటీవల మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచింది ఈవీఎంలతోనేనని.. తాము గెలిచినచోట ఆ యంత్రాలు ఉత్తమమని, ఓడినచోట హ్యాకింగ్ జరిగిందనీ అనడం కాంగ్రెస్‌కు సముచితం కాదన్నారు. గ్రామపంచాయతీల ఎన్నికల్లో ఏకగ్రీవాల పేరుతో ప్రత్యర్థి పార్టీల నేతలను తెరాస బెదిరిస్తోందని దత్తాత్రేయ విమర్శించారు. ఏకగ్రీవమైన పంచాయతీలకు లక్షల రూపాయలు ఇస్తామని తెలంగాణ ప్రభుత్వం చెప్పడం సరికాదని, ప్రజాస్వామ్యంలో ఉండాల్సింది పోటీతత్వం తప్ప మరొకటి కాదన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: పీఆర్‌టీయూ టీఎస్

మొదటి విడత పంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు పలు సమస్యలు ఎదుర్కొన్నారని, వాటిని పరిష్కరించాలని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సరోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ పూల రవీందర్ రాష్ట్ర ఎన్నికల కార్యదర్శి అశోక్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత అర్ధరాత్రి వేళల్లో ఉపాధ్యాయినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వివరించారు.

RANGARAYA MEDICAL COLLEGE, KAKINADA
TENDER NOTICE
Sealed tenders are invited from the reputed firms or from their authorized distributors for supply of certain equipment to the Virology Lab. For details mail to principal_rmc@yahoo.com within 5 days. Tender forms must reach this office on or before 20-02-2019 by 3.00 pm
PRINCIPAL

నార్దర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెని ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
CIN No.U40109TG2000SGC034119.
ఓపెన్ టెండరు నోటీసు
TSNPDCL ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా తయారీదారుల నుండి మెటీరియల్స్‌ను కొనుగోలు చేయాలనుకుంటున్నది.
స్పెసిఫికేషన్ నెం.: CGM/P&MM/ OT-101 to 104/18-19
మెటీరియల్ పేరు : 220KVAR కెపాసిటర్ సెల్స్, ట్రికిల్ ఛార్జర్లు, 11 KV మిడిల్ ఫేజ్ రెయిజర్ & స్టే వైర్
బిడ్ సెక్యూరిటీ : ఎక్స్-వర్క్స్ మీద @ 2%
ఆన్-లైన్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ల డౌన్‌లోడ్ ప్రారంభం : 23-1-19, ఉ. 11.00 గం.ల నుండి.
తదుపరి వివరముల కొరకు చూడండి: www.tender.telangana.gov.in మరియు www.tsnpdcl.in
డిజిటల్ కీ ని పొందేందుకు చూడండి www.tsts.gov.in
ఫోన్ నెం.0870-2461507.
Mail id:cgmpmm@tsnpdcl.in
సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (P & MM) TSNPDCL/ వరంగల్


తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ లిమిటెడ్
TSSDC
రిజిష్టర్డ్ కార్యాలయము : 5-10-193, HACA భవన్, 2వ అంతస్తు, పబ్లిక్ గార్డెన్స్ ఎదురుగా, హైదరాబాద్-04.
నెం.: SSDC/Mrktg/G.P./Tender/K-2019/2018-19 తేది : 22.01.2019
టెండరు ప్రకటన
ఖరీఫ్ 2019 కొరకు గవర్నమెంట్ సబ్సిడీ ప్రోగ్రామ్ క్రింద పంపిణీ నిమిత్తం దిగువ తెలిపిన విధంగా తాజా సోయాబీన్ F/s మరియు C/s, పచ్చి రొట్ట T/L - జీలుగ విత్తనముల సరఫరా కొరకు T.S.S.D.C. లిమిటెడ్, హైదరాబాద్, తెలంగాణ వారు సీల్డు టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్రమ సంఖ్య	పంట / రకము	విత్తన తరగతి	కావలసిన సుమారు పరిమాణము క్వింటాళ్ళలో	సరఫరా చేయవలసిన కనీస పరిమాణము క్వింటాళ్ళలో	ధరావతు (రూ.లక్షలలో)
1	సోయాబీన్ - JS-335	C/s	1,50,000	5,000	7.00
	సోయాబీన్ JS-9560	C/s	20,000	3,000	
	సోయాబీన్ JS-9305	C/s	10,000	2,000	
		మొత్తం	1,80,000		
2	సోయాబీన్ - JS-335	F/S-I / FS-II	2,500	500	3.00
	సోయాబీన్ JS-9560	F/S-I / FS-II	1,500	500	
	సోయాబీన్ JS-9305	F/S-I / FS-II	1,000	500	
		మొత్తం	5,000		
3	జీలుగ	T/L	90,000	5,000	5.00

టెండరు ప్రక్రియలో పాల్గొను అర్హులైన సరఫరాదారులు టెండరు షెడ్యూలు ధర : రూ.2,500/- + GST 5% నగదు / డి.డి. రూపంలో చెల్లించవలెను.
టెండరు షెడ్యూళ్ళ అమ్మకం : 25.01.2019 ఉ॥ 11.00 గం॥ల నుండి
టెండరు ధాఖలుకు చివరితేది : 05.02.2019 మ॥ 1.00 గం॥ వరకు
టెండరు తెరచుట మరియు సంప్రదింపులు : 05.02.2019 మ॥ 2.00 గం॥లకు
నియమ నిబంధనలతో కూడిన టెండరు షెడ్యూలు వెబ్‌సైట్ : www.tssdcl.telangana.gov.in నందు లభించును. వెబ్‌సైట్ నుండి టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ చేసుకొన్న టెండరుదార్లు టెండరు షెడ్యూల్ సమర్పించుటకు ముందు టెండరు షెడ్యూల్ ధర చెల్లించిన నగదు రశీదును జతచేయవలెను.
సం/- మేనేజింగ్ డైరెక్టర్

పల్లి నూనె పేరుతో పల్టీ కొట్టించారు

- గొలుసుకట్టు వ్యాపారంలో రూ.కోట్లు వసూలు
- 4 రాష్ట్రాల్లో వేలల్లో బాధితులు



ఉప్పల్‌లోని గ్రీన్‌గోల్డ్ బయోటెక్ కార్యాలయం

ఉప్పల్, న్యూస్‌టుడే: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మరో మోసం వెలుగు చూసింది. కరక్కాయ కథ మరువక ముందే పల్లీల నూనె పేరుతో రూ.కోట్లలో కాజేసిన వైనమిది. "ప్రతి నెలా రూ.5 వేలు చెల్లించండి.. 24 నెలల్లో ఏకంగా రూ.20 లక్షలు మీ సొంతం చేసుకోవచ్చు. మరో పథకంలో రూ.లక్ష డిపాజిట్ చేస్తే నెలకు రూ.10 వేలు సంపాదించుకోవచ్చు. రూ.2 లక్షలు డిపాజిట్ చేస్తే నెలకు రూ.20 వేల సంపాదన ఉంటుంది. మీరు చేయాల్సిందల్లా పల్లీగింజల నుంచి నూనె తీయడమే. అందుకు కావాల్సిన యంత్రం, పల్లీలను కూడా మేమే ఇస్తాం. తీసిన నూనెను, దాని నుంచి వచ్చిన పిప్పిని సైతం కొంటాం" అని మాయమాటలతో నమ్మించారు. కొందరి వద్ద డబ్బు తీసుకొని యంత్రాలు ఇచ్చారు. 'గ్రీన్‌గోల్డ్ బయోటెక్' పేరుతో ప్రచారం చేయగా జనం రూ.కోట్లలో డిపాజిట్ చేశారు. చివరకు మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఉప్పల్ కేంద్రంగా ఈ మోసం జరిగింది. తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి 6 వేల మందికిపైగా బాధితులున్నారు. ఎక్కువగా కర్ణాటక, మహారాష్ట్ర నుంచే ఉన్నారు.

బాండు పేపర్లపై అగ్రిమెంట్లు..బహుమతులు

గ్రీన్‌గోల్డ్ బయోటెక్ కార్యాలయం హైదరాబాద్ ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉంది. ఏడాది క్రితం సికింద్రాబాద్‌లో ఉండేది. కార్యాలయానికి సమీపంలోనే గోదాము ఉంది. దానిలోనే పల్లీలు, నూనె, పిప్పి నిల్వ చేస్తున్నారు. నమ్మకం కలిగించేందుకు బాండు పేపర్ల మీద ఒప్పందాలను రాసి ఇస్తున్నారు. రూ.5 వేలు చెల్లించి ప్రాథమికంగా చేరి ఇతరులను చేర్పిస్తే బహుమతులు ఇస్తామని ప్రచారం చేశారు. ఎక్కువ సంఖ్యలో సభ్యులను చేర్చితే కార్లు బహుమతిగా ఇస్తామని నమ్మబలికారు. బ్యాంకాక్, ఇతర విదేశీ టూర్లు కూడా ఉంటాయని పేర్కొన్నారు. రూ.2 లక్షలు డిపాజిట్ చేయించిన కొందరికి రూ.5వేల చొప్పున నగదు ఇచ్చారు. పల్లీ గింజల నుంచి తీసిన నూనెకు లీటరుకు రూ.35, పిప్పికి రూ.20 చొప్పున చెల్లిస్తామని నమ్మించారు.

వెలుగులోకి వచ్చిందిలా..

రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌కు చెందిన ఇంద్రకిరణ్ (28) వ్యాపారి. అతని భార్య ఈ కంపెనీ గురించి తెలిసి సంస్థ ఎండీ జిన్నా శ్రీకాంత్‌ను, మేనేజర్ భాస్కర్‌యాదవ్‌ను కలవగా ఆమె నుంచి రూ.లక్ష తీసుకొని అగ్రిమెంట్ రాసి ఇచ్చారు. నెలకు ఇస్తామన్న డబ్బులు ఇవ్వకపోవడంతో ఇంద్రకిరణ్ బుధవారం ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు అక్కడి ఉద్యోగులను అదుపులోకి తీసుకున్నారు. శ్రీకాంత్ పరారీలో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన శ్రీకాంత్ గతంలోనూ పలు గొలుసుకట్టు దందాలు చేసి మోసం చేసినట్లుగా తెలిసింది. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో పలు స్టేషన్లలో కేసులు కూడా ఉన్నాయి.

నాపై ఆరోపణలు కాంగ్రెస్ కుట్ర

- భాజపా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



హైదరాబాద్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడుతున్న భాజపా నేత కిషన్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: గత ఎన్నికల సందర్భంగా తాను హత్యా రాజకీయాలకు పాల్పడినట్లు సైబర్ నిపుణుడిగా చెప్పుకునే సయ్యద్ షుజాతో కాంగ్రెస్ పార్టీ తప్పుడు ఆరోపణలు చేయించిందని భాజపా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం రఫేల్ కుంభకోణం పేరుతో చేసిన ఆరోపణలు బెడిసికొట్టడంతో, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల)ను 2014 ఎన్నికల్లో హ్యాక్ చేశారంటూ కాంగ్రెస్ పార్టీ ప్రజల్ని గందరగోళపరిచే యత్నం చేస్తోందని విమర్శించారు. హైదరాబాద్‌లోని కిషన్‌బాగ్ మత కలహాలు ఎలా జరిగాయి? ఎంతమంది మరణించారు? ఆ 11 మంది శవాలు దొరికాయా? అన్న వివరాలను దర్యాప్తు జరిపి తేల్చాలని డిమాండ్ చేశారు. సీబీఐతో దర్యాప్తు జరిపించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని కిషన్‌రెడ్డి చెప్పారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో మాట్లాడుతూ.. సయ్యద్‌షుజా, కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ చేసిన ఆరోపణలపై తీవ్రంగా స్పందించారు. "గత ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని, ఈ విషయంపై మాట్లాడేందుకు కాకిరెడ్డి అనే వ్యక్తి అతిథిగృహం వద్దకు 14మందితో వెళ్తే వారిలో 11 మందిని నేను కాల్చి చంపించి, తర్వాత మతకలహాల్లో కలిపేసినట్లు సయ్యద్‌షుజా లండన్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో నాపై ఆరోపణలు చేశారు. ఆ కాకిరెడ్డి నా బావమరిది అని చెప్పారు. అసలు ఆ కాకిరెడ్డి ఎవరో నాకు తెలియదు. ఇదంతా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆదేశాలతో సిబల్ ఆధ్వర్యంలో జరిగిన కుట్ర" అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. "ఐటీ పితామహుడిగా చెప్పుకునే చంద్రబాబు కూడా 2014 ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని ఆరోపించడం, వాటిని భాజపాకు ముడిపెట్టడం హాస్యాస్పదం." అని కిషన్‌రెడ్డి అని వ్యాఖ్యానించారు. ఓటమిపాలైనా ప్రజల్లోనే ఉన్నానని, సికింద్రాబాద్ లోక్‌సభ నుంచి పోటీపై పార్టీ నిర్ణయం తీసుకుంటుందన్నారు.

■ మరోవైపు సయ్యద్‌షుజా, కపిల్‌సిబల్ చేసిన ఆరోపణలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్సీ రామచంద్రరావుతో కలిసి కిషన్‌రెడ్డి డీజీపీ మహేందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

కార్యకర్తల కోసం సంక్షేమనిధిని ప్రవేశపెట్టిన లోకేశ్: రమణ

ఈనాడు, హైదరాబాద్: దేశంలోనే తొలిసారి తెలుగుదేశం కార్యకర్తల కోసం సంక్షేమ నిధిని నారా లోకేశ్ ప్రవేశపెట్టారని ఆ పార్టీ తెలంగాణ శాఖ అధ్యక్షుడు ఎల్.రమణ పేర్కొన్నారు. బుధవారం లోకేశ్ జన్మదిన వేడుకలను ఎన్టీఆర్ భవన్‌లో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. రమణతో పాటు పార్టీ ప్రధాన కార్యదర్శులు బండ్రు శోభారాణి, బుచ్చిలింగం, నేతలు బీఎన్‌రెడ్డి, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పేదరిక ఉపశమన నిధి.. బిల్లు పరిగణనలోకి!

ఈనాడు, దిల్లీ: తెరాస ఎంపీ బూర నర్సయ్యగౌడ్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఒక ప్రైవేటు బిల్లును పరిగణనలోకి తీసుకుంటున్నట్లు లోక్‌సభ సెక్రటరీ జనరల్ స్నేహలత శ్రీవాస్తవ పేర్కొన్నారు. ఎంపీ 2018 ఆగస్టు 3న 'జాతీయ పేదరిక ఉపశమన నిధి' బిల్లు అంశాన్ని లోక్‌సభలో ప్రస్తావించారు. దీన్ని పరిగణనలోకి తీసుకోవాలన్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సూచన మేరకు.. కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి ఈ నెల 17న విషయాన్ని తమ దృష్టికి తెచ్చారన్నారు. బిల్లు అంశాన్ని ఆర్టికల్ 117(3) కింద పరిగణించాలని రాష్ట్రపతి పేర్కొన్నారంటూ ...స్నేహలత శ్రీవాస్తవ లోక్‌సభ బులెటిన్ విడుదల చేశారు.

ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నాం

కాంగ్రెస్ సీనియర్ నేత మర్రి శశిధర్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, న్యూస్‌టుడే: జాతీయ ఓటరు దినోత్సవం (ఈ నెల 25) సందర్భంగా 'ఒక్క ఓటరునూ వదిలిపెట్టొద్దు' అనే నినాదంతో రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని బహిష్కరించాలని నిర్ణయించినట్లు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమన్వయ కమిటీ ఛైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి తెలిపారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో లక్షలాది ఓట్లు గల్లంతైనందుకు క్షమించండి. పార్లమెంటు ఎన్నికల్లోపు అన్నీ సరిదిద్దుతాం' అని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి రజత్‌కుమార్ ఇచ్చిన మాట నిలబెట్టుకునే పరిస్థితిలో లేనందునే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ తీరుకు నిరసనగా గురువారం ధర్నాచౌక్ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతకుముందు గాంధీభవన్‌లో కమిటీ సమావేశం శశిధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఓటరు నమోదు ప్రక్రియ, పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో చేపట్టాల్సిన పలు అంశాలపై చర్చించారు.

బోధనేతర పనుల ఒత్తిడిని తగ్గించాలి: యూటీఎఫ్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ యాజమాన్యాల పరిధిలోని సంక్షేమ గురుకుల పాఠశాలల్లో నూతనంగా నియామకమైన ఉపాధ్యాయులపై బోధనేతర పనుల ఒత్తిడిని తగ్గించాలని యూటీఎఫ్ కోరింది. ఈ మేరకు ఆ సంఘం ప్రతినిధులు బుధవారం సొసైటీల కార్యదర్శులతో చర్చించి ఆయా సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. మొత్తం 22 సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.రాములు, ప్రధాన కార్యదర్శి చావ రవి, రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వై.కొండల్‌రావు అధికారులను కోరారు.

హక్కులను హరించే కుట్రలను తిప్పికొట్టాలి

- పార్లమెంటు సభ్యుడు మల్లికార్జున్ ఖర్గే
- గద్దర్‌కు ఈశ్వరీబాయి స్మారక పురస్కారం

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: హక్కులను హరించే కుట్రలను తిప్పికొట్టడానికి ప్రజాస్వామ్యవాదులంతా సిద్ధంగా ఉండాలని పార్లమెంటు సభ్యుడు మల్లికార్జున్ ఖర్గే పిలుపునిచ్చారు. తెలంగాణ తొలి ఉద్యమకారిణి, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈశ్వరీబాయి శతజయంతి ఉత్సవాలు బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ట్రస్టు ఛైర్‌పర్సన్ డాక్టర్ జె.గీతారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మల్లికార్జున్ ఖర్గే.. ప్రజా గాయకుడు గద్దర్‌ను 'ఈశ్వరీబాయి స్మారక శతజయంతి పురస్కారం'తో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈశ్వరీబాయి ప్రసంగాలు తనను ఎంతో ప్రభావితం చేశాయన్నారు. కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈశ్వరీబాయి జీవితాన్ని పాఠాలుగా నేర్చుకోవాలన్నారు. పూర్వ రాజ్యసభ సభ్యులు వి.హన్మంతరావు, మాజీ మంత్రి జానారెడ్డి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సురేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మాజీ ఎంపీ మధుయాష్కీ, మర్రి శశిధర్‌రెడ్డి, జాతీయ బాలల పరిరక్షణ కమిషన్ పూర్వ ఛైర్‌పర్సన్ ఆచార్య శాంతాసిన్హా, కర్ణాటక ప్రభుత్వ పూర్వ ప్రధాన కార్యదర్శి కె.రత్నప్రభ మాట్లాడారు. అంతకుముందు జె.ఈశ్వరీబాయి విగ్రహాన్ని, 'అగ్నిశిఖ ఈశ్వరీబాయి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈశ్వరీబాయి జీవితంపై నిర్మించిన లఘుచిత్రాన్ని ప్రదర్శించారు.



ఈశ్వరీ బాయి జయంతి సందర్భంగా బుధవారం రవీంద్రభారతిలో జరిగిన గద్దర్ దంపతుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు వీహెచ్, జానారెడ్డి, మల్లికార్జున్ ఖర్గే, జైపాల్‌రెడ్డి, గీతారెడ్డి తదితరులు

మా చిరునామా: **మకరందం,** ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

ధర్మసందేహం

అసుర గుణాలను తరిమికొట్టాలని...

భగవంతునికి హారతి ఇచ్చేటప్పుడు ఘంటానాదం ఎందుకు చేస్తారు?

వాసుకి, మిర్యాలగూడ

దేవాలయాలలో కర్పూర హారతి ఇస్తూ స్వామివారి దివ్యమంగళ విగ్రహాన్ని అణువణువూ భక్తులు తిలకించి పులకించే ఏర్పాటు చేస్తారు అర్చకస్వాములు. హారతి ఇవ్వడంలో ఒక విశేషం దృష్టిదోష పరిహారం. రెండో విశేషం స్వామిరూపమే ప్రపంచానికి అసలైన వెలుగు అని చాటిచెప్పటం. ఆ సమయంలో చేసే ఘంటానాదం అసుర గుణాలను తరిమి కొడుతుందని చెబుతారు.

ఆగమార్థం తు దేవానాం
గమనార్థం తు రక్షసాం
కురు ఘంటారవం

తత్ర దేవతాహ్వాన లాంఛనం అని ఆగమ సంప్రదాయం చెప్తోంది. హారతి సమయంలో స్వామి దర్శనం దివ్యదర్శనం. ఆ హారతి దివ్యజ్యోతి. అప్పుడు వినిపించే ఘంటానాదం దివ్యనాదం. హారతి వెలుగులో స్వామిని విగ్రహరూపంలో దర్శిస్తూ, తనలోకి తాను చూసుకుంటూ భక్తులు అంతర్ముఖులు కావాలన్నది మన సంప్రదాయంలోని ఆంతర్యం. అలా అంతర్ముఖులైన వేళ వారిలోని రాక్షస గుణాలు అంతరించి దైవీగుణాలు అంకురించాలన్న సందేశాన్ని ఘంటానాదం సూచిస్తుంది.

– మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి



మన భారతీయ సంస్కృతిలోనే కాదు మానవ మనుగడలోనే అమ్మతనానికి ఎంతో విలువ ఉంది. అందుకే అత్యున్నత ప్రేమను అందించే దేన్నైనా తల్లి హృదయంతో పోల్చుతారు. అలాంటి తల్లి హృదయం పురుషుడికి కూడా ఉంటుంది.

" ...యాదేవీ సర్వభూతేషు మాతృరూపేణ సంస్థితా.. నమస్తస్త్యై, నమస్తస్త్యై నమస్తస్త్యై నమోనమః" ఏ అమ్మవారైతే సర్వ భూత(జీవుల) హృదయాలలో మాతృరూపంలో ఉందో ఆ దేవికి మనస్ఫూర్తిగా నమస్కరిస్తున్నాను..అని అర్థం. పురుష రూపంలో ఉన్న ఒక తల్లి లక్షల మంది క్షుద్బాధను తీరుస్తూ, లాలిస్తూ విద్యాభ్యాసం చేయిస్తూ వారి భవిష్యత్తుకు దారిదీపంలా సాక్షాత్కరించింది.

కర్ణాటకలో తుమకూరు జిల్లా సిద్ధగంగ మఠానికి పీఠాధిపత్యం వహించి నడయాడే దేవుడిగా కీర్తిగడించారు శివకుమార స్వామిజీ. ఆయన జీవితంలోని ప్రతి ఘట్టం, చేసిన ప్రతి బోధ... మానవాళికి శిరోధార్యాలే...



శివా నమామి...

సదాస్మరామి

విద్యార్థులలో ముందు ఏదైనా తెలుసుకోవాలి, అనంతరం ఆచరించాలి అన్న జిజ్ఞాసను ప్రేరేపించారు. ముందుగా ఆత్మశుద్ధి అవసరమనే శివకుమారస్వామి సాధారణ విద్యతోపాటు ఆధ్యాత్మిక విద్యలో కూడా బోధనలు ఎంతో ప్రేరకాలుగా ఉండేవి....సమసమాజ నిర్మాణానికి ఒక క్రాంతినే (విప్లవాన్నే) తెచ్చి క్రాంతియోగిగా ప్రసిద్ధి చెందిన బసవన్న సిద్ధాంతాలను తు.చ. తప్పక పాటించారు. విద్యకు, ఆత్మజ్ఞానానికి అందరూ అర్హులే. దీనికి జాతిమతకుల భేదం లేదనే ఈ ఆత్మజ్ఞాని సమాజానికి ఈ విషయంపై చేసిన బోధలు అనేకం. బసవన్నే ఈ జన్మ మళ్లీ ఎత్తారని భక్తులు భావించేవారు. ఇతరులకు నీతులు చెప్పే ముందు తాను ఆచరించి తీరాలన్న నియమానికి స్వామీజీ ఎప్పుడూ కట్టుబడి ఉండేవారు. ఆత్మానుభూతిలోని ఆనందాన్ని ఆస్వాదించాలన్నా, సొంతం చేసుకోవాలన్నా ఆచరించవలసిన నియమాలు తాను ఎంత కఠినంగా పాటించేవారో బోధించేటప్పుడు ఎంతో అలవోకగా వివరించేవారు. బ్రహ్మచర్యం, అహింస, అస్థేయ, సత్య, అపరిగ్రహ, శౌచ, తపస్సు, స్వాధ్యాయ, ఈశ్వర, ప్రణిదాన తదితర అష్టాంగయోగాల్లో యమ నియమాలను ఎంతో క్రమశిక్షణతో పాటించేవారు. పాటించలేనివారికి మరోమార్గంలో సూచనలు చేసేవారు. ఈ విరాగి తన జీవితకాలంలో అనేకానేక జ్ఞానజ్యోతులను వెలిగించడంతో పాటు ప్రేమానురాగాల గంగాప్రవాహంతో సమాజాన్ని సస్యశ్యామలం చేసిన త్యాగధనుడు.

ఆయన జీవితంలోని చివరి అంకం కూడా అనంతమైన త్యాగభావనకు నిదర్శనంగా నిలుస్తోంది. శివకుమారస్వామి తన చివరి క్షణాల్లో తన ఉత్తరాధికారితో చెప్పిన మాటలు వింటే ఎవరికైనా హృదయం ద్రవిస్తుంది. 'నాయనా నేను ఏ క్షణంలోనైనా దేహ త్యాగం చేయవచ్చు. నేను ఏ సమయంలో మృతిచెందినా... మఠం పిల్లలు, విద్యార్థులు కడుపునిండా భోజనం చేసే వరకు నా మృతి విషయాన్ని ప్రకటించవద్దు..' అని. మఠం అధికారులు సరిగ్గా అలాగే చేశారు. సోమవారం ఉదయం 11:44 గంటలకు స్వామీజీ శివైక్యం చెందారు. అయితే మఠంలో వాతావరణం ఏమాత్రం మారలేదు. అందరి భోజనాలు అయిన తర్వాత ఆయన పరమపదించిన విషయాన్ని ప్రకటించారు. ఇది ఒక మనిషి సంపూర్ణ సార్థక జీవితానికి పరాకాష్ఠ. మఠం నిర్వాహకులు స్వామి పార్థివ శరీరాన్ని సందర్శించటానికి వచ్చే లక్షలాది మందికి అన్నదాసోహ వ్యవస్థ చేశారు. నా ఆశ్రమానికి వచ్చిన ఏ ఒక్కరూ ఖాళీకడుపుతో వెళ్లకూడదన్నది ఈ కర్మిష్ఠి నిశ్చిత సంకల్పం.

"భక్తిమార్గంలో మనసుపెట్టి నడిచేవారిని నేను నిష్కామ కర్మమార్గం వైపు మళ్లిస్తాను. ఈ మార్గంలో సంపూర్ణత్వం సిద్ధించిన వాడిని జ్ఞాన మార్గోన్ముఖుణ్ని చేస్తాను. అనంతరం మోక్షగామిగా మలుస్తాను" అన్నాడు గీతాచార్యుడు. ఆ ఉత్తుంగ స్థితికి చేరాక ఆ వ్యక్తి సాక్షాత్తు పరబ్రహ్మే అవుతాడు. భగవానుడు చెప్పిన ఈ లక్షణాలన్నిటిలో పూర్తి అర్హత సంపాదించినవారు ఈ శివకుమారస్వామి. జితేంద్రియుడిగా, త్రిగుణాతీతుడిగా, నిష్కామ కర్మిష్ఠిగా జీవితాన్ని సంపూర్ణంగా సార్థకం చేసుకుని ఉత్తుంగానికి చేరిన మానవ దేహంలోని భగవంతుడి గురించి ఎంతచెప్పినా అల్పమే.

పనిలో ప్రతిసారీ ఫలితాన్ని ఆశించొద్దు.. ముందు పని మాత్రమే చేయి... అంటారు శివకుమారస్వామి. సన్యాసం స్వీకరించకముందు శివణ్ణ బెంగుళూరులో డిగ్రీ చదువుతుండగా మఠం ఉత్తరాధికారి మృతిచెందారు. తర్వాతి ఉత్తరాధికారి ఎవరని తర్జనభర్జన జరుగుతున్న సమయంలో మఠాధిపతి ఉద్ధానస్వామి శివణ్ణను ఆ బాధ్యతలకు ఎంచుకున్నారు. విషయం తెలుసుకున్న తండ్రి పరుగుపరుగున వచ్చి ఇంటిబాధ్యతలు తీసుకోమని శివణ్ణను బతిమాలారు. అప్పుడు తండ్రితో శివణ్ణ చెప్పిన మాటలు సిసలైన నిష్కర్మఫల భావానికి నిదర్శనంగా నిలుస్తుంది. 'మీరు నన్ను ఈ లోకానికి తెచ్చారు. ఈ ప్రపంచపు సేవకై నన్ను విడవండి. నా జీవితాన్ని దైవసేవతో పాటు సామాజిక సేవకు కూడా... పెద్ద మనసు చేసుకుని నన్ను వదిలేయండి" అని ఆ కుర్రాడు తండ్రితో తన భావి లక్ష్యాలను వివరిస్తూ వినయంగా చెప్పిన మాటలివి. అప్పటి నుంచి స్వామి సేవామార్గంలో అడుగడుగునా అవే కాంతులు.

శివ సూత్రాలు...

- సర్వ అశాంతులకు, అసంతృప్తికి నిలయం మనసు. మనసు పరిశుద్ధమైతే మాటకు గాంభీర్యం, రచనకు నిండుదనం వస్తాయి.
- ఒక విషయాన్ని మనం ఇప్పుడు తీవ్రంగా ఆలోచించాల్సి ఉంది. అదేం దురదృష్టమోగానీ మన సంస్కృతిపై మన ప్రజలే ఉదాసీనంగా ఉంటున్నారు. ఇది చాలా ప్రమాదకరం.ఈ పరిస్థితికి మన దేశనాయకులే బాధ్యులు. వారు అధికారదాహం, స్వార్థచింతన, భోగలాలసలతో దేశ హితాన్ని విస్మరించారు. వారు ఇప్పటికైనా మేల్కొని మన భాషలను, సంస్కృతులను సంరక్షించాలి.
- మన దృష్టిననుసరించే జగత్తు ఉంటుంది. అది మంచిదైతే లోకం కూడా మంచిగా కనిపిస్తుంది. చెడుదైతే చెడ్డగా కనిపిస్తుంది. కాబట్టి దృష్టిని బట్టే సృష్టి, భావాలనుబట్టే భవిష్యత్తు అన్నది సదా గుర్తుంచుకోవాలి.
- మన హైందవ సంస్కృతిలో గురువుకు ఎంతో మహత్తరమైన స్థానం ఉంది. మన ప్రాచీన పరంపర గురువుని ఆచార్య అనే సంబోధనతో గౌరవించి సర్వోన్నత స్థానాన్నిచ్చింది. అసలు ఆచార్యుడంటేనే ఘనీభూతమైన పాండిత్యం ఉన్నవాడని, నిరాడంబరుడని, త్యాగశీలుడని, సమాజ సంక్షేమాన్ని కోరేవాడని అర్థాలున్నాయి. మన పూర్వకాలపు ఉపాధ్యాయులు కేవలం చదువు చెప్పటం వరకే పరిమితం కాలేదు. సమాజాన్ని దిద్దే బాధ్యత కూడా చేపట్టేవారు. కానీ ఇప్పుడు గురువుపై నిర్లక్ష్యం, నిరాసక్తత పెరిగింది. ఇది దేశానికి మానవ సమాజానికికూడా మంచిదికాదు.
- క్రమం తప్పని సాధన ఒక శక్తిగా అభివృద్ధి చెందుతుంది. దీన్నే ఇచ్ఛాశక్తి అంటారు. ఇలాంటి ఇచ్ఛాశక్తి కలిగిన వాడే లోక పూజ్యుడు అవుతాడు.

నేను ఆయన ఉపయోగించే పరికరాన్ని మాత్రమే. ఆయన చెప్పినదారిలో నడుస్తున్నానంతే. చేసేదంతా పరమాత్మే... ఇదే కర్మకర్తృత్వ భావన. దీన్ని అనుక్షణం ఆచరించి చూపారు శివకుమారస్వామి. మనం చేసే పనిలో చిత్తశుద్ధి ఉంటే దైవానుగ్రహం నిండుగా ఉంటుందని ఆయన అనుక్షణం చెప్పేవారు.

పెద్దస్వామి అయిన ఉద్ధాన స్వామి గురువైన అటవీ స్వామివారి కాలంలో అన్నదాన కార్యక్రమం ప్రారంభమైంది. అప్పట్లో మఠంలో ఎలాంటి సౌకర్యాలు లేవు. ఉద్ధాన స్వామివారి కాలంలో పేద విద్యార్థులకు విద్యాదానం కూడా ప్రారంభమైంది. అయితే అప్పట్లో అన్ని విషయాల్లోనూ తగిన నిధులు లేక పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. బాలలకు సందర్శకులకు భోజన వ్యవస్థ కష్టంగా ఉండేది. అంతేకాదు పరిస్థితి ఇది అని గురువుగారికి వివరించబోతే "నన్నేం చేయమంటావు... బాధ్యత తీసుకున్నావు శ్రమించు, సంపాదించు, పోషించు" అని నిక్కచ్చిగా చెప్పేశారు. ఈ మాటకు అందరూ అవాక్కయ్యారు. కానీ కర్మిష్ఠి అయిన శివస్వామి గురువుగారి మాటలోని పరమార్థాన్ని గ్రహించారు. జోలెపట్టారు. ఇంటింటికీ తిరిగారు. భిక్ష అడిగారు... ఎందుకు.. అంటే ప్రతి బాలుడిని మంచి కర్మిష్ఠిగా, ఆత్మజ్ఞానంగల ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దాలి. కానీ పేదరికం తాండవిస్తున్న వేల కుటుంబాల బాలలకు ఇది గగన కుసుమం కాకూడదు. జ్ఞానబోధనకు ముందు వారి ఆకలి తీరాలి, జ్ఞానాన్ని జీర్ణం చేసుకోవాలంటే విద్య అవసరం అన్న సిద్ధాంతాన్ని పూర్తిగా నమ్మారు స్వామిజీ.


–జి.జగదీశ్వరి, బెంగళూరు

ఇస్లాం సందేశం

చిత్తశుద్ధి లేని దైవచింతనేల?

మనం చేసే పనిలో చిత్తశుద్ధి, నిజాయతీ ఉంటేనే అవి అల్లాహ్ స్వీకృతిని పొందుతాయి. ఏదో ఆశించి, ఎవరి మెప్పుకోసమో చేసే పనులు వృథా అంటారు ప్రవక్త మహనీయులు. ప్రదర్శనా బుద్ధి గురించి షేక్ సాదీ (అలై) చెప్పిన కథ ఒకటి ప్రాచుర్యంలో ఉంది.

ఒక ఊళ్లో ఓ పండితుడు ఉండేవాడు. ఎప్పుడూ తానే గొప్పవాడినని భావించేవాడు. ఓసారి అతడికి రాజదర్బారుకు అతిథిగా వెళ్లే అవకాశం వచ్చింది. రాజుగారు ఎంతో ఆదరించారు. పంచభక్ష్య పరమాన్నాలు వడ్డించారు. తన ముందు రుచికరమైన వంటకాలున్నా.. ఆ పండితుడు చాలా మితంగా తిన్నాడు. అంతలోనే నమాజు వేళయింది. అందరూ తనను గొప్ప ఆరాధకుడిగా భావించాలని చాలాసేపు నమాజు చేశాడు. నమాజు పూర్తయ్యాక పండితుడు ఇంటికి వెళ్లాడు. 'బాగా ఆకలిగా ఉంది అన్నం పెట్టండి' అన్నాడు. పండితుడి కుమారుడు 'నాన్నగారూ! మీరు రాజుగారి దర్బారులో తినకుండానే వచ్చేశారా?' అనడిగాడు. 'రాజ దర్బారులో తినడానికి ఎన్నున్నా.. కడుపారా తింటే రాజుగారి దృష్టిలో చులకనవుతానేమోనని చాలా తక్కువగా తిన్నాను. కడుపు కాలుతున్నా నా నోటిని అదుపు చేసుకున్నాను' అని బదులిచ్చాడు.



'నాన్నగారూ! మీరు నమాజు కూడా మళ్లీ చేసుకోండి. ఎందుకంటే.. దర్బారులో చేసిన నమాజు అల్లాహ్ కోసం చేసుండరు! రాజుగారి మెప్పు కోసం చేసుంటారు' అని చెప్పడంతో ఆ పండితుడు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. చెల్లని నోట్లతో మనం ఏ వస్తువునూ కొనలేము. అలాగే అల్లాహ్‌కు నచ్చని రీతిలో పుణ్యాలను మూటగట్టుకోలేం. అల్లాహ్‌కు నచ్చని దుర్గుణాలలో ప్రదర్శనా బుద్ధి కూడా ఒకటి. పరుల మెప్పుకోసం పాకులాడటం, కీర్తిప్రతిష్ఠల కోసం పనిచేయడం ఇవన్నీ ఒకే కోవకు చెందినవి. ప్రదర్శనా బుద్ధితో చేసేది మంచి పనైనా దుర్గుణమే అవుతుంది. ఇస్లామ్ బోధనల ప్రకారం దైవదాసుడు ఎలాంటి సత్క్రియలు చేసినా కేవలం అల్లాహ్ మెప్పు కోసమే చేయాలి. ప్రజలు తన్ను మెచ్చుకోవాలని చేసే ఎంత గొప్ప పనైనా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది.

– ఖైరున్నీసాబేగం

విశేషం

దేవుడు దిగి వస్తాడు

పెళ్లికి పిలుస్తాడు

ప్రపంచంలో ఎక్కడైనా భక్తులే భగవంతుడి వద్దకు వెళుతుంటారు. దైవమే భక్తుల వద్దకు వెళ్లే సందర్భం మాత్రం ఒకే ఒక్కచోట ఉంటుంది. అది అహోబిల లక్ష్మీనరసింహ స్వామికే ప్రత్యేకం. అహోబిలం క్షేత్రంలో కొలువైన జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరద స్వాములు పల్లకిలో కొలువై గ్రామాలకు వెళ్లి భక్తులకు తమ దర్శన భాగ్యం కల్పిస్తుంటారు. ఈ ప్రత్యేకమైన వరాన్ని కర్నూలు జిల్లాలోని 33 గ్రామాల ప్రజలు అందుకుంటున్నారు.

ఎందుకంటే?: ఒక దేశానికి రాజు అంటే ప్రజలకు సర్వస్వం ఆయనే. ప్రజల కష్టసుఖాల్లో ఆయన పాలు పంచుకోవాలి. సర్వలోక పాలకుడైన లక్ష్మీనరసింహ స్వామి కూడా నిజమైన పాలకుడిగా ప్రజల కష్టసుఖాలను తెలుసుకునేందుకు వారి వద్దకే వెళ్లాలనుకుంటారు. ఇందులో భాగంగానే 'పార్వేట' పేరిట ఆలయాన్ని, ఆప్తులను విడిచి భక్తుల చెంతకు పయనమవుతారు. పరి అంటే గుర్రం. గుర్రంపై వేటాడడాన్ని పార్వేట అంటారు. ఈ సంప్రదాయం చాలా వైష్ణవ క్షేత్రాల్లో ఉంటుంది. ఇది ఒక్కరోజు మాత్రమే కొనసాగుతుంది. కానీ అహోబిలంలో మాత్రం ఈ ఉత్సవం పేరిట ఏకంగా 45 రోజుల పాటు స్వామిని ప్రజల మధ్యనే ఉంచుతారు.

ఈ క్షేత్రం నిర్వహించే అహోబిల మఠం ప్రథమ పీఠాధిపతి ఆదివన్ శఠగోప యతీంద్ర మహాదేశికన్‌కు స్వామి 'గ్రామే గ్రామే చగత్వాపద చరణ యో మాంగృహీత్వ' అంటే గ్రామా గ్రామాలకు నన్ను వేంచేలా చేసి జనులకు మోక్ష మార్గాన్ని ఉపదేశించమని చెప్పారు. స్వామి ఆజ్ఞ మేరకు ఆనాటి నుంచి ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారని చెబుతారు. అన్నమయ్య 12 ఏళ్ల పాటు ఇక్కడే నివసించి ఎన్నో కీర్తనలు రాశారు. 'దేవ శిఖామణి దివిజుల వొడగంగ వేవేల గతులు వెలసీనాడే' అంటూ నరసింహ స్వామి గుర్రంపై వీధి వీధిన తిరుగుతూ తన పెళ్లికి భక్తులు అందించే సారెను స్వీకరిస్తారని ఓ కీర్తనలో వివరిస్తారు.





ఎలా నిర్వహిస్తారంటే..: ఎగువ అహోబిలంలోని జ్వాలా నరసింహ స్వామి, దిగువ అహోబిలంలో ఉన్న ప్రహ్లాద వరద స్వామి ఇద్దరినీ ఒకే పల్లకిలో ఉంచి ఈ ఉత్సవాన్ని జరపడం ఆనవాయితీ. ఈ కార్యక్రమానికి ముందు 45 రోజుల పాటు స్వామివార్లకు సరిపడా ఆహారాన్ని అందించే 'అన్న కూటోత్సవం' నిర్వహిస్తారు.

ఆ తర్వాత దాదాపు 45 రోజులపాటు ప్రజల మధ్యనే రాత్రనక, పగలనక గడుపుతూ వారి కష్టసుఖాలను తెలుసుకుంటూ, తన కల్యాణోత్సవానికి రమ్మని భక్తులను ఆహ్వానిస్తారు. కార్యక్రమం పూర్తి చేసుకుని అలసిసొలసి అహోబిలం చేరిన స్వామివార్లకు బడలిక తొలగేలా పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం 81 కలశాలతో తిరుమంజనం నిర్వహిస్తారు. తర్వాత పాల్గుణ శుద్ధ పంచమి నుంచి పౌర్ణమి వరకు స్వామివార్లకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. కులమతాలకు అతీతంగా స్వామి ఉత్సవాలు జరుగుతాయి. స్వామి పరిణయమాడిన చెంచులక్ష్మిని స్థానిక చెంచులు తమ ఆడపడుచుగా భావిస్తారు. నరసింహ స్వామిని ఓబులేసుగా పిలుస్తారు. పార్వేట ఉత్సవాల్లో వీరే ముందుడి పల్లకిని ఆహ్వానించి, నడిపిస్తారు. ఆలమూరు, టి.లింగందిన్నె గ్రామాలకు చెందిన బెస్తలకు స్వామి పల్లకిని మోసే హక్కు వారసత్వంగా వస్తోంది. ఈ ప్రాంత ప్రజలు సంక్రాంతి పండగను పెద్దగా చేసుకోరు. అయితే స్వామి తమ గ్రామానికి వచ్చిన రోజునే సంక్రాంతిగా భావించి పండగ చేసుకుంటారు.

– సత్తార్‌మియా, మోహిద్దీన్ ఆళ్లగడ్డ



ఈనాడు సినిమా



ప్రేమకథలకి పెట్టింది పేరు అక్కినేని కథానాయకులు. వెండితెర మజ్ను, దేవదాసు, మన్మథుడు... ఇలా అందరూ ఆ కుటుంబం నుంచే వచ్చారు మరి! ఇప్పుడు అఖిల్ అక్కినేని కూడా యువ మజ్ను అవతారమెత్తాడు. ఆయన కథానాయకుడిగా నటించిన 'మిస్టర్ మజ్ను' శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ఆయన బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...

స్టార్లు కూడా బయటికి రాలేరు కానీ నేనొచ్చా!

'మిస్టర్ మజ్ను' కథని మూడేళ్ల కిందటే విన్నారట కదా. మరి కొత్తగా అందులో మార్పులేమైనా చేశారా?

నేను తొలి సినిమా చేయడాని కన్నా ముందే దర్శకుడు వెంకీ అట్లూరి ఈ కథని చెప్పారు. అప్పటికి వినాయక్‌తో సినిమా చేయడానికి ఒప్పుకొన్నాను. దాంతో తను నా కోసం ఈ స్క్రిప్టుని పక్కనపెట్టి 'తొలిప్రేమ' తీశారు. మేం ముందు అనుకున్నట్లుగానే నా మూడో సినిమాగానే ఈ కథ చేశాం.

'మిస్టర్ మజ్ను' కథలో మీకు నచ్చిన విషయం ఏంటి?

పాత్ర ప్రధానంగా సాగే కథ ఇది. నటుడిగా నాకు ఛాలెంజింగ్‌గా ఉంటుందనుకొన్నా. నిజంగానే గత రెండు సినిమాలకి పూర్తి భిన్నమైన నటనని ఇందులో కనబరిచా. తొలి సగభాగం ఎక్కువగా కథానాయకుడి పాత్ర నేపథ్యంలోనే సాగుతుంది. ఆ పాత్ర మొత్తం నా నటనపైనే ఆధారపడి ఉంటుంది. దానికి తోడు కుటుంబ భావోద్వేగాలూ ఇందులో బలంగా ఉంటాయి.

తొలి రెండు సినిమాలతో పోలిస్తే ఇప్పుడు మీపై ఒత్తిడి పెరిగిందా? తగ్గిందా?

కెమెరా ముందుకు అడుగు పెట్టిన తొలి రోజు నుంచే నాపైన మితిమీరిన అంచనాలు ప్రభావం చూపించడం మొదలైంది. ఒత్తిడి, అంచనాలే నాకు అతి పెద్ద శత్రువులు. మరింత ఎక్కువగా శ్రమించడానికి కారణమూ అవే. అంచనాల్ని అందుకోవడం కోసం నేను చేయకూడనిది కూడా చేయాల్సి వచ్చింది. కానీ ఆ తర్వాత తెలుసుకొన్నా. అంచనాల గురించి ఆలోచించడం కంటే, ఒకొక్క మెట్టు ఎక్కుతూ వెళ్లడమే ఉత్తమం అని. అందుకే 'మిస్టర్ మజ్ను' సినిమాని ఎలాంటి ఒత్తిడి లేకుండా చేశా.

తొలి రెండు సినిమాలు మీలో చాలా మార్పుని తెచ్చినట్టున్నాయి కదా?

మార్పు అనేది అనుభవం నుంచే వస్తుంది. రెండు సినిమాలు గొప్ప అనుభవాన్నిచ్చాయి. తొలి సినిమా అయితే చాలా నేర్పించింది. అలాంటి పరాజయం తర్వాత స్టార్ కథానాయకులు కూడా అంత త్వరగా బయటికి రాలేరు. కానీ నేనొక కొత్త నటుడినైనా దాన్ని అధిగమించి తర్వాత సినిమా చేశా. 'హలో'తో ఆత్మవిశ్వాసం పెంచుకొన్నా. ప్రేక్షకుల నమ్మకాన్ని గెలుచుకొన్నా.

బాగా తెలిసిన దర్శకుడితో పనిచేయడం ఎలా అనిపించింది?

సెట్‌లో చాలా సరదాగా ఉండేది. వెంకీ నాకు పదేళ్లుగా తెలుసు కానీ అంత స్నేహితులమేమీ కాదు. ఈ సినిమాతో సన్నిహితుడయ్యాడు. 'నిన్నే పెళ్లాడతా', 'మన్మథుడు'తోపాటు కొన్ని త్రివిక్రమ్ సినిమాల స్ఫూర్తితో ఈ సినిమాని మరింత వినోదాత్మకంగా తీశాడు. 'మజ్ను' అనగానే విషాదమే గుర్తుకొస్తుంది. అలా కాకుండా ఒక యువ మజ్ను ప్రేమ కథని చెబుతున్నాం కాబట్టే దర్శకుడు 'మిస్టర్ మజ్ను' అని పేరు పెట్టారు. ఒక ప్లేబోయ్ లవర్‌బోయ్‌లా ఎలా మారాడనేది ఆసక్తికరంగా ఉంటుంది. నేను చేసిన విక్కీ పాత్ర 'ప్రేమ్‌నగర్' సినిమాలో మా తాతగారిని గుర్తు చేస్తుంది. అందులో ఆయన చెప్పిన సంభాషణల్ని నాతో చెప్పించాడు వెంకీ. 'సవ్యసాచి'లో కొన్ని సన్నివేశాలు చూసి దర్శకుడే కథానాయికగా నిధి అగర్వాల్‌ని ఎంపిక చేశారు. తను తెలుగు బాగా అర్థం చేసుకొని నటించింది. నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ మా తాతగారితోనూ సినిమా చేశారు. ఇప్పుడు ఆయన నిర్మాణంలో నేను సినిమా చేయడం ఆనందంగా ఉంది.

ఈ కథ వ్యక్తిగతంగా మీకెంత దగ్గరగా ఉంటుంది?

నా చుట్టూ సినిమాలో కనిపించినంత మంది అమ్మాయిలేమీ ఉండరు (నవ్వుతూ). ప్రస్తుతానికి నేను సింగిల్‌నే. ఈ సినిమా తర్వాత ఎవరితోనైనా మింగిల్ అవుతానేమో చూడాలి.

ప్రేమకథలు మీ కుటుంబానికి బాగా కలిసొస్తుంటాయి కదా...

నాకు అన్ని రకాల సినిమాలు చేయాలని ఉంది. తదుపరి ఓ కొత్త జోనర్‌లో సినిమా చేసినా మళ్లీ ప్రేమకథలు చేస్తాను. నా వయసు 25 ఏళ్లు. మరో ఐదేళ్ల వరకు నేను ఇలాంటి ప్రేమకథల్ని అస్సలు మిస్ చేసుకోను. 'మజ్ను' అనే పేరు కూడా మా కుటుంబానికి బాగా కలిసొచ్చింది. ఈ సినిమా విజయంతో ఆ సెంటిమెంట్ కొనసాగుతుంది. ఈ కథ విన్నప్పుడు అదంతా ఏమీ గుర్తుకు రాలేదు. ఇది నాకు కరెక్ట్ స్క్రిప్ట్ అనిపించిందంతే.

అఖిల్ మంచి నటుడిగా పేరు తెచ్చుకుంటాడని ఎన్టీఆర్ చెప్పారు కదా. దానిపై మీ అభిప్రాయం?

ఆ మాటని నేను అస్సలు ఊహించలేదు. నేను అంతకుముందు కలిసినప్పుడు కూడా ఎప్పుడూ చెప్పలేదు. నేను ఆత్మవిమర్శ చేసుకొని అడుగులు వేస్తుంటాననీ చెప్పారు. నిజంగా నా తప్పుల్ని నేను తెలుసుకొంటున్నా. అలాగే ఎన్టీఆర్ నుంచి మాస్ నేర్చుకోమని నాన్న చెప్పారు. అదెలాగో నాన్నని ఒకసారి అడగాలి.

మల్టీస్టారర్ చిత్రాలు ఎక్కువగా సెట్స్‌పైకి వెళుతున్నాయి కదా. వాటిలో నటించడానికి మీరు సిద్ధమేనా?

ఇదివరకు ఒకట్రెండు కథలొచ్చాయి. కానీ నాకు అవేమీ అంత ఆసక్తికరంగా అనిపించలేదు. ఒకవేళ మంచి కథలొస్తే చేయడానికి సిద్ధమే. సినిమాలో ఆరేడు మంది స్టార్స్ ఉంటే సందడిగా ఉంటుంది. సెట్‌లో ఆ వాతావరణం కానీ, నేర్చుకోవడానికి కానీ చాలా బాగుంటుంది.

క్రికెట్ బాగా ఆడుతుంటారు కదా. ఆ నేపథ్యంలో సినిమా చేయాలనే ఆలోచనేమైనా ఉందా?

క్రికెట్‌కి సంబంధించిన సినిమా చేయాలంటే ఆలోచిస్తా. స్పోర్ట్స్ సినిమాలు కనెక్ట్ కావాలంటే అందులో సాంకేతిక పరమైన విషయాలు పక్కాగా ఉండాలి. దర్శకులకి ఆటలపై పూర్తి అవగాహన ఉండాలి. ఇప్పటి వరకు నా దగ్గరికి క్రికెట్ కథలేతే రాలేదు కానీ.. ఇతర క్రీడల నేపథ్యంలో కథలైతే విన్నా. ఒకటి చర్చల్లో కూడా ఉంది. నా తదుపరి సినిమా ఏంటనేది ఫిబ్రవరిలో ప్రకటిస్తా. మార్చిలో మొదలవుతుంది.

చేపలు మాత్రమే తిన్నా

ప్రేమకథ కాబట్టి 'మిస్టర్ మజ్ను'కి కండలు చూపించాల్సిన అవసరం ఉండదనుకొన్నా. కానీ ఇందులో ఒక పాట కోసం 8 ప్యాక్ చేయాల్సి వచ్చింది. సినిమాలో పాత్ర ప్రధానంగా సాగే తొలి పాట అది. హైదరాబాద్, లండన్ మధ్య సాగే ఆ పాట ఎడిటింగ్ కొత్తగా ఉంటుంది. అందుకే ఈ పాటలో గెటప్ కూడా కొత్తగా ఉంటే బాగుంటుందని నృత్య దర్శకుడు శేఖర్ మాస్టర్ చెప్పారు. ఆయన వల్లే ఎయిట్ ప్యాక్ చేశా. అందుకోసం కొన్ని నెలల పాటు కేవలం చేపలు మాత్రమే తిన్నా.





పూజా హెగ్డే

కష్టమూ కాదు సులువూ

చిత్రసీమలో అన్నింటికంటే అవకాశం గొప్పదని చెబుతుంటారు. కథానాయిక కావాలని కలలో కూడా అనుకోని పూజా హెగ్డేకి అనుకోకుండానే ఆ అవకాశం దక్కింది. అంతే కాదు... ఎంతోమంది కలలు కనే బాలీవుడ్ ప్రయాణాన్ని తొలి అడుగుల్లోనే సాకారం చేసుకొంది. ఇంతకీ చిత్రసీమలో అవకాశాలు అందుకోవడం సులభమా కష్టమా అని పూజా హెగ్డేని అడిగితే... "సినిమాల్లోనే కాదు, ఏ రంగంలోనైనా అవకాశాలు అందిపుచ్చుకోవడం అనేది కష్టం కాదు. అలాగని సులభం అనీ చెప్పను. మనం సాధించాలనుకొన్నది మన మనసులో ఎంత దృఢంగా ఉందన్నదే కీలకం. మనం గట్టిగా అనుకొన్నదే మనం సాధిస్తాం. ఇక చాలామంది అదృష్టం గురించి మాట్లాడుతుంటారు. మన తపన, మన కృషి గట్టిగా ఉన్నప్పుడే అదృష్టం కలిసొస్తుంది. అదేమీ లేకుండా ఒట్టి అదృష్టంపైనే ఆధారపడితే ఏదీ సాధించలేం. సినిమా రంగంలోకి అనుకోకుండానే ప్రవేశించానేమో కానీ ఆ తర్వాత ప్రతి అవకాశం కోసం, అది దక్కిన తర్వాత దానికి న్యాయం చేయడం కోసం శ్రమిస్తూనే ఉన్నా" అని చెప్పింది. ప్రస్తుతం మహేష్‌బాబు సరసన 'మహర్షి' లోనూ, ప్రభాస్‌తో కలిసి ఓ సినిమాలోనూ నటిస్తోందామె.



రామ్

ఇస్మార్ట్ శంకర్ స్టార్ట్ చేశాడు

తన పేరు శంకర్. కానీ 'శంకర్' అని పిలిస్తే ఒప్పుకోడు. 'ఇస్మార్ట్ శంకర్' అనాల్సిందే. ఎదుటి వాళ్లని బురిడీ కొట్టించే తెలివితేటలు శంకర్ సొంతం. అందుకే ఆ పేరు. శంకర్ తెలివితేటలు ఏ స్థాయిలో సాగాయో, ఆ బుర్రతో ఎంత మందిని బుట్టలో వేసుకున్నాడో తెలియాలంటే 'ఇస్మార్ట్ శంకర్' చూడాల్సిందే. రామ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమిది. పూరి జగన్నాథ్ దర్శకుడు. పూరితో కలసి ఛార్మి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బుధవారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి ఛార్మి క్లాప్‌నిచ్చారు. స్రవంతి రవి కిషోర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. "ఇదో యాక్షన్ ఎంటర్‌టైనర్. రామ్ పాత్ర కొత్తగా ఉంటుంది. తన గెటప్ కూడా వైవిధ్యంగా కనిపిస్తుంది. గురువారం నుంచి చిత్రీకరణ మొదలెడతాం. మేలో విడుదల చేస్తామ"న్నారు ఛార్మి. పునీత్ ఇస్సార్, సత్యదేవ్, ఆశిష్ విద్యార్థి తదితరులు నటిస్తున్నారు. సంగీతం: మణిశర్మ, ఛాయాగ్రహణం: రాజ్ తోట, కూర్పు: జునైద్ సిద్దిఖీ, పాటలు: భాస్కరభట్ల.

సౌందర్య రజనీకాంత్ వివాహం?




సౌందర్య, విశాగన్

రజనీకాంత్ రెండో కుమార్తె సౌందర్య మళ్లీ పెళ్లి చేసుకోనున్నారా? అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. సౌందర్య దర్శకురాలిగా ప్రత్యేకతను చాటుకున్న విషయం తెలిసిందే. రజనీకాంత్ హీరోగా మోషన్ క్యాప్చర్ సాంకేతికతతో 'కోచ్చడయాన్' చిత్రాన్ని తెరకెక్కించారామె. ఆ తర్వాత ధనుష్ హీరోగా 'వీఐపీ 2'ను రూపొందించారు. సౌందర్యకు 2010లో చెన్నైకి చెందిన పారిశ్రామికవేత్త అశ్విన్‌తో వివాహమైంది. వీరికి వేద్ అనే కుమారుడు ఉన్నాడు. అయితే కొన్ని కారణాల వల్ల సౌందర్య, అశ్విన్ రెండేళ్ల క్రితం విడిపోయారు. ఈ నేపథ్యంలో సౌందర్యకు పారిశ్రామికవేత్త వనంగాముడి కుమారుడు విశాగన్‌లకు వివాహం జరుగనున్నట్లు కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. విశాగన్ అమెరికాలో చదువుకున్నారు. 'వంజగర్ ఉలగం' అనే చిత్రంలో నటించారు. ఓ నిర్మాణ సంస్థను నడుపుతున్నారు. ఆయనకీ గతంలో వివాహమైనా విడాకులు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో వీరి వివాహం ఇద్దరి కుటుంబీకుల సమ్మతితో జరుగనుందని వార్తలు వినిపిస్తున్నాయి. నిశ్చితార్థం కూడా జరిగిందని, ఫిబ్రవరి 11న పెళ్లి జరుగనుందని సమాచారం. ఈ పెళ్లికి సంబంధించిన అధికారిక సమాచారం ఇంకా రాలేదు.

– కోడంబాక్కం, న్యూస్‌టుడే

ఆధ్యాత్మిక అనుభూతి



సుమన్

సుమన్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'సింహనాదం'. పి.శ్రీనివాస్ దర్శకుడు. శ్రీలిఖిత మూవీ మేకర్స్, శ్రీవైష్ణవ స్పిరిటైన్‌మెంట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. "ఇదో ఆధ్యాత్మిక చిత్రం. శ్రీనరసింహస్వామి మహిమల్ని తెరపై చూపిస్తున్నాం. విజయ్ కురాకుల అందించిన పాటలు ఆకట్టుకుంటాయి. ప్రస్తుతం నటీనటుల ఎంపిక జరుగుతోంది. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తామ"న్నారు దర్శకుడు. ఇదే వేదికపై శ్రీ అహోబిల నరసింహస్వామిపై తాళ్లపాక అన్నమాచార్యులు రచించిన కీర్తనల్ని 'సర్వం సింహమయం' పేరుతో ఆవిష్కరించారు.

ముక్కుసూటి ప్రయాణం



ప్రియాంత్

"ముక్కుసూటిగా నడిచే ఓ అబ్బాయి కథ ఇది. ఓ అమ్మాయితో ప్రేమలో పడడం వల్ల వచ్చిన సమస్యలేంటి? అనేది ఆసక్తికరంగా చెప్పామ"న్నారు ప్రియాంత్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'కొత్తగా మా ప్రయాణం'. యామినీ భాస్కర్ నాయిక. రమణ దర్శకుడు. ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రియాంత్ హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ "యువతీయువకులు ప్రేమ పేరుతో పెళ్లికి ముందే సహజీవనం చేస్తున్నారు. వాటి వల్ల కలిగే అనర్థాలేంటో తెరపై చూపిస్తున్నాం. రొమాన్స్‌కి తగిన స్థానం ఉంది. 'ఈ రోజుల్లో' సాయి మరో ముఖ్య పాత్రలో కనిపిస్తారు. దీన్ని నా మిత్రులు నిర్మించారు. ఫిబ్రవరి నుంచి మరో కొత్త చిత్రం ప్రారంభం అవుతోంది. ప్రసాద్ దర్శకుడుగా పరిచయమవుతాడు. రాజేష్ నాగుల నిర్మాత. ఇప్పటి యువత పోకడలకి సంబంధించి వాస్తవికతతో సాగే వినోదాత్మక చిత్రమిద"న్నారు.

వెండితెర 'ఠాకరే' వస్తున్నాడు

విడుదలకు సిద్ధం



'ఠాకరే'

మరాఠా రాజకీయ ఉద్ధండుడు, శివసేన పార్టీ వ్యవస్థాపకుడు బాల్ ఠాక్రే జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'ఠాకరే'. మరాఠీ, హిందీ భాషల్లో రూపొందిన ఈ చిత్రంలో ఠాక్రే పాత్రలో నవాజుద్దీన్ సిద్దిఖీ నటించారు. ఠాక్రే సతీమణి మీనా ఠాక్రేగా అమృతా రావ్ నటించింది. అభిజిత్ పన్సె దర్శకత్వం వహించారు. శివసేన నేత సంజయ్ రావత్ రచయిగా వ్యవహరించడంతో పాటు నిర్మాణంలో పాలుపంచుకున్నారు. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఆ సినిమా విశేషాలివీ.

కార్టూనిస్టుగా ప్రస్థానం మొదలుపెట్టి కాలక్రమంలో మరాఠా రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగిన బాలా సాహెబ్ ఠాక్రే జీవితాన్ని నేటి తరానికి తెలియజేసేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఠాక్రే పాత్రకు నవాజుద్దీన్‌ను ఎంచుకున్నప్పుడు చాలా మంది ఆశ్చర్యపోయారు. చివరి క్షణం వరకూ హిందూ జాతీయ వాదిగా జీవించిన ఠాక్రే పాత్రకు ముస్లిం అయిన నవాజ్‌ను ఎంపిక చేసుకోవడమే అందుకు కారణం. అయితే 'ఠాకరే' ఫస్ట్‌లుక్ విడుదలయ్యాక నవాజ్ సరైన ఎంపిక అని అంతా ఒప్పుకున్నారు. ఠాక్రే గెటప్‌లో నవాజ్ అంతలా ఒదిగిపోయారు. ఈ సినిమా టీజర్ ఠాక్రేకు సన్నిహితుడైన అమితాబ్ బచ్చన్ చేతుల మీదుగా విడుదలైంది. ట్రైలర్ విడుదలయ్యాక ఈ చిత్రంపై వివాదం రాజుకుంది. అందులో దక్షిణ భారతీయులపై ద్వేషాన్ని రెచ్చగొట్టే విధంగా సంభాషణలున్నాయంటూ విమర్శలొచ్చాయి. వాటిని తొలగించాలంటూ డిమాండ్లు వచ్చాయి. కానీ చిత్ర నిర్మాత సంజయ్ రావత్ అందుకు అంగీకరించలేదు. అయితే మరాఠీ ట్రైలర్‌లో ఉన్న ఆ సంభాషణలు హిందీ ట్రైలర్‌లో వినిపించలేదు. మరాఠీ వెర్షన్‌కు నవాజుద్దీన్ డబ్బింగ్ చెప్పలేదు. ఆ భాషలో సంభాషణలు చెప్పడానికి అంత పట్టు లేదని, అందుకే డబ్బింగ్ చెప్పలేకపోయానని నవాజ్ తెలిపారు. ఇందులో ఇందిరా గాంధీ, ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే పాత్రలు కూడా ఉన్నాయి. ఈ సినిమాకు సీక్వెల్ రూపొందించే ఆలోచన ఉన్నట్లు సంజయ్ రావత్ చెప్పారు.

వసుంధర


శిరీష ఇందుకూరి

వ్యాయామం కోసం... స్నేహితులతో కలిసి సరదాగా నడవడం... మనలో చాలామందికి అలవాటే. ఎప్పుడైనా చరిత్రకోసం నడిచారా...? చరిత్ర ఏంటీ... నడక ఏంటీ అంటారా...! అవును! మన చుట్టూ ఉన్న ప్రపంచం... దానికి సంబంధించిన వాస్తవాలు తెలుసుకునేందుకు చేసేదే హెరిటేజ్ వాక్. అవే నిర్వహిస్తున్నారు శిరీష ఇందుకూరి, మధు వాత్రి.


మధు వాత్రి

చరిత్ర కోసం ఓ వాక్!

నగరాన్ని చూపిస్తాం...

ప్రతి ప్రదేశానికీ ఓ చరిత్ర ఉంటుంది. ఎన్నో పురాతన వస్తువులు, ప్రాంతాలు మన చుట్టూనే ఉన్నా... వాటిని గమనించం. ఉరుకుల పరుగుల జీవితం, ఆధునికంగా విస్తరిస్తోన్న నాగరికత వల్ల ఈ సమస్య ఎదురవుతుంది. అయితే ఆ చరిత్రతో అనుబంధాన్ని పెంచుకోలేకపోతే, భద్రంగా కాపాడుకోలేకపోతే అది మరుగున పడిపోతుంది. ఆ ఆలోచనే హెరిటేజ్ వాక్‌లు నిర్వహించే స్ఫూర్తిని అందించింది. అందుకోసం నగర నిర్మాణానికి సంబంధించిన పురాతన మ్యాప్‌లను వినియోగించుకుంటున్నా.

పన్నెండు రాష్ట్రాల్లో తిరిగా: మా స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా. కానీ పుట్టి పెరిగిందంతా దిల్లీలోనే. సోషియాలజీలో పీజీ చేశా. ఆ తరువాత దిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ నుంచి సోషియాలజీలో ఎంఫిల్ పూర్తిచేశా. ఆపై కొన్నాళ్లు నెదర్లాండ్స్ రాజధాని హేగ్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ స్టడీస్, బ్యాంకాక్‌లోని రీజనల్ కమ్యూనిటీ ఫారెస్ట్రీ ట్రైనింగ్ సెంటర్‌లోనూ ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేశా. కొన్నాళ్లు దిల్లీకి చెందిన ఓ స్వచ్ఛంద సంస్థలో ఉద్యోగం చేశా. దానిలో భాగంగా సుమారు పన్నెండు రాష్ట్రాల్లోని మారుమూల ప్రాంతాల ప్రజలతో పనిచేయగలిగా. జీవనాధారానికి సహజ వనరుల వినియోగం, పర్యావరణం, సామాజిక అభివృద్ధి, ప్రణాళికాభివృద్ధి కార్యక్రమాలు నా విధుల్లో భాగం. క్రమంగా గ్రామీణ, పట్టణ భౌగోళిక స్థితిగతులు, చరిత్రపై ఆసక్తి పెరిగింది. ఆ ప్రయత్నంలో భాగంగానే అధ్యయనం చేయడం మొదలుపెట్టా.

ఆ అవకాశంతో: ఆ సమయంలోనే ఇండియా ఫౌండేషన్ ఫర్ ద ఆర్ట్స్ సంస్థ అందించే ఫెలోషిప్ గురించి తెలిసింది. కళాకృతి ఆర్కైవ్స్ సమన్వయంతో టాటా ట్రస్ట్ సహకారంతో అందించే ఈ ఫెలోషిప్ నాకు మంచి అవకాశాన్ని కల్పించింది. అలా హైదరాబాద్ చరిత్ర, చారిత్రక నిర్మాణాలను తెలుసుకునేందుకు సిద్ధమయ్యా. దీనిలో భాగంగానే కళాకృతి సంస్థ వద్ద సుమారు 848 పురాతన హైదరాబాద్ నగర నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌లు ఉన్నాయి.

వాటిల్లో సుమారు 120కిపైగా పాత హైదరాబాద్‌కి సంబంధించినవే. వీటిని 1908లో వరదలు వచ్చిన తరువాత అంటే 1912-1915 మధ్య కాలంలో రూపొందించారు. నగరంలోని ప్రదేశాలు, వీధులు, భవంతులు అన్నింటినీ గుర్తిస్తూ ఈ మ్యాప్‌లు తయారయ్యాయి. ఇవే హైదరాబాద్ నగరానికి మొదటి మున్సిపల్ సర్వే మ్యాప్‌లు కూడా. 'ద లియోనార్డ్ మన్ మ్యాప్స్' అంటాం. అవి చూశాక వాటి గురించి తెలుసుకోవాలనే ఆసక్తి పెరిగింది. అలా తెలుసుకున్న అంశాలను నలుగురికీ చెప్పాలనుకున్నా. అందుకే ఈ హెరిటేజ్ వాక్‌లను ఏర్పాటు చేశా. అదీ ఉచితంగానే. వీటి ద్వారా ఆనాటి గుర్తులు ఎంత మేర మిగిలి ఉన్నాయి... అప్పటికి చారిత్రక సంపద, సాంకేతికత... వంటివన్నీ వివరిస్తాం. ఇవన్నీ తెలుసుకోగలిగితే నగరంతో వారి బంధం మరింత పెరుగుతుందనేది నా ఆలోచన. అలాని ఏదో తీసుకెళ్లి, తీసుకొస్తే ఉపయోగం ఉండదు. అందుకే ముందుగానే వారి చేతికి మ్యాప్‌లను ఇచ్చి ట్రెజర్ హంట్ వంటి కార్యక్రమాల ద్వారా ఉత్సాహం పెంచుతాం. ఇలా హుస్సేనీ ఆలం, కార్వాన్, చార్మినార్, దారుల్‌షిఫా, పురానాపూల్ వంటి ఎన్నో ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశాం.

నగరంలో దీవాన్ దేవిడీ అనేది సాలర్‌జంగ్స్ కాలంలో పెద్ద నివాస భవంతి. దీన్ని అనుకుని పెద్ద తోట ఉండేది. కానీ ఇప్పుడు అదో షాపింగ్, అపార్ట్‌మెంట్‌ల సమూహం. దీనికి సంబంధించి అప్పటి, ఇప్పటి పరిణామాలను వివరిస్తూ ఓ ఎగ్జిబిషన్‌ని ఏర్పాటు చేశా. ఇలా మన చుట్టూ ఉన్న చరిత్రను నడకతోనే తెలుసుకోగలగడం నిజంగా గొప్ప విషయమే కదా. ఒకప్పుడు విలసిల్లిన నాగరికత తెలుసుకునేందుకు ఒక్క చారిత్రక నడక కార్యక్రమాలే కాదు.. ఆసక్తి ఉన్నవారితో చర్చలు, వర్క్‌షాప్‌లు వంటివన్నీ నిర్వహిస్తాం.



చరిత్రను పుస్తకాల్లో చదివితే అర్థమయ్యేది కొంతే. ఆ నాటి కట్టడాలను, అప్పటి గుర్తులను చూసి తెలుసుకోగలిగితే...అర్థం చేసుకోగలిగేది ఎంతో. పర్యటకులకు ఆ అవగాహనే అందించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇందుకోసం మేం హెరిటేజ్ వాక్‌లను ఏర్పాటు చేస్తాం. ఇవన్నీ స్థానిక పర్యటన ప్రాధాన్యం పెంచేందుకు, చారిత్రక- సామాజిక అనుబంధాన్ని ఒకరితో మరొకరికి పంచేందుకు ఎంతగానో ఉపయోగపడతాయి. అందుకోసం హైదరాబాద్‌ని ఎంచుకున్నాం. అది చార్మినార్ నుంచి చౌమొహల్లా వరకూ అయినా సెంట్రల్ లైబ్రరీ నుంచి సిటీకాలేజ్ వరకూ అయినా సరే!

పుస్తకం రాశా: మాది లఖనవూ. నా చదువంతా దిల్లీ పరిసర ప్రాంతాల్లోనే సాగింది. 2005లో కన్జర్వేటివ్ ఆర్కిటెక్చర్‌లో ఎంఆర్క్ పూర్తిచేశా. చదువుతున్నప్పుడు ఓ సారి లఖనవూలో హెరిటేజ్ వాక్‌ని నిర్వహించా. అది విజయవంతం కావడంతో ఇంకా చేయాలని అనిపించింది. చదువయ్యాక పెళ్లికావడంతో హైదరాబాద్ వచ్చేశా. ఇక్కడ ఓ కాలేజీలో పాఠాలు చెప్పేదాన్ని. ఈలోగా పాప పుట్టడంతో కాస్త విరామం తీసుకున్నా. అప్పుడు ఉద్యోగం చేయలేదు కానీ...నా అధ్యయనాన్ని మాత్రం ఆపలేదు. సుమారు 300 పాత భవంతులు, వాటి చరిత్రలు, నిర్మాణం వంటి వివరాలన్నీ సేకరించి పుస్తకంగా రాయడం మొదలుపెట్టా. ఆ సమయంలోనే కొన్ని అనుమతుల కోసం పర్యటక శాఖ అధికారులను కలిశా. వారు నా పుస్తకం గురించి తెలిసి 'నగరంలో పర్యటకులకోసం హెరిటేజ్ వాక్‌ని నిర్వహించగలరా' అని అడిగారు. అలా వేర్వేరు మార్గాల్లో ఈ నడకకోసం ప్రాజెక్ట్ చేసి చూపించా. అప్పటికే బెంగళూరు, పుణెల్లో ఇలాంటివి నిర్వహించిన అనుభవం కూడా ఉండటంతో వారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నగరంలో ఉన్న గైడ్‌లకు శిక్షణ ఇవ్వమన్నారు.

ఏం చెబుతామంటే: హైదరాబాద్ నగరంలో బోలెడన్ని చారిత్రక ప్రదేశాలు ఉన్నాయి. వాటికి ఎంతో చరిత్రా ఉంది. అది తెలుసుకోవాలంటే ఆ ప్రయత్నంలో మమేకవ్వాలి. మేం మొదట చేసింది చార్మినార్ - చౌమొహల్లా వాక్. అలాని కేవలం వెళ్లి వచ్చేయడం కాదు. ఆ మార్గంలో ఉండే కమాన్ అంటే ఏంటి... టూంబ్స్ ఏముంటాయి... వాటి నిర్మాణాలు ఎలా ఉన్నాయి... చరిత్ర... అప్పటి పరిస్థితులు... వంటివన్నీ రెండు మూడు గంటల్లోనే తెలుసుకుంటాం. ఈ పర్యటనను నమోదు చేయించుకున్నవారికి టిఫిన్‌తో కలిపి యాభైరూపాయలు తీసుకుంటాం అంతే. ఈ నడక మొదలవడానికి ముందే ఆ మ్యాప్‌ని చేత్తో డ్రాయింగ్‌ని గీసి ఇస్తాం. ఇక ఈ ప్రాజెక్ట్ చేపట్టాక

పదిహేను వేలకు పైగా



అమెరికన్ కాన్సులేట్ మూడువారాల పాటు అమెరికాలో మరెన్నో విషయాలు తెలుసుకునేందుకు పంపించింది. నేను కేవలం చారిత్రక నడక కార్యక్రమాలే కాకుండా మ్యూజియం వాక్, నేచర్ వాక్‌లతో పాటు శిల్పారామంలో క్రాఫ్ట్స్ పై అవగాహనా నడకని కూడా నిర్వహించా. ఒక్కో మార్గంలో కనీసం ఏడాదిన్నరపాటు విడతల వారీగా ఈ నడకను ఏర్పాటు చేశాం. కనీసం ఇద్దరు వచ్చినా ఈ పర్యటన సాగుతుంది. కానీ ముప్పై టిక్కెట్లు తీసుకోవాలి. ఇద్దరే వస్తే ఆ మిగిలిన ఇరవై ఎనిమిది టిక్కెట్లను వదిలేయకుండా స్థానికంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే చిన్నారులకు కేటాయించి వాళ్లను తీసుకెళ్తాం. ఇప్పటివరకూ సుమారు పదిహేను వేలమందికి పైగా మా వాక్‌లలో పాల్గొన్నారు. కేవలం హైదరాబాద్ చరిత్ర మీదే కాకుండా బీదర్, హంపి వంటి ప్రాంతాల్లోనూ మేం నడకలు నిర్వహించాం. త్వరలో వందరూపాయల ధరకు ఓ మొబైల్ యాప్‌నీ విడుదల చేయనున్నాం.

– స్వాతి కొరపాటి


విడాకుల కాగితాలు కనిపించడం లేదు?

ప్ర పెళ్లయిన ఏడాదిన్నరకే నా భర్తతో మ్యూచువల్‌గా విడాకులు తీసుకున్నా. ఇది జరిగి ఆరేళ్లు అవుతోంది. ఇప్పుడు నా సమస్య ఏంటంటే కోర్టు నుంచి తీసుకున్న విడాకుల కాగితాలు ఎక్కడో పోగొట్టుకున్నా. విడాకులు తీసుకున్న సంవత్సరం మినహా మిగిలిన వివరాలేవీ నాకు గుర్తులేవు. ఇప్పుడు మరో కాపీ తీసుకునే అవకాశం ఉందా? ఉంటే అదెలానో చెప్పగలరు.

– ఓ సోదరి

జ మీరు విడాకుల కాగితాలు ఎప్పుడు తీసుకున్నారో గుర్తులేక పోయినా, ఏ కోర్టు నుంచి తీసుకున్నారో తెలిసే ఉంటుంది కదా! అక్కడే డూప్లికేట్ కాపీ కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఇక ఇష్యూడేట్, నంబర్ వంటివన్నీ మర్చిపోయాను అంటున్నారు కాబట్టి దాన్ని తిరిగి పొందడానికి మీరు కొద్దిగా కష్టపడాల్సి వస్తుంది. మీకు ఏ కోర్టులో విడాకులు మంజూరు అయ్యాయో అక్కడ ఆ సంవత్సరానికి సంబంధించిన రిజిస్టర్ ఉంటుంది. దానిలో డిస్పోజల్ కేసుల వివరాలన్నీ నమోదు చేస్తారు. ఫిర్యాది, ప్రతివాది పేర్లు కూడా ఉంటాయి. ఆ నంబర్ తీసుకుని, దాని ఆధారంగా విడాకుల తేదీని వేసి సర్టిఫైడ్ కాపీ ఆర్డరు కోసం దరఖాస్తు చేయండి. సాధారణంగా కేసు రిజిస్టర్‌ని పరిశీలించుకునే అవకాశం నేరుగా ఆయా వ్యక్తులకు ఉండదు. కాబట్టి మీకు విడాకుల కేసుని డీల్ చేసిన లాయర్‌ని సంప్రదించండి. అతని ద్వారా పని సులువవుతుంది. ఒకవేళ ఆ లాయర్ దగ్గర ఫైల్ నంబరు, డిస్పోజల్ డేట్ దొరికితే దాని సాయంతోనే ఆర్డర్ కాపీ కూడా తీసుకోవచ్చు. ఆ ఆర్డర్ కాపీ లేకపోయినా కేస్ నంబర్‌తో సర్టిఫైడ్ కాపీ కోసం దరఖాస్తు చేయొచ్చు. అయితే దానికి మళ్లీ న్యాయమూర్తి అనుమతి అవసరం. ఇదంతా పూర్తవడానికి నెలరోజుల సమయం పడుతుంది. ఇప్పటికే మీ కేసు ఫలితం వచ్చి ఆరేళ్లు దాటిపోయాయి. దాంతో అవన్నీ రికార్డ్ సెక్షన్‌కి వెళ్లిపోయి ఉంటాయి. ముందు మీ అవసరాన్ని చెప్పి మీ లాయర్ ద్వారా ప్రయత్నిస్తే మీ పని సులువవుతుంది.

డియర్ వసుంధర


జి. వరలక్ష్మి
న్యాయవాది

– మీ సందేహాలను, సమస్యల్ని vasulegal@eenadu.net కు పంపించగలరు.

నజరానా

పసుపు నిల్వ చేసుకునే సీసాలు, డబ్బాల్లో పసుపు మరకలు కనిపిస్తుంటాయి. వాటిని తొలగించడానికి ఆ పాత్రలను మొదట గోధుమపిండితో తోమి, కాసేపు నీళ్లలో నానబెట్టాలి. ఆ తరువాత కడిగేస్తే సరి. మరకలు పోతాయి.

ఒత్తిడా... నవ్వేయండి!

ఒత్తిడి మన జీవితంలో ఓ భాగం అయిపోయింది. దానికి కారణాలు ఎలాంటివైనా పరిష్కారం ముఖ్యం కాబట్టి... ఒత్తిడి నుంచి ఎలా బయటపడొచ్చో చూద్దాం.

- మనలో చాలా మంది తేలిగ్గా తీసుకుంటాం కానీ... ఒత్తిడిని నివారించడంలో వ్యాయామం కీలకంగా పని చేస్తుంది. వేగంగా వ్యాయామం చేయడం వల్ల గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. చెమట పడుతుంది. శరీరం కూడా చురుగ్గా మారుతుంది. శరీరంలో ఎండార్ఫిన్లు అనే ఫీల్‌గుడ్ హార్మోన్లు విడుదల అవుతాయి. అవి ఒత్తిడిని పెంచే హార్మోన్లను తగ్గిస్తాయి. కాబట్టి ఎన్ని పనులు ఉన్నా... వ్యాయామం చేసేందుకు సమయం పెట్టుకోండి.
- మనకు ఉన్న కొన్ని సమస్యలు కూడా ఒత్తిడికి దారితీస్తాయి. అలాంటప్పుడు వాటి గురించి ఆలోచించి, బాధపడటం కన్నా ఏ మార్గాల్లో పరిష్కరించొచ్చో ఆలోచించాలి. కచ్చితంగా మార్పు ఉంటుంది.
- ఎప్పుడూ పనులతోనే గడిపేస్తుంటాం. ఒకదాని తరువాత మరొకటి అంటూ ఎన్నో పనులు చేసుకుంటూ పోతాం. కానీ మీ కోసం మీరు కొంత సమయం పెట్టుకుని ఆ పనుల ఒత్తిడి నుంచి బయటపడాలి. కుదిరితే కాసేపు నవ్వుకోవడం, నచ్చిన పని చేయడం, అభిరుచులపై ఆసక్తి చూపించడం వంటివాటికి ప్రాధాన్యం ఇవ్వాలి. వాటి వల్ల ఎంతో మార్పు ఉంటుంది.
- కనీసం నెలా, రెణ్నెల్లకోసారి స్పాలో లేదా ఇంట్లోనే బాడీ మసాజ్‌కి ప్రాధాన్యం ఇవ్వాలి. దీనివల్ల కండరాలు, నాడీవ్యవస్థ పనితీరు బాగుండటమే కాదు, ఒత్తిడి కూడా దూరమవుతుంది. ఒత్తిడి తాలూకు హార్మోన్లు కూడా బయటకు పోతాయి.
- రోజులో వీలైనంత ఎక్కువ కూరగాయలు, పండ్లు తీసుకునేవారు ఆనందంగా ఉంటున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. కాబట్టి జంక్ ఫుడ్‌ని తగ్గించి, పండ్ల ముక్కలు, కూరగాయల సలాడ్లు ఎక్కువగా తీసుకునేలా చూసుకోవాలి. క్యారెట్, కీరలాంటివయితే కుదిరినప్పుడల్లా విడిగానే తీసుకోవచ్చు.

బంగారం వెండి



23న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	33,440	33,460	33,000	33,100
ఆర్నమెంట్	31,240	31,250	30,700	30,700
వెండి (కిలో)	40,100	39,930	40,000	40,000
	ప్రొద్దుటూరు		**రాజమహేంద్రవరం**	
బంగారం(24క్యా)	33,000	33,000	33,460	33,490
ఆర్నమెంట్	30,670	30,520	30,940	30,960
వెండి (కిలో)	40,000	39,800	40,300	40,000
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	33,290	33,090	-------	-------
ఆర్నమెంట్	30,960	30,780	3,097	3,096 గ్రా
వెండి (కిలో)	40,000	41,000	42.50	42.20 గ్రా

పక్క జడే ప్రత్యేకం!

సందర్భం ఏదైనా చక్కగా అలంకరించుకోవాలనుకుంటాం. ఇలాంటప్పుడు దుస్తుల మీద పెట్టే శ్రద్ధలో కాస్త కేశాలంకరణపైనా పెట్టగలిగితే... మెరిసిపోవచ్చు. అలాని ఎప్పుడూ ఒకే రకం ఎంచుకుంటే ఏం బాగుంటుంది చెప్పండి. అందుకే ఇప్పుడు ట్రెండ్‌లో ఉన్న పక్కజడని ప్రయత్నించి చూడండి. అంటే జడ లేదా కొప్పును మధ్యకి కాకుండా కాస్త పక్కనుంచి వేసుకుని పూలు అలంకరించుకుంటే ఆ అందమే వేరు. అలాంటి కేశాలంకరణలే ఇవన్నీ.

సిగ సింగారం



దాల్చినచెక్క చూర్ణం... సైనస్ దూరం

సైనస్... చాలామందిని ఇబ్బంది పెట్టే సమస్య. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ఈ సమస్య ఇంకాస్త ఎక్కువగానే బాధిస్తుంది. మరి దాన్ని అదుపులో ఉంచాలంటే ఏం చేయాలో చూద్దామా...




సైనస్‌లనేవి ముక్కుకి సంబంధించిన గాలి గదులు. ముక్కుకి రెండు వైపులా, కనుబొమ్మలపైనా, కిందా... మొత్తం ఆరుంటాయి. వీటిల్లో తడి ఉండదు. కొంత మందికి మాత్రం వీటిల్లో కఫం చేరుతుంది. అలా అవి బ్లాక్ అవుతాయి. ఇలా కఫం చేరినప్పుడు వైరస్, ఫంగస్, బ్యాక్టీరియా వంటివి అక్కడ చేరి ఇన్‌ఫెక్షన్ ఎదురవుతుంది. కొందరిలో అకస్మాత్తుగా ఈ సమస్య మొదలై 10 లేదా 15 రోజుల్లో తగ్గిపోతుంది. కొంతమందిలో మాత్రం దీర్ఘకాలం బాధిస్తుంది. కఫ ప్రకృతి ఉన్నవారికి ఈ సమస్య వచ్చే అవకాశం ఎక్కువ. తరచూ జలుబు చేస్తే, అలాగే ముక్కులో కంతులు ఉన్నప్పుడు, రోగనిరోధక వ్యవస్థ తక్కువగా ఉన్నవారికి, అలర్జీలు ఉన్నవారికి సైనసైటిస్ వచ్చే అవకాశాలెక్కువ.

జాగ్రత్తలు

ముఖ భాగమంతా, అలాగే కనుబొమ్మలపైన నొప్పి అధికంగా ఉంటుంది. ముక్కు మూసుకుపోవడం, దగ్గు, జ్వరం, నోటి దుర్వాసన, అలసట, తలనొప్పి వంటి లక్షణాలూ కనిపిస్తాయి. తరచూ ఈ సమస్యకు గురయ్యేవారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. కఫాన్ని తగ్గించే వెల్లుల్లి, అల్లం, మిరియాలను ఆహారంలో వాడాలి. నిత్యం పచ్చి ఉల్లిపాయలు తినడం మంచిది. కఫాన్ని పెంచే గుణమున్న చల్లని, తీపి పదార్థాలు, చాక్లెట్లు, కేకులు, పెరుగు, పాయసం, పాల పదార్థాలు తగ్గించాలి. చల్లగాలిలో, వానలో తిరగకూడదు. తరచూ వేడి నీటిని తాగుతూ ఉండాలి. ముఖానికి ఆవిరి పడుతూ ఉండాలి.

ఇంటి వైద్యం





- ఆవనూనెను గోరువెచ్చగా చేసి, రెండు లేదా మూడు చుక్కలను ముక్కులో వేసుకుని, 10 నిమిషాల తరువాత ముఖంపై చేతులతో మర్దన చేసుకుంటే ఉపశమనం కలుగుతుంది.
- వేడి నీళ్లల్లో కొన్ని చుక్కలు యూకలిప్టస్ నూనె వేసి, ఆవిరి పడితే ముక్కు తెరుచుకుని తేలికగా ఊపిరి తీసుకోవచ్చు.
- అయిదు గ్రాముల వస కొమ్ము చూర్ణం, 20 మి.లీ. నువ్వుల నూనెను 80 మి.లీ నీటిలో కలపాలి. ఈ మిశ్రమాన్ని సన్నటి మంటపై కాచి, నూనె మాత్రమే మిగిలేలా చూసి వడబోయాలి. ఈ నూనెను ముక్కులో రెండు లేదా మూడు చుక్కల చొప్పున వేసుకుంటూంటే సమస్య తగ్గుతుంది.
- దాల్చిన చెక్క, యాలకులు, లవంగాలు, తులసి ఆకులను సమానంగా తీసుకుని పొడి చేసి కప్పు నీళ్లల్లో అరచెంచా పొడి వేసి టీలా చేయాలి. దీన్ని వేడివేడిగా తాగాలి. అలా రెండు లేదా మూడు వారాలపాటు ప్రతీరోజూ తీసుకుంటే సైనసైటిస్ తగ్గుతుంది.
- కప్పు పాలల్లో అర చెంచా శొంఠి పొడి వేసి బాగా కాసి, వేడివేడిగా తాగితే... సైనస్ నుంచి ఉపశమనం కలుగుతుంది.


డాక్టర్ గాయత్రీదేవి, ఆరోగ్యపీఠం

మీ ప్రశ్నలు ఇకపై vasuayur@eenadu.net కు పంపించగలరు.

అనుబంధానికి పంచ సూత్రాలు

పెళ్లయిన కొత్తల్లో భార్యాభర్తల మధ్య ఎదురయ్యే చిన్నచిన్న సమస్యలే మనస్పర్థలకు దారితీస్తాయి. అన్యోన్యతకు ఆటంకంగా మారతాయి. మరి వాటిని అధిగమించాలంటే...



- పెళ్లయిన తరువాత చిన్నచిన్న విషయాలకు సర్దుకోకపోవడం, ఇంకా పెళ్లికానట్లు భావించి నచ్చినట్లు ఉండటం వల్ల ఇద్దరి మధ్య గొడవలు మొదలవుతాయి. వాటిని అధిగమించాలంటే... ఇద్దరూ కలిసి తమలోని పొరపాట్లను, చిన్నచిన్న సమస్యల్ని ఎలా సరిదిద్దుకోవాలనేది చూసుకోవాలి. ఆ పరిణతి పెంచుకోగలిగితే ఇద్దరి మధ్య అన్యోన్యత వస్తుంది. ఇబ్బంది కలగనంత వరకూ కొన్ని విషయాలను చూసీ చూడనట్లు వదిలేయాలి.
- ఎదుటివారిలో సమస్యలు, లోపాలు ఉండటం మామూలే. అవి ఇబ్బంది కలిగిస్తున్నా కూడా... మౌనంగా ఉండటం సబబు కాదు. ఉద్వేగాలు వ్యక్తం చేయాలి. ఎదుటి వారికి అర్థం అయ్యేలా మీ సమస్యను తెలియజేయాలి. కానీ చాలా మంది ఆ పనిచేయరు. అసలు విషయం కాకుండా ఇంకేదో మాట్లాడతారు. అది ఎదుటి వారికి అర్థంకాక సమస్యలు మొదలవుతాయి. అయితే ఇద్దరూ కలిసి ఎలా పరిష్కరించుకోవాలనే కోణంలో ఆలోచిస్తే ఏ గొడవలూ ఉండవు.
- భాగస్వామిలో ఓ లోపం లేదా సమస్య ఉందని గుర్తించినప్పుడు... ఎప్పుడో ఏదో గొడవ జరిగితే... పదే పదే ప్రస్తావించడం చాలామంది చేసే పొరపాటు. గతం గతః అనే సూత్రాన్ని ఇద్దరూ పాటించాలి. గతాన్ని పదే పదే తవ్వడం, లోపాల్ని ఎత్తిచూపడం వల్ల మనస్పర్థలు పెరుగుతాయే తప్ప మరో ప్రయోజనం ఉండదు.
- భార్యాభర్తల మధ్య ఎదురయ్యే సమస్యలు ఎక్కువగా ఇంటి పనులు, ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి ఉంటాయి. వాటిని పెళ్లయిన కొత్తల్లోనే పరిష్కరించుకోవడం మంచిది. లేదంటే తామే ఎందుకు చేయాలనే వాదన మొదలై... దూరాన్ని పెంచుతుంది. ఆర్థిక వ్యవహారాలు కూడా అంతే. ఎంతవరకూ పొదుపు చేయాలి, ఏ మేరకు ఖర్చు చేసుకోవాలనే విషయాలపై ఇద్దరికీ ఓ స్పష్టత ఉండాలి.
- భాగస్వామి మీలా ఆలోచిస్తారనుకోవడం సబబు కాదు. ఎదుటివారు మిమ్మల్ని అర్థం చేసుకుని దానికి తగినట్లుగా వ్యవహరిస్తానుకోవడం అంతకన్నా పొరపాటు. సమస్య ఉంటే సూటిగా చెప్పాలి. అలాగే అవసరం అనుకుంటే మీరు కూడా భాగస్వామికి అనుగుణంగా చిన్నచిన్న మార్పులు చేసుకునేందుకు సిద్ధమనే విషయాన్ని కూడా స్పష్టం చేయాలి.

చదువు



వందకు వంద వడ్డించి టాప్ ర్యాంకు ఘనతను కట్టబెట్టగలిగింది గణితం. సమీకరణాలకు సానపెట్టి సరైన కెమిస్ట్రీని సాధిస్తే మంచి మార్కులను ఇస్తుంది రసాయన శాస్త్రం. ఈ రెండు సబ్జెక్టులను ఎలా చదువుకుంటే చక్కటి స్కోరు సాధించవచ్చో చెబుతున్నారు నిపుణులు. ఇంటర్మీడియట్ విద్యార్థులు ఈ సలహాలు, సూచనలతో తమ ప్రిపరేషన్‌కు మరింత పదునుపెట్టుకోవచ్చు.

ఇంటర్ పరీక్షల సన్నద్ధత

ఘనతకు గణితం మార్కుల రసాయనం

కెమిస్ట్రీ (రసాయన శాస్త్రం)

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల రసాయన శాస్త్రంలో అత్యధిక మార్కులు స్కోరు చేయటానికి కొన్ని మెలకువలు పాటించాలి. మొదట గమనించాల్సింది.. పూర్తి సిలబస్ మీద సరైన అవగాహన అవసరం. అన్ని పాఠ్యాంశాలనూ 2 మార్కులు, 4 మార్కులు, 8 మార్కుల ప్రశ్నలుగా విభజించి ఎంపిక చేసుకుని చదవాలి.

8 మార్కుల ప్రశ్నలు పరమాణు నిర్మాణం, ఆవర్తన పట్టిక, రసాయన బంధం లోనుంచి మాత్రమే రావడానికి అవకాశాలు ఎక్కువ. 4 మార్కుల ప్రశ్నలు స్టేట్స్ ఆఫ్ మ్యాటర్ (పదార్థాల స్థితి, స్టాయికియోమెట్రి, ఉష్ణగణిత శాస్త్రం (thermodynamics) హైడ్రోజన్- దాని సమ్మేళనాలు, రసాయన సమతాస్థితి, అయానిక సమతాస్థితి, కర్బన రసాయన శాస్త్రం నుంచి వచ్చే అవకాశాలు ఎక్కువ.



8 మార్కుల ప్రశ్నలు మూడింటిలో రెండు మాత్రమే రాయాలి కాబట్టి బాగా తెలిసిన 2 ప్రశ్నలను ఎంచుకోవాలి. సుమారు 250 పదాలతో రెండు మూడు పేజీల్లో కూలంకషంగా అవసరమైనచోట డయాగ్రామ్స్ (పటం) వేసి సమాధానం రాయాలి. ప్రశ్నలను పూర్తిగా అర్థం చేసుకొని దానికి కావలసిన సమాధానం మాత్రమే రాయాలి. ఇక్కడ అదనపు ప్రశ్నకు సమాధానం రాయాలని ప్రయత్నించకూడదు.

4 మార్కుల ప్రశ్నల్లో 8 ప్రశ్నలకుగాను 6 ప్రశ్నలు మాత్రమే రాయాలి. బాగా తెలిసిన 6 ప్రశ్నలకు 50 నుంచి 60 పదాల్లో రాయాలి. ఒకవేళ సమయం మిగిలి వుంటే అదనపు ప్రశ్నలకు సమాధానాలు రాస్తే అదనపు ప్రయోజనం లభిస్తుంది. ఎందుకంటే ఎగ్జామినర్ ఈ ప్రశ్నల్లో బాగా రాసిన అంటే.. ఎక్కువ మార్కులు వచ్చిన ప్రశ్నలను పరిగణనలోనికి తీసుకుంటారు. అందుకని అధిక మార్కులు వచ్చే అవకాశం ఉంది.

2 మార్కుల ప్రశ్నల్లో చాయిస్ లేదు. 10 ప్రశ్నలూ సరిగ్గా రాస్తేనే 60 మార్కులు వస్తాయి. పాఠ్యాంశాలూ పూర్తిగా చదవాలి.

ప్రథమ సంవత్సరంలో..

❖ అకాడమీ పుస్తకాల్లో పాఠ్యాంశం చివరున్న అన్ని రెండు మార్కుల ప్రశ్నలూ జాగ్రత్తగా చదివితే గరిష్ఠ మార్కులు తెచ్చుకోవడం సులభమే. 2 మార్కుల ప్రశ్నలు- ఎన్విరాన్‌మెంట్ కెమిస్ట్రీ, యస్ బ్లాక్, పి-బ్లాక్ నుంచి దాదాపు 6 ప్రశ్నల వరకు అడిగే అవకాశం ఉంటుంది. అయానిక సమతాస్థితిలో పీహెచ్ ప్రాబ్లమ్స్‌మీద ఎక్కువ దృష్టి పెట్టాలి. అకాడమీ పుస్తకంలో వెనుక వైపున ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలను బాగా సాధన చేయాలి.

ద్వితీయ సంవత్సరంలో...

❖ కర్బన రసాయన శాస్త్రం నుంచి 16 మార్కులుంటాయి. కాబట్టి ఈ విభాగం మీద ఎక్కువ దృష్టి సారించాలి. దీనిలో వచ్చే అన్ని Named Reactions బాగా సాధన చేయాలి. కార్బాక్సిలికామ్లాల ఆమ్లత్వం, అమైన్స్ క్షారత్వం ఆర్ద్రతను సాధన చేయాలి. ద్రావణాలు, లోహసంగ్రహణ శాస్త్రం, ఉపరితల రసాయన శాస్త్రం, సంక్లిష్ట సమ్మేళనాలు, జీవ అణువులనుంచి 4 మార్కుల మీద ఎక్కువ సాధన చేయాలి. పాలిమర్స్, నిత్యజీవితంలో రసాయనశాస్త్రం, ఘన స్థితి ద్రావణాలు, లోహసంగ్రహణ శాస్త్రం, సంక్లిష్ట సమ్మేళనాల నుంచి 2 మార్కులమీద ఎక్కువ సాధన చేయాలి. వీలైనంత వరకు 2 మార్కుల సమాధానాలు వరుస క్రమంలో రాయటం మేలు.

- టి. లక్ష్మీనారాయణ

మేథమేటిక్స్ (గణితశాస్త్రం)

ఇంటర్మీడియట్ విద్యార్థులు గణితంలో 75 మార్కులు చాలా సులభంగా సాధించవచ్చు. ❑ 7 మార్కుల ప్రశ్నల్లో బాగా తెలిసినవి 5 ప్రశ్నలు ఎంచుకుని సమాధానాలు రాయాలి (50 నిమిషాలు) ❑ 4 మార్కుల ప్రశ్నల్లో బాగా తెలిసినవి 5 ఎంచుకుని సమాధానాలు రాయాలి (40 నిమిషాలు) ❑ 2 మార్కుల ప్రశ్నలన్నింటినీ వరుసక్రమంలో రాయడానికి ప్రయత్నించాలి (40 నిమిషాలు) ❑ పై మూడింటినీ ఏదో క్రమంలో పూర్తిచేసిన తరువాత మిగిలిన 7 మార్కుల ప్రశ్న ఒకటి, 4 మార్కుల ప్రశ్న ఒకదానికి సమాధానం ఇవ్వండి (15 నిమిషాలు) ❑ చివరగా మిగిలిన 7, 4 మార్కుల ప్రశ్నలను సాధించండి (15 నిమిషాలు). చివరగా 2 మార్కుల ప్రశ్నల సమాధానాలను పరిశీలించుకోవాలి (20 నిమిషాలు).

మొదటి సంవత్సరంలో..

◗ మ్యాథ్స్- 1ఎలో మంచి మార్కులు సాధించాలంటే ముందుగా మాత్రికలు చూసుకోవాలి. ఈ అధ్యాయానికి 22 మార్కుల వెయిటేజీ ఉంది. దీని నుంచి రెండు 7, ఒక 4, రెండు 2 మార్కుల ప్రశ్నలు వస్తాయి. ◗ సదిశల నుంచి ఒక 7, రెండు 4, మూడు 2 మార్కుల ప్రశ్నలు వస్తాయి. మొత్తం మార్కులు 21. ◗ ప్రమేయాలు వెయిటేజీ 11 మార్కులు. ఒక 7, రెండు 2 మార్కుల ప్రశ్నలు వస్తాయి. దీని నుంచి సిద్ధాంతాలు ముఖ్యమైనవి. ◗ తరువాత సులభమైన అధ్యాయం గణితానుగమనం. దీని నుంచి 7, 4 మార్కుల ప్రశ్నలు ఒక్కొక్కటి చొప్పున వస్తాయి. ◗ ఆపై త్రికోణమితీయ నిష్పత్తులు, త్రికోణమితీయ పరివర్తనలు చదవాలి. దీని వెయిటేజీ 15 మార్కులు. దీని నుంచి 7, 4 మార్కుల ప్రశ్నలు ఒక్కొక్కటి చొప్పున, రెండు 2 మార్కుల ప్రశ్నలు వస్తాయి. ◗ ఆ తర్వాత త్రిభుజ ధర్మాలు చదవాలి. దీని వెయిటేజీ 11 మార్కులు. 7, 4 మార్కుల ప్రశ్నలు ఒక్కొక్కటి చొప్పున వస్తాయి. ◗ దీని తరువాత త్రికోణమితీయ సమీకరణాలు, విలోమ త్రికోణమితీయ ప్రమేయాల నుంచి ఒక్కొక్కటి చొప్పున 4 మార్కుల ప్రశ్నలు వస్తాయి. ◗ చివరగా 2 మార్కుల కోసం అతి పరావలయ ప్రమేయాలు చదివితే సరిపోతుంది.

మొదటి సంవత్సర విద్యార్థులు కష్టంగా భావించే సబ్జెక్టు 1బి. కానీ ప్రణాళిక ప్రకారం చదివితే మంచి మార్కులు సాధించవచ్చు. ★ ముందుగా నిరూపక జ్యామితిలోని సరళరేఖలతో సన్నద్ధత ప్రారంభించాలి. దీనికి 15 మార్కుల వెయిటేజీ ఉంది. రెండు 2 మార్కుల ప్రశ్నలూ, 7, 4 మార్కుల ప్రశ్నలు ఒక్కొక్కటి చొప్పునా వస్తాయి. ★ ఆ తరువాత సరళరేఖ యుగ్మాలు చూసుకోవాలి. దీని నుంచి రెండు ఏడు మార్కుల ప్రశ్నలు వస్తాయి. దీనిలో మొదటి భాగం (మొదటి రెండు అభ్యాసాలు)లో వరకు ఒక ప్రశ్న, రెండో భాగం (మూడో అభ్యాసం) నుంచి రెండో ప్రశ్న వస్తుంది. ★ త్రిపరిమాణ జ్యామితిలో 3 అధ్యాయాలుంటాయి. 1. త్రిపరిమాణ నిరూపక వ్యవస్థ (దీనికి 2 మార్కులు) 2. దిక్ కొసైన్‌లు, దిక్ నిష్పత్తులు (7 మార్కులు) 3. తలాలు (2మార్కులు) ★ తరువాత కలన గణితాన్ని మొదలుపెట్టాలి. దీని నుంచి రెండు 2 మార్కుల ప్రశ్నలు, 4, 7 మార్కుల ప్రశ్నలు ఒక్కొక్కటి చొప్పున మొత్తం 15 మార్కులకు వస్తాయి. ★ ఇప్పుడు స్పర్శరేఖలు, సరళరేఖలు, అభిలంబ రేఖలను ఎంచుకోవాలి. దీని నుంచి 4, 7 మార్కుల ప్రశ్నలు ఒక్కొక్కటి చొప్పున వస్తాయి. మొత్తం వెయిటేజీ 13 మార్కులు. ఇక్కడి వరకూ ఆరు 7 మార్కుల ప్రశ్నలు అయ్యాయి. ★ తరువాత 4 మార్కుల కోసం బిందు పథం, అవధులు అవిచ్ఛిన్నత, పైన చెప్పినవీ చూసుకోవాలి.


రెండో సంవత్సరం

కొంతమంది సులభంగా, మరికొంతమంది కష్టంగా భావించే సబ్జెక్టు మ్యాథ్స్ 2 ఏ. 75కు 75 మార్కులు తెచ్చుకోవాలంటే..

➤ పూర్ణసంఖ్యలకు 8 మార్కుల వెయిటేజీ (4+2+2) ➤ డిమోయర్ సిద్ధాంతం వెయిటేజీ 9 మార్కులు (7+2) ➤ దీని తరువాత సులభమైన అధ్యాయం యాదృచ్ఛిక చలరాశులు- సంభావ్యత విభజనలు. వెయిటేజీ 9 మార్కులు (7+2) ➤ దీని తరువాత సులువైన అధ్యాయం సంభావ్యత. దీని నుంచి 15 మార్కులు వస్తాయి (ఒక 7, రెండు 4 మార్కుల ప్రశ్నలు)

➤ ఆపై ద్విపద సిద్ధాంతం. వెయిటేజీ 16 మార్కులు (రెండు 7, రెండు 4 మార్కుల ప్రశ్నలు) ➤ తరువాత సిద్ధమవ్వాల్సింది- ప్రస్తారాలు- సంయోగాలు. వెయిటేజీ 12 మార్కులు. ప్రస్తారాల నుంచి ఒకటి 4, ఒక 2 మార్కుల ప్రశ్నలు వస్తాయి. ➤ వర్గ సమాసాలు సులభమైనది. వెయిటేజీ 6 మార్కులు. 4, 2 మార్కుల ప్రశ్నలు ఒక్కొక్కటి చొప్పున వస్తాయి.

విద్యార్థులు కష్టంగా భావించే సబ్జెక్టు 2బి. ➤ మొదట నిరూపక జ్యామితిలో వృత్తాలు చూసుకోవాలి. తరువాత వృత్త సరణి. ➤ ఈ రెండు అధ్యాయాలూ పూర్తయ్యాక కలన గణితం మొదలుపెట్టాలి. మొదటగా సమాకలనం. ➤ తరువాత నిశ్చిత సమాకలనం. ఆపై అవకలన సమీకరణాలు. ➤ నిరూపక జ్యామితితో పోలిస్తే కలన గణితాన్ని విద్యార్థులు సులభంగా భావిస్తారు. అందుకే వృత్తాలు, వృత్త సరణి తర్వాత కలన గణితం మొదలుపెట్టాలి. కలన గణితంలో మార్కులు సాధించడం సులభం. ➤ పరావలయం. పరావలయం, దీర్ఘవృత్తం, అతిపరావలయం.. ఒకదానికొకటి సంబంధాన్ని కలిగివుంటాయి. కాబట్టి మొదటగా పరావలయం, తరువాత దీర్ఘవృత్తం, చివరగా పరావలయాన్ని చదవాలి.



మ్యాథ్స్ 2బిలో కచ్చితంగా సిద్ధం కావాల్సిన అధ్యాయాలు- వృత్తాలు (22 మార్కులు), వృత్తసరణి (6 మార్కులు), పరావలయం (9 మార్కులు), అతి పరావలయం (6 మార్కులు), సమాకలనం (18 మార్కులు), నిశ్చిత సమాకలనం (15 మార్కులు), అవకలన సమీకరణాలు (13 మార్కులు).

ఇక వేటిని వదిలేయవచ్చు అంటే.. దీర్ఘవృత్తం (8 మార్కులు), వైశాల్యాలు (4 మార్కులు).

- ఆర్. శ్రీనివాసరాజు

(రచయితలు శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో అధ్యాపకులు) ●

కెమిస్ట్రీ, మ్యాథ్స్‌లో ముఖ్యమైన ప్రశ్నలను www.eenadupratibha.netలో చూడండి.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఐఐసీబీ, కోల్‌కతా

కోల్‌కతాలోని సీఎస్ఐఆర్ - ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ బయాలజీ (ఐఐసీబీ) కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టులు – ఖాళీలు:** సైంటిస్ట్-02, సీనియర్ సైంటిస్ట్-08, ప్రిన్సిపల్ సైంటిస్ట్-02.
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ ఉత్తీర్ణత.
వయసు: సైంటిస్ట్ పోస్టులకు 32 ఏళ్లు, సీనియర్ సైంటిస్టుకు 37, ప్రిన్సిపల్ సైంటిస్టుకు 45 ఏళ్లు మించకూడదు. **దరఖాస్తు:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్.
ఫీజు: రూ.100. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** ఫిబ్రవరి 28 http://www.career.iicb.res.in/

భెల్, చెన్నై

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్) పవర్ సెక్టార్ - సదరన్ రీజియన్... ఫిక్స్‌డ్ టెన్యూర్ పద్ధతిలో కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టు:** సేఫ్టీ ఆఫీసర్ **ఖాళీలు:** 38 **రీజియన్లవారీ ఖాళీలు:** సదరన్-29, ఈస్టర్న్- 03, వెస్టర్న్- 06. **అర్హత:** సంబంధిత బ్రాంచీల్లో బీఈ/ బీటెక్, ఇండస్ట్రియల్ సేఫ్టీలో కనీసం ఏడాది డిప్లొమా, రెండేళ్ల పోస్ట్-క్వాలిఫికేషన్ అనుభవం. **వయఃపరిమితి:** 23.01.2019 నాటికి 35 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్. **ఫీజు:** రూ.200.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: ఫిబ్రవరి 18
హార్డు కాపీలను పంపడానికి చివరితేది: ఫిబ్రవరి 25 **వెబ్‌సైట్:** http://www.bhel.com/

ఓఎన్‌జీసీ పెట్రో అడిషన్స్ లిమిటెడ్

వడోదరలోని ఓఎన్‌జీసీ పెట్రో అడిషన్స్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

➤ **మొత్తం పోస్టుల సంఖ్య:** 31
విభాగాలవారీ ఖాళీలు: పాలిమర్ ఆపరేషన్స్-06, యుటిలిటీస్ అండ్ ఆఫ్‌సైట్స్-02, సెంట్రల్ టెక్నికల్ సర్వీసెస్-01, ఆపరేషన్ కంట్రోల్ గ్రూప్ (ఓసీజీ)-03, ఫైర్-02, మెకానికల్ మెయింటినెన్స్-01, సివిల్-01, ఫైనాన్స్-04, మెటీరియల్స్ మేనేజ్‌మెంట్-03, ఎస్ఏపీ-03, హెచ్ఆర్-04, లీగల్-01. **ఆన్‌లైన్ దరఖాస్తు:** జనవరి 24 నుంచి ఫిబ్రవరి 10 వరకు. http://www.opalindia.in/

వాక్ఇన్ ఇంటర్వ్యూ

ఐకార్ - నార్మ్, హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఐకార్ - నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్) కింది కాంట్రాక్టు పోస్టుల భర్తీకి వాక్ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది. **పోస్టులు–ఖాళీలు:** జూనియర్ రిసెర్చ్ ఫెలో-01, యంగ్ ప్రొఫెషనల్-07
ఒప్పంద కాలపరిమితి: ఒక ఏడాది.
జీతభత్యాలు: నెలకు రూ.25,000 + హెచ్ఆర్ఏ.
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ, ఎంసీఏ, పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ ఉత్తీర్ణత.
వాక్ఇన్ తేది: ఫిబ్రవరి 6 **వేదిక:** ఐకార్-నార్మ్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 500030.
వెబ్‌సైట్: https://naarm.org.in/

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు ●

నేటి ప్రతిభ పేజీల్లో
ఏపీపీఎస్సీ, ఎస్ఐ & కానిస్టేబుల్స్ పోటీ పరీక్షార్థులకు
▮ జనరల్ స్టడీస్–జాగ్రఫీ,
టెన్త్, ఇంటర్ విద్యార్థుల కోసం..
▮ టెన్త్: సోషల్ స్టడీస్, ఇంటర్: కెమిస్ట్రీ

Test the waters.. అంటే తెలుసా?

Test the waters.. వినగానే నీటిని పరిశీలించడం అనుకున్నారా? అయితే పప్పులో కాలేసినట్టే! దానికో అర్థముంది. అదేంటో.. దాన్ని వ్యక్తీకరణల్లో ఎలా ఉపయోగించొచ్చో తెలుసుకుందామా?

MODERN ENGLISH USAGE

Srinivas: Are you going to the party that Rajaram is giving? If you are going when will you start? (రాజారాం ఇస్తున్న పార్టీకి నువ్వు వెళ్తున్నావా?)

Gopi: I am not sure if I am going. But then if I go, it is going to be a white tie affair. And right now I don't have the formal dress that is required for the party. A good number of VIPs are coming to the party, and our dress should be quite formal. Are you attending the party? (నేనింకా వెళ్లాలా వద్దా అనే నిర్ణయం తీసుకోలేదు. ఒకవేళ నేను వెళ్లినా అది లాంఛనప్రాయమే. అయినా పార్టీకి అవసరమైన ఫార్మల్ బట్టలు కూడా నా దగ్గర లేవు. చాలామంది వీఐపీలు పార్టీకి వస్తున్నారు కాబట్టి, మన దుస్తులు కూడా ఫార్మల్‌వి అయ్యుండాలి. ఇంతకీ నువ్వు వెళ్తున్నావా పార్టీకి?)



ఎం. సురేశన్

Srinivas: I am not sure either. As it is tomorrow evening itself, I don't have the formal dress to attend the party (నేనూ ఇంకా నిర్ణయించుకోలేదు. పార్టీ రేపు సాయంత్రమే. నా దగ్గర ఫార్మల్ దుస్తులేవీ లేవు).

Gopi: It is going to be a white tie affair. I am not sure if I have that kind of dress (అది చాలా ఖరీదైన బట్టలు వేసుకునే పార్టీ అవుతుంది. అలాంటి దుస్తులు నాకు లేవనుకుంటున్నా).

Srinivas: My opinion is that I had better avoid it. But I feel Rajaram might feel bad or let down if I do not attend the party (నా అభిప్రాయం ప్రకారం.. మనం ఆ పార్టీకి వెళ్లకుండా ఉండటమే మంచిది. కానీ మనం వెళ్లకపోతే రాజారాం వాడిని ముంచేసినట్లుగా భావిస్తాడేమో).

Gopi: I do feel so too. Any way I am going to buy a new suit and will attend the party (నేనూ అదే అనుకుంటున్నా. ఏదేమైనా ఓ కొత్త సూటు కొనుక్కొని పార్టీకి వెళ్లాలి అనుకుంటున్నా).

Srinivas: So will I. He is our closest friend and if we don't attend the party, he may misread our intentions. He may think badly of us. We should attend the party and test the waters (నేనూ అదే అనుకుంటున్నా. అతను చాలా సన్నిహితమైన మిత్రుడు. మనం వెళ్లకపోతే అతను మనల్ని తప్పుగా అర్థం చేసుకోవచ్చు. మనం ఆ పార్టీకి వెళ్లి, అక్కడ మిగతావాళ్లు ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలి).

Gopi: OK, then. Let us attend the party (సరే అయితే. మనం ఆ పార్టీకి వెళదాం).

Look at the following sentences from the conversation



1. But then if I go it is going to be a white tie affair

A white tie affair = A context requiring a formal dress (లాంఛనప్రాయమైన బట్టలు వేసుకునే సందర్భం).

Dhanaraj: Are you attending the meeting tomorrow of the board of directors of the company? (రేపు జరిగే కంపెనీ డైరెక్టర్ల సమావేశానికి నువ్వు వెళ్తున్నావా?)

Bhagavan: I am not sure if I am attending the board meeting. It is going to be a white tie affair. I am afraid I cannot go in that kind of formal clothes. I had better avoid it (వెళ్లాలా వద్దా అనేది నేనింకా నిర్ణయించుకోలేదు. అది చాలా అట్టహాసంగా బట్టలు వేసుకుని వచ్చే వాళ్ల సమావేశం అవుతుంది. నాకలాంటి బట్టలు వేసుకుని వెళ్లాలనే ఉద్దేశం లేదు. నేను ఆ సమావేశానికి వెళ్లను).

2. We should attend the party and test the waters

Test the waters = Find out what people's opinions of something are before you ask them to do something (మనం ఇంకొకరిని ఏదైనా చేయమని అడిగేముందు వాళ్ల అభిప్రాయాలను తెలుసుకోవడం).

Naresh: Are you attending the meeting that Chandrasekhar is going to organize? (చంద్రశేఖర్ నిర్వహించనున్న సమావేశానికి నువ్వు వెళ్తున్నావా?)

Jagadeesh: I think I am. If we don't go he may misunderstand us. I am going there to test the waters too (వెళ్లాలనే అనుకుంటున్నా. మనం వెళ్లకపోతే అతను మనల్ని అపార్థం చేసుకోవచ్చు. అక్కడికి వెళ్లి వాళ్ల అభిప్రాయాలను తెలుసుకుంటా. వాళ్లనేమైనా చేయమనే ముందు). ●

కాంగ్రెస్ ప్రియబాంధవి



నెహ్రూ-గాంధీ కుటుంబం నుంచి కీలక బాధ్యతల్లో 11వ వ్యక్తి

నెహ్రూ–గాంధీ కుటుంబం నుంచి మరో వ్యక్తి భారత రాజకీయ రంగంలోకి అడుగిడారు. ఈ కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన 11వ వ్యక్తిగా నెహ్రూ మునిమనవరాలు.... ఇందిరాగాంధీ మనవరాలు...రాజీవ్‌గాంధీ కుమార్తె....రాహుల్‌గాంధీ చెల్లెలు అయిన ప్రియాంకాగాంధీ ఇప్పుడు నేరుగా క్రియాశీలక రాజకీయాల్లోకి అడుగుపెట్టారు.కాంగ్రెస్ ప్రధానకార్యదర్శిగా ప్రియాంక బుధవారం నియమితులయ్యారు. కాంగ్రెస్‌పార్టీలో అధికారికంగా ఆమె ఓ పదవిని పొందడం ఇదే ప్రథమం. అంతకుముందామె అమ్మ సోనియా, సోదరుడు రాహుల్‌గాంధీలు నిర్వహించిన ఎన్నో బహిరంగసభల్లో పాల్గొన్నప్పటికీ....పార్టీ పరంగా అధికారికంగా బాధ్యతలను చేపట్టడం ఇదే మొదటిసారి.

- భారత రాజకీయాలతో నెహ్రూ-గాంధీ కుటుంబం పెనవేసుకున్న బంధం ఈనాటిది కాదు. బ్రిటిష్‌పాలకులతో పోరులో మోతీలాల్‌నెహ్రూ పాల్గొన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే ఆయన కాంగ్రెస్‌పార్టీలో సభ్యులు. తొలుత 1919-1920....ఆ తర్వాత 1928-29 సంవత్సరాల్లో మోతీలాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించారు.
- ఆయన కుమారుడు జవహర్‌లాల్ నెహ్రూ 1912లో భారత రాజకీయాల్లోకి అడుగిడారు. 1923లో జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానకార్యదర్శిగా కాంగ్రెస్‌పార్టీ పగ్గాలు అందుకున్నారు. ఆ తర్వాత ఆయన పార్టీలో పలు బాధ్యతలు నిర్వర్తించారు. స్వాతంత్ర్య పోరాట యోధుల్లో ఒకరిగా ఎదిగారు. 1947లో స్వాతంత్ర్యం సిద్ధించగానే భారతావనికి తొలిప్రధాని అయ్యారు.
- జవహర్‌లాల్ కుమార్తె ఇందిర ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే రాజకీయరంగప్రవేశం చేశారు. 1958లో కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ పార్లమెంటరీ బోర్డు సభ్యురాలిగా నియమితులయ్యారు.
- 1964లో తండ్రి జవహర్‌లాల్ మరణానంతరం కూడా ఆమె రాజకీయాల్లో తనదైన స్థానాన్ని సంపాదించారు. 1966లో భారత ప్రధాని అయ్యారు. ఎమర్జెన్సీ విధింపుతో విమర్శలకు గురయ్యారు. 1977లో పరాజయం పాలైనప్పటికీ....1980లో తిరిగి భారత ప్రధాని పదవిని అధిష్టించారు. అధికారంలో ఉండగానే 1984లో హత్యకు గురయ్యారు.
- అమ్మ ఇందిర అధికారంలో ఉండగా ఒక్కవెలుగువెలిగి... కాంగ్రెస్ సారథ్య బాధ్యతలు చేపడతారనుకున్న ఆమె కుమారుడు 1980లో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించాడు.
- ఇక, 1984లో ఇందిర హత్యానంతరం రెండో కుమారుడు రాజీవ్‌గాంధీ ప్రధాని బాధ్యతలు చేపట్టారు.
- 1989లో కాంగ్రెస్ పరాజయం పాలైంది. రెండేళ్ల తర్వాత అంటే...1991లో రాజీవ్‌గాంధీ హత్యకు గురయ్యారు.
- రాజీవ్ మరణంతో....1997లో అయిష్టంగానే ఆయన భార్య సోనియాగాంధీ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. కాంగ్రెస్‌పార్టీ సభ్యురాలయ్యారు. 1998లో పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు.
- గత ఏడాది డిసెంబరులో రాజీవ్-సోనియాల కుమారుడు రాహుల్‌గాంధీ పార్టీ సారథ్యబాధ్యతలు స్వీకరించారు.
- తాజాగా ఈ కుటుంబం నుంచే ప్రియాంకా గాంధీ ఇప్పుడు క్రియాశీలక రాజకీయాల్లోకి అడుగిడారు.



తల్లి సోనియాతో ప్రియాంకా గాంధీ



నీ తోడునై.. నీడనై ఉంటా..

ప్రియాంకకు అభినందనలు. అత్యుత్తమ సేవలందించు. నీ జీవితంలోని ప్రతిదశలోనూ నేను తోడుంటాను.

– రాబర్ట్ వాద్రా

అమెరికా వెళ్లి చెల్లిని ఒప్పించిన రాహుల్

- ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశంపై గతవారమే నిర్ణయం
- వచ్చే నెల్లో భారత్‌కు రానున్న ప్రియాంక

ప్రత్యక్ష రాజకీయాల్లోకి తన ప్రవేశ ముహూర్తంపై ప్రియాంకాగాంధీ గతవారమే నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అమెరికా వెళ్లి మరీ తన చెల్లిని ఈ విషయంలో ఒప్పించారు. పార్టీ అంతర్గత వర్గాల సమాచారం ప్రకారం.. ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించాలని ప్రియాంక దాదాపు రెండేళ్ల నుంచి యోచిస్తున్నారు. ఎప్పట్లోగా చేరాలనే అంశంపై మాత్రం కాలపరిమితి విధించుకోలేదు. ఇటీవల ఉత్తర్ ప్రదేశ్‌లో మాయావతి నేతృత్వంలోని బహుజన్ సమాజ్ పార్టీ, అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పారీ పొత్తు కుదుర్చుకొని



సోదరుడు రాహుల్‌తో...

కాంగ్రెస్‌ను దూరం పెట్టడంతో.. ప్రియాంక ప్రవేశానికి ఇదే మంచి తరుణమని రాహుల్ భావించారు. గతవారం ఆయన దుబాయ్ నుంచి నేరుగా న్యూయార్క్ వెళ్లారు. అక్కడ చెల్లితో మాట్లాడారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చేలా ఆమెను ఒప్పించారు. తదనుగుణంగా ప్రస్తుతం పార్టీలో కీలక పదవి కట్టబెట్టారు. ఫిబ్రవరి తొలివారంలో ప్రియాంక భారత్‌కు తిరిగి రానున్నారు.

యూపీలో కనీసం 30 సీట్లు సాధిస్తాం

ఎస్పీ, బీఎస్పీలతో కాంగ్రెస్ పొత్తు కుదిరి ఉంటే.. ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రియాంక ప్రవేశం వేరే సమయంలో, మరోలా ఉండేదని కాంగ్రెస్ కీలక నేత ఒకరు అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర్ ప్రదేశ్‌లో తాము సాధించబోయే స్థానాలు 10 లోపే ఉంటాయని తొలుత భావించినట్లు కాంగ్రెస్ అంతర్గత వర్గాలు తెలిపాయి. ప్రియాంక రాకతో పరిస్థితులు పూర్తిగా మారిపోయే అవకాశముందని పేర్కొన్నాయి. తాము రాష్ట్రంలో మొత్తం 80 స్థానాల్లోనూ పోటీ చేసి కనీసం 30 సీట్లు గెల్చుకుంటామని విశ్వాసం వ్యక్తం చేశాయి.

ఎవరేమన్నారు!

ప్రియాంక గాంధీ వాద్రాకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించడాన్ని భాజపా విమర్శించింది. ఆ పార్టీలో కుటుంబ పాలనకు ఇది నిదర్శనమంటూ ఎద్దేవా చేసింది. ఆర్జేడీ, శివసేన, పీడీపీ తదితర పార్టీల నేతలు మాత్రం ఈ పరిణామాన్ని స్వాగతించారు.

చిరకాలంగా ఎదురుచూస్తున్న నిర్ణయం



భారత రాజకీయాల్లోకి ప్రియాంక రావడం చిరకాలంగా ఎదురుచూస్తున్న పరిణామం. చివరకు ఆమె రంగంలోకి దిగేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఆమెకు అభినందనలు, శుభాకాంక్షలు. పార్టీలో ఆమె పాత్ర, స్థానం తదితర అంశాలపై ఇక ప్రజలు చర్చిస్తారు.

– ప్రశాంత్ కిశోర్, జేడీయూ ఉపాధ్యక్షుడు

ఆలస్యమైంది..

ప్రియాంక నియామకం బాగా ఆలస్యమై పోయింది. కాంగ్రెస్ భవిష్యత్తును మార్చేందుకు ఇది ఏమాత్రం దోహదపడదు. యూపీలో ఎస్పీ-బీఎస్పీ కూటమి కాంగ్రెస్‌కు కొద్దిచోటు మిగిల్చింది. తృణమూల్ సహా మిగతా భాజపా వ్యతిరేక పార్టీలన్నీ రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని తిరస్కరించాయి. ఎన్నికల ముందు ప్రియాంక నియామకం కాంగ్రెస్ ఆఖరి వ్యూహం."

– కేసీ త్యాగి, జేడీయూ అధికార ప్రతినిధి

కాంగ్రెస్‌కు ప్రయోజనకరం

రాజకీయాల్లోకి ప్రియాంకకు స్వాగతం. . శుభాకాంక్షలు. గాంధీ నెహ్రూ కుటుంబం ఆకర్షణతో పాటు ఆమె గొప్ప వ్యక్తిత్వం కాంగ్రెస్ పార్టీకి దోహదపడుతుంది. 2019 ఎన్నికల సంగ్రామంలో ఆమె ప్రత్యేకంగా నిలుస్తారు.


– మెహబూబా ముఫ్తీ పీడీపీ అధినాయకురాలు

ప్రియాంకలో ఇందిరాగాంధీని చూస్తారు..

ప్రియాంక రాజకీయ ప్రవేశం కాంగ్రెస్‌కు ప్రయోజనకరం. ఆమెకు తన నాయనమ్మ ఇందిరాగాంధీ లక్షణాలున్నాయి. ప్రియాంక తన మంచి వ్యక్తిత్వంతో ఓటర్ల మెప్పును పొందగలరు. ఆమెలో ప్రజలు ఇందిరాగాంధీని చూస్తారు.

– మనీషాకాయందే, శివసేన అధికార ప్రతినిధి

యువతలో నవ్యోత్సాహం



ప్రియాంక నియామకాన్ని స్వాగతిస్తున్నాం. ఇది యువతలో నవ్యోత్సాహాన్ని నింపడమే కాకుండా 50 శాతం మహిళలను రాజకీయాల్లోకి ప్రోత్సహిస్తుంది.

– తేజస్వి యాదవ్, ఆర్జేడీ నేత

వారికి కుటుంబమే పార్టీ



భాజపాను ప్రజాస్వామ్య విలువలు నడిపిస్తుంటే..మిగిలిన పార్టీలను కుటుంబాలు నడిపిస్తున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ప్రియాంక గాంధీ వాద్రా రాజకీయ రంగ ప్రవేశం చేయడాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయన ఈ వ్యాఖ్య చేశారు. బుధవారం మహారాష్ట్రకు చెందిన పోలింగ్ బూత్ స్థాయి పార్టీ కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ "చాలామందికి కుటుంబమే పార్టీ. కానీ భాజపాకు పార్టీయే కుటుంబం" అని అన్నారు. "పార్టీ కార్యకర్తల ఆలోచనలకు అనుగుణంగానే భాజపాలో నిర్ణయాలు ఉంటాయి. ఒక వ్యక్తి లేదా ఒక కుటుంబం కోరికల మేరకు నిర్ణయాలు ఉండవు" అని తెలిపారు. కాంగ్రెస్ 'పరివార్‌వాది' పార్టీ అని అభివర్ణించారు. కాంగ్రెస్ ముక్త్ భారత్ అన్న తన మాటలకు అర్థం కాంగ్రెస్ సంస్కృతిని తొలగించడమేనని తెలిపారు. ఆ పార్టీ చెడుతో నిండిపోయిందని అన్నారు. ప్రజాస్వామ్యమే భాజపాను నడిపిస్తోందని, అందుకే దేశ ప్రజలు తమ పార్టీతో సన్నిహితంగా ఉంటారని చెప్పారు.

– ప్రధాని నరేంద్ర మోదీ

వారసత్వ రాజకీయాలు..

కుటుంబం ప్రాతిపదికన జరిపిన నియామకమిది. వారసత్వ రాజకీయాలు మరో రెండడుగులు ముందుకు వెళ్లాయి. ఎంతోమంది పార్టీ కార్యకర్తలున్నప్పటికీ ప్రియాంకను నియమించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ ఓ కుటుంబానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తేటతెల్లమవుతోంది.

– నిర్మలా సీతారామన్, రక్షణ మంత్రి

యూపీలో కాంగ్రెస్‌కు మేలు

ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ప్రత్యేక ప్రయోజనాలు చేకూరుతాయి. అయితే ఎస్పీ-బీఎస్పీ కూటమిపై పెద్ద ప్రభావం ఉండబోదు. ఆ పార్టీలకు నిర్దిష్ట ఓటుబ్యాంకు ఉంది. కాంగ్రెస్ తెలివిగా ప్రియాంకను నియమించింది.

– నవాబ్ మాలిక్, ఎన్సీపీ అధికార ప్రతినిధి

ఓ కుటుంబానికే రిజర్వేషన్

ప్రధాని మోదీ పేదల కోసం ఆలోచిస్తూ ఇటీవల వారికి 10 శాతం కోటాను కల్పిస్తే.. కాంగ్రెస్‌లో మాత్రం ఒకే ఒక్క కుటుంబానికి రిజర్వేషన్ ఉంటుంది.

– పీయూష్ గోయల్, కేంద్ర మంత్రి

ప్రియాంక కార్యసాధకురాలు

- సోదరితో కలిసి పనిచేయడం సంతోషంగా ఉంది
- ఉత్తరప్రదేశ్ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చబోతున్నాం: రాహుల్

ఈనాడు, దిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో పూర్తి సత్తాతో పోరాడటానికే యువ నాయకులైన ప్రియాంక, జ్యోతిరాదిత్య సింధియాలకు బాధ్యతలు అప్పగించినట్లు ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ వెల్లడించారు. వారిద్దరూ శక్తిమంతమైన నాయకులేనన్నారు. తన సోదరి చాలా సమర్థమైన కార్యసాధకురాలని కొనియాడారు. ఆమెతో కలిసి పనిచేయడం వ్యక్తిగతంగా సంతోషంగా ఉందన్నారు. ఆయన బుధవారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయం వద్ద విలేకర్లతో మాట్లాడారు. బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి, సమాజ్‌వాదీ అధ్యక్షుడు అఖిలేష్‌పట్ల తనకు గౌరవం ఉందని, వారు ఇప్పటికీ తనతో మాట్లాడాలనుకుంటే మాట్లాడొచ్చని వ్యాఖ్యానించారు. 'కాంగ్రెస్‌పార్టీ ఎప్పుడూ సిద్ధాంతపరమైన పోరాటం చేస్తూ వస్తోంది. పోరాటంలో వెనకడుగు ప్రసక్తే ఉండదు. మొన్న గుజరాత్, ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో కూడా అలాగే పోరాడాం. ప్రియాంక, జ్యోతిరాదిత్యల ద్వారా ఉత్తరప్రదేశ్ రాజకీయ ముఖచిత్రం మార్చబోతున్నాం' అన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడమనేది ప్రియాంక మీద ఆధారపడి ఉంటుందన్నారు. మాయావతి, అఖిలేష్‌ల కూటమికి ఏం చెబుతారు? అన్న ప్రశ్నకు బదులిస్తూ "వారిద్దరినీ నేను పూర్తిగా గౌరవిస్తాను. మా అందరి ఆలోచన ధోరణిలో సారూప్యత ఉంది. వారు భాజపాను ఓడించడానికి కూటమి ఏర్పాటు చేసుకున్నారు. మాకు వారిపట్ల ప్రేమతప్పితే ఎలాంటి శత్రుభావం లేదు" అని చెప్పారు.



ప్రియాంకను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై బుధవారం గాంధీభవన్‌లో హర్షం వ్యక్తం చేస్తూ నృత్యాలు చేస్తున్న వీహెచ్, మర్రి శశిధర్‌రెడ్డి సహా ఆ పార్టీ కార్యకర్తలు

గాంధీభవన్‌లో సంబురాలు

హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రియాంకా గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టడం పట్ల రాష్ట్ర కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పార్టీ శ్రేణులు గాంధీభవన్‌లో సంబురాలు జరుపుకున్నాయి. కార్యకర్తలు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఏఐసీసీ కార్యదర్శి వి.హన్మంతరావు, మర్రి శశిధర్‌రెడ్డిలు కార్యకర్తలతో కలిసి నృత్యం చేశారు. ప్రియాంకా గాంధీ క్రియాశీల, ప్రత్యక్ష రాజకీయాలకు రావడం శుభపరిణామమని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భాజపా ఓటమే లక్ష్యం

భాజపాను ఓడించడమే అందరి లక్ష్యమని, వీలున్న చోటల్లా మాయావతి, అఖిలేష్‌లకు సహకారం అందిస్తామని రాహుల్ చెప్పారు. ఇదే సమయంలో కాంగ్రెస్‌కు స్థానం కల్పించుకోవడం తమ బాధ్యత కాబట్టి ఆ దిశగా పెద్ద నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రియాంక, జ్యోతిరాదిత్యలను కేవలం రెండు నెలల కోసం ఉత్తరప్రదేశ్‌కు పంపడంలేదని, పేదలు, బలహీన వర్గాలను కలుపుకొని ముందుకెళ్లాలన్న కాంగ్రెస్ సిద్ధాంతాన్ని మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకెళ్లే బృహత్తర బాధ్యతను వారికి అప్పగించామన్నారు. రెండ్రోజుల పర్యటన నిమిత్తం సొంత నియోజకవర్గమైన అమేథీకి రాహుల్ బుధవారం చేరుకున్నారు.

ప్రియాంక పరిచయం



- పుట్టిన తేదీ: 12-01-1972
- వయస్సు: 47 ఏళ్లు
- తండ్రి: రాజీవ్‌గాంధీ
- తల్లి: సోనియాగాంధీ
- తాత: ఫిరోజ్ గాంధీ(తండ్రి తరపు)
- నానమ్మ: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ
- విద్యాభ్యాసం: మోడ్రన్ స్కూల్, దిల్లీ (ప్రస్తుతం జీసస్ అండ్ మేరీ స్కూల్)
- డిగ్రీ: బి.ఏ. (సైకాలజీ) జీసస్ అండ్ మేరీ కాలేజీ, దిల్లీ
- మాస్టర్స్ డిగ్రీ: ఎం.ఏ. (బౌద్ధం)
- పెళ్లిరోజు: 18-02-1997
- భర్త: రాబర్ట్ వాద్రా (దిల్లీకి చెందిన వ్యాపారవేత్త)
- కుమారుడు: రైహన్ వాద్రా, కుమార్తె: మిరాయ వాద్రా
- మతం: బౌద్ధం (విపాసన)
- రాజకీయ అనుభవం: తల్లి సోనియా, అన్న రాహుల్ నియోజకవర్గాలైన రాయ్‌బరేలీ, అమేథీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించడం. అడపాదడపా కాంగ్రెస్ సమావేశాలకు హాజరుకావడం.
- తాజా బాధ్యత: ఉత్తర్ ప్రదేశ్ తూర్పు ప్రాంత పార్టీ వ్యవహారాల ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి
- ఎప్పటి నుంచి: ఫిబ్రవరి మొదటి వారంలో బాధ్యతలు చేపట్టే అవకాశం.

పునరుత్తేజమే లక్ష్యం

- సార్వత్రిక సమరమే ధ్యేయంగా ప్రియాంకకు బాధ్యతలు
- యూపీ, బిహార్‌లపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి

ఈనాడు, దిల్లీ: పార్టీ పరమైన బాధ్యతల్లోకి ప్రియాంక గాంధీని తీసుకురావడం వెనుక కాంగ్రెస్‌లో భారీ వ్యూహమే కనిపిస్తోంది. అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తర్‌ప్రదేశ్‌లో 80, బిహార్‌లో 40... వెరశి 120 లోక్‌సభ స్థానాలపై ఆ పార్టీ గట్టిగా దృష్టి సారించిందన్న విషయాన్ని ఈ పరిణామం చెప్పకనే చెబుతోంది. కరడుగట్టిన హిందుత్వవాదిగా ముద్రపడిన యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు గట్టి పట్టున్న తూర్పు యూపీలో భాజపా ఆధిపత్యానికి గండి కొట్టడం పార్టీ ప్రధానోద్దేశంగా తెలుస్తోంది. ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో భాజపా నుంచి అధికారాన్ని దక్కించుకోగలిగిన ఉత్సాహంతో ఇప్పుడు యూపీ, బిహార్‌లలోనూ విజయం సాధించడంపై కాంగ్రెస్ ఆశాభావంతో ఉంది. యూపీలో ఎస్పీ-బీఎస్పీలు చేతులు కలిపి కాంగ్రెస్‌ను వదిలేసిన రీతిలోనే బిహార్‌లో ఆర్జేడీ కూడా చేసేలా ఉందనే సంకేతాలు ఇప్పటికే వెలువడ్డాయి. దీంతో రెండు చోట్లా విజయావకాశాలను మెరుగుపరచుకునే లక్ష్యంతో ప్రియాంకను రంగంలో దింపినట్లు కనిపిస్తోంది.

మాటల్లో మృదుత్వం... చేతల్లో దృఢత్వం

దిల్లీలో అధికారాన్ని చేపట్టాలంటే యూపీలో నెగ్గాలన్న రాజకీయ సూత్రాన్ని దృష్టిలో పెట్టుకుని జనాకర్షణ ఉన్న ఆమెకు కీలకమైన బాధ్యతలు కట్టబెట్టారు. అటు భాజపాను, ఇటు ఎస్పీ-బీఎస్పీని దెబ్బ కొట్టాలనే ఎత్తుగడ దీని వెనుక ఉందని స్వతంత్ర విశ్లేషకుడొకరు చెప్పారు. యూపీలో ప్రధానంగా ఇంతవరకు ప్రియాంక తన తల్లి, సోదరుల నియోజకవర్గాల వరకే పరిమితమవుతూ వస్తున్నారు. 2017లో యూపీ ఎన్నికల్లో కాంగ్రెస్-ఎస్పీ మధ్య సీట్ల సర్దుబాటు కుదరకపోవడంతో అప్పుడు మాత్రం ఆమె కలగజేసుకుని నేరుగా ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌తో మాట్లాడారు. ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్ ముఖ్యమంత్రుల ఎంపిక నిమిత్తం దిల్లీలోని రాహుల్‌గాంధీ నివాసంలో జరిగిన మంతనాల్లోనూ ఆమె పాలు పంచుకున్నారు. మృదువుగా మాట్లాడుతున్నట్లు కనిపించినా అనుకున్నది చెప్పడంలో దృఢంగా ఉంటూ జనాన్ని ఆకట్టుకోవడంలో ఆమెది ప్రత్యేక శైలి. ప్రజలతో అనుసంధానమయ్యే చొరవ ఉంది. 1999లో తొలిసారిగా ఆమె తమ కుటుంబ మిత్రుడైన సతీష్‌శర్మ తరఫున ప్రచారంలో పాల్గొన్నారు. తమకు బంధువైన ప్రత్యర్థి అరుణ్ నెహ్రూపై తొలి సమావేశంలోనే ఆమె పదునైన వ్యాఖ్యలు చేశారు. ఆమె జోక్యంతోనే ఆ ఎన్నికల్లో అరుణ్ ఏకంగా నాలుగో స్థానంలోకి వెళ్లిపోయారని పార్టీ వర్గాలు చెబుతుంటాయి. 'ఎగైనెస్ట్ ఔట్రేజ్' పేరుతో ప్రస్తుతం ఆమె ఒక పుస్తకం రాస్తున్నారు.

ఆసక్తి లేదంటూనే...

గతంలో అనేక పర్యాయాలు ఉత్తర్‌ప్రదేశ్‌లో సోనియా, రాహుల్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించిన ప్రియాంక. .రాజకీయాలపై తనకు ఎన్నడూ ఆసక్తి లేదని పలు సందర్భాల్లో మీడియాకు చెబుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో గతంలో ఆమె చేసిన కొన్ని వ్యాఖ్యలు....

- రాజకీయాల కంటే నన్ను ఆకర్షించేది ప్రజలే. రాజకీయాల్లో లేకుండానే వారి కోసం పని చేస్తాను.
- రాజకీయాలపై నాకు ఆసక్తి లేదని ఇప్పటికి వెయ్యిసార్లు చెప్పాను. ఇప్పుడు మళ్లీ అదే విషయం చెబుతున్నా. నా తల్లి తరపున ప్రచారం నిర్వహించడానికే ఇక్కడ ఉన్నాను. ఈ విషయం మీడియాకు ప్రత్యేకంగా కనిపించవచ్చు. అయితే నేను నా తల్లి కోసం పనిచేస్తున్నానన్న విషయంలో నాకు స్పష్టత ఉంది.

సెన్సెక్స్ ▼ 336 **36108**

నిఫ్టీ ▼ 91 **10832**

డోజోన్స్ 24468 ▲ 63

నాస్‌డాక్ 6991 ▼ 29

అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి 71.33 ▲ 11 పైసలు (ఒక అమెరికా డాలరుకు)


ముడి చమురు 60.66 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)



ఘనం (+) నిఫ్టీ	23న	మార్పు%	గ్రహణం (-) నిఫ్టీ	23న	మార్పు%
SUN PHARMA	431.00	2.88	ITC	277.30	-4.30
YES BANK	197.25	2.63	GRASIM	782.15	-2.76
ZEE ENTERTAINMENT	432.85	1.79	INDIABULLS HSG	778.70	-2.34
TATA STEEL	464.60	1.76	TITAN COMPANY	962.15	-2.09
WIPRO	351.55	1.46	INFOSYS	731.65	-1.84
JSW STEEL	280.90	1.04	POWER GRID CORP.	186.30	-1.79
HUL	1767.20	0.97	M & M	695.85	-1.79


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	64.78	75.11	బ్రహెయిన్ దీనార్	175.32	200.59
పౌండ్ స్టెర్లింగ్	83.94	97.33	కువైట్ దీనార్	194.32	241.90
యూరో	73.64	85.40	ఒమన్ రియాల్	171.56	196.52
జపనీస్ యెన్/100	59.04	68.47	సౌదీ రియాల్	17.22	20.41
ఆస్ట్రేలియా డాలరు	46.23	53.49	యూఏఈ దిర్హమ్	17.63	20.60
సింగపూర్ డాలరు	47.66	56.46	మలేషియా రింగిట్	15.34	18.87
థాయ్ బాత్/100	204.16	244.25	చైనీస్ యువాన్	7.41	12.04

బుధవారం నిఫ్టీ కదలికలు



టాటా ఎస్‌యూవీ హారియర్

ప్రారంభ ధర రూ.12.69 లక్షలు

ముంబయి: టాటా మోటార్స్ ప్రీమియం మధ్య శ్రేణి స్పోర్ట్స్ వినియోగ వాహనం (ఎస్‌యూవీ) హారియర్‌ను విపణిలోకి విడుదల చేసింది. నాలుగు వేరియంట్లు ఎక్స్ఈ, ఎక్స్ఎం, ఎక్స్‌టీ, ఎక్స్‌జడ్‌లలో ఇది లభించనుంది. వీటి ధరలు వరుసగా రూ.12.69 లక్షలు, రూ.13.75 లక్షలు, రూ.14.95 లక్షలు, రూ.16.25 లక్షలు (ఎక్స్-షోరూమ్ ముంబయి)గా ఉన్నాయి. ప్రస్తుతానికి ఇవి డీజిల్ వేరియంట్‌లోనే లభించనున్నాయి. కంపెనీ పుణె తయారీ కేంద్రం నుంచి వీటిని ఉత్పత్తి చేయనున్నారు. జీప్ కంపాస్, హ్యుందాయ్ క్రెటా, హ్యుందాయ్ టక్సన్, మహీంద్రా ఎక్స్‌యూవీ 500 వంటి మోడళ్లతో టాటా హారియర్ పోటీపడనుంది. 'హారియర్ విడుదలతో టాటా మోటార్స్ ప్రీమియం మధ్య శ్రేణి ఎస్‌యూవీ విభాగంలో అడుగుపెట్టింది. మార్కెట్‌లో ఇది గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుంద'ని టాటా మోటార్స్ సీఈఓ, ఎండీ గుంటెర్ బుషెక్ పేర్కొన్నారు.



ముంబయిలో విడుదల చేసిన హారియర్‌తో టాటా మోటార్స్ సీఈఓ, ఎండీ గుంటెర్ బుషెక్

తెలుగు రాష్ట్రాల్లోకి నిస్సాన్ కిక్స్

ఈనాడు, హైదరాబాద్: నిస్సాన్ స్పోర్ట్స్ వినియోగ వాహనం (ఎస్‌యూవీ) కిక్స్‌ను తెలుగు రాష్ట్రాల్లో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా నిస్సాన్ డీలర్ నెట్‌వర్క్ డెవలప్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ శహానే మాట్లాడుతూ.. ఈ ఏడాది మరిన్ని కొత్త కార్లను విపణిలోకి తీసుకొస్తామని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కిక్స్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. డీజిల్‌లో నాలుగు, పెట్రోలులో రెండు వేరియంట్‌లు, మొత్తం 11 రంగుల్లో అందుబాటులో ఉన్నట్లు వివరించారు. పరిచయ ధరగా పెట్రోలు వేరియంట్‌ల ధర రూ.9,50,000 రూ.10,95,000లుగా ఉన్నాయి. డీజిల్ వేరియంట్ల ధర రూ.10,85,000 నుంచి రూ.14,65,000ల వరకూ (షోరూం ధర) ఉంది. మొదటి 10,000 మంది కొనుగోలుదార్లకు మొదటి మూడేళ్ల వారంటీ, మెయింటెన్స్ ప్యాకేజీ (30,000 కిలోమీటర్ల వరకూ), 24 గంటల రోడ్‌సైడ్ అసిస్టెన్స్ ఉచితంగా అందిస్తున్నామన్నారు.



నిస్సాన్ కిక్స్‌తో అతుల్ శహానే. చిత్రంలో వైబ్రంట్ నిస్సాన్ ఎండీ సిరాజ్ బాబుఖాన్, లక్ష్మీ నిస్సాన్ ఎండీ కంభంపాటి జయరాం

కొత్త వ్యాగన్‌ఆర్

దిల్లీ: మారుతీ సుజుకీ హ్యాచ్‌బ్యాక్ మోడల్ వ్యాగన్‌ఆర్‌లో కొత్త వెర్షన్‌ను విపణిలోకి ప్రవేశపెట్టింది. దీని ధరల శ్రేణి రూ.4.19- 5.69 లక్షలు (ఎక్స్-షోరూమ్ దిల్లీ)గా నిర్ణయించారు. కొత్త వ్యాగన్‌ఆర్ 1.2 లీటర్ పెట్రోల్ ఇంజిన్, 1 లీటర్ పవర్‌ట్రైన్, ఆటోమేటిక్ గేర్ షిఫ్ట్ వేరియంట్లలో లభించనుంది. 1 లీటర్ మాన్యువల్ వెర్షన్‌ల ధర రూ.4.19- 4.69 లక్షలుగా, ఆటోమేటిక్ గేర్ వేరియంట్ ధర రూ.5.16 లక్షలుగా ఉన్నాయి. ఇక 1.2 లీటర్ వేరియంట్ల ధర రూ.4.89- 5.69 లక్షలుగా నిర్ణయించారు. కొత్త వ్యాగన్‌ఆర్ ఒక్క కుటుంబాలనే కాకుండా యువ కొనుగోలుదార్లను కూడా మెప్పిస్తుందని మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) ఎండీ, సీఈఓ కెనిచి ఆయుకవా పేర్కొన్నారు. సుజుకీ అయిదో తరం హార్టెక్ట్ ప్లాట్‌ఫామ్‌పై కొత్త వ్యాగన్‌ఆర్‌ను రూపొందించారు.



దిల్లీలో విడుదల చేసిన కొత్త వ్యాగన్‌ఆర్‌తో ఎంఎస్ఐ సీఈఓ, ఎండీ కెనిచి ఆయుకవా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్ఎస్ కల్సీ

ధరల శ్రేణి రూ.4.19-5.69 లక్షలు

ఆర్‌కామ్ నష్టం రూ.341 కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) ఏకీకృత ప్రాతిపదికన రూ.341 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.206 కోట్ల నికర నష్టాన్ని చవిచూసింది. వడ్డీ, విదేశీ మారక ప్రభావం వంటి వాటిని నష్టాల్లో కలపలేదు. ఈ రెండింటిని కలిపితే నష్టం మరో రూ.617 కోట్లు అధికమవుతుందని కంపెనీ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో పేర్కొంది. రిలయన్స్ రియాల్టీలో కంపెనీ పెట్టిన పెట్టుబడులను సైతం కంపెనీ మినహాయించింది. ఆర్‌కామ్ విదేశీ అనుబంధ సంస్థ జీసీఎక్స్ ప్రస్తుత అప్పులు సైతం 324 మిలియన్ డాలర్లు మేర పెరిగాయి. సమీక్షిస్తున్న త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.1083 కోట్లకు తగ్గింది.

ఐటీసీ లాభం రూ.3,209 కోట్లు

దిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఐటీసీ సంస్థ స్టాండలోన్ ప్రాతిపదికన రూ.3,209.07 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో సంస్థ ఆర్జించిన నికర లాభం రూ.3,090 కోట్లతో పోలిస్తే ఇది 3.84 శాతం అధికం. విక్రయాల ద్వారా వచ్చిన స్థూల ఆదాయం రూ.9,852.74 కోట్ల నుంచి 15.09 శాతం పెరిగి రూ.11,340.15 కోట్లకు చేరింది. ప్రధానంగా ఎఫ్ఎంసీజీ, ఎఫ్ఎంసీజీ-ఇతర, వ్యవసాయ ఉత్పత్తులు, పేపర్ బోర్డులు, కాగితం, ప్యాకేజింగ్ విభాగాల్లో వృద్ధితో ఆదాయం పెరిగినట్లు సంస్థ ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది. రూ.412.90 కోట్ల అసాధారణ ఆదాయం కూడా మూడో త్రైమాసికంలో సంస్థకు లభించింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు తమిళనాడు ప్రవేశ పన్ను (ఎంట్రీ ట్యాక్స్) రూపంలో చెల్లించిన మొత్తం తిరిగొచ్చింది. మొత్తం



వ్యయాలు రూ.6,377.90 కోట్ల నుంచి 16.75 శాతం పెరిగి రూ.7,446.46 కోట్లకు చేరాయి.

విభాగాల వారీ ఆదాయాలు ఇలా..

- ✦ ఎఫ్ఎంసీజీ వ్యాపార విభాగ ఆదాయం రూ.7,500.97 కోట్ల నుంచి 10.31 శాతం పెరిగి, రూ.8,274.36 కోట్లకు చేరింది.
- ✦ సిగరెట్ల వ్యాపార విభాగ ఆదాయం 9.59 శాతం వృద్ధి చెంది రూ.5,073.38 కోట్లకు చేరింది.
- ✦ ఎఫ్ఎంసీజీ-ఇతర వ్యాపార విభాగ ఆదాయం రూ.2,871.78 కోట్ల నుంచి 11.46 శాతం పెరిగి రూ.3,200.98 కోట్లకు చేరింది.
- ✦ హోటళ్ల వ్యాపార విభాగ ఆదాయం రూ.404.44 కోట్ల నుంచి 11.72 శాతం పెరిగి రూ.451.86 కోట్లకు చేరింది.
- ✦ వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపార విభాగ ఆదాయం 1,530.86 కోట్ల నుంచి 25.72 శాతం పెరిగి రూ.1,924.61 కోట్లకు చేరింది.
- ✦ పేపర్ బోర్డులు, కాగితం, ప్యాకేజింగ్ వ్యాపార విభాగ ఆదాయం రూ.1,279.60 కోట్ల నుంచి 20.54 శాతం పెరిగి రూ.1,542.51 కోట్లకు చేరింది.

షేరు 4.16% తగ్గి రూ.277.70 వద్ద ముగిసింది.

ఇండిగో లాభంలో 75% క్షీణత

దిల్లీ: ఇండిగో మాతృ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ మూడో త్రైమాసికంలోనూ డీలా పడింది. అధిక ముడి చమురు ధరలు, గట్టి పోటీ నేపథ్యంలో డిసెంబరు 31, 2018తో ముగిసిన మూడు నెలల కాలంలో కంపెనీ నికర లాభం రూ.191 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో లాభం రూ.762 కోట్లతో పోలిస్తే ఇది 75 శాతం తక్కువ. ఇక మొత్తం ఆదాయం మాత్రం 28.40 శాతం వృద్ధితో రూ.6,408.95 కోట్ల నుంచి రూ.8,229.36 కోట్లకు చేరింది.

షేరు వారీ ఆర్జన(ఈపీఎస్) రూ.19.83 నుంచి రూ.4.97కు పరిమితమైంది. ఈ కంపెనీ స్టాక్ మార్కెట్లోకి 2015లో రాగా మూడు నెలల కిందట తొలి త్రైమాసిక నష్టాన్ని ప్రకటించింది. డిసెంబరు 31, 2018 నాటికి ఇండిగో వద్ద మొత్తం నగదు నిల్వలు రూ.4,136 కోట్లుగా ఉండగా.. మొత్తం రుణాలు రూ.2,475 కోట్లుగా ఉన్నాయి. ఇక సంస్థ ఇంధన వ్యయాలు 69.2 శాతం పెరిగాయి. కాగా, 'సంక్లిష్ట వాతావరణం కొనసాగుతున్నా కంపెనీ రూ.190 కోట్ల లాభాన్ని ప్రకటించింది. వారానికి ఒక ఎయిర్‌క్రాఫ్ట్ చొప్పున పెంచుకుని.. డిసెంబరు త్రైమాసికంలో సామర్థ్యాన్ని 33 శాతం మేర పెంచుకుంద'ని ఇండిగో సహ-వ్యవస్థాపకుడు, తాత్కాలిక సీఈఓ రాహుల్ భాటియా పేర్కొన్నారు.

బీఎస్ఈలో షేరు 0.89% నష్టంతో రూ.1107.95 వద్ద స్థిరపడింది.

భారతీ ఇన్‌ఫ్రా లాభంలో 11% వృద్ధి

దిల్లీ: టవర్ల నిర్వహణ సంస్థ భారతీ ఇన్‌ఫ్రాటెల్ ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.648 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో సంస్థ ఆర్జించిన నికర లాభంతో పోలిస్తే ఇది 11 శాతం అధికం. ఏకీకృత ఆదాయం స్వల్పంగా తగ్గి రూ.3,640 కోట్లకు పరిమితమైంది. ఎబిటా ఆదాయం కూడా 6 శాతం క్షీణించి రూ.1,513 కోట్లుగా నమోదైంది. 'భారత టెలికాం పరిశ్రమలో ప్రస్తుతం స్థిరీకరణ జరుగుతోంది. దీనికితోడు కో-లొకేషన్ల నుంచి దాదాపు బయటకు రావడం కూడా జరిగింది. మేము ఇప్పుడు తదుపరి దశ గురించి చూస్తున్నాం. ఆపరేటర్లు తమ నెట్‌వర్క్‌ల విస్తరణకు పూనుకుంటున్నారు. తొలుత 4జీ, తర్వాత 5జీ నెట్‌వర్క్‌లకు అవసరమైన మౌలిక వసతుల కోసం ప్రయత్నిస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న డేటా అవసరాలకు అనుగుణంగా ఆపరేటర్లు నెట్‌వర్క్ విస్తరణకు పూనుకుంటుండటంతో మౌలిక వసతులు కల్పిస్తున్న సంస్థలకు మంచి వృద్ధి అవకాశాలున్నాయ'ని భారతీ ఇన్‌ఫ్రాటెల్ ఛైర్మన్ అఖిల్ గుప్తా వెల్లడించారు.

రేమండ్ లాభం రూ.40 కోట్లు

దిల్లీ: డిసెంబరు 2018తో ముగిసిన త్రైమాసికంలో రేమండ్ గ్రూప్ ఏకీకృత నికర లాభం 30 శాతం మేర పెరిగి రూ.39.95 కోట్లకు చేరింది. క్రితం ఆర్థిక సంవత్సరం(2017-18) అక్టోబరు-డిసెంబరులో కంపెనీ నికర లాభం రూ.30.71 కోట్లుగా ఉంది. ఇదే సమయంలో మొత్తం ఆదాయం సైతం 12.69 శాతం వృద్ధితో రూ.1705.68 కోట్లకు చేరుకుంది. ఇక సమీక్షిస్తున్న త్రైమాసికంలో కంపెనీ మొత్తం వ్యయాలు రూ.1639.03 కోట్లకు చేరుకున్నాయి. క్రితం ఆర్థిక సంవత్సరం ఏడాది ఇవి రూ.1471.38 కోట్లుగా ఉన్నాయి. కాగా, జౌళి, షర్టింగ్, దుస్తులు, టూల్స్ అండ్ హార్డ్‌వేర్ విభాగాల్లో ఆదాయాలు రాణించి వరుసగా రూ.847.73 కోట్లు; రూ.159.25 కోట్లు; రూ.392.94 కోట్లు; రూ.99.94 కోట్లు చొప్పున నమోదయ్యాయి.

బీఎస్ఈలో షేరు 0.15% లాభంతో రూ.814.35 వద్ద ముగిసింది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు

(రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2018–19	నికర లాభం/(నష్టం) 2017–18	మొత్తం ఆదాయం 2018–19	మొత్తం ఆదాయం 2017–18
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	(3764.26)	(596.70)	-----	-----
డీబీ కార్ప్	75.62	78.10	661.63	-----
రాడికో ఖైతాన్	52.09	35.01	2,081.12	1747.98
ఇండొకో రెమెడీస్	5.34	22.66	-----	278.67
ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్	296.77	452.10	7482.95	6795.13
ఉజ్జీవన్ ఫైనాన్షియల్	45.20	29.35	------	------
యునైటెడ్ స్పిరిట్స్	190.90	762.00	8229.40	6409.00

నేటి బోర్డు సమావేశాలు: అల్ట్రాటెక్ సిమెంట్, యెస్ బ్యాంక్, జీ మీడియా, బయోకాన్, కోల్గేట్ పామోలివ్, ఎడెల్‌వైజ్, ఇక్రా, జిందాల్ సా, ఎంఫసిస్, నెల్కో, ఎన్ఐఐటీ, ఫైజర్, పీఎన్‌బీ హౌసింగ్, పీవీఆర్

విజయా బ్యాంక్ లాభంలో 80% వృద్ధి

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో విజయా బ్యాంక్ రూ.143.38 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంక్ ఆర్జించిన రూ.79.56 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 80.2 శాతం అధికం. ఇక మొత్తం ఆదాయం రూ.3,450.81 కోట్ల నుంచి రూ.4,106.42 కోట్లకు పెరిగింది. ఇక బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) 6.17 శాతం నుంచి స్వల్పంగా తగ్గి 6.14 శాతానికి చేరాయి. నికర ఎన్‌పీఏలు మాత్రం 3.99 శాతం నుంచి 4.08 శాతానికి పెరిగాయి. ఫలితంగా మొండి బకాయిలపై కేటాయింపులు రూ.333.26 కోట్ల నుంచి దాదాపు రెట్టింపై రూ.582.22 కోట్లకు చేరాయి.

వొడాఫోన్ ఐడియా రూ.25,000 కోట్ల సమీకరణ

- **జియోతో పోటీ పడడానికే**

దిల్లీ: వొడాఫోన్, ఆదిత్య బిర్లా గ్రూప్‌లు వొడాఫోన్ ఐడియాలోకి రూ.18,000 కోట్ల నిధులను పంపించనున్నాయి. జియోతో పోటీని తట్టుకోవడం కోసం రైట్స్ ఇష్యూ ద్వారా ఈ పని చేయనున్నాయి. అర్హత గల వాటాదార్లకు రైట్స్ ఇష్యూ జారీ చేయడం ద్వారా రూ.25,000 కోట్ల నిధులను సమీకరించడానికి వొడాఫోన్ ఐడియా బోర్డు డైరెక్టర్లు బుధవారం ఆమోద ముద్ర వేశారు. ఒక వేళ రైట్స్ ఇష్యూకు సరైన స్పందన లభించకపోతే ప్రమోటరు వాటాదార్లు స్పందన లభించని ఇష్యూకు దరఖాస్తు చేసుకుంటారు. వొడాఫోన్ ఐడియాలో వొడాఫోన్‌కు 45.1 శాతం వాటా; ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు 26% వాటా; ఐడియా వాటాదార్లకు 28.9 శాతం చొప్పున వాటా ఉంది. ముకేశ్ అంబానీకి చెందిన జియోతో పోటీ పడడం కోసమే ఈ సమీకరణ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జియో రాకతో చాలా వరకు టెలికాం కంపెనీలు డీలా పడ్డ విషయం తెలిసిందే. జియో తీసుకొచ్చిన 4జీ డేటా, వేగం, ధరలతో పోటీ పడడం కోసం గతేడాది వొడాఫోన్, ఐడియాలు విలీనం అయిన సంగతి తెలిసిందే.

తెరపైకి మళ్లీ వాణిజ్య ఉద్రిక్తతలు

- 336 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్
- ఎఫ్ఎంసీజీ, ఆర్థిక, ఐటీ షేర్లకు ఒత్తిడి
- 10,900 దిగువన ముగిసిన నిఫ్టీ




సూచీలు రెండో రోజూ నష్టాలతోనే ముగిశాయి. అమెరికా-చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు మళ్లీ తెరపైకి రావడంతో మదుపర్ల సెంటిమెంటు దెబ్బతింది. ఎఫ్ఎంసీజీ, ఆర్థిక, ఐటీ షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. దీంతో సెన్సెక్స్ 336 పాయింట్లు, నిఫ్టీ 91 పాయింట్లు నష్టపోయాయి. అంతర్జాతీయ సూచీలకొస్తే ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా మార్కెట్లు ప్రతికూలంగా ప్రారంభమయ్యాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 11 పైసలు లాభపడి 71.33 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ ఉదయం 36,494.12 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. ఒక దశలో 36,521.47 పాయింట్ల గరిష్ఠ స్థాయిని కూడా తాకింది. మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా వచ్చిన విక్రయాల ఒత్తిడితో 36,037.90 పాయింట్ల కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. చివరకు 336.17 పాయింట్ల నష్టంతో 36,108.47 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 91.25 పాయింట్లు కోల్పోయి 10831.50 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,944.80-10,811.95 పాయింట్ల మధ్య కదలాడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో సన్ ఫార్మా అత్యధికంగా 3.04 శాతం లాభపడింది. యెస్ బ్యాంక్ 2.71%, టాటా స్టీల్ 1.53%, హెచ్‌యూఎల్ 0.90%, వేదాంతా 0.73%, బజాజ్ ఫైనాన్స్ 0.63% మేర లాభపడ్డాయి. ఐటీసీ అత్యధికంగా 4.16 శాతం నష్టపోయింది. పవర్‌గ్రిడ్ 1.85%, ఇన్ఫోసిస్ 1.73%, ఎంఅండ్ఎం 1.65%, ఎన్‌టీపీసీ 1.58%, ఎస్‌బీఐ 1.31%, హెచ్‌డీఎఫ్‌సీ 1.26%, కోటక్ బ్యాంక్ 1.19%, హీరో మోటోకార్ప్ 1.16%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.15%, టీసీఎస్ 1.08%, ఓఎన్‌జీసీ 0.87%, కోల్ ఇండియా 0.81%, ఏషియన్ పెయింట్స్ 0.75%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.73%, ఇండస్ఇండ్ బ్యాంక్ 0.52% చొప్పున నష్టపోయాయి. రంగాలవారీ సూచీలకొస్తే లోహ, ఆరోగ్య సంరక్షణ సూచీలు తప్ప మిగతావన్నీ డీలా పడ్డాయి. బీఎస్ఈలో 1057 షేర్లు లాభపడగా, 1487 షేర్లు నష్టపోయాయి. 145 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

23న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు			
హైదరాబాద్	400	వరంగల్	402
చిల్లరగా(ఒక గుడ్డు)	4.60	విశాఖపట్నం	417
బెంగళూరు	415	చెన్నై	430
24వ తేదీకి...		చిత్తూరు	423
విజయవాడ/గోదావరి	417	నమక్కల్	415

ఎన్ఎస్ఈ

బుధవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 385.20 (390.60) 3653992
ASIAN PAINTS 1396.55 (1406.95) 2702265
AXIS BANK LT 661.60 (661.60) 7596006
BAJAJ AUTO L 2674.10 (2688.35) 205104
BAJAJ FINANC 2634.35 (2621.90) 992504
BAJAJ FINSER 6493.15 (6435.55) 187445
BHARTI AIRTE 303.70 (304.85) 5063257
BHARTI INFRA 277.00 (277.65) 4888651
BPCL 357.15 (353.80) 1986513
CIPLA 509.30 (507.10) 1358623
COAL INDIA L 225.55 (227.75) 2328748
DR. REDDYS 2646.75 (2640.30) 754526
EICHER MOTOR 20089.15 (20023.60) 53595
GAIL 334.20 (332.90) 3063229
GRASIM IND 782.15 (804.35) 1572530
HCL TECH 944.45 (940.75) 2820793
HDFC 1958.25 (1979.40) 2201110
HDFC BANK 2105.40 (2135.85) 1906072
HERO MOTOCOR 2795.95 (2824.90) 326454
HINDALCO IND 205.45 (203.55) 5821081
HINDUSTAN UN 1767.20 (1750.20) 2321782
HPCL 241.85 (242.00) 3325871
ICICI BANK 367.40 (369.05) 9726450
INDIABULLS H 778.70 (797.35) 3406301
INDIAN OIL 136.10 (135.95) 5367900
INDUSINDBANK 1495.00 (1501.60) 1441440
INFOSYS LTD 731.65 (745.35) 7212099
ITC 277.30 (289.75) 40188183
JSW STEEL LT 280.90 (278.00) 4489030
KOTAK MAHIND 1276.50 (1291.75) 3258582
LARSEN & TOU 1301.45 (1301.15) 1821323
M&M 695.85 (708.50) 4714919
MARUTI SUZIK 7045.40 (7068.85) 702474
NTPC LTD 140.75 (142.80) 4436294
ONGC 143.30 (144.35) 4946218
POWER GRID C 186.30 (189.70) 3472589
RELIANCE IND 1226.30 (1235.15) 8829502
SBI 286.65 (290.25) 10304608
SUN PHARMA 431.00 (418.95) 26921274
TATA CONSULT 1875.60 (1901.90) 2578169
TATA MOTORS 180.25 (180.85) 9778926
TATA STEEL L 464.60 (456.55) 7259386
TECH MAHINDR 720.70 (714.20) 1965283
TITAN IND 962.15 (982.65) 1574247
ULTRATECH 3850.65 (3860.50) 171340
UPL LIMITED 762.85 (763.30) 2336913
VEDANTA LIMI 192.80 (191.50) 7523951
WIPRO 351.55 (346.50) 9937426
YES BANK LTD 197.25 (192.20) 46394304
ZEE ENTERTAI 432.85 (425.25) 12987032

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1293.20 (1309.15) 24267
ACC 1429.85 (1436.35) 314654
ADITYA BIRLA 87.40 (90.85) 2580533
AMBUJA CEMEN 212.40 (213.85) 979376
ASHOK LEYLAN 89.15 (87.95) 13463017
AUROBIND PHA 783.10 (788.95) 1819565
AVENUE SUPER 1397.30 (1357.90) 1062451
BANDHAN BANK 414.20 (408.95) 1023822
BANK OFBAROD 111.30 (113.80) 10399387
BEL 83.90 (85.15) 3879672
BHEL 69.35 (71.20) 5371992
BIOCON LTD 670.65 (668.60) 2429064
BOSCH LTD 19090.15 (19208.35) 5495
BRITANNIA 3203.85 (3153.65) 286992
CADILA HEALT 342.05 (346.05) 573513
COLGATE PALM 1307.25 (1306.55) 474354
CONTAINER 659.90 (669.50) 675635
DABUR INDIA 430.65 (433.35) 1537391
DLF LIMITED 177.25 (180.05) 4567262
GENERAL INS 247.70 (252.25) 38701
GODREJ CONSU 789.80 (792.85) 499882
HAVELLS INDI 696.20 (711.85) 2677472
HDFC STAND L 373.35 (383.85) 1355788
HINDUSTAN ZI 259.40 (260.25) 537622
ICICI LOMBAR 832.25 (847.65) 88430
IDEA CELLULR 33.90 (33.50) 12749248
INTERGLOBE A 1109.30 (1120.65) 1623993
L&TFIN.HOLD 136.60 (137.00) 4333336
LIC HOUS.FIN 466.95 (475.20) 1353505
LUPIN 864.60 (865.45) 837289
MARICO LIMIT 376.55 (375.55) 720808
MCDOWELL 580.25 (597.20) 2208148
MOTHERSON 157.55 (162.55) 3223449
MRF 66072.05 (65259.60) 3086
NHPC LTD 25.25 (25.40) 4516414
NMDC LTD 89.90 (90.55) 1686889
OIL INDIA 170.05 (170.50) 816310
ORACLE FIN S 3769.65 (3684.80) 48774
P&G HYG&HEAL 9914.85 (9987.95) 838
PETRONET LNG 226.80 (222.95) 1997980
PIDILITE IND 1131.45 (1152.80) 544213
PIRAMAL ENTE 2357.85 (2339.15) 436540
SAIL 48.55 (48.25) 8867064
SBI LIFE INS 620.00 (619.90) 159259
SHREE CEMENT 16103.35 (15917.55) 50789
SHRIRAM TRAN 1088.05 (1096.15) 1240765
SIEMENS 1045.00 (1049.50) 183900
SUN TV LTD 529.45 (519.25) 3412724
THE NEW INDI 179.30 (181.70) 14179

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 5.42 (5.70) 520
AISHWARYA TE 3.14 (3.02) 2400
ALPHAGEO 452.35 (461.45) 1164
AMAR RAJA BA 781.25 (779.90) 7911
ANDHRA BANK 27.20 (27.80) 27642
ANDHRA CEMEN 5.08 (5.28) 6268
ANDHRA PAPER 443.15 (442.45) 1061
ANDHRA PETRO 62.25 (62) 52215
ANDHRA SUGAR 314.70 (318.95) 715
ANJANI PORTL 123 (125) 35
ASTRA MICROW 80.60 (79.30) 17502
AUROBINDO PH 782.05 (788.25) 55404
AVANTEL SOFT 223.50 (230.60) 959
AVANTI FEEDS 362.55 (367.80) 19654
AVON ORG 6.65 (6.38) 1
BALAJI AMIN 492.50 (499.50) 330
BARTRONICS 6.71 (7.09) 6612
BHAGIRA CHEM 438.95 (441.65) 80
BHAGYA NAG 35.85 (35.05) 250
BN RATHI SEC 26 (25.30) 1
BRILLIANT SE 1.04 (1.02) 32353
CAMBRIDGE TE 45.30 (45.75) 14
CIL SECURI 15.45 (16) 649
CONT COFFEE 272.10 (273.40) 958
COROMAN FERT 435.20 (432.40) 6754
CUBEX TUB 14.95 (14.37) 1437
CYBERMATE 1.90 (1.91) 12583
CYIENT LIMIT 598.40 (591.45) 9488
DIVI'S LAB 1503.70 (1502.40) 10891
DIVYA GRANIT 103.90 (100) 4034
DR REDDY 2645.50 (2640) 41746
FOUR SOFT 38.55 (38.75) 328
GATI CORPN 77.40 (78.90) 26713
GAYATRI PROJ 168.85 (170.55) 573
GMR INFRASTR 16.15 (16.15) 1050135
GOLDST INFRA 234.25 (237) 3865
GOLDSTONE EN 14.25 (14.65) 3682
GRANULES (I) 93.20 (86.65) 131863
GSS AMERICA 122.25 (115.25) 147712
GVK POWER 6.96 (7.04) 206129
HBL NIFE POW 26.90 (27) 14086
HERITAGE FOO 519.05 (525.90) 531
HIL LTD 1942 (1954.10) 144
IDL INDUSTRS 264.90 (265.20) 22
ILFS ENGINEE 13.35 (12.75) 7886
INCAP 37 (36.15) 218
IVRCL INFRAS 0.98 (0.99) 77511
JEEVAN SCIEN 36.15 (35.10) 245
KAKATIYA CEM 192.05 (194.10) 3407
KALLAM SPG 17.65 (17.85) 6501
KAVERI SEED 555.75 (557.05) 15828
KCP LTD 86.80 (87.05) 2089
KERNEX MICRO 26.45 (25.95) 3384
KNR CONSTRUC 210.90 (213.15) 3791
KREBS BIO 112.85 (122.95) 1263
LANCO INDUS 183.85 (185.85) 787
LAURUS LABS 376 (377) 1075
LOKESH MACH 44.80 (43.75) 373
MEGA SOFT 6.95 (7) 960
MIC ELECTRON 0.96 (1.01) 112745
MOLD-TEK.TEC 52 (53.70) 4053
MOLDTK PLA 266.30 (261.90) 2298
MSR INDIA LT 10.57 (10.17) 13811
NAGARJAGRICH 27.10 (26.55) 10978
NATCO PHARMA 685.20 (689.40) 5735
NAVA BH VENT 112.15 (111.60) 4886
NCC 85.45 (86.25) 335208
NCL IND 126.55 (126.15) 5940
NEHA INTER 4.30 (4.35) 2305
NETTLINX 46.95 (49.40) 6463
NEULAND LAB 500.35 (522.90) 1146
NIHAR INFO 11.98 (12.60) 2326
NILE 354 (350.55) 3744
NORTHGATE TE 0.61 (0.64) 3350
OIL COUNTRY 14.20 (14.60) 4366
PANYAM CEMEN 12.27 (12.58) 13530
PENNER IND 37.40 (37.15) 9433
PHYTOCHEM I 41.75 (42.80) 2725
PIONEER DIST 164.60 (166) 790
PITTI LAMIN 55.20 (58.90) 23847
POKARNA 168.95 (173.30) 1274
PRAJAY ENGS 8.25 (8.34) 1125
PREMIER EXPL 265.15 (231.55) 50160
PRISM CEMENT 80.90 (81.20) 14100
PRUDENTL PHA 3.57 (3.57) 37602
RAASI REFRAC 16.45 (15.72) 149
RAIN INDUSTR 119.60 (120) 37351
RAJ PACKAGIN 27.05 (29) 1100
RAM INFORMAT 42.85 (42.75) 2965
SAGAR CEM 632 (642.65) 102
SAMKRG PIST 187.30 (187.40) 504
SMS PHARMA 72.30 (72.95) 3066
SREE RAYAL A 37.10 (37.50) 71469
SRI KPR INDU 19.45 (20.45) 2700
STARCHIK SP 26 (26.55) 35270
STEEL EXCHAN 13.75 (13) 4683
SUJANA METAL 0.37 (0.38) 2600
SURANA TELE 4.39 (4.45) 6500
SURYALAKSH.C 40.20 (41.45) 100
SURYALATA SP 130 (127.50) 18
SURYAVA SPIN 5.44 (5.72) 50
SUVEN PHARMA 204.10 (210.90) 34637
TAJ GVK HOTE 181.45 (172.55) 20761
TANLA 29.90 (30) 21646
TERA SOFTWAR 45.70 (46.15) 1216
TRANS BIOTEK 5.92 (5.97) 1127913
VBC FERRO 40.35 (38.45) 50
VICEROY HOTE 3.99 (4.20) 15399
VIJAY GROWTH 8.92 (8.50) 4194
VIJAY TEXTIL 40.80 (40) 11000
VIMTA LABS 274.65 (273.45) 2015
VISAKA IND 412.15 (420.35) 729
VISTA PHARMA 27.95 (28.30) 3045
VIVIMED LABS 25.65 (24.65) 243583
YBRANT DIGIT 3 (3.05) 25141
ZENOTECH LAB 32.10 (33) 8279
ZENTECH 85 (81.95) 45214



సౌర విద్యుత్తుతో రైలు కూత

● స్టేషన్లు, ట్రాకుల పక్కనే సౌర పలకలు

● 20-40% వరకు తగ్గనున్న విద్యుత్తు బిల్లు!

ఈనాడు - హైదరాబాద్

దేశంలో రైల్వే విభాగం సౌర విద్యుత్తు బాట పడుతోంది. విద్యుత్తు వినియోగం ఏటేటా పెరుగుతున్నందున విద్యుత్తు బిల్లు పెనుభారం కారాదనే ఉద్దేశంతో సౌర విద్యుత్తుకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందిగా రైల్వే బోర్డుకు, కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ సూచించింది. అంతేగాక దీనిపై సత్వర కార్యాచరణకు సంబంధిత వర్గాలు సిద్ధం అవుతున్నాయి. 2030 నాటికి ఇంధన వినియోగం ద్వారా వచ్చే కాలుష్యాన్ని పూర్తిగా అదుపు చేయాలనే లక్ష్యాన్ని కూడా రైల్వే విభాగం నిర్దేశించుకుంది. దానికి సౌర విద్యుత్తు మెరుగైన ప్రత్యామ్నాయం. అందువల్ల అన్నీ అనుకున్నట్లుగా జరిగితే సమీప భవిష్యత్తులో రైల్వే ట్రాకుల పక్కనే, రైల్వే స్టేషన్ల పైకప్పుల మీద ఏర్పాటు చేసే సౌర పలకల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేసి, దాన్ని రైలు ఇంజిన్లకు, రైల్వే స్టేషన్లలో, కార్యాలయాల్లో వినియోగించుకోవటం కనిపిస్తుంది!

రూ.16,000 కోట్ల టెండర్?

రైల్వే అవసరాలకు అనుగుణంగా 'మేకిన్ ఇండియా' కార్యక్రమం కింద దాదాపు రూ.16,000 కోట్ల విలువైన సౌర విద్యుత్తు టెండర్లను సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ) రూపొందించింది. కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ సారథ్యంలో ఈ సంస్థ పనిచేస్తోంది. దీని కింద 1,200 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉపకరణాలు తయారు చేయాల్సి వస్తుంది. ఈ ప్రతిపాదన ప్రస్తుతం రైల్వే బోర్డు పరిశీలనలో ఉంది. రైల్వేల వద్ద 47,300 హెక్టార్ల ఖాళీ స్థలం ఉంది. ఇందులో 90 శాతం రైల్వే ట్రాకుల పక్కన ఉంటుంది. చాలా చోట్ల రైల్వే స్థలాలకు ఆక్రమణల బెడద ఉంటుంది. ఈ స్థలాలను సౌరవిద్యుత్తు ఉత్పత్తికి వినియోగించుకోవచ్చు. అందువల్ల ఈ ప్రతిపాదనను రైల్వే బోర్డు ఆమోదించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

నూరుశాతం విద్యుద్దీకరణ దిశగా...

మనదేశంలో 1,17,996 కిలోమీటర్ల పొడవైన రైల్వే ట్రాక్ ఉంది. ఎనిమిది వేలకు పైగా రైల్వే స్టేషన్లను ఈ రైలు మార్గం అనుసంధానిస్తోంది. రైలు మార్గాలన్నింటి విద్యుద్దీకరణను 2022 నాటికి పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. అదే జరిగితే రైల్వేల విద్యుత్తు వినియోగం వచ్చే నాలుగేళ్లలో రెట్టింపు అవుతుంది. ప్రస్తుతం బ్రాడ్‌గేజీ రైలు మార్గాల కోసం 2,000 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం అందుబాటులో ఉంది. నూరుశాతం విద్యుద్దీకరణ వల్ల విద్యుత్తు వినియోగం 3,600 మెగావాట్లకు చేరుతుందని అంచనా. ఇదే కాకుండా రెండు ప్రత్యేక సరకు రవాణా కారిడార్లకు మరో 600 మెగావాట్ల విద్యుత్తు కావాలి. దీంతో పాటు రైల్వే స్టేషన్లు, కార్యాలయాలు, రైల్వే వర్క్‌షాపులు, ఇతర రైల్వే సముదాయాల్లో విద్యుత్తు కోసం 400 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉండాలి. మొత్తం కలిపి 4,000 మెగావాట్లకు పైగా విద్యుత్తు రైల్వేకు అవసరమని తెలుస్తోంది.

బిల్లు తగ్గుతుంది

✦ రైల్వేలు ప్రస్తుతం ఏటా 1850 కోట్ల యూనిట్ల విద్యుత్తును వినియోగిస్తున్నాయి. ఇందులో రైళ్లను నడపటానికి 1600 కోట్ల యూనిట్ల విద్యుత్తును వినియోగిస్తున్నారు. మిగిలిన 250 కోట్ల యూనిట్ల విద్యుత్తును రైల్వే స్టేషన్లు, కార్యాలయాలు, వర్క్ షాపుల్లో (నాన్-ట్రాక్షన్) అవసరాలకు ఖర్చు చేస్తున్నారు.

✦ ఇతర అవసరాలతో పాటు ప్రధానంగా డీజిల్ ఇంజిన్లకు అవసరమైన డీజిల్ కోసం ఏటా రూ.18,000 కోట్ల నిధులను రైల్వేలు వెచ్చించాల్సి వస్తోంది. అదేవిధంగా విద్యుత్తు బిల్లు రూ.9,000 కోట్లు ఉంటోంది.

✦ నూరు శాతం విద్యుద్దీకరణ సాధించి డీజిల్ ఇంజిన్లను తొలగించాలని, అన్ని రైళ్లను విద్యుత్తు ఇంజిన్లతో నడపాలనేది ప్రభుత్వ ప్రణాళిక. అదే జరిగితే ఏటా విద్యుత్తు బిల్లు రూ.16,000 కోట్లకు పెరుగుతుందని అంచనా.

✦ దీన్ని సాధ్యమైనంత మేరకు తగ్గించుకునేందుకు వీలుగా సౌరవిద్యుత్తు వైపు రైల్వే విభాగం అడుగులు వేస్తోంది.

✦ అనుకున్నట్లుగా సౌరవిద్యుత్తు ప్రాజెక్టులను అమలు చేయగలిగితే 20-40 శాతం వరకూ విద్యుత్తు బిల్లు తగ్గే అవకాశం ఉంటుంది.

కొన్ని ప్రాజెక్టులు

ఉత్తర రైల్వే పరిధిలోని దిల్లీ-అంబాలా రైల్వే ట్రాక్ వెంట 2 మెగావాట్ల సౌరవిద్యుత్తు సదుపాయాన్ని ఏర్పాటు చేయటానికి రైల్వే ఎనర్జీ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఆర్ఈఎంసీ) టెండర్లు పిలిచింది. ఈ టెండరు ప్రకారం యూనిట్ విద్యుత్తుకు రూ.2.93 వరకూ ధర ఇచ్చేందుకు రైల్వే విభాగం సిద్ధపడుతోంది. ఇదేవిధంగా చత్తీస్‌గఢ్‌లో 50 మెగావాట్ల సౌర విద్యుత్తు యూనిట్ స్థాపనకు కూడా ఇటీవల ఆర్ఈఎంసీ బిడ్లు పిలిచింది. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతిపాదించిన సౌర విద్యుత్తు ప్రణాళికను రైల్వే బోర్డు ఆమోదిస్తే ఇటువంటి పలు సౌర యూనిట్ల స్థాపనకు అవకాశం ఏర్పడుతుంది. తద్వారా అటు సౌరవిద్యుత్తు పరిశ్రమ, ఇటు రైల్వేలు లాభపడే అవకాశం లభిస్తుంది.

కోటి కే ఓటు

● బీమా పాలసీల్లో వీటికి ఎక్కువ ఆదరణ

● పాలసీబజార్.కాం నివేదికలో వెల్లడి

జీవిత, ఆరోగ్య బీమా పాలసీలపై పాలసీదారుల్లో అవగాహన పెరుగుతోంది. అధిక విలువైన పాలసీలు తీసుకుంటేనే ఆర్థికంగా రక్షణ లభిస్తుందని నమ్ముతున్నారు. 30-40 ఏళ్ల లోపు వారు జీవిత బీమా పాలసీలపై, 26-35 ఏళ్లవారు ఆరోగ్య బీమా పాలసీలపై మొగ్గు చూపిస్తున్నట్లు డిజిటల్ ప్లాట్‌ఫాంపై బీమా పాలసీలను విక్రయించే పాలసీబజార్.కాం నివేదిక వెల్లడించింది. కుటుంబంలో ఆర్జించే వ్యక్తికి ఏదైనా జరిగితే ఆ కుటుంబానికి ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ పడుతుంది. ఒక్కరు అనారోగ్యంపాలైనా అప్పటివరకూ దాచి పెట్టుకున్న మొత్తం అంతా కరిగిపోతుంది. ఈ కష్టాల నుంచి గట్టెక్కించే బీమా పాలసీలపై ప్రజలకు అవగాహన పెరుగుతోందని పాలసీబజార్ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, హైదరాబాద్‌లలో తమ ద్వారా అమ్ముడైన టర్మ్ పాలసీలు, ఆరోగ్య బీమా పాలసీల తీరుతెన్నులు ఎలా ఉన్నాయనే విషయంలో ఈ నివేదిక ఏం చెబుతోందంటే...

- ఈనాడు, హైదరాబాద్



ఆరోగ్య బీమా..

☛ వైద్యం ఖరీదవుతున్న నేపథ్యంలో సగటు పాలసీ విలువలు పెరిగాయని అంటోంది పాలసీబజార్. తమ ద్వారా కొనుగోలు చేసిన ఆరోగ్య బీమా పాలసీలను గమనించినప్పుడు ఈ విషయం వెల్లడవుతోందని తెలిపింది.

☛ ఆంధ్రప్రదేశ్‌లో... సగటు ఆరోగ్య బీమా విలువ రూ.7,34,439గా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.5,47,586. ఇక మొత్తం పాలసీ బజార్‌లో విక్రయించిన పాలసీల్లో 1.96శాతం ఏపీకి ఉంది. 26-35 ఏళ్ల వయసు వారు 42% మంది పాలసీలు తీసుకున్నారు. ఇందులోనూ పురుషుల వాటా 89.40%గా ఉంది.

☛ వైద్య రాజధానిగా పేరున్న హైదరాబాద్‌లో సగటు వైద్య బీమా పాలసీ మొత్తం అధికమయ్యింది. 2017-18లో సగటు పాలసీ మొత్తం రూ.5,99,123 ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు వరకూ చూస్తే.. రూ.9,18,662కు చేరింది. 26-35 ఏళ్ల వయసులో ఉన్నవారు 39.5% మంది పాలసీలను తీసుకుంటున్నారు. ఈ ప్రాంతంలో అమ్ముడైన వాటిల్లో 86% పాలసీలను పురుషులు తీసుకున్నారు.

☛ తెలంగాణ (హైదరాబాద్ మినహా)లో సగటు పాలసీ విలువ గత ఏడాది రూ.5,99,123 ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో సగటు పాలసీ విలువ రూ.9,18,662లకు చేరింది. 26-35 ఏళ్ల వయసులో ఉన్నవారు 39.5శాతం మంది ఆరోగ్య బీమా పాలసీలపై మొగ్గు చూపిస్తున్నట్లు తేలింది. ఈ పాలసీల్లో పురుషుల వాటా 86% ఉన్నట్లు నివేదిక పేర్కొంది.

జీవిత బీమా..

☛ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ -డిసెంబరు మధ్య దేశ వ్యాప్తంగా పాలసీబజార్ నుంచి రూ.కోటి, అంతకు మించిన టర్మ్ పాలసీలు దాదాపు 1,58,283 అమ్ముడయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం మొత్తంలో వీటి సంఖ్య 1,34,098.

☛ ఈ మొత్తం పాలసీల్లో ఆంధ్రప్రదేశ్ వాటా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 9 నెలల్లో 2.95శాతం ఉంది. 30-40 ఏళ్ల మధ్య వారు 80.63శాతం మంది రూ.కోటికి మించి విలువైన పాలసీలు తీసుకున్నారు. గత ఏడాది 1.22శాతంతో పోలిస్తే ఈ సంఖ్య పెరిగడం గమనార్హం.

☛ హైదరాబాద్‌లో పాలసీలు గత ఏడాదితో పోలిస్తే తగ్గాయి. 2017-18లో 2.50శాతం మంది రూ.కోటి విలువైన పాలసీలు తీసుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు వరకూ ఈ శాతం 1.54%. ఇక 30-40ఏళ్ల వయసులో పాలసీ తీసుకున్న వారు 58.55%.


☛ తెలంగాణ (హైదరాబాద్ మినహా)లో కూడా పాలసీలు తగ్గాయి. గత ఆర్థిక సంవత్సరంలో 2.65శాతం పాలసీలు విక్రయించగా.. ఈసారి 1.67శాతం పాలసీలు మాత్రమే రూ.కోటికి మించి ఉన్నాయి. 30-40 ఏళ్ల మధ్య వారు 58.38% ఈ పాలసీలను కొనుగోలు చేశారు.

ఉద్యోగార్థులూ.. సిద్ధం కండి

● వచ్చే ఆరు నెలల్లో నియామకాల్లో వృద్ధి

● ఐటీ, బీఎఫ్ఎస్ఐ, బీపీఓల్లో ఎక్కువ

వచ్చే ఆరు నెలల్లో కొత్త ఉద్యోగాలు రానున్నాయి. ఇప్పటికే ఉన్న స్థానాల్లో నియామకాలూ పెరగనున్నాయి. ముఖ్యంగా ఐటీ, బీఎఫ్ఎస్ఐ(బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా), బీపీఓ విభాగాల్లో ఈ నియామకాల ధోరణి ఎక్కువగా కనిపించవచ్చని 'నౌకరీ హైరింగ్ అవుట్‌లుక్ 2019' పేర్కొంది. దేశవ్యాప్తంగా 3310 కంపెనీలను సర్వే చేసి ఈ ద్వై వార్షిక నివేదికను రూపొందించారు. 'గతేడాది కనిపించిన నియామకాల ధోరణి కొత్త ఏడాదిలోనూ కొనసాగనుంది. తొలి అర్ధభాగంలో ఇది కనిపించనుంద'ని ఇన్ఫోఎడ్జ్ ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సుమిత్ సింగ్ పేర్కొన్నారు.



✦ విక్రయాలు-మార్కెటింగ్, ఐటీ-సాఫ్ట్‌వేర్ విభాగాల్లో అధిక నియామకాలు జరగనున్నాయని సర్వేలో పాల్గొన్న సగం కంపెనీలు వివరించాయి.

✦ కార్యకలాపాలు, మానవ వనరులు, అకౌంట్స్ విభాగాల్లో ఎక్కువ నియామకాలు చేపడుతున్నట్లు నాలుగో వంతు కంపెనీలు తెలిపాయి.

✦ 3-5 ఏళ్ల అనుభవం ఉన్న వారికి ఎక్కువ అవకాశాలు కలగనున్నాయి. ఆ తర్వాత 1-3 సంవత్సరాల పాటు పనిచేసిన వారిపైనా కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి.

✦ వలసలు 5-15% మేర ఉంటాయని.. ముఖ్యంగా 1-3 ఏళ్ల అనుభవం(ప్రారంభస్థాయి) ఉన్న వారే అందులో ఉంటారని 50 శాతం యాజమాన్యాలు అంచనా వేశాయి.

✦ విక్రయాలు-మార్కెటింగ్, ఐటీ సాఫ్ట్‌వేర్ విభాగాల్లో అధిక వలసలు ఉంటాయని అంచనా కట్టాయి.

✦ ఉద్యోగ సృష్టిపై ఆశావహ దృక్పథమే ఉన్నప్పటికీ.. సరైన నైపుణ్యం గల వారు లభించడం లేదని కంపెనీలు ఆందోళన చెందుతున్నాయి. వచ్చే ఆరు నెలల్లో నైపుణ్య కొరత పెరుగుతుందని 42% సంస్థలు అభిప్రాయపడుతుండగా.. గత ఆరు నెలల తరహాలోనే ఈ కొరత కొనసాగుతుందని 31 శాతం అంచనా వేశాయి.

✦ 3-5 ఏళ్ల విభాగంలో ఈ నైపుణ్యం ఉన్న వ్యక్తుల కొరత ఎక్కువగా కనిపిస్తోంది.

✦ 20 శాతం మేర నియామకాలు పెరుగుతాయని 16% కంపెనీలు; 15-20 శాతం మేరే వృద్ధి కనిపించవచ్చని 15% సంస్థలు పేర్కొన్నాయి.

జీఎస్‌టీ అప్పిలేట్ ట్రైబ్యునల్ జాతీయ బెంచ్‌కు మంత్రి మండలి ఆమోదం

దిల్లీ: జీఎస్‌టీ అప్పిలేట్ ట్రైబ్యునల్‌కు ఒక జాతీయ ధర్మాసనం(బెంచ్) ఏర్పాటు చేయడానికి కేంద్రమంత్రి మండలి(కేబినెట్) ఆమోద ముద్ర వేసింది. రాష్ట్రస్థాయిలో వివాదాలపై రెండో అప్పీలు చేసుకోవడానికి ఇది వీలు కల్పిస్తుంది. దేశ రాజధానిలో ఈ బెంచ్‌ను ఏర్పాటు చేయనున్నారు. కేంద్రం, రాష్ట్రాల నుంచి ఒక్కో సభ్యుడు చొప్పున ఉంటారు. ఒక అధ్యక్షుడు కూడా ఈ బెంచ్‌కు ఉంటారు. వివాదాల పరిష్కారాలను ఈ జాతీయ బెంచ్ వేగవంతం చేయగలదని కేంద్ర మంత్రి రవి శంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఒక కేంద్రీకృత అప్పిలేట్ అథారిటీని ఏర్పాటు చేయాలని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆధ్వర్యంలోని జీఎస్‌టీ మండలి డిసెంబరులో నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ బెంచ్ ఏర్పాటు వల్ల ఏటా రూ.6.86 కోట్ల వ్యయం అవుతుందని అధికారిక ప్రకటన ఒకటి వెల్లడించింది.

శక్తిమంత రిటైలింగ్ దిగ్గజాల్లో రిలయన్స్ రిటైల్

ఏడాదిలో 95 స్థానాలు పైకి

దిల్లీ: ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ రిటైల్‌కు మరో ఘనత లభించింది. అంతర్జాతీయంగా శక్తిమంత రిటైల్ దిగ్గజాలతో డెలాయిట్ రూపొందించిన 'గ్లోబల్ పవర్స్ ఆఫ్ రిటైలింగ్ 2019' జాబితాలో ఒకేసారి 95 స్థానాలు పైకి చేరి, 94వ స్థానం పొందింది. రిలయన్స్ రిటైల్ స్టోర్లలో విక్రయించే నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు, ఫ్యాషన్, జీవనశైలి ఉత్పత్తుల విభాగాలన్నింటిలో వృద్ధి బాగుందని డెలాయిట్ తెలిపింది. విక్రయశాలల విస్తరణతో పాటు, విక్రయాల్లో వృద్ధి బాగుందని వివరించింది.

జాబితా ఇలా

డెలాయిట్ సంస్థ ఏటా రూపొందించే ఈ నివేదిక కోసం అంతర్జాతీయంగా 250 సంస్థలను ఎంపిక చేసుకుంటుంది. 2017 ఆర్థిక సంవత్సర ఆదాయాలను పరిగణనలోకి తీసుకుని, తాజా జాబితా రూపొందించింది. భారత సంస్థలకు వచ్చేసరికి 2018 మార్చి ఆఖరు వరకు ఆదాయాలను సమీకరించింది. ఈ జాబితాలోని సంస్థలన్నిటి ఆదాయం 4.51 లక్షల కోట్ల డాలర్లు (రూ.321.63 లక్షల కోట్లకు పైగా) అని డెలాయిట్ వెల్లడించింది. ఈ మొత్తంలో తొలి 10 రిటైల్ సంస్థల ఆదాయ వాటాయే 31.6 శాతం. ఇందులో 7 అమెరికా సంస్థలు కాగా, జర్మనీ సంస్థలు స్వార్జ్, ఆల్డి ఎన్‌కాఫ్ 5, 9 స్థానాల్లో నిలిచాయి. బ్రిటన్ సంస్థ టెస్కో స్థానం మెరుగుపడి 10కి చేరింది. అయితే జాబితా మొత్తంలో ఐరోపాకు చెందినవే 87 కంపెనీలున్నాయి.

✦ ప్రపంచంలోనే అతిపెద్ద రిటైల్ సంస్థగా వాల్‌మార్ట్ తన స్థానం నిలుపుకుంది. భారత్‌లో ఫ్లిప్‌కార్ట్‌ను కొనుగోలు చేయడంతో పాటు జపాన్‌లో రకుతెన్‌తో భాగస్వామ్యం ఏర్పరచుకుంది.

✦ రెండోస్థానంలో కాస్ట్‌కో, మూడోస్థానంలో క్రోగర్ నిలిచాయి. అమెజాన్ స్థానం 2 స్థానాలు మెరుగుపడి, 4వ స్థానానికి చేరింది. ఈ సంస్థ ఆదాయం 25.3 శాతం వృద్ధి చెందింది.

వేగవంతమైన వృద్ధి మనదే

● 2019, 2020ల్లోనూ అగ్రస్థానం

● ఐక్యరాజ్యసమితి నివేదిక

దిల్లీ: ప్రపంచంలో వేగవంతమైన వృద్ధి సాధిస్తున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతుందని ఐక్యరాజ్య సమితి నివేదిక పేర్కొంది. 2019, 2020ల్లో చైనా కంటే ముందంజలో నిలవనుందని అభిప్రాయపడింది. ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆర్థిక పరిస్థితి, అంచనాలు (డబ్ల్యూఈఎస్‌పీ) 2019 నివేదిక ప్రకారం.. 2019-20లో భారత వృద్ధి 7.6 శాతానికి పెరగొచ్చు. ఆ తర్వాతి సంవత్సరంలో 7.4 శాతం నమోదు కావొచ్చని అంచనా వేసింది. ఇదే సమయంలో చైనా వృద్ధి 6.6 శాతం నుంచి 6.3 శాతానికి తగ్గనుంది. 2020లో 6.2 శాతానికి పరిమితం కావొచ్చని పేర్కొంది. ప్రైవేట్ పెట్టుబడులు పెరగడం, సంస్కరణల ఫలాలతో భారత్‌లో వృద్ధి జోరు కొనసాగొచ్చని నివేదిక స్పష్టం చేసింది. మధ్య కాలవ్యవధిలో వృద్ధికి ప్రైవేట్ పెట్టుబడులు కీలకం కానున్నాయని తెలిపింది. చైనా వృద్ధిపై వాణిజ్య ఉద్రిక్తతలు ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని వెల్లడించింది. ఇక ప్రపంచ వృద్ధి 2019, 2020ల్లో నిలకడగా దాదాపు 3 శాతంగా నమోదు కావొచ్చని నివేదిక అభిప్రాయపడింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలు అడ్డంకిగా మారొచ్చని తెలిపింది. వాణిజ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో 2017లో 5.3 శాతంగా ఉన్న ప్రపంచ వాణిజ్య వృద్ధి.. 2018లో 3.8 శాతానికి చేరిందని వెల్లడించింది.



ఇంటి వంటలతో వ్యాపార అవకాశం

హైదరాబాద్‌లో ఫుడ్డీ బడ్డీ సేవలు

ఈనాడు, హైదరాబాద్: ఇంట్లో వండిన ఆహార పదార్థాలను విక్రయించాలని భావించే వారిని ప్రోత్సహించి, వారికి మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పిస్తోన్న బెంగళూరు అంకురం ఫుడ్డీబడ్డీ హైదరాబాద్‌లో తన సేవలను ప్రారంభించింది. వంటలపై ఇష్టం ఉన్న వారిని, ఇంటి వంటలను కోరుకునే వారినీ ఒక చోటకు చేర్చడం ద్వారా ఇది వ్యాపార అవకాశాన్ని కల్పిస్తుంది. ఇప్పటి వరకూ ప్రయోగాత్మకంగా హైదరాబాద్‌లో 15,000 నివాసాలకు చేరువై దాదాపు 20,000 భోజనాలను విక్రయించినట్లు సంస్థ వ్యవస్థాపకులు రచనా రావు, సహ వ్యవస్థాపకుడు అఖిల్ సేథురామన్ తెలిపారు. బయట మార్కెట్లో దొరకని ప్రాంతీయ వంటకాలను ప్రత్యేకంగా రూపొందించే వారిని ఎంచుకుని, వారి వద్ద నుంచి వాటిని పొందే అవకాశం ఫుడ్డీ బడ్డీ కల్పిస్తుందని వివరించారు. తమ యాప్‌లో నమోదైనవారు తాము ఏం వండాలనుకుంటున్నారు, ఏ సమయంలో అందుబాటులో ఉంటుందో చెబితే, నచ్చిన వారు ఆ పదార్థాలను కొనుగోలు చేస్తారని తెలిపారు. ఆహార పదార్థాలను సొంతంగానే తీసుకెళ్లడమో, విక్రయించిన వారు అందించడమో చేయాల్సి ఉంటుందన్నారు. ఆహార పదార్థాల ధరను వండిన వారే నిర్ణయించుకునే వీలుంటుందనీ, తాము కొంత కమీషన్‌ను మాత్రమే వసూలు చేస్తామని తెలిపారు. ప్రైవేటు కిచెన్ సేవలూ అందుబాటులో ఉన్నాయనీ, క్రమం తప్పకుండా కొనేవారితో ఒక ప్రైవేటు గ్రూపు ఏర్పాటు చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సంస్థ విస్తరణ కోసం ప్రైమ్ వెంచర్స్ నుంచి రూ.6 కోట్ల పెట్టుబడిని స్వీకరించామని వివరించారు.



విజ్జీ ఆన్ వెబ్‌ను ఆవిష్కరిస్తున్న రవిచందర్ బత్తి, రవికాంత్ గొల్లపూడి

రోజువారీ పనుల్లో 'విజ్జీ' తోడు

హైదరాబాద్ (బంజారాహిల్స్), న్యూస్‌టుడే: ఒక వస్తువును ఒక చోట నుంచి మరో చోటికి చేరవేయడం, డ్రై క్లీనింగ్ నుంచి దుస్తులను తీసుకురావడం, మందులు, కిరాణా సరకులను ఇంటికి తెచ్చివ్వడం, బ్యాంకులో చెక్కులు డిపాజిట్ చేయడం, నగదు తీసుకువచ్చి అందించడం ఇలా పని ఏదైనా సహాయం చేసేందుకు 'విజ్జీ' యాప్ అందుబాటులోకి వచ్చింది. ఇల్లు, వ్యాపార నిర్వహణ, సీనియర్ సిటిజన్లకు అవసరమైన అనేక రకాల సేవలను ఇది అందించనుంది. బుధవారం హైదరాబాద్‌లో దీని వ్యవస్థాపకుడు రవి కాంత్ గొల్లపూడి, సహ వ్యవస్థాపకుడు రవిచందర్ బత్తి పాల్గొని 'విజ్జీ ఆన్ వెబ్'ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి గొల్లపూడి మాట్లాడుతూ హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయనీ, ఏడాది చివరికల్లా నగరం మొత్తం సేవలు ప్రారంభిస్తామన్నారు. 3 కిలోమీటర్ల దూరానికి రూ.20, ఆ తర్వాత ప్రతి కిలోమీటరుకు రూ.10 చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలిపారు. 20 కిలోల బరువును కూడా అంగీకరించి రవాణా చేసినట్లు తెలిపారు. రోజుకు 15,000 లావాదేవీలను నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ రూ.కోటి పెట్టుబడి పెట్టినట్లు, ఏడాదిలో దీనికి అదనంగా మరో రూ.కోటి పెట్టుబడి పెడతామని వివరించారు.



సానుకూల సంస్థల్లో గూగుల్ నెం.1

ముంబయి: ఆన్‌లైన్ సెర్చ్ ఇంజిన్ దిగ్గజం గూగుల్ మరోసారి తమ ప్రత్యేకత చాటుకుంది. గతేడాది భారత్‌లో సానుకూల అంశాలను బలంగా సృష్టించిన బ్రాండ్‌లలో గూగుల్ అగ్రస్థానంలో నిలిచింది. ఫేస్‌బుక్‌కు చెందిన వాట్సాప్ రెండో స్థానంలో, గూగుల్‌కే చెందిన యూట్యూబ్ మూడో స్థానంలో నిలిచాయి. ఇంగ్లాండ్ కేంద్రంగా పనిచేసే ఆన్‌లైన్ మార్కెట్ పరిశోధన, డేటా అనలిటిక్స్ సంస్థ యూగవ్ నివేదికలో ఈ విషయాలను పేర్కొంది.

సంస్థ	స్కోరు
1) గూగుల్	57.2
2) వాట్సాప్	55.7
3)యూట్యూబ్	52.9

ఒక బ్రాండ్ గురించి సానుకూలంగా లేదా ప్రతికూలంగా ప్రజలు విన్న విషయాల ఆధారంగా బజ్ స్కోరును లెక్కిస్తారు.

4) మేక్‌మైట్రిప్
5) అమెజాన్
6) స్విగ్గీ 7) ఓలా
8) ఉబర్ 9) ఫేస్‌బుక్
10) ఇన్‌స్టాగ్రామ్

గతేడాదిలో ఎక్కువగా మెరుగుపడ్డ బ్రాండ్‌లు జొమాటో, ఇన్‌స్టాగ్రామ్, కోటక్ మహీంద్రా బ్యాంక్, పిన్‌ట్రెస్ట్, యాక్సిస్ బ్యాంక్

ఈశాన్య గిరిజన మండళ్లకు మరింత స్వయం ప్రతిపత్తి

కేంద్రమంత్రి వర్గం నిర్ణయం

దిల్లీ: లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈశాన్య రాష్ట్రాల్లోని 10 గిరిజన మండళ్లకు మరింత స్వయంప్రతిపత్తి కల్పిస్తూ బుధవారం కేంద్రమంత్రివర్గం నిర్ణయం తీసుకొంది. నిధులతో పాటు, ప్రజా పనులు, అడవులు వంటి 30 శాఖలపై మరిన్ని అధికారాలు కల్పించనుంది. రాజ్యాంగంలోని 280వ అధికరణం, ఆరో షెడ్యూల్ ప్రకారం ఈ అధికారాలు ఇవ్వనుంది. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఇందుకు సంబంధించిన బిల్లు ప్రవేశపెట్టనుంది. గిరిజన మండళ్లతో పాటు వాటి పరిధిలోని గ్రామపంచాయతీలు, పురపాలక సంఘాలకు ఎన్నికలు నిర్వహించడంతో పాటు, అవే అభివృద్ధి ప్రణాళికలను రూపొందించుకొనే అవకాశం కూడా కల్పించనుంది.

ఇంటిపనివారి నియామకంపై కువైట్‌తో ఒప్పందం

ఇంటిపనివారి నియామకంపై కువైట్‌తో కుదిరిన ఒప్పందానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కువైట్‌లో 3 లక్షల మంది భారతీయులు ఇంటి పనివారిగా విధులు నిర్వర్తిస్తుండగా, వారిలో 90 వేల మంది మహిళలు .వారికి తగిన భద్రత కల్పించే విషయమై సహకరించుకోవాలని ఇరు దేశాలు అంగీకరించాయి. ఈ ఒప్పందం అయిదేళ్ల పాటు అమల్లో ఉంటుంది. తరువాత దాన్ని నవీకరించే వెసులుబాటు ఉంది. ఈ ఒప్పందం అమలుకు రెండుదేశాల ప్రతినిధులతో సంయుక్త సంఘం ఏర్పాటవుతుంది.

ప్రతివాదిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

ఇందూలో ఫ్లాట్‌ల రిజిస్ట్రేషన్ వ్యవహారంలో హైకోర్టు నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: ఇందూ ప్రాజెక్ట్స్‌లోని ఫ్లాట్‌లు, విల్లాలకు సొమ్ము చెల్లించిన వారికి రిజిస్ట్రేషన్ చేయాలంటూ ఇచ్చిన ఉత్తర్వులు అమలుకాలేదని పేర్కొంటూ దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో హైకోర్టు..ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సుమోటోగా ప్రతివాదిగా చేర్చింది. ఇందూ ప్రాజెక్ట్స్‌లో భాగమైన ఇందూ అరణ్యలో ఫ్లాట్ కొనుగోలు చేసి సొమ్ము చెల్లించినవారికి రిజిస్ట్రేషన్ చేయించాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అమలు చేయకపోవడంతో న్యాయవాది డీవీఎస్ రవిప్రసాద్ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. ఈ పిటిషన్‌పై బుధవారం జస్టిస్ నవీన్‌రావు మరోసారి విచారణ చేపట్టారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.శరత్‌కుమార్ వాదనలు వినిపించారు. వాదనలను విన్న న్యాయమూర్తి అసంతృప్తి వ్యక్తం చేస్తూ ముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ప్రతివాదిగా చేర్చి నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. కోర్టు ఉత్తర్వుల అమలుపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశిస్తూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.

5 రోజుల పాటు అడవిలో..

- ప్రతి దీపావళికి వెళ్లి ఆత్మపరిశీలన చేసుకునేవాడిని
- జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ

ముంబయి - దిల్లీ



ఎర్రకోటలో జలియన్‌వాలాబాగ్, మొదటి ప్రపంచ యుద్ధ వీరుల స్మారకార్థం ఏర్పాటు చేసిన 'యాద్ ఎ జలియాన్' మ్యూజియాన్ని ప్రారంభించిన అనంతరం తిలకిస్తున్న ప్రధాని మోదీ

జీవితం తొలినాళ్లలో తాను ప్రతి దీపావళికి అయిదు రోజుల పాటు అడవిలో గడిపి ఆత్మ పరిశీలన చేసుకునేవాడినని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అదే ఇప్పుడు తనకు ఎంతో శక్తిని ఇస్తోందని తెలిపారు. 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' (ముంబయికి చెందిన కొందరు కథా రచయితలు ఏర్పాటు చేసిన సంస్థ)కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జీవిత లక్ష్యాన్ని అన్వేషించడానికి యవ్వనంలో తాను చేసిన ఆధ్యాత్మిక ప్రయాణం గురించి వివరించారు. దీనిని బుధవారం ఫేస్‌బుక్‌లో ఉంచారు. "చాలా మందికి ఈ విషయం తెలియదు. ప్రతి దీపావళికి అయిదు రోజుల పాటు ఎవరికీ కనిపించేవాడిని కాదు. అడవిలోకి వెళ్లిపోయేవాణ్ణి. మనుషులెవరూ ఉండని, మంచినీరు దొరికే ప్రదేశాన్ని చూసుకునేవాడిని. అయిదు రోజులకు సరిపడా ఆహార పదార్థాలను తీసుకెళ్లేవాడిని. 'ఎవర్ని కలవడానికి వెళ్తున్నావు?' అని ఎవరైనా అడిగేవారు. నన్ను నేను కలుసుకోవడానికి వెళ్తున్నానని చెప్పేవాడిని." అని ప్రధాని అన్నారు.

యువత ఆత్మ పరిశీలన చేసుకోవాలి

ఉరుకులు, పరుగులతో జీవితాలను గడిపే యువత ఏదో ఒక సమయంలో ఆత్మ పరిశీలన చేసుకోవాలని మోదీ హితవు పలికారు. "ఆత్మ పరిశీలనతో మీ ఆలోచన ధోరణి మారుతుంది. వాస్తవిక ప్రపంచంలో జీవించడం ప్రారంభిస్తారు. ఇతరులు ఏమనుకుంటారో అన్నదానిని పట్టించుకోకుండా ఆత్మవిశ్వాసంతో జీవిస్తారు. వెలుగు కోసం వెతకకండి. అది మీలోనే ఉంది". అని చెప్పారు.

నా హిమాలయ యాత్ర

17 ఏళ్ల వయసులో రెండేళ్ల పాటు తాను జరిపిన హిమాలయ యాత్రను మోదీ పంచుకున్నారు. "ఎక్కడికి వెళ్లాలో తెలియదు. ఏమి చేయాలో అంతకన్నా తెలియదు. చెప్పేవారు లేరు. ఏదో ఒకటి చేయాలన్న బలమైన కోరిక మాత్రం ఉండేది. అందుకే నన్ను నేను దేవునికి సమర్పించుకొని హిమాలయాలకు వెళ్లా. ఇది నా జీవితంలో అత్యంత అస్పష్టమైన కాలం. అయినా ఎన్నో సమాధానాలు లభించాయి. ప్రపంచాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేశాను. నన్ను నేను తెలుసుకున్నాను. రామకృష్ణ మిషన్‌లో కాలం గడిపాను. సాధువులను కలిశాను."

హిమాలయాల్లో ఉన్నప్పుడు ఆచరించిన దినచర్యను మోదీ వివరించారు. "వేకువజాము 3-3.45 గంటల మధ్య నిద్రలేచేవాణ్ణి. గడ్డకట్టిన నీటిలో స్నానం చేసేవాణ్ణి. అయినా ఎంతో వెచ్చగా ఉన్నట్టు అనిపించేది. జలపాతాల శబ్దాల నడుమ ధ్యానం చేసేవాణ్ణి. విశ్వసంగీతంతో ఎలా ఏకం కావాలో సాధువులు నాకు బోధించారు. ఆ అనుభవాలన్నీ ఇప్పుడు అక్కరకొస్తున్నాయి. మనలోని అహంకారాన్ని పూర్తిగా తొలగించినప్పుడే నిజమైన జీవితం ఆరంభమవుతుంది. రెండేళ్ల తరువాత స్పష్టమైన ఆలోచనలతో జీవిత గమ్యాన్ని తెలుసుకొని ఇంటికి చేరుకున్నా". చాయ్‌వాలాగా తండ్రితో గడిపిన రోజులనూ మోదీ గుర్తు చేసుకున్నారు. చాయ్ అమ్మడంతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలవారితో మాట్లాడడంపై ఆసక్తి ఉండేదని అన్నారు. "వారికి టీ అమ్మి వారి మాటలు వింటూ హిందీ నేర్చుకున్నా" అని పేర్కొన్నారు.

ధైర్యశాలి బాల్ ఠాక్రే

శివసేన వ్యవస్థాపకుడు బాల్‌ఠాక్రే ధైర్యశాలి అని మోదీ ప్రశంసించారు. ఠాక్రే 93వ జయంతి సందర్భంగా మోదీ ట్వీట్ చేశారు. అమోఘమైన వాగ్ధాటితో ప్రజలను మంత్రముగ్ధుల్ని చేశారన్నారు.

నేతాజీ మ్యూజియం ప్రారంభం

దిల్లీలోని ఎర్రకోటలో నేతాజీ సుభాష్ చంద్ర బోస్ మ్యూజియంను మోదీ ప్రారంభించారు. జలియన్ వాలాబాగ్, మొదటి ప్రపంచ యుద్ధం వీరుల స్మారకార్థం ఏర్పాటు చేసిన యాద్ ఎ జలియాన్ మ్యూజియం, భారతీయ చిత్రాలపై ఏర్పాటైన 'దృశ్య కాల్' మ్యూజియంను కూడా ప్రారంభించారు. అన్ని మ్యూజియంలను కలిపి క్రాంతి మందిర్ అని పేరు పెట్టారు. నేతాజీ ధరించిన టోపీని ఆయన కుటుంబసభ్యులు మోదీకి బహుమతిగా ఇవ్వగా, దాన్ని మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచుతామని ప్రధాని ప్రకటించారు.

పీయూష్ గోయల్‌కు ఆర్థికశాఖ బాధ్యతలు

ఈనాడు, దిల్లీ: అరుణ్‌జైట్లీ చేతుల్లో ఉన్న ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ బాధ్యతలను కేంద్ర రైల్వే, బొగ్గు శాఖల మంత్రి పీయూష్ గోయల్‌కు అప్పగించారు. ప్రధానమంత్రి సూచన మేరకు రాష్ట్రపతి ఆ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. అనారోగ్యంతో ఉన్న జైట్లీ కోలుకొని, తిరిగి తన బాధ్యతలు మొదలుపెట్టేవరకు జైట్లీ శాఖ లేని అమాత్యునిగా కొనసాగుతారు. చికిత్సల నిమిత్తం ఈనెల 17న జైట్లీ అమెరికా వెళ్లారు.

అమెరికాలో అరుణ్‌జైట్లీకి శస్త్రచికిత్స!

దిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీకి న్యూయార్క్‌లోని ఓ ఆసుపత్రిలో శస్త్రచికిత్స జరిగింది. మంగళవారం శస్త్రచికిత్స జరిగిందని, ఆయన కనీసం రెండువారాల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

గీతా గోపీనాథ్‌కు ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డు

ముగ్గురు తెలుగువారికి కూడా..

వారణాసి: 'అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎంఎఫ్)' ప్రధాన ఆర్థికవేత్త గీతా గోపీనాథ్‌ను ప్రతిష్ఠాత్మక ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డు వరించింది. మొత్తం 28 మంది ప్రవాస భారతీయులు, రెండు సంస్థలకు ఈ ఏడాది ప్రవాసీ భారతీయ సమ్మాన్ పురస్కారాలు దక్కాయి. వారిలో ముగ్గురు తెలుగువారు - పి.వి.సాంబశివరావు, గుణశేఖర్ ముప్పూరి, జగదీశ్వర్‌రావు మద్దుకూరి కూడా ఉన్నారు. మూడు రోజులుగా వారణాసిలో జరుగుతున్న 15వ 'ప్రవాసీ భారతీయ దివస్' సదస్సు బుధవారంతో ముగిసింది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ముగింపు ఉపన్యాసం చేశారు. ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డులను అందజేశారు. నార్వే ఎంపీ హిమాన్షు గులాటి, దక్షిణాఫ్రికా దౌత్యవేత్త అనిల్ సూక్లల్ తదితరులతోపాటు గయానా హిందూ ధార్మిక సభ, ఈజిప్టులోని భారతీయ కమ్యూనిటీ సంఘం ఈ అవార్డును అందుకున్నాయి. వైద్యం-వ్యాపార రంగంలో చేసిన కృషికిగాను గుణశేఖర్(జమైకా)కు అవార్డు దక్కింది. సాంకేతిక రంగంలో సేవలకు గుర్తింపుగా సాంబశివరావు(కెన్యా), వ్యాపారరంగంలో జగదీశ్వర్‌రావు(పోలండ్) ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

వృద్ధిలో భాగస్వాములవ్వండి: కోవింద్

'ప్రవాసీ భారతీయ దివస్' సదస్సులో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగిస్తూ.. మునుపెన్నడూ లేనంత అసాధారణ స్థాయిలో ప్రస్తుతం భారత్ పరివర్తనం చెందుతోందన్నారు. దేశ వృద్ధి చరిత్రలో భాగస్వాములవ్వాలని ప్రవాస భారతీయులు, భారత సంతతి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం భారత్ ఆలోచనలు, అవకాశాల పుట్టగా మారిందని పేర్కొన్నారు. గతంలో మనదేశం నుంచి 'మేధో వలస' ఉండేదని, ప్రస్తుతం దాన్ని 'మేధో లబ్ధి'గా మార్చాలని కోరుకుంటున్నామని కోవింద్ తెలిపారు. ప్రవాస భారతీయులందరూ మన సంస్కృతికి రాయబారులుగా మారాలని ఆయన ఆకాంక్షించారు.

యూపీలో ఎస్పీ-బీఎస్పీదే హవా?

- ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఆ కూటమికి 58 సీట్లు
- ఇండియాటుడే-కార్వీ ఇన్‌సైట్స్ సర్వేలో వెల్లడి

దిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు ముచ్చెమటలు తప్పవట! ఇప్పటికిప్పుడు సాధారణ ఎన్నికలు జరిగితే... యూపీలోని ఎస్పీ, బీఎస్పీ, ఆర్‌ఎల్‌డీ కూటమి 58 సీట్లు గెలుచుకుంటుందని ఇండియాటుడే-కార్వీ ఇన్‌సైట్స్ తాజాగా నిర్వహించిన 'మూడ్ ఆఫ్ ద నేషన్ సర్వే' పేర్కొంది. భాజపా, దాని మిత్రపక్షం అప్నాదళ్ కలిసి 18 సీట్లకే పరిమితమవుతాయని, కాంగ్రెస్ 4 సీట్లు గెలుచుకుంటుందని వెల్లడించింది. హస్తం పార్టీ కూడా జతకడితే కూటమి మరింత బలపడి 75 స్థానాలు గెలుచుకుంటుందని, అప్పుడు భాజపాకు కేవలం 5 స్థానాలే వస్తాయని అంచనా వేసింది. రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన 2,478 శాంపిళ్లను విశ్లేషించిన సర్వే సంస్థలు బుధవారం ఆ వివరాలను వెల్లడించాయి. యూపీలో మొత్తం 80 లోక్‌సభ స్థానాలకు 2014లో భాజపా 71, అప్నాదళ్ 2 స్థానాలను గెలుచుకున్నాయి. వీటికి 43% ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్-2 (7.53% ఓట్లు), ఎస్పీ-5 (22.4%) స్థానాలను గెలుచుకున్నాయి. 19.6% ఓట్లు సాధించిన బీఎస్పీ; 1% ఓట్లు సాధించిన ఆర్‌ఎల్‌డీలు మాత్రం ఖాతా తెరవలేదు. అయితే, ఈసారి ఫలితాలు భిన్నంగా ఉంటాయని తాజా సర్వే పేర్కొంది. భాజపా, అప్నాదళ్‌కు ఉమ్మడిగా 36%; ఎస్పీ, బీఎస్పీ, ఆర్‌ఎల్‌డీ కూటమికి 46%; కాంగ్రెస్‌కు 12% ఓట్లు వస్తాయని లెక్కగట్టింది.



అతిశీతల పరిస్థితుల నేపథ్యంలో అమెరికాలోని ప్రపంచ ప్రఖ్యాత నయాగరా జలపాతం ఇలా గడ్డకట్టింది. మంచు గడ్డల మధ్య నుంచి అక్కడక్కడ నీరు కిందకు జారడాన్ని సందర్శకులు ఆసక్తిగా తిలకించారు



హిమాచల్‌ప్రదేశ్ రాజధాని సిమ్లాలో హిమపాతం ఉద్ధృతికి దర్పణం ఈ దృశ్యం. బుధవారం ఇలా వాహనాలు మంచు దుప్పట్లో మునిగిపోయాయి

ఏడేళ్ల చిన్నారిపై అత్యాచారం, హత్య!

- నిందితుడిగా అనుమానిస్తున్న యువకుడి ఆత్మహత్య!
- సీఎంఈ ఆవరణలో దారుణం

పుణె: మహారాష్ట్రలోని మిలిటరీ ఇంజినీరింగ్ కళాశాల (సీఎంఈ) ఆవరణలో ఏడేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి...ఆ తర్వాత హత్యచేసిన దారుణకృత్యం చోటు చేసుకుంది. అదే ఆవరణలో ఓ చెట్టుకు ఉరివేసుకున్న 24 ఏళ్ల వయసు యువకుడే చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. ఉద్యోగం నుంచి సాయంత్రం ఇంటికి వచ్చి పాప పరిస్థితి చూసిన తల్లి చిన్నారిని హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్లింది. పాపపై అత్యాచారం, అనంతరం హత్య జరిగినట్లు వైద్యులు తెలిపారు.

ఈ క్రమంలో పోలీసులు చిన్నారి తల్లిని విచారించగా కొన్ని విషయాలు వెల్లడైనాయి. నిందితుడిగా అనుమానిస్తున్న ఆ యువకుడు, బాధిత చిన్నారి పాప తల్లి సీఎంఈ మెస్‌లో పనిచేస్తున్నారు. ఇద్దరూ కూడా అదే ఆవరణలో నివాసం ఉంటున్నారు. వితంతువైన తనను వివాహం చేసుకుంటానంటూ అతడు ప్రతిపాదించినట్లు పాప తల్లి వెల్లడించింది. అందుకు తాను తిరస్కరించడంతో ఇద్దరి మధ్యా సోమవారం తీవ్ర ఘర్షణ జరిగినట్లు చెప్పింది. కోపోద్రిక్తుడైన అతడు పరిణామాలు విపరీతంగా ఉంటాయి.. చూడు అంటూ తనను హెచ్చరించినట్లు ఆమె తెలిపింది. ఆమె వాంగ్మూలం ఆధారంగా ఆ యువకుడి కోసం వెతికితే అదే ఆవరణలో చెట్టుకు ఉరేసుకుని కనిపించాడని పోలీసులు చెప్పారు.



కుంభమేళాను పురస్కరించుకొని బుధవారం ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణి సంగమానికి ఊరేగింపుగా వెళ్తున్న ద్వారక శంకరాచార్య స్వరూపానంద సరస్వతి స్వామి

రైల్వేలో 2.30 లక్షల ఉద్యోగాలు

- వచ్చే రెండేళ్లలో భర్తీ
- 10% పేదల కోటా అమలు
- కేంద్ర రైల్వే మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి
- తిరుపతి వరకు హౌవ్‌డా-విజయవాడ హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ పొడిగింపు

ఈనాడు, దిల్లీ: వచ్చే రెండేళ్లలో రైల్వేలో 2.30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. తొలిదశలో 1.31 లక్షల పోస్టులను, రెండో దశలో 99 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. బుధవారమిక్కడ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 నెలల క్రితం 1,51,548 పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రారంభించామనీ, ఇప్పుడు దానికి అదనంగా 2.30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయబోతున్నామని చెప్పారు. ఇందులో 103వ రాజ్యాంగ సవరణ ప్రకారం పేదలకు 10% కోటా కల్పిస్తామనీ, తద్వారా 23 వేల మంది పేదలు లబ్ధి పొందుతారన్నారు. ఈ పోస్టులకు స్థాయిని బట్టి ఐటీఐ, డిప్లొమా, ఇంజనీరింగ్ విద్యార్హతలు ఉన్నవారు అర్హులని మంత్రి ప్రకటించారు.



22 రైళ్ల సేవలు పొడిగింపు

దేశ వ్యాప్తంగా 22 రైళ్ల సేవలను పొడిగిస్తున్నట్లు పీయూష్ గోయల్ వెల్లడించారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం- హౌవ్‌డా-విజయవాడ హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ (20889/20890)ను తిరుపతి వరకు నడుస్తుంది. ఇది ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది. కటక్-బ్రహ్మపుర (68433/68434 మెమూ)ను ఇచ్ఛాపురం వరకు పొడిగించారు. ఈ మార్గంలోని అన్ని స్టేషన్లలో ఇకపై ఈ రైలు ఆగుతుంది. సికింద్రాబాద్-తాండూరు (67249/67250 మెమూ) రైలును చిత్తాపుర్ వరకు పొడిగించారు. ఇది మన్‌తట్టి, నవంద్గి, కురుగుంట, సెరం, మల్‌ఖయిడ్‌రోడ్డు స్టేషన్లలో ఆగుతుంది. మిర్యాలగూడ-కాచిగూడ (77673/77674 డెమూ) రైలును నడికుడి వరకు నడుస్తుంది. ఇక నుంచి ఇది కొండ్రాపోలె హాల్ట్, విష్ణుపురం, పొందుగుల స్టేషన్లలో ఆగుతుంది. విశాఖపట్నం-పలాస (58526/58525) ప్యాసింజర్ బ్రహ్మపుర వరకు వెళ్తుంది. ఆ మార్గంలోని అన్ని స్టేషన్లలోనూ ఈ రైలు ఆగుతుంది.

రైల్వేశాఖ ఉద్యోగాల స్వరూపం ఇలా...

మొత్తం ఉద్యోగాలు:	15,06,598	ఇందులో ఎస్సీలకు దక్కేవి:	19,715
ప్రస్తుతం పనిచేస్తున్నవారు:	12,23,622	ఎస్టీలకు దక్కేవి:	9,857
మొత్తం ఖాళీలు:	2,82,976	ఓబీసీలకు వచ్చేవి:	35,485
ప్రస్తుత నియామకాలు:	1,51,548	అగ్రవర్ణ పేదలకు:	13,100
మిగిలిన ఖాళీలు:	1,31,428	**తొలిదశ పూర్తి గడువు: ఏప్రిల్-మే 2020**	
2019-20లో పదవీ విరమణ పొందేవారు:	53,000	రెండో దశలో భర్తీచేసే ఉద్యోగాలు:	99,000
2020-21లో పదవీ విరమణ పొందేవారు:	46,000	ఇందులో ఎస్సీలకు దక్కేవి:	15,000
ఈ రెండూ కలిపితే ఏర్పడే ఖాళీలు:	99,000	ఎస్టీలకు వచ్చేవి:	7,500
వచ్చే రెండేళ్లలో భర్తీ చేయాల్సిన మొత్తం ఖాళీలు	2,30,000	ఓబీసీలకు చేజిక్కేవి:	27,000
తొలిదశలో భర్తీచేసేవి (ఫిబ్రవరి-మార్చిలో):	1,31,328	అగ్రవర్ణ పేదలకు వచ్చేవి:	10,000

ఆందోళనకరంగా షరీఫ్ ఆరోగ్యం



లాహోర్: అవినీతి కేసులో జైలుశిక్ష అనుభవిస్తున్న పాకిస్థాన్ మాజీ ప్రధాన మంత్రి నవాజ్ షరీఫ్ ఆరోగ్య పరిస్థితి 'చాలా ఆందోళనకరం'గా ఉందని ఆయన వ్యక్తిగత వైద్యుడు చెప్పారు. ఆయనకు గుండెకు సంబంధించి సమస్యలు తలెత్తాయని, వెంటనే ఆసుపత్రికి తరలించాల్సిన అవసరం ఉందని తెలిపారు. 69 ఏళ్ల షరీఫ్ లాహోర్‌లోని కోట్ లఖ్‌పత్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నారు. ఛాతీలో అసౌకర్యంగా ఉందని చెప్పడంతో మంగళవారం ఆయనను 'పంజాబ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్డియాలజీ'కి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం ఆయనను తిరిగి జైలుకు తరలించారు. ఆయన పరిస్థితి ఏమంత ఆందోళనకరంగా లేదని అక్కడి వైద్యులు పేర్కొన్నారు. మందులు వాడాలని, తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అయితే షరీఫ్ పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని ఆయన వ్యక్తిగత వైద్యుడు, హృద్రోగ నిపుణుడు అద్నాన్ ఖాన్ చెప్పారు. "ఆయనకున్న గుండె సమస్యల వల్ల జైల్లో చికిత్స సాధ్యం కాదు. తక్షణం ఆసుపత్రికి తరలించి, సరైన చికిత్స అందించాలి" అని చెప్పారు. గతంలో ఆయనను పరీక్షించిన వైద్య బృందం కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేసిందని, ప్రభుత్వం మాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. షరీఫ్ ఆరోగ్యంపై ఆయన కుమార్తె మరియం ఆందోళన వ్యక్తంచేశారు. తన తండ్రి గురించిన సమాచారం మీడియా ద్వారానే తెలుస్తోందన్నారు. మూడు సార్లు దేశానికి ప్రధాన మంత్రిగా వ్యవహరించిన షరీఫ్‌కు అత్యుత్తమ వైద్య సౌకర్యాలు కల్పించాలని ఆయన సోదరుడు షాబాజ్ షరీఫ్ కోరారు.

ఏపీవై పింఛను రూ.10వేలకు పెంచే యోచన

దిల్లీ: అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) కింద ఇచ్చే కనీస పింఛనును నెలకు రూ.10వేలకు పెంచాలన్న ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ తెలిపారు. ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు గరిష్ఠ వయోపరిమితిని 40 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచాలన్న సూచన కూడా వచ్చిందని బుధవారమిక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో పేర్కొన్నారు.

ఎన్‌డీఆర్‌ఎఫ్‌కు తొలి సుభాష్ చంద్రబోస్ పురస్కారం!

దిల్లీ: విపత్తు సహాయక, పునరావాస చర్యలు చేపట్టే సంస్థలు, వ్యక్తుల సేవలకు గుర్తింపుగా వార్షిక పురస్కారాన్నిచ్చి సత్కరించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. అందు కోసం 'సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్' పేరిట అవార్డును నెలకొల్పింది. తొలి పురస్కారానికి (2019 సంవత్సరానికి) గాజియాబాద్‌లోని 'జాతీయ విపత్తు స్పందన దళాన్ని'(ఎన్‌డీఆర్‌ఎఫ్) ఎంపిక చేసినట్లు హోంశాఖ బుధవారం విడుదల చేసిన ప్రకటన తెలిపింది. ఇటీవలి కాలంలో ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ అందించిన అసమాన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రకటించినట్లు వెల్లడించింది.

షుజాకు అమెరికాలో ఆశ్రయం

- గత ఏడాది మంజూరు

దిల్లీ: ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చంటూ వివాదాస్పద ప్రకటన చేసిన సయ్యద్ షుజాకు గత ఏడాది మార్చిలో అమెరికాలో ఆశ్రయం లభించినట్లు ఐరోపాలోని భారత పాత్రికేయుల సంఘం (ఐజేఏ) విడుదల చేసిన పత్రాలను బట్టి స్పష్టమవుతోంది. సోమవారం ఈ సంఘం లండన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలోనే ఆయన ఈవీఎంలపై సంచలన ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. తన బృందంలోని 11 మంది సభ్యులను హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో నాటి భాజపా ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి బంధువు కాకిరెడ్డికి చెందిన ఒక గెస్ట్‌హౌస్‌లో చంపేశారని ఈ పత్రాల ద్వారా షుజా ఆరోపించారు. సదరు పత్రాల్లో షుజా పేరు సయ్యద్ హైదర్ అహ్మద్ అని ఉంది. అతడి పుట్టిన రోజుపై రెండు రకాల తేదీలు ఉన్నాయి. 1983 ఏప్రిల్ 4న జన్మించినట్లు ఒక పత్రంలో ఉండగా..1981లో పుట్టినట్లు మరో పత్రంలో ఉంది. వలస, జాతీయత చట్టంలోని సెక్షన్ 208 కింద అతడికి అమెరికాలో నిరవధిక కాలం పాటు ఆశ్రయం కల్పించినట్లు తెలుస్తోంది.

'విన్ సొల్యూషన్స్' అనే సంస్థలో షుజా పనిచేసినట్లు కొన్నిపత్రాలు చెబుతున్నాయి. అందులో భాగంగా ఈసీఐఎల్‌లో పోస్టింగ్ లభించినట్లు పేర్కొన్నాయి. సనత్‌నగర్‌లోని ఈసీఐఎల్ ప్రధాన కార్యాలయం సహా పలు చోట్ల పనిచేసినట్లు వివరిస్తున్నాయి. 2014 మే 17న తన ఇంటిని కొందరు దగ్ధం చేశారని షుజా ఆరోపించారు. తన తండ్రి 2006 వరకూ బీఈఎల్‌లో పనిచేశారని చెప్పారు. తన తల్లి ఖుదిసా సయ్యదా హత్యకు గురైనట్లు పేర్కొన్నారు.

ఖండించిన గౌరీ లంకేశ్ సోదరి

ఈవీఎంల హ్యాకింగ్‌పై కథనం రాయడానికి ప్రయత్నించినందువల్లే పాత్రికేయురాలు గౌరీ లంకేశ్ హత్యకు గురయ్యారని షుజా చేసిన ఆరోపణను ఆమె సోదరి కవితా లంకేశ్ ఖండించారు. షుజా వ్యాఖ్యల్లో ఏ మాత్రం నిజంలేదన్నారు. తన సోదరి హత్యకు ఈవీఎంల అంశం కారణం కాదన్నారు. రాజకీయ కుట్రకు ఆమె బలయ్యారని చెప్పారు.

షుజాపై కేసు నమోదు

దిల్లీ: ఈవీఎంలపై ఆరోపణలు చేసిన సయ్యద్ షుజాపై కేసు నమోదైంది. ఈసీ ఫిర్యాదు ఆధారంగా అతడిపై భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 505(ప్రజల్లో భయాందోళనలు కలిగించడం) కింద పార్లమెంటు స్ట్రీట్ ఠాణాలో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు దిల్లీ పోలీసులు బుధవారం వెల్లడించారు. దర్యాప్తు ప్రారంభించేందుకు కోర్టు అనుమతి కోరినట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తు బాధ్యతను ప్రత్యేక సంస్థకు అప్పగించే అవకాశముందన్నారు.

ఐసిస్ ప్రేరణతో దాడులకు కుట్ర

మహారాష్ట్రలో 8 మంది అరెస్టు

ముంబయి: మహారాష్ట్రలో భారీ ఉగ్ర కుట్రను పోలీసులు భగ్నం చేశారు. ఉగ్రసంస్థ ఐసిస్ ప్రేరణతో పలు ప్రాంతాల్లో దాడులకు పథక రచన చేసిన 8మందిని మహారాష్ట్ర ఉగ్రవాద నిరోధక దళం(ఏటీఎస్) పోలీసులు అరెస్టు చేశారు. మరో మైనర్ బాలుణ్ని అదుపులోకి తీసుకున్నారు. ఐఎస్ఐఎస్ ప్రేరణతో వీరంతా ముఠాగా ఏర్పడ్డారని, దాడులు జరిపేందుకు పేలుడు పదార్థాలు సమకూర్చుకున్నారని సీనియర్ అధికారి ఒకరు బుధవారం వెల్లడించారు. పక్కా ఆధారాలతో ఠానే, ఔరంగాబాద్‌లలోని వేర్వేరు ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో వారందరిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

నౌకల ప్రమాదంలో ఆరుగురు భారతీయుల దుర్మరణం

మాస్కో/దిల్లీ: కెర్చ్ జలసంధిలో సోమవారం రెండు ఇంధన నౌకలు అగ్ని ప్రమాదానికి గురైన దుర్ఘటనలో ఆరుగురు భారత నావికులు దుర్మరణం పాలయ్యారు. మరో ఆరుగురు భారతీయులు గల్లంతయ్యారు. క్రిమియా నుంచి రష్యాను వేరు చేసే కెర్చ్ జలసంధి(రష్యా జలాలు)లో సోమవారం కేండీ, మ్యాస్ట్రో అనే రెండు నౌకలు అగ్ని ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. మొత్తం 14 మంది మరణించినట్లు సోమవారం అధికారులు చెప్పారు.

ఛాంపియన్

షమి.. వేగంగా 100

వన్డే క్రికెట్లో అత్యంత వేగంగా 100 వికెట్ల మైలురాయిని అందుకున్న భారత బౌలర్‌గా మహ్మద్ షమి ఘనత సాధించాడు. కివీస్ ఓపెనర్ మార్టిన్ గప్తిల్‌ది అతడికి వందో వికెట్. కెరీర్‌లో 56వ వన్డేలో వంద వికెట్ల ఘనత సాధించిన షమి.. ఇర్ఫాన్ పఠాన్ రికార్డు (59 వన్డేల్లో 100)ను బద్దలు కొట్టాడు. జహీర్ ఖాన్ 65 మ్యాచ్‌ల్లో, అగార్కర్ 67 మ్యాచ్‌ల్లో ఈ మైలురాయిని అందుకున్నారు.

ప్రపంచకప్ సమీపిస్తున్న తరుణంలో టీమ్ ఇండియా టాప్ గేర్‌లో దూసుకెళ్తోంది. ఆసీస్‌ను ఆసీస్‌లో మట్టికరిపించిన కోహ్లీసేన.. ఇప్పుడు న్యూజిలాండ్‌లోనూ మోత మొదలెట్టింది. తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ.. వన్డే సిరీస్‌ను ఘనంగా ఆరంభించింది.



కోహ్లికి విశ్రాంతి

చివరి 2 వన్డేలకు, టీ20 సిరీస్‌కు దూరం

నేపియర్: గత కొన్ని నెలలుగా తీరిక లేకుండా అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న టీమ్ ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లికి విశ్రాంతి ఇవ్వాలని బీసీసీఐ నిర్ణయించింది. న్యూజిలాండ్‌తో ఐదు వన్డేల సిరీస్‌లో చివరి రెండు వన్డేలకు, ఆ తర్వాత జరిగే టీ20 సిరీస్‌కు కోహ్లి అందుబాటులో ఉండడు. అతడి స్థానంలో రోహిత్ శర్మ సారథ్య బాధ్యతలు నిర్వర్తించాడు. కోహ్లి స్థానంలో ఎవరినీ ఎంపిక చేయడం లేదని బీసీసీఐ తెలిపింది. ఐదు వన్డేల సిరీస్ ముగిసిన తర్వాత 3 మ్యాచ్‌ల టీ20 పోరు మొదలు కానుంది. దీనికీ కోహ్లి దూరంగా ఉంటాడు.

అటు పేస్.. ఇటు స్పిన్
కివీస్ విలవిల



న్యూజిలాండ్‌ను కోహ్లీసేన మామూలుగా హడలెత్తించలేదు. నిప్పులు చెరిగే బంతులతో షమి, మణికట్టు స్పిన్‌తో కుల్‌దీప్, చాహల్ బ్యాట్స్‌మెన్‌ను విలవిలలాడించిన వేళ.. పోరును ఏకపక్షంగా మార్చేసిన భారత్ తొలి వన్డేలో ఆతిథ్య జట్టును చిత్తుచిత్తుగా ఓడించింది.

- తొలి వన్డేలో న్యూజిలాండ్‌పై భారత్ ఘనవిజయం
- విజృంభించిన షమి, కుల్‌దీప్, చాహల్ • మెరిసిన ధావన్

నేపియర్

సూపర్ ఫామ్‌తో న్యూజిలాండ్‌లో అడుగుపెట్టిన టీమ్ ఇండియా జోరు కొనసాగించింది. అద్భుతమైన బౌలింగ్‌తో ఆతిథ్య జట్టును కుదేలు చేసిన భారత్.. బుధవారం జరిగిన మొదటి వన్డేలో 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన కివీస్.. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' మహ్మద్ షమి (3/19), కుల్‌దీప్ యాదవ్ (4/39), చాహల్ (2/43) ధాటికి 38 ఓవర్లలో 157 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ విలియమ్సన్ (64; 81 బంతుల్లో 7×4) నిలవకుంటే కివీస్ మరింత తక్కువే ఆలౌటయ్యేదే. శిఖర్ ధావన్ (75 నాటౌట్; 103 బంతుల్లో 6×4), కోహ్లి (45) రాణించడంతో.. డకవర్త్ లూయిస్ పద్ధతిలో సవరించిన లక్ష్యాన్ని (49 ఓవర్లలో 156) భారత్.. 34.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. రెండో వన్డే శనివారం జరుగుతుంది.

నిప్పులు చెరిగిన షమి: న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో షమి బౌలింగే హైలైట్. ఆసీస్ పర్యటనలో అదరగొట్టిన అతడు.. కివీస్ పైనా కళ్లు చెదిరే ప్రదర్శన చేశాడు. పదునైన బౌలింగ్‌తో ఆతిథ్య జట్టు టాప్ లేపి, భారత్ పని తేలిక చేశాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నందుకు న్యూజిలాండ్ చింతించే ఉంటుంది. పిచ్ నుంచి లభించిన కాస్త సహకారాన్ని షమి సద్వినియోగం చేసుకున్నాడు. బంతిని స్వింగ్ చేస్తూ, సీమ్‌ను ఉపయోగించుకుంటూ బ్యాట్స్‌మెన్‌ను బెంబేలెత్తించాడు. తొలి స్పెల్‌ను 4-2-13-2తో ముగించాడు షమి. చక్కని లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేసిన షమి ధాటికి కివీస్ 18 పరుగులకే ఓపెనర్లిద్దరినీ కోల్పోయింది. రెండో ఓవర్లో షమి బంతిని గప్తిల్ (5) ఫార్వర్డ్ డిఫెన్స్ ఆడబోగా.. ఇన్‌సైడ్ ఎడ్జ్‌తో బౌల్డయ్యాడు. షమి తన తర్వాతి ఓవర్లో కళ్లు చెదిరే బంతితో మున్రో (8)ను బౌల్డ్ చేశాడు. విలియమ్సన్ నిలిచినా.. మరో వైపు నుంచి కివీస్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ఐతే రాస్ టేలర్ కాసేపు అతడికి అండగా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌కు చాహల్ తెరదించాడు. ముందుకొచ్చే ఆడేలా టేలర్‌ను ఉసిగొల్పిన చాహల్.. బంతి వేగంలో మార్పుతో అతణ్ని బోల్తా కొట్టించాడు. భారీ షాట్ ఆడబోయిన టేలర్ (24) రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. చాహల్ కాసేపటి తర్వాత లాథమ్ (11)ను కూడా రిటర్న్ క్యాచ్‌తోనే వెనక్కి పంపాడు. 24వ ఓవర్లో నికోల్స్ (12) జాదవ్ ఔట్ చేసేటప్పటికి స్కోరు 107/5. ఎడమవైపు దూకుతూ కుల్‌దీప్ అందుకున్న క్యాచ్‌కు నికోల్స్ నిష్క్రమించాడు. విలియమ్సన్‌కు శాంట్నర్ (14) కాస్త సహకరించడంతో కివీస్ 133/5కు చేరుకుంది. కానీ కుల్‌దీప్ తన మాయాజాలంతో ఆ జట్టును దెబ్బతీశాడు. అతడి ధాటికి కివీస్ 24 పరుగులకే ఆఖరి 5 వికెట్లు కోల్పోయింది. శాంట్నర్‌ను షమి ఔట్ చేశాక.. చివరి 4 వికెట్లను కుల్‌దీపే చేజిక్కించుకున్నాడు. విలియమ్సన్‌నూ అతడే వెనక్కి పంపాడు.

2

వన్డేల్లో అత్యంత వేగంగా (ఇన్నింగ్స్‌ల పరంగా) 5000 పరుగులు పూర్తి చేసిన రెండో భారత బ్యాట్స్‌మన్ ధావన్ (118 ఇన్నింగ్స్). కోహ్లి (114 ఇన్నింగ్స్) ముందున్నాడు.



ఫెర్గ్యూసన్ స్టంప్డ్

ఆడుతూ పాడుతూ..: స్వల్ప లక్ష్యాన్ని భారత్ ఆడుతూ పాడుతూ ఛేదించింది. గత 9 ఇన్నింగ్స్‌ల్లో కేవలం 20 సగటు సాధించిన ధావన్ ఫామ్‌లోకి రావడం భారత్‌కు సంతోషాన్నిచ్చే అంశం. ధావన్, రోహిత్ (11) నెమ్మదిగానే ఛేదన ఆరంభించారు. 5 ఓవర్లకు స్కోరు 12 పరుగులే. కానీ ధావన్ క్రమంగా దూకుడు పెంచాడు. బౌండరీలతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. జట్టు స్కోరు 41 పరుగుల వద్ద రోహిత్ ఔటైనా... కోహ్లి క్రీజులోకి రావడంతో భారత్ ఛేదన సాఫీగా సాగింది. కోహ్లితో రెండో వికెట్‌కు 91 పరుగులు జోడించిన ధావన్.. రాయుడు (13 నాటౌట్)తో కలిసి లాంఛనాన్ని పూర్తి చేశాడు. ధావన్ కెరీర్‌లో 26వ అర్ధశతకం చేశాడు.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: గప్తిల్ (బి) షమి 5; మున్రో (బి) షమి 8; విలియమ్సన్ (సి) శంకర్ (బి) కుల్‌దీప్ 64; టేలర్ (సి) అండ్ (బి) చాహల్ 24; లాథమ్ (సి) అండ్ (బి) చాహల్ 11; నికోల్స్ (సి) కుల్‌దీప్ (బి) జాదవ్ 12; శాంట్నర్ ఎల్బీ (బి) షమి 14; బ్రాస్‌వెల్ (బి) కుల్‌దీప్ 7; సౌథీ నాటౌట్ 9; ఫెర్గ్యూసన్ (స్టంప్డ్) ధోని (బి) కుల్‌దీప్ 0; బౌల్ట్ (సి) రోహిత్ (బి) కుల్‌దీప్ 1; ఎక్స్‌ట్రాలు 2 మొత్తం: (38 ఓవర్లలో ఆలౌట్) **157;**

వికెట్ల పతనం: 1-5, 2-18, 3-52, 4-76, 5-107, 6-133, 7-146, 8-146, 9-148; **బౌలింగ్:** భువనేశ్వర్ 5-0-20-0; షమి 6-2-19-3; విజయ్ శంకర్ 4-0-19-0; చాహల్ 10-0-43-2; కుల్‌దీప్ 10-1-39-4; కేదార్ జాదవ్ 3-0-17-1

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) గప్తిల్ (బి) బ్రాస్‌వెల్ 11; ధావన్ నాటౌట్ 75; కోహ్లి (సి) లాథమ్ (బి) ఫెర్గ్యూసన్ 45; రాయుడు నాటౌట్ 13; ఎక్స్‌ట్రాలు 12 **మొత్తం:** (34.5 ఓవర్లలో 2 వికెట్లకు) **156; వికెట్ల పతనం:** 1-41, 2-132; **బౌలింగ్:** బౌల్ట్ 6-1-19-0; సౌథీ 6.5-0-36-0; ఫెర్గ్యూసన్ 8-0-41-1; బ్రాస్‌వెల్ 7-0-23-1; శాంట్నర్ 7-0-32-0


ఆటను ఆపిన సూర్యుడు



షమి (3/19)

వర్షంతోనో వెలుతురు సరిగాలేకనో క్రికెట్ మ్యాచ్‌లకు అంతరాయం కలగడం కొత్తేమీ కాదు. కానీ భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి వన్డే చిత్రమైన కారణంతో కాసేపు నిలిచిపోయింది. అస్తమిస్తున్న సూర్యుడి కిరణాలు నేరుగా బ్యాట్స్‌మెన్ కళ్లలో పడుతుండడంతో ఆటను అరగంట ఆపేయాల్సివచ్చింది. తర్వాత లక్ష్యాన్ని సవరించారు. ఛేదనలో భారత్ 10 ఓవర్లలో 44/1తో ఉన్నప్పుడు ఇది జరిగింది. అప్పటికి కోహ్లి, ధావన్ క్రీజులో ఉన్నారు. కెరీర్‌లో ఎప్పుడూ తనకు ఇలాంటి అనుభవం ఎదురుకాలేదని కోహ్లి అన్నాడు. "సూర్య కిరణాలు నేరుగా ఆటగాళ్ల కళ్లలో పడ్డాయి. ఆటగాళ్లు, అంపైర్ల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆటను నిలిపివేయాలని నిర్ణయించాం" అని అంపైర్ షాన్ జార్జ్ చెప్పాడు. సాధారణంగా క్రికెట్ పిచ్‌లు ఉత్తర-దక్షిణ ముఖంగా ఉంటాయి. తొలి వన్డే వేదిక మెక్‌లీన్ పార్క్‌లో పిచ్ తూర్పు-పడమర ముఖంగా ఉండటంతో ఈ ఇబ్బంది తలెత్తింది.

సైనా, శ్రీకాంత్ ముందుకు




జకార్తా: ఇండోనేసియా మాస్టర్స్‌లో భారత షట్లర్లు పి.వి.సింధు, సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్ శుభారంభం చేశారు. బుధవారం తొలి రౌండ్లో సింధు 22-24, 21-8, 21-17 లీ జురుయ్ (చైనా)పై పోరాడి గెలిచింది. మరోవైపు సైనా 7-21, 21-16, 21-11తో స్థానిక క్రీడాకారిణి దినార్ అయిస్టిన్ (50వ ర్యాంకు)పై అతి కష్టం మీద నెగ్గి రెండో రౌండ్లోకి ప్రవేశించింది. పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ మాత్రం 21-12, 21-8తో చాంగ్ వి ఫెంగ్ (మలేసియా)పై సునాయాసంగా విజయం సాధించాడు. అతడి సహచరులు మాత్రం పరాజయం పాలయ్యారు. పారుపల్లి కశ్యప్ 12-21, 16-21తో అంథోని సిన్సుకా (ఇండోనేసియా) చేతిలో, సాయిప్రణీత్ 12-21, 16-21తో ఒలింపిక్ ఛాంపియన్ చెన్‌లాంగ్ (చైనా) చేతిలో, శుభంకర్ 14-21, 21-19, 15-21తో విక్టర్ అక్సెలెసన్ (డెన్మార్క్) చేతిలో ఓడారు. పురుషుల డబుల్స్‌లో మాత్రం మను అత్రి- సుమీత్ రెడ్డి జోడీ 14-21, 21-19, 21-15తో మేడ్స్ పీలర్, నికొలస్ నోర్ (డెన్మార్క్) ద్వయంపై విజయం సాధించింది. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప, సిక్కిరెడ్డి జోడీకి నిరాశే ఎదురైంది. ఈ జంట.. 14-21, 14-21తో థాయ్‌లాండ్ జోడీ జోంగ్ కోల్ఫన్, రావిండా ప్రజంజోయ్ చేతిలో ఓడింది.

నిద్రలేని రాత్రులు గడిపాను



ముంబయి: టీమ్‌ఇండియా క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌లపై సస్పెన్షన్ వేటు పడటం పట్ల బాలీవుడ్ దర్శక నిర్మాత కరణ్ జోహార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. కరణ్ నిర్వహించే టాక్ షోలో మహిళల గురించి అనుచిత వ్యాఖ్యలు చేయడంతో వారిపై బీసీసీఐ క్రమశిక్షణ చర్యలు తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కరణ్ మాట్లాడుతూ.. "ఆ ఎపిసోడ్లో జరిగిన సంభాషణను నేను సమర్థించట్లేదు. అందులో కొన్ని విషయాలు హద్దులు దాటి ఉండొచ్చు. నా పరిధిలో జరిగిన తప్పిదం కాబట్టి క్షమాపణ చెబుతున్నా. ఆ షో నాది కాబట్టి జరిగిన దానికి పూర్తి బాధ్యత తీసుకుంటున్నా. అందులో జరిగిన చర్చలన్నింటికీ కూడా నా బాధ్యతే. వారికి నష్టం జరగకుండా ఏం చేయాలో ఆలోచిస్తూ నేను చాలా నిద్ర లేని రాత్రులు గడిపాను" అని చెప్పాడు.




సెరెనా మళ్లీ..

24వ టైటిల్ ఆశలు గల్లంతు

టైటిళ్ల మీద టైటిళ్లు కొడుతూ, రికార్డుల మీద రికార్డులు సాధిస్తూ సాగిపోయిన సెరెనా విలియమ్స్‌కు.. 24వ టైటిల్‌తో 'ఆల్‌టైం గ్రేట్' అనిపించుకోవడానికి దీర్ఘ కాల నిరీక్షణ తప్పేలా లేదు. 2017 నుంచి ఈ రికార్డు టైటిల్ కోసం వేచి చూస్తున్న సెరెనాకు.. మరోసారి ఆశాభంగమే. ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గి మార్గరెట్ కోర్ట్‌ను అందుకోవాలని ఆశించిన ఆమెకు.. ప్లిస్కోవా చెక్ పెట్టింది. క్వార్టర్స్‌లో సెరెనాకు షాకిచ్చింది. నిర్ణయాత్మక మూడో సెట్లో 5-1తో ఆధిక్యంలో నిలిచి కూడా సెరెనా మ్యాచ్‌ను గెలవలేకపోయింది. మరోవైపు ఒసాకా సెమీస్‌లో ప్రవేశించింది. పురుషుల సింగిల్స్ జకోవిచ్, పౌలీ ముందంజ వేశారు.

- ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి ఔట్
- క్వార్టర్స్‌లో ప్లిస్కోవా చేతిలో ఓటమి
- సెమీస్‌లో జకోవిచ్, ఒసాకా



ప్లిస్కోవా

మెల్‌బోర్న్

మార్గరెట్ కోర్ట్ పేరిట ఉన్న అత్యధిక సింగిల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల రికార్డును అందుకోవడానికి సెరెనా మరికొంత కాలం ఎదురు చూడక తప్పదు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అమెరికా తార కథ ముగిసింది. 37 ఏళ్ల సెరెనా బుధవారం మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో 4-6, 6-4, 5-7తో ఏడో సీడ్ ప్లిస్కోవా చేతిలో పరాజయం చవిచూసింది. 2 గంటల 10 నిమిషాల పోరులో ఇద్దరూ హోరాహోరీగానే తలపడ్డారు. తొలి సెట్ మూడో గేమ్‌లో సెరెనా సర్వీస్ బ్రేక్ చేసిన ప్లిస్కోవా.. ఐదో గేమ్‌లో మరోసారి బ్రేక్ పాయింట్‌కు చేరువగా వెళ్లింది. అతి కష్టం మీద ప్లిస్కోవాను కాచుకున్న సెరెనా.. సెట్‌ను కాపాడుకోలేకపోయింది. రెండో సెట్లో వరుసగా ఒకరి సర్వీస్ ఒకరు బ్రేక్ చేసుకున్నారు. ఐతే పదో గేమ్‌లో సెరెనా బ్రేక్ సాధించి సెట్‌ను సొంతం చేసుకుంది. నిర్ణయాత్మక మూడో సెట్ రసవత్తరంగా సాగింది. 4, 6 గేముల్లో ప్లిస్కోవా సర్వీస్‌ను బ్రేక్ చేసిన సెరెనా.. మ్యాచ్‌ను దాదాపు సొంతం చేసుకున్నట్లే కనిపించింది. ఐతే 1-5తో వెనుకబడ్డ స్థితిలో ప్లిస్కోవా ఆశలు కోల్పోకుండా గొప్పగా పోరాడింది. తర్వాతి గేమ్‌లో సెరెనా సర్వీస్‌ను బ్రేక్ చేసిన ఆమె.. తర్వాతి గేమ్‌లో మ్యాచ్ పాయింట్‌ను కాచుకుని, సర్వీస్‌ను నిలబెట్టుకుంది. సెరెనా తర్వాతి సర్వీస్‌ను కూడా ఆమె బ్రేక్ చేసింది. దీంతో 5-5తో స్కోరు సమమైంది. ఈ దశలో ప్లిస్కోవా మూడు మ్యాచ్ పాయింట్లు కాచుకోవడం విశేషం. వరుసగా మూడో గేమ్‌లోనూ బ్రేక్ సాధించిన ఆమె మ్యాచ్ విజయానికి చేరువైంది. 12వ గేమ్‌లో పెద్దగా కష్టపడకుండానే ఆమె సర్వీస్ నిలబెట్టుకుని మ్యాచ్‌ను చేజిక్కించుకుంది. మరో మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో యుఎస్ ఓపెన్ 2018 ఛాంపియన్, నాలుగో సీడ్, నవోమి ఒసాకా (జపాన్) 6-4, 6-1తో ఆరో సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్)పై సునాయాసంగా విజయం సాధించింది.



ఒసాకా

పౌలీ మరో సంచలనం: పురుషుల సింగిల్స్‌లో ఫ్రెంచ్ ఆటగాడు లూకాస్ పౌలీ సంచలన జైత్రయాత్రను కొనసాగించాడు. గతంలో ఐదుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆడినా ఒక్క విజయం కూడా సాధించని పౌలీ.. ఈసారి ఏకంగా సెమీస్‌లోకి అడుగుపెట్టాడు. 28వ సీడ్ పౌలీ.. 3 గంటలకు పైగా హోరాహోరీగా సాగిన క్వార్టర్స్‌లో 7-6 (7-4), 6-3, 6-7 (2-7), 6-4తో 16వ సీడ్, కెనడా స్టార్ మిలోస్ రోనిచ్‌ను ఓడించాడు. 2010లో సోంగా తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెమీస్ చేరిన ఫ్రెంచ్ ఆటగాడు పౌలీనే కావడం విశేషం. ఫైనల్లో చోటు కోసం అతను జకోవిచ్‌తో తలపడబోతున్నాడు. క్వార్టర్స్‌లో 8వ సీడ్, జపాన్ ఆటగాడు నిషికోరి అర్ధంతరంగా తప్పుకోవడంతో జకోవిచ్ ముందంజ వేశాడు. తొలి సెట్‌ను 6-1తో నెగ్గిన జకోవిచ్.. రెండో సెట్లో 4-1తో ఆధిక్యంలో ఉండగా గాయంతో నిషికోరి మ్యాచ్ నుంచి తప్పుకున్నాడు. నొవాక్ రెండేళ్ల విరామం తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్ చేరాడు.

సెమీస్‌లో ఎవరితో ఎవరు

పురుషుల సింగిల్స్


జకోవిచ్ (సెర్బియా) × పౌలీ (ఫ్రాన్స్)
నాదల్ (స్పెయిన్) × సిట్సిపాస్ (గ్రీస్)

మహిళల సింగిల్స్

ఒసాకా (జపాన్) × ప్లిస్కోవా (ఉక్రెయిన్)
క్విటోవా (చెక్ రిపబ్లిక్) × కోలిన్స్ (అమెరికా)

భారత్ × న్యూజిలాండ్ మహిళల తొలి వన్డే నేడు ఉదయం 6.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

సంజితపై నిషేధం ఎత్తివేత



దిల్లీ: భారత వెయిట్‌లిఫ్టర్ సంజిత చానుపై విధించిన ప్రాథమిక నిషేధాన్ని అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య (ఐడబ్ల్యూఎఫ్) ఎత్తి వేసింది. గత ఏడాది కామన్వెల్త్ క్రీడల 53 కేజీల విభాగంలో స్వర్ణం సాధించిన సంజిత.. ఆ తర్వాత డోప్ టెస్టులో దొరికిపోయింది. దీంతో ఐడబ్ల్యూఎఫ్ ఆమెపై నిషేధం విధించి.. విచారణకు ఆదేశించింది. విచారణ ఆధారంగా ఆమెపై ప్రస్తుతానికి నిషేధాన్ని తొలగించిన సమాఖ్య.. త్వరలోనే తుది నిర్ణయాన్ని ప్రకటించనుంది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92,
Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00



Terms and conditions apply. Features and accessories shown may not be part of standard fitment. Images used are for illustration purposes only.

AUTHORISED DEALERS: HYDERABAD: Jayabheri (Gachibowli) 8100823456 Kalyani Motors (Nacharam) 9100102157 (Lb Nagar) 9100102157, Mithra (Himayathnagar) 040- 27634444 (Mehdipatnam) 040-23518600 Pavan (Secunderabad) 7799949968 RKS (Somajiguda) 9848898488 (Malakpet) 9848898488 (Secunderabad) 9848898488 (Kushaiguda) 9848898488, Sai Service (Erragadda) 7331168888 (Miyapur) 7331168888 Varun (Begumpet) Toll Free - 18008331112 (Banjara Hills) Toll Free - 18008331112, (Kukatpally) Toll Free - 18008331112, (Vanasthalipuram) Toll Free - 18008331112, (Gachibowli) Toll Free- 18008331112 Acer (Tirumalgiri) 9100011877 Adarsha (Attapur) 9581586633 (Chandrayangutta) 8297576633 (Siddipet) 9581656633 Autofin (Bowenpally) 040-67292222; Gem Motors (Kondapur) 9272506060 **TELANGANA STATE** Adarsha (Karimnagar) 9133308022 (Warangal) 0870- 26553319 Varun (Nizambad) 8462236236, Pavan (Nalgonda) 8790902131, Sri Jayarama (Mehabubnagar) 8096998841 **E-OUTLETS:** Adarsha (Mancherial) 8886006633 (Nirmal) 9133307720 (Jagityal) 8886776633 (Godavarikhani) 8886556633 (Adilabad) 7799784536 (Jangaon) 7799306633 (Siddipet) 9581656633; Varun (Kamareddy) 9966111132 (Armur) 9052022990 (Kottagudem) 9885260333; Pavan (Miryalaguda) 8790902154 (Kodada) 8790902135; Sri Jayarama (Shadnagar) 8096998841 (Wanaparthy) 8096998841; Mithra Auto (Khammam) 8886063524, Sai Service (Sangareddy) 7331168888 (Zaheerabad) 7331168888 **RAIALA STATE:** Msa (Kurnool) 08518-221427/222791 Bhargavi (Tirupati) 9248709123 Sri Durga (Ananthapur) 9100984251 **E-OUTLET:** Bhargavi (Chittoor) 9248709123 (Madanapally) 9248709123 Msa (Cuddapah) 9160555427 (Nandyal) 9100907773; Sri Durga (Hindupur) 9100984251 **CENTRAL ANDHRA (VIJAYAWADA)** Mithra Auto 8297174444; Santosh 9209094999; Varun 9885260333; Jayalakshmi (Guntur) 7093522444 (Ongle) 9618599433; Bhargavi (Nellore) 9248744744, Reddy & Reddy Motors (Eluru) 9133377574; Novelty Reddy & Reddy (Bhimawaram) 08816-251555; **E-OUTLETS:** Varun (Gudiwada) 9885260333, (Jaggiahpet) 9885260333 (Nuzvid) 9885260333 Mithra Auto (Machilipatnam) 8886063493, Jayalakshmi (Chirala) 9100980063 (Tenali) 9100790152 (Narasaraopet) 9959963538; Bhargavi (Kavali) 7658923339, (Gudur) 7658923339; Reddy & Reddy (Jangareddy Gudam) 9912911455 (Tanuku) 08819-229123 **NORTH ANDHRA (VISHAKHAPATNAM)** Jayabheri (Kranthi Nagar) 7093915512; Varun (Siripuram) 8912599999 (Gajuwaka) 8912599999, (Muralinagar) 8912599999 (Srikakulam) 8912599999 S.B. Motors (Rajahmundry) 0883-2442410 Satti Babu (Kakinada) 0883-2442410; **E-OUTLETS:** Varun (Pendurthy) 8912599999 (Rajam) 8912599999 Jayabheri (Vizinagaram) 8912505000, (Narsipatnam) 8912505000 (Anakapalle) 8912505000 (Madhurwada) 8912505000 Satti Babu (Tuni) 0883-2442410 S. B. Motors (Amalapuram) 0883- 2442410.